# బహుళ

## త్రైమాసిక అంతర్జాతీయ అంతర్జాల మహిళా పత్రిక

2021 - నవంబర్ - 01

సంపుటి -1 సంచిక - 3 https://www.bahulabyjwalitha.com 2022 మార్చి 8

## అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రత్యేక సంచిక









వ్యాసం

# ధైర్యవంతులైన అందమైన మహిళలు



- నిరుపమ

7208153263

'ధైర్యంగా ఉండటమే అందంగా ఉండటము' అని మనం, మహిళలం తెలుసుకోవాలి.

మన సమాజ స్థాపనకు ఆరంభం నుండి శక్తివంతులైన మహిళలెందరో వెన్నెముకగా ఉన్నారు. అవసరమైన ప్రతిసారీ మహిళలు ప్రపంచానికి మద్దతునిచ్చారు. మనం చూస్తున్న ఈ ప్రపంచాన్ని సృష్టించి, నిర్మించి, ఆవిష్కరించి, ఆకృతినిచ్చిన వారు మహిళలే...

ఉక్రెయిన్కు చెందిన 79 ఏళ్ల వృద్ధురాలు రష్యా దాడి ఉద్రిక్తత మధ్య పోరాడేందుకు AK-47 తుపాకీతో శిక్షణ పొందుతున్న కథనాన్ని ఇటీవల నేను చూశాను. "ఏదైనా జరిగితే... తుపాకీతో కాల్చడానికి నేను సిద్ధంగా ఉన్నాను, నేను నా ఇల్లు, నా నగరం, నా పిల్లలను రక్షించుకుంటాను. నాదేశానికి నష్టం జరగనివ్వను" అని చెప్పిన తీరు ఆమె ధైర్యానికి ఆత్మవిశ్వాసానికి దృష్టాంతం.

'ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ఉండడానికి వయస్సుతో కాని, జెండర్ (లింగం) తో కానీ సంబంధం లేదు' అనే విషయం, ఈ సంఘటన ద్వారా మనకర్థమవుతుంది.

ఆ ఉక్రెయిన్ మహిళ యుద్ధ ప్రభావాన్ని ప్రత్యక్షంగా చూసింది. ధీరురాలైన ఆ స్త్రీ యుద్ధ సైరన్లు మోగడం విన్నది – ప్రజలు భద్రత కోసం షెల్టర్లకు పరిగెత్తడం చూసింది, పైన రాకెట్లను అడ్డగిస్తున్నప్పుడు ఆమె ఆకాశం వైపు చూస్తూ ఉండిపోయింది – ఆ పేలుళ్లు నలుపు సముద్రంలో బాణాసంచా పేలినట్లుగా ఉందట. తన పిల్లలకు రాబోయే ప్రమాదం తెలుసుకొన్న తల్లుల, ముఖంలో భయాన్ని చూసింది...

ప్రతి మహిళ ఏదో ఒక యుద్ధాన్ని నిత్యం ఎదుర్కొంటూనే ఉన్నది కదా..

ప్రపంచం వ్యాప్తంగా అనేక రంగాలలో మహిళలు అనేక అడ్డంకులను ఎదుర్కొంటూ.. సృష్టించడం, కనిపెట్టడం, నిర్మించడం అనే ప్రక్రియను కొనసాగిస్తున్నారు మహిళలు. మనం ధైర్యవంతులుగా ఉండటం అంటే కష్టాలను ఎదుర్కొంటూ, విజయం సాధించడానికి పట్టుదలతో ఉండడం. ఈ లక్షణాలతో ధైర్యవంతమైన మహిళగా మారడం, కష్టాలను ఎదుర్కొని విజయం సాధించడం మనం నేర్చుకోవచ్చు.

ఉక్రెయిన్ మహిళ వంటి శక్తివంతురాలైన స్త్రీ గొప్పపనులు చేయటానికి భయపడదు. యుద్ధం జరుగుతున్నపుడు వేరే నగరానికి వెళ్లి తన కోసం కొత్త జీవితాన్ని ప్రారంభించగలదు. రిస్క్ తీసుకునే వ్యక్తి కాబట్టి, జరగ బోయే దాని గురించి ఆమెకు విచారం లేదు.

శక్తివంతులైన మహిళలెవరైనా చాలా ఆత్మవిశ్వాసంతో ఉంటారన్నది సత్యం. మనం ఆత్మవిశ్వాసం కలిగుంటే రిస్కుతో కూడిన విలువైన నిర్ణయాలు తీసుకుంటాము. అనుకున్న ప్రకారం పని పూర్తి చేస్తాము కూడా. ఒకవేళ ప్రయత్నం విఫలమైతే ఏమిచెయ్యాలో ముందుగా ఆలోచించు కుంటాము.

ఆత్మవిశ్వాసంతో వున్న మనం వైఫల్యాలకు భయపడం, ఎందుకంటే స్త్రీల జీవితాలలో నిత్యం యుద్ధాలే కదా. సమయం విలువ, కృషి విలువ తెలుసినవాళ్ళం. అయినా ఎంత శ్రమపడినా విజయాన్ని సాధించలేకపోవచ్చు. కానీ, ఎప్పుడూ నిరాశపడ కూడదు. మళ్లీ మన కాళ్ళ మీద మనం నిలబడడానికి ప్రయత్నాన్ని కొనసాగించాలి.

అడ్డంకులను ఎదుర్కొంటూనే మహిళలం వ్యక్తిగతంగా, సామాజికంగా పునర్నిర్మాణం కొనసాగిస్తున్నాము. ధైర్యవంతులుగా ఉండటం అంటే కష్టాలను ఎదుర్కొంటూ విజయం సాధించడం కొరకు పట్టుదలతో ఉండటమని చెప్పుకున్నాము కదా.. ఈ లక్షణాలతో, ధైర్యంగా ఉండటమే అసలైన సౌందర్యం అని మన మహిళలంతా ఐక్యంగా చాటాలి. ఆ విధంగా కష్టాలను ఎదుర్కొని విజయం సాధించడం నేర్చుకోవాలి.

ఆత్మవిశ్వాసం కలిగిన స్త్రీ తనను తాను నమ్ముతుంది. తన లక్ష్యాలను సాధించడానికి ప్రయత్నిస్తూ తోటి మహిళలను కలుపుకొని బలమైన శక్తిగా ఎదుగుతుంది. ఎదగాలని అవసరం ప్రస్తుతం ఏర్పడింది.

ఇప్పుడున్న క్లిష్టతరమైన ప్రపంచంలో మనమంతా 'ధైర్యంగా ఉండటమే నిజమైన సౌందర్యం' కనుక, సమస్యలు ఎదురైనపుడు ఆత్మస్థైర్యంతో సమయస్ఫూర్తితో ఐకమత్యంతో వ్యవహరిస్తూ ముందుకు సాగుదాము..

ఏమంటారు మరి..?

సంపుటి - 1 సంచిక - 3

# ఐక్యతకై విస్మరణను ఛేదించే ప్రయత్నం.



"ఏమి జరుగుతుందో గట్టిగా అరిచి చెప్పడమే విప్లవం" అన్నది పెద్దల మాట.

'ధనం కంటే ధైర్యం ఇచ్చే శక్తి గొప్పది' ఆ శక్తినిచ్చే ప్రయత్నమే ఈ కవులు చేస్తున్నారు.

తోటి మనిషిని ప్రేమించలేని మనిషి మానవతా వాది కానట్లే. తోటి స్త్రీని గౌరవించలేని స్త్రీలెవ్వరూ స్త్రీ వాదులు కారు... వారెంత గొప్ప కవిత్వం రాసినా, ఎంత గొప్పగా ఉపన్యాసాలు ఇచ్చినా కూడా...

మన గురించి మాట్లాడే వారు లేనప్పుడు, మన గురించి మనమే మాట్లాడాలి అనే సూత్రం అన్ని అస్తిత్వ వాదాలకు వర్తిస్తుంది..

'స్త్రీవాదం వేరు స్త్రీ సమస్యలు వేరు' అని వాదించే స్త్రీలున్న దేశం మనది. కనుక పాశ్చాత్య దేశాల స్త్రీవాదానికి, భారతదేశంలో స్త్రీవాదానికి తేడా ఉన్నదన్న విషయం తప్పనిసరిగా అంగీకరించాలి. ప్రపంచంలో మరెక్కడా లేని వర్ణవ్యవస్థ భారత దేశంలో ఉన్నది. స్త్రీ రెండవ తరగతి పౌరురాలిగా అంతటా వివక్షను ఎదుర్కొంటోంది.. తోటి మానవి ఒక వస్తువు గాను బానిస గాను భావించబడుతోంది. (ఎప్పటి కాలం గురించి అని ముఖం తిప్పుకోకండి) మన దేశంలో అత్యధిక జనాభా కార్మికులుగా వృత్తికారులుగా జీవించడం వలన, వారికి విద్యనభ్యసించే అవకాశం దక్కలేదు.. దక్కనివ్వలేదు కూడా.. స్త్రీ విద్య వలన పురుషులకు ఆయుక్షీణమని, 'నస్త్రీ స్వాతంత్ర మర్హతి' అని విష ప్రచారాలు చేసారు.

వ్యూహాత్మకంగా స్త్రీలకు విద్యాగంధం అందకుండా చేసిన సమాజంలో, బ్రిటిష్ పాలనలో మిషనరీ పాఠశాలల కారణంగా జ్యోతిబాపూలే వంటి నిస్వార్ధపరులు స్త్రీ విద్యకు అవకాశం కలిగించారు. భార్యను బానిసగా.. వంటింటి కుందేలుగా చూసే కాలంలో.. తన భర్త ద్వారా విద్యా సుగంధాన్ని ఆస్వాదించిన సావిత్రిబాయి పూలే... వర్ణవివక్షకు, లింగ వివక్షకు, భయపడకుండా.. కుల మత భేదం పాటించకుండా వితంతువులకు బాలికలకు అనాధ స్త్రీలకు విద్యాదానం చేయగలిగారు. ఆమె ఆనాడు పెట్టిన అక్షర బిక్ష ఇప్పుడు మనం అందరం అనుభవిస్తున్న చదువు, ఉద్యోగం మొదలైన సౌకర్యాలన్నీ కూడా... భారతదేశంలో స్త్రీలందరూ అది గుర్తుంచుకోవాలి.

స్వాతంత్ర్యానంతరం రాజ్యాంగపరమైన హక్కుగా గౌరవంగా జీవించే హక్కు, విద్యా హక్కు భారతీయ మహిళలకు కూడా లభించాయి. అయినప్పటికీ ఈ రోజుకు కూడా మహిళలు వివక్షకు గురవుతూ.. లైంగిక హింస, గృహ హింస అనుభవిస్తూనే ఉన్నారు. కార్మిక చట్టాల ప్రకారం లభించే సమాన వేతనం, సమాన ఉపాధి ఇప్పటికీ... అసంఘటిత రంగంలో స్త్రీలు పొందలేక పోతున్నారు. దీనంతటికీ కారణం పితృస్వామ్య భావజాలం నరనరాల్లో జీర్ణించుకొని ఉండడమే.

ధరించిన దుస్తుల కారణంగా.. పుట్టిన కులం కారణంగా.. భారతదేశంలో స్త్రీలు భయంకరమైన వివక్షను హింసను ఎదుర్కొంటున్నారు. మన దేశంలో స్త్రీల పరిస్థితి రోజురోజుకు భద్రత లేకుండా పోతున్నది. తెలుగు రాష్ట్రాలలో స్త్రీల భద్రత మరింత దిగజారింది. పురుషులతో పాటు స్త్రీలు కూడా కొందరు ఈ వివక్షను సమర్ధిస్తున్నారు. స్త్రీవాదానికి విపరీతార్ధాలను అన్వయిస్తూ.. స్త్రీవాదం అంటే పురుష వ్యతిరేకమని ప్రచారం చేస్తున్నారు. నేడు మన దేశంలో పశువులకు గోవులకు ఉన్న భద్రత, సానుభూతి స్త్రీలకు లేదని రోజూ జరిగే సంఘటనలే సాక్ష్యం చెప్తున్నాయి. ప్రతి గంటకు 90 అత్యాచారాలు 80 హత్యలు స్త్రీలపై జరుగుతున్నాయంటే... మన స్త్రీలు ఎటువంటి పరిస్థితుల్లో ఉన్నారో తెలుస్తుంది.

భారతదేశంలో సంస్కరణోద్యమంలో భాగంగా బాల్య వివాహాలు, సతీసహగమనాలు నిరోధించ బడ్డాయి. వితంతు వివాహాలు కూడా అందులో భాగమే.. అనేక ఉద్యమాల్లో పాల్గొన్న స్త్రీలు కూడా వివక్ష ఎదుర్కొన్నారని కొండపల్లి కోటేశ్వరమ్మ వంటి వారి జీవిత చరిత్రలు సాక్ష్యం చెబుతున్నాయి. యుద్ధరంగంలో పోరాడిన జల్కరీబాయి, భూస్వామ్య వ్యవస్థను ఎదిరించిన చాకలి ఐలమ్మ వంటి వారి గురించి నిన్నటి వరకు చరిత్రలో రికార్డు చేయకపోవడానికి కారణం వివక్షే కదా... అందుకే వివక్షను విచ్ఛిన్నం చేయడం మన బాధ్యత.

...జ్వలిత ప్రధాన సంపాదకురాలు


## సంపాదక వర్గం

**ప్రధాన సంపాదకురాలు**
జ్వలిత

**ప్రధాన సలహాదారులు**
డా. తిరునగరి దేవకీదేవి
అనిశెట్టి రజిత
డా. కొమర్రాజు రామలక్ష్మి

**సంపాదక వర్గం**
ఆచార్య సూర్య ధనుంజయ
జి. విజయలక్ష్మి
డా. షాజహానా
కొల్లాపురం విమల
డా. త్రివేణి
డా. నందిగామ నిర్మల
నస్రీన్ ఖాన్
నాంపల్లి సుజాత
నిరుపమ
లావణ్య
డా. మారోజు దేవేంద్ర
రమాదేవి బాలబోయిన

**సాంకేతిక వర్గం**
చందన్ కలిత
టి. నరేష్ చైతన్య
కె. ప్రకాష్

**కార్యనిర్వాహక వర్గం**
జయింతి వాసరచెట్ల
సరోజన బోయిని
యడవల్లి శైలజ
సిస్టర్ అనసూయ
పోతన జ్యోతి


**బహుళ బహుజనస్త్రీలసమస్యలన్నింటినీ చర్చించే అవకాశం కల్పిస్తుంది. పత్రికలో ప్రచురించే రచనలతో సంపాదక వర్గం ఏకీభవించినట్టు కాదు.**

రచనలు పంప వలసిన చిరునామా :
జ్వలిత, సాహితీవనం, 15-21-130/2, బాలాజీనగర్, కూకట్పల్లి, హైదరాబాద్ - 500072, తెలంగాణ editorbahula@ gmail.com

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | ముఖచిత్రం | | ....................1 |
| 2. | వ్యాసం | ధైర్యవంతులైన అందమైన మహిళలు | నిరుపమ ....................2 |
| 3. | వ్యాసం | తెలంగాణా స్త్రీల సంస్కరణ ఉద్యమం | కొల్లాపురం విమల ....................6 |
| 4. | కథ | నిర్ణయం | పోర్షియాదేవి ....................11 |
| 5. | కథ | నా జాన్ జిగ్రీ | జూపాక సుభద్ర....................13 |
| 6. | కవిత | నా కైతే సిగ్గుగా ఉంది | గీతాంజలి ....................16 |
| 7. | ఇంటర్వ్యూ | "మహిళా దినోత్సవం సందర్భంగా స్ఫూర్తి దాయకమైన శ్రామిక మహిళతో మాటా – ముచ్చట" | జయంతి వాసరచెట్ల ....................17 |
| 8. | కవిత | మగువా నీ పోరాటం ఇంకెన్నాళ్లు ?? | మామిడాల శశిరేఖ ....................20 |
| 9. | వ్యాసం | ఆదిమ సమాజాల స్త్రీవాది ద్రౌపది | నందిగామ నిర్మలకుమారి....................21 |
| 10. | కథ | కొత్త టీచర్ | తులసీ గుగులోతు ....................24 |
| 11. | కథ | పుర్రె | గంధం విజయ లక్ష్మి....................25 |
| 12. | కవిత | ఆమెల గురించి మాట్లాడదాం... | సీహెచ్. ఉషారాణి....................26 |
| 13. | సమీక్ష | చక్కని శైలితో సాగిన 'పృథ' దృశ్యకావ్యం | శైలజామిత్ర ....................27 |
| 14. | వ్యాసం | హిజాబ్ అభ్యంతరమేమి | తిరునగరి దేవకీదేవి....................31 |
| 15. | కవిత | సానిటరి ప్యాడ్స్ | వితలాపురం పుష్పలత....................32 |
| 16. | కథ | బంగారు భూమి | వనజ తాతినేని ....................33 |
| 17. | కథ | సావిత్రి | చల్లా సరోజినీదేవి....................39 |
| 18. | కవిత | ఆమెకు ఆమే సాటి | నస్రీన్ ఖాన్....................43 |
| 19. | కవిత | ఎర్ర మరక | సాకేర....................44 |
| 20. | ఇంటర్వ్యూ | మహిళానుబంధాల సాక్ష్యం | లావణ్య....................45 |
| 21. | కవిత | తరువు తనువు | శారద ఆవాల ....................47 |
| 22. | వ్యాసం | శ్రీమతి బండారు అచ్చమాంబ గారి కథల విశిష్టత | ముద్దు వెంకట లక్ష్మి ....................48 |
| 23. | కవిత | సాధికారత వైపు...! | అయిత అనిత ....................49 |
| 24. | కథ | అక్షరానుబంధం | నాంపల్లి సుజాత ....................50 |
| 25. | కథ | కొత్తతరం | జయంతి వాసరచెట్ల ....................53 |
| 26. | వ్యాసం | పాకాల యశోదారెడ్డిగారి వచన కవిత్వంలోని కొత్తచూపు | డా. కొండపల్లి నీహారిణి....................58 |
| 27. | కవిత | నాలోకి నేను | వనితా రాణి నోముల ....................61 |
| 28. | కథ | మనోధైర్యం | డా. ప్రతిభాలక్ష్మి....................62 |
| 29. | కథ | పొరబాటు | డా. లక్ష్మి రాఘవ ....................66 |
| 30. | కవిత | 'నానీలు' | ఆచార్య సూర్యధనుంజయ్ ....................69 |
| 31. | కవిత | జ్ఞానజ్యోతులు | మహతితేజశ్రీ ....................69 |
| 32. | వ్యాసం | రేపటి శక్తివంతమైన సమాజం కోసం నేడు స్త్రీ పురుష సమానత్వం ! | ఝాన్సీ కె.వి. కుమారి ....................70 |
| 33. | కవిత | నేనో చెదిరిన చిరునవ్వుని | యలమర్తి అనూరాధ ....................71 |
| 34. | కథ | నయని | జి. దివ్య కీర్తన ....................72 |

| | | | |
|---|---|---|---|
| 35. | కథ | సత్పురుషా ...!? | యడవల్లి శైలజ ప్రేమ్....................76 |
| 36. | కవిత | పూల రెక్కలు | శాంతి కృష్ణ ................................80 |
| 37. | కవిత | నీవే ఈ జగత్తు ప్రదాతవు | సిస్టర్ అనసూయ .........................80 |
| 38. | వ్యాసం | మహిళా సాధికారత సవాళ్లు, సమస్యలు | అల్లూరి గౌరీలక్ష్మి .........................81 |
| 39. | కథ | కలనైనా .. కథనైనా... | స్వాతి శ్రీపాద ..............................85 |
| 40. | కథ | ధైర్యం | విజయ గోలి ...............................87 |
| 41. | కవిత | హుస్న్– ఏ– మత్లా | గీతారాణి అవధానుల ...................90 |
| 42. | కథ | ఆత్మవిశ్వాసం | వేముల ప్రేమలత .........................91 |
| 43. | వ్యాసం | మారిన మనిషి | పెద్దపల్లితేజస్వి ...........................92 |
| 44. | కవిత | విడి ఆకులు | సిద్దగాని భాగ్యలక్ష్మి.......................94 |
| 45. | కవిత | విజయ గీతిక | కళ తాటికొండ............................95 |
| 46. | వ్యాసం | మలుపు తిరిగిన రథచక్రాలు | వంగరి త్రివేణి .............................96 |
| 47. | కథ | చిత్రం | ఈరంకి ప్రమీలారాణి................. 105 |
| 48. | కవిత | శిల్పి | వి. పద్మ ................................. 108 |
| 49. | కథ | పునర్నవి | బి. భవానీ ............................. 109 |
| 50. | వ్యాసం | శ్రామిక మహిళా దినోత్సవం | సరోజన బోయిని ..................... 112 |
| 51. | కథ | నువ్వునాకునచ్చావ్ | కోటమర్తి రాధాహిమబిందు......... 114 |
| 52. | కథ | అలనాటి తెలుగు ఇల్లాలు | లంక సీత ............................... 117 |
| 53. | పాట | మహిళా దినోత్సవం | వారణాసి నాగలక్ష్మి .................. 118 |
| 54. | వ్యాసం | ఇది మహిళా పోరాట దినం | జి. విజయలక్ష్మి........................ 119 |
| 55. | కథ | అత్తగార్లూ పారా హుషార్ ...!!! | చివుకుల లక్ష్మీ ......................... 121 |
| 56. | కవిత | ప్రగతి పథంలో పడతి | గుడిపూడి రాధికారాణి ............... 123 |
| 57. | కథ | కాల పురుషుని కరాళదంష్ట్రలు | పి. శాంత ............................... 124 |
| 58. | వ్యాసం | 'మహిళా మణి' | సుమతి చురుకంటి.................... 127 |
| 58. | కవిత | మానవత్వం | తిరునగరి సంధ్య...................... 127 |
| 59. | వ్యాసం | శాపగ్రస్త అహల్య | చంద్రకళ దీకొండ..................... 128 |
| 60. | వ్యాసం | వీరనారి సుమయ్య(రజి) | కవి కరీముల్లా ......................... 129 |
| 61. | కవిత | ఈ ఒక్క రోజుకే.... భయపడకు | జ్వలిత ................................. 130 |
| 62. | కవిత | చిటికెన వేలు నృత్యం | గీతాంజలి .............................. 131 |
| 63. | కవిత | మహిళా దినోత్సవం – 2022 | తంగెళ్ళశ్రీదేవిరెడ్డి ...................... 132 |
| 64. | కథ | లైక్ , కామెంట్, షేర్ చేయండి | రమాదేవి బాలబోయిన.............. 134 |
| 65. | కవిత | ప్రయోగశాలలు | కడెం లక్ష్మీ ప్రశాంతి ................. 135 |
| 66. | కథ | పుత్తడి బొమ్మ | రోహిణి వంజారి ....................... 136 |
| 67. | కవిత | మరో అడుగు .... | మొహమ్మద్. అఫ్సర వలీషా ........ 138 |
| 68. | | కొత్త పుస్తకాలు | ............................................ 139 |

వ్యాసం

# తెలంగాణా స్త్రీల సంస్కరణ ఉద్యమం



## (1926-1950)

## (స్త్రీల కొరకు స్త్రీలే పూనుకున్న సంస్కరణ ఉద్యమం)

- కొల్లాపురం విమల

"ప్రతీ జీవితంలో కదలిక ఉంటది. యే ఉద్యమమైనా కదలికతోనే మెదలయితది" అంటారు కాళన్న, ఓ సందర్భంలో. ఉద్యమాలు జన చైతన్యానికి ప్రతీకలు, భావజాల ప్రాతిపదికగా తాము ఆశించే మార్పులకోసం సాగే దీర్ఘకాలిక ఉద్యమాలు కావచ్చు; అణచివేతలు పెచ్చరిల్లినప్పుడు అసహనాలు పేట్రేగినప్పుడు ప్రతిస్పందనగా అప్పటికప్పుడు ఎగిసే ఉద్యమాలు కావచ్చు – ఏ ఉద్యమమయినా జనాలను కలిపే వంతెనగా పనిచేస్తుంది. సమష్టి కార్యాచరణలకు భూమికను సిద్ధం చేస్తుంది. మహిళా ఉద్యమాలు స్త్రీల అనుభవాలే ప్రాతిపదికగా మొదలైన ఉద్యమాలు. పితృస్వామ్య వ్యవస్థలో అన్ని రకాల వివక్షల్లో, అణచివేతల్లో మగ్గిపోయిన స్త్రీలు తమ విముక్తి కోసం కలిసి పనిచేయడం మొదలు పెట్టినప్పుడే తక్కిన ఉద్యమాలకు భిన్నమైన తమ ఉనికి బలంగా చాటినై.

పురుష ఆధిపత్య భావనల మూలంగా కుంగిపోయే వ్యవస్థల్లో వీగిపోని ప్రతిఘటన శక్తులుగా స్త్రీల ఉద్యమాలు కొనసాగినై. తమవే అయిన అనుభవాల నుంచి అందుకున్న స్పష్టమైన దృక్పథాలతో అన్ని రకాల ఆధిపత్యాలకు 'షాక్ ట్రీట్ మెంట్' ఇచ్చిన మహిళా ఉద్యమాల గురించి తెలుసుకోవడం అంటే, ఆయా సందర్భాల్లో మలుపు తిరిగిన చరిత్రను అర్థం చేసుకోవడం. అంతే కాదు, వర్తమానాన్ని మలచిన ఆనాటి స్త్రీల ఉద్యమస్ఫూర్తిని అందుకోవడం కూడా.

తెలంగాణ సందర్భమే తీసుకుంటే మలిదశ తెలంగాణ ఉద్యమంలో తమ పిల్లల్నే విరాళంగా ఇచ్చిన స్త్రీల త్యాగాలకూ, సాయుధ

పోరాటంలో ఆధిపత్యాలను ఎదురిచ్చిన 'ఐలమ్మ' వంటి వారి సాహసాలకూ బీజాలు వందల ఏండ్ల కిందనే పడినయి అనడానికి సమ్మక్క-సారలమ్మలే ఉదాహరణ. అన్యాయాలను అణచివేతలను ఎదిరించిన వారి చైతన్యమే తెలంగాణ పోరాటాలకు దిక్సూచి. అందుకే వాళ్ళు దేవతలుగా పూజలందుకుంటున్నారు. ఆదిమ స్త్రీలు అందించిన పోరాట చైతన్యం తెలంగాణలో అవిచ్ఛిన్నంగా సాగిన ఆధారాలున్నయి. 7వ శతాబ్దంలోనే కలం పట్టి తన అనుభవాలను ప్రపంచానికి వినిపించిన కవయత్రి 'నాచి' నుంచి మొదలుకొని స్త్రీల స్వతంత్ర అస్తిత్వాలను సూటిగా వినిపించిన అక్కమాహాదేవి వరకు వ్యవస్థతో చేసిన కలం పోరాటాలను వ్యక్తిగత ఉద్యమ కార్యచరణలుగా చూడొచ్చు. మధ్య యుగాల నాడే పరిపూర్ణ వ్యక్తిత్వాలను తేట భాషలో రూపుగట్టిచ్చిన మొల్ల కావచ్చు, కవయిత్రీ– కళాకారిణి ఉస్మానియా యూనివర్సిటీకి తన జాగీరుని వారసత్వ కానుకగా అందిచ్చిన సామాజికవేత్త అయిన మహలఖా బాయి చందా కావచ్చు వ్యక్తులుగానే సమాజంలో మార్పు కోసం పనిచేసిన స్త్రీలకు ఆదర్శంగా నిలిచారు. తెలంగాణాలో ఆధునిక చైతన్యాన్ని రగిలించి గ్రంథాలయోద్యమానికి పాదులు వేసిన అచ్చమాంబ, బాలికల విద్యకై పని చేసిన సుగ్రా హుమాయున్ మీర్జా లాంటి వారు తొలినాళ్ల ప్రజాస్వామిక ఉద్యమాలకు నారు పోసారు. ఆ తర్వాతి కాలంలో వచ్చిన 'ఆది హిందూ ఉద్యమం' తో మమేకమై పనిచేసిన స్త్రీలు నీరు పోసారు. ఈ చైతన్యమే తెలంగాణాలో తొలి 'స్త్రీల సంస్కరణ ఉద్యమా'నికి బీజాలు వేసింది. 'స్త్రీ విద్యాసామాజిక వికాస సమితి' (Women's association for education and Social advancement) అనే స్త్రీల సంస్కరణల సంఘానికి దారులు చేసింది.

మనం ఇంతకాలం ఆధునిక సందర్భంలో

ఆర్యసమాజం, బ్రహ్మ సమాజం వంటి సంఘాల సంస్కరణ కార్యక్రమాల గురించి చదివినం. బ్రిటిష్ ఇండియాలో పురుషుల నాయకత్వంలో నడిచిన సంస్కరణల ఉద్యమాల గురించి తెలుసుకున్నం. బాల్యవివాహాల రద్దు, విధవ వివాహం వంటి దురాచారాల మీద పోరాడిన వీరేశలింగం పంతులు గారి వంటి కోస్తాంధ్ర సంస్కర్తల గురించి విన్నం. కానీ హైద్రాబాదు కేంద్రంగా స్త్రీల సమస్యల పరిష్కారానికై స్త్రీలే పూనుకొని ఉద్యమించారన్న విషయం మన సమష్టి జ్ఞాపకాల్లోంచే తుడిచి పెట్టుకొని పోయింది. స్త్రీల సాధికారత కోసం సాగిన సంస్కరణ ఉద్యమాలు, స్త్రీల (బహుజనుల) విముక్తి కోసం సాగిన తిరుగుబాటు ఉద్యమాలు, అనే రెండు పాయలుగా సాగిన తెలంగాణగా స్త్రీల ఉద్యమ కార్యచరణల ఊసే లేని చరిత్రలు అందుకు కారణమైనై. అంతర్గత వలస, పితృ స్వామ్యం, కుల స్వామ్యం అనే మూడంచెల వివక్షల కింద నల్లజాతి స్త్రీల వలెనే తెలంగాణా స్త్రీల చరిత్రా జ్ఞానాలు పూడుకు పోయినై. వాటిని తవ్వి తీయాల్సిన అవసరం వుంది. విధవా వివాహాలే గొప్ప సంస్కరణ ఉద్యమంగా చరిత్రలో స్థానం దక్కించుకుంటున్న సందర్భంలోనే తలకిందులుగా వున్న పురుషున్నీ, రాజ్యం పెదధోరణులను 'సంస్కరించే' ఉద్దేశ్యంతో పనిచేసిన తెలంగాణా 'స్త్రీ విద్యా సామాజిక వికాస సమితి' గురించీ, దాని నేపథ్యం, ఉద్యమ కార్యాచరణల గురించీ తరిచి చూడాల్సి వుంది. స్త్రీల నాయకత్వంతోనే సాగిన తొలినాళ్ల స్త్రీల సంస్కరణ ఉద్యమ చరిత్రను తిరగదోడాల్సివుంది.

తెలంగాణలో గ్రంథాలయోద్యమంతో మొదలైన 'చదివించే' ఉద్యమం, ఆదిహిందూ ఉద్యమ (1906) తోడ్పాటుతో స్త్రీవిద్యకు దోహదం చేసింది. సుగ్రా హుమాయన్ మీర్జా వంటి విద్యావంతులైన స్త్రీలూ, ఆది హిందూ పరిషత్తు వంటి సంస్థలూ బాలికల విద్య కోసం నెలకొల్పిన బడులే కాక అప్పుడే మొదలైన ఉస్మానియా యూనివర్సిటీ, ఆ తరం విద్యావంతులైన స్త్రీలలో మహిళా వికాసానికి సంబంధించిన ఆలోచనలను రగిలించిన 1920ల నాటికి స్త్రీల సమస్యల గురించిన చర్చలు హైదరాబాదులో ముమ్మరమైనై. సంపన్న వర్గాల స్త్రీలు కలుసుకునే క్లబ్బులు అందుకు తొలి వేదికలైనై. అప్పటికి మూసీ వరదల్లో అల్లకల్లోలమైన నగరవాసులకు సేవచేసేందుకు సరోజినీ దేవి వంటి కవయిత్రుల చొరవతో 'జనానా' స్త్రీలు పబ్లిక్ రంగంలో పనిచేయడం మొదలైంది. వరద బాధితులకు రిలీఫ్ ఫండ్ జమచేయడం, ఫస్ట్ ఎయిడ్ వైద్యం, బట్టలు – ఆహారం అందించడం వంటి కార్యక్రమాల్లో సంపన్న, మధ్యతరగతి స్త్రీలు స్వచ్ఛందంగా పనిచేసారు. ఈ అనుభవం వారికి స్త్రీల సమస్యల పట్ల అవగాహనను పెంచింది. పరిష్కారాల కోసం చర్చలు మొదలైనై. 'లేడీ బర్టన్ క్లబ్' అందుకు కేంద్రంగా మారింది. అప్పటి రెసిడెంట్ 'బర్టన్' భార్య ఈ చర్చలకు వేదికగా తన క్లబ్ ని అనుమతించడమే గాక సంస్కరణ వాదులైన స్త్రీలతో కలిసి పనిచేయడం ప్రారంభించింది. విద్యావంతురాలూ, నిబద్దత కల్గిన సంఘ సేవకురాలిగా పేరున్న 'బేగం రుస్తుం జంగ్' స్త్రీలలో చైతన్యం జాగృతం చేసేందుకు ఆరోజుల్లో అహర్నిశలు శ్రమించేది. దేశవ్యాప్తంగా స్త్రీల వికాసం కోసం పనిచేసే వ్యక్తులతో ఆమెకు స్నేహ సంబంధాలుండేవి. 'పూనా'లో స్త్రీలు నిర్వహించిన సమావేశానికి అతిథిగా వెళ్లి పాల్గొన్నది. హైద్రాబాదులో కూడా అట్లాంటి స్త్రీల సభను నిర్వహించాలనే ఆలోచనతో విద్యావంతులైన స్త్రీలను సమీకరించింది. లేడీ 'బర్టన్' క్లబ్ కేంద్రంగా దఫాల వారీ చర్చల ఫలితంగా చివరికి 1926 లో 'స్త్రీ విద్యా సామాజిక సమితి' (W.A.E.S.A) పేరుతో తొలి స్త్రీల సంస్కరణ సంఘం ఏర్పడింది. ఈ సంఘం తన లక్ష్యాల్లో స్త్రీల సాధికారతే తన ధ్యేయంగా ప్రకటించుకున్నది. కుల మత, భాషలకతీతంగా సభ్యత్వాన్ని ప్రకటించింది. ఐతే తప్పనిసరిగా ఇంగ్లీషు భాష తెలిసి ఉండాలనే నిభందనను నిర్ణయించింది. బేగం హైదర్ నవాజ్ జంగ్ (లేడీ హైదరీ) ప్రెసిడెంట్ గా, మసూమా బేగం, గుల్ షెనాయ్ కార్యవర్గ సభ్యులుగా సంఘ కార్యక్రమాలు మొదలైనై. షాపూర్ వాడీ లో తొలి సమావేశం జరిగింది. సరోజినీ నాయుదు ముఖ్య అతిథిగా ఆ సభలో పాల్గొంది. బాలికలకు తప్పనిసరి ప్రాథమిక విద్యనందించాలని ఆనాటి సభ తీర్మానించింది. W. A.E. S.A వరుస సమావేశాలలో విద్యావంతులైన హైద్రాబాదు స్త్రీలలో కదలిక మొదలైంది. జాతీయోద్యమంలో తమను తాము మరచి జాతిస్వాతంత్ర్యం కోసం పనిచేస్తున్న భారతీయ స్త్రీలకు స్త్రీలుగా తమ హక్కుల ప్రకటన చేయాల్సిన అవసరాన్ని W.A.E. S. A సమావేశాలు గుర్తు చేసినై. డిల్లీ కేంద్రంగా మార్గరెట్ కజిన్స్ W.A.E.S.A ఆలోచనలకు రూపం ఇచ్చే బాధ్యతను తీసుకున్నది. ఫలితంగా 1928 లో 'అఖిల భారత స్త్రీల మహాసభ" (All India women's Confrence) ఏర్పాటయింది. ఆ సభలో పాల్గొనేందుకు వెళ్ళే W.A.E.S.A సభ్యుల కోసం నిజాం ప్రభుత్వం ఒక ప్రత్యేక రైలు బోగీని ఏర్పాటు చేసింది. సమావేశాల తర్వాత ఆ బోగీలోనే సభ్యులు విశ్రమించడానికి ఆనాటి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. మూడు రోజుల ఆ సమావేశాల్లో W. A. E

S.A.కీ A.I.W.C.కీ మధ్య సంభందాలు దృడపడినై. దళిత సంస్కర్త భాగ్యరెడ్డి వర్మతో మొదలైన 'ఆదిహిందూ ఉద్యమం' 'అఖిల భారత నిమ్నవర్గాల మహాసభ' పూనాలో ఏర్పడేందుకు దోహదపడినట్లుగానే, బేగం రుస్తుం జంగ్ పూనికతో మెదలైన "స్త్రీవిద్యా సామాజిక వికాస సమితి' (W.A.E.S.A) 'అఖిల భారత స్త్రీల మహాసభ డిల్లీలో ఏర్పడేందుకు దారులు వేసింది. A.I.W.C. తన మూలాలు హైద్రాబాదులోనే వున్నాయని ప్రకటించుకొన్నది.

అప్పటికే ఆర్యసమాజం, బ్రహ్మసమాజం ప్రచారంలోకి తెచ్చిన విధవా వివాహం, సతి, బాల్యవివాహాల రద్దు వంటి సంస్కరణ కార్యక్రమాలకు మద్దతు ఇస్తూనే తమవే అయిన ఆలోచనలకు కార్యరూపం ఇవ్వడంతో W.A.E.S.A. సంస్కరణ ఉద్యమానికి ప్రత్యేకతలు సమకూరినై. స్త్రీల స్వతంత్ర అస్తిత్వాలను చాటే నినాదాలను, కార్యాచరణలను ఈ సంఘం తన కార్యకమాలుగా యెంచుకోవడంలోనే ఆ ప్రత్యేకతలు స్పష్టపడతై. ఉదాహరణకి స్త్రీ పురుషులకి 'సమాన పౌర హక్కులు' అన్న భావనను యావత్ భారతదేశంలోనే తొలిసారిగా చర్చించి ప్రచారంలోకి తెచ్చింది ఈ సంఘ సభ్యులే. బేగం రుస్తుం జంగ్ ప్రారంభించిన ఈ మహిళా సంస్కరణ ఉద్యమంలో బేగం హైదర్ నవాజ్ జంగ్, మసూమా బేగం, గుల్ షెనాయ్, లేడీ బర్టన్, నంది, లేడీ ఆస్మాన్ జా, రాణీ కుముదినీ దేవి(వనపర్తి), లేడీ కీస్, దుర్రె పవార్, నీలోఫర్, బేగం నాలవుద్దౌలా(ఈమె హెలెన్ కెల్లర్ ని హైదరాబాద్ కు ఆహ్వానించి ప్రసంగాలు ఏర్పాటు చేసింది) దయాదేవి, పద్మజా నాయుడు, వికార్ ఉల్ ఉమ్రా (ఈమె హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ కోసం 39 ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చింది) సరళాదేవి, లీలావతి నాయుడు, సుధా రంగనాధన్, ఇందిరాదేవి ధన్ రాజ్ గిర్ వంటి విద్యావంతులైన సంపన్నవర్గాల స్త్రీలు స్వచ్ఛందంగా పాలుపంచుకున్నారు.

స్త్రీల కోసం ఆలోచించే మేధావులను దేశం నలుమూలల నుంచి ఆహ్వానించి ప్రసంగాలు ఏర్పాటు చేయడం, చర్చలు నిర్వహించడంతో మొదలైన ఈ సంఘ సంస్కరణ కార్యక్రమాలు క్రమంగా భిన్న రంగాలకు విస్తరించినై. సామాజిక సంస్కరణలు, విద్యా సంస్కరణలు అనే రెండు పాయలుగా సంస్కరణల కార్యక్రమాలను సాగించేందుకు 4 కమిటీలుగా ఏర్పడి ఈ సంఘం పనిజేయడం ప్రారంభించింది. స్కూల్స్ – హాస్టల్స్; రాజ్యాంగం – హక్కులు: డిబేటింగ్ సొసైటీ అనే విభాగాలుగా ఈ కమిటీలు కలిసి పనిచేసేవి. అందులో భాగంగా అధ్యయనం, పరిశోధన, క్షేత్రస్థాయి కార్యక్రమాలు, స్త్రీల డెలిగేషన్స్ వంటి కార్యక్రమాలను ఎంచుకొని AIW-Cతో కలిసి ఈ సంఘం 1960ల వరకు నిరంతరంగా పని చేసింది. విద్యాసంస్కరణల్లో భాగంగా మానేపల్లిలో తమ మెట్టమొదటి బాలికల పాఠశాలను నెలకొల్పింది. ఆనాడే మధ్యాహ్న భోజనాన్ని బడిలో ప్రారంభించింది. అంతేకాదు, సంఘ సభ్యులు అదే బడి ప్రాంగణంలో సాయంత్రాలు స్త్రీల కోసం వయోజన విద్యా కార్యక్రమాలు నిర్వహించేవారు. సికంద్రాబాదు, హైద్రాబాదులోని పాఠశాలలకు బృందాలుగా వెళ్లి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసి తాము నడిపే స్కూల్స్ లో విద్యా ప్రమాణాలను పెంచే ప్రయోగాలు చేసేవారు. వెబ్ స్టర్ వంటి ప్రముఖ శిశు విద్యా నిపుణులతో ట్రైనింగ్ తరగతులు తీసుకొని పాఠ్యప్రణాళికలు సిద్ధం చేసేవారు. పాఠ్య పుస్తకాల కోసం 1929లో ప్రత్యేక సిలబస్ డ్రాఫ్ట్ తయారు చేసే ప్రయత్నాలను A.I.W.C. తో కలిసి ప్రారంభించి, దేశవ్యాప్తంగా అమలవుతున్న టీచర్ ట్రైనింగ్ పద్ధతులను అధ్యయనం చేసిందీ సంఘం. యూనివర్సిటీ అకడమిక్ బాడీల్లో పురుషులకు సమానంగా స్త్రీలు సభ్యులుగా వుండాలనే డిమాండు పెట్టి సాధించుకున్నది. ఈ సంఘం నడిపే పాఠశాలలు నాంపల్లి, ఖైరతాబాద్, గోల్కొండలకు కూడా విస్తరించినై. ఉర్దూ, తెలుగు మీడియంలలో వేరువేరుగా తరగతులు నిర్వహించేవారు. 1935లో నాటికి ఆ బళ్ళలో 181 మంది బాలికలు చదివేవారని సంఘ వార్షిక రిపోర్టులు చెబుతున్నాయి. ఇక హాస్టల్ కమిటీ 'గగన్ మహల్' లో స్త్రీలకు ఉద్యోగ సూచనలు, సలహాల కోసం ఒక బ్యూరో ప్రారంభించడమే గాక, ఉద్యోగస్తులైన స్త్రీల కోసం 'చాదర్ ఘాట్ చర్చిరోడ్'లో ఒక వసతి గృహాన్ని ఏర్పాటు చేసింది. దానికి ప్రభుత్వం నుంచి 100రూ.ల గ్రాంటుని కూడా సంపాదించింది. హైద్రాబాదు, సికింద్రాబాదు బొల్లారం నుంచే గాక ఇతర డొమేనయన్ల నుంచి వచ్చిన డెలిగేట్స్కి ఇక్కడ వసతి సౌకర్యాలుండేవి. సంఘం ఆహ్వానం పై వచ్చిన డెలిగేట్స్ తో చర్చలు నిర్వహించేవారు. ఇంగ్లీషు, ఉర్దూ, తెలుగు, మరాఠీ, గుజరాతీ భాషల్లో చర్చలు సాగేవి. 1935 నాటికి ఈ హాస్టల్లలో 400 మంది స్త్రీలుండేవారని రిపోర్టులు చెబుతున్నై. ఇంతేగాకుండా ఈ సంఘం స్త్రీల స్వావలంబన కోసం 'జనానా కాటేజ్ ఇండస్ట్రీ సొసైటీ'ని నెలకొల్పాలనీ; దానికి సూపరిండెంటు స్థాయిలో స్త్రీలే ఉండాలనీ, అన్ని ప్రభుత్వ విభాగాల్లో– మున్సిపాలిటీల్లో – క్లబ్బుల్లో స్త్రీలకు ప్రత్యేక వృత్తి శిక్షణా తరగతులు– అక్షరాస్యతా తరగతులు

నిర్వహించాలనీ; జాగీర్దార్లూ – జమీందార్లూ తమ ఇలాకాల్లో బదులు గ్రంధాలయాలూ నెలకొల్పాలనీ; పేదలకు స్కాలర్షిప్ లు ప్రకటించాలనీ, గ్రామాల పునర్నిర్మాణంలో స్త్రీల సమాన భాగస్వామ్యానికి అన్ని రకాల అవకాశాలను కల్పించాలనే స్పష్టమైన ప్రతిపాదనలను నిజాం సర్కారుకు పంపింది. అప్పటి పొలిటికల్, ఎడ్యుకేషనల్ మెంబర్స్ తో సంప్రదింపులు జరిపి వాటి అమలుకు పని చేసింది. పిల్లల రక్షణ చట్టాలను ఏర్పర్చి స్త్రీల–పిల్లల అమ్మకాలకు అడ్డుకట్ట వేయాలనీ, బాధితులకు ఉచిత హాస్టల్స్ నిర్మించాలనీ, సంపన్నుల ఇండ్లలో బానిసలుగా బతుకుతున్న బాలికల కేసులను వెలికి తీయాలనే డిమాండ్లను ముందుకు తెచ్చింది.

ఇక రాజ్యాంగం – హక్కుల కమిటీ స్త్రీలకు చట్టాలపై అవగాహన కల్పించే దిశగా ప్రముఖులతో ప్రసంగాలు ఏర్పాటు చేస్తూనే, స్త్రీల హక్కుల పరిరక్షణకై చట్టపరమైన సంస్కరణల కోసం ఉద్యమించింది. 1928 లో కేంద్ర లెజిస్లేచర్ లో స్త్రీల ప్రాతినిధ్యం, శారదా బిల్లు అమలు వంటి తీర్మానాలు చేసి ప్రభుత్వం పై వత్తిడి తెచ్చింది. ఇదే సంవత్సరం స్త్రీపురుషులకి సమాన పౌరసత్వం, స్త్రీల దుస్థితి, మహిళా కార్మికుల సమస్యలపై ఏర్పడిన డెలిగేషన్ లో 'బెర్లిన్ ఇంటర్నేషనల్ కాంగ్రెస్ ఆఫ్ ఉమెన్' సదస్సుకు హాజరైంది. లేబర్ కమీషన్ ముందు మహిళా కార్మికుల సమస్యలకు సంబందించిన రిపోర్టులను సమర్పించింది. ఇక 'డిబేటింగ్ కమిటీ' చర్చల్లోంచి 'అంటారాని తనం' నిర్మూలనకై W.A.E.S.A. సంఘ కార్యక్రమాలు షురువైనై. 1931ల నాటికి హిందూ విడాకుల చట్టానికి సంబంధించిన అధ్యయనాన్ని ఈ సంఘం ప్రారంభించింది. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఉమెన్, ఆల్ ఇండియా ఉమెన్ కాన్ఫరెన్స్ లతో కలిసి 'రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్' కి స్త్రీల హక్కులకి సంబంధించిన మెమోరాండం సమర్పించింది. రౌండ్ టేబుల్ సమావేశంలో స్త్రీల ప్రాతినిధ్యానికి డిమాండు చేస్తూ వైస్రాయ్ కి మెమోరాండం సమర్పించిన వారిలో హైదరాబాద్ మహిళా సంస్కర్తలు కీలకంగా పని చేసింద్రు. 1931 – 32 లో సమాన ప్రాతినిధ్యం కోసం వీరు చేసిన ప్రయత్నాలు విఫలమవడంతో బ్రిటిష్ పార్లమెంట్ కు రెండోసారి మెమోరాండం ఇచ్చేందుకు భారత మహిళ డెలిగేషన్ లో భాగంగా లండన్ కెళ్ళింది సంఘం. 'భారత స్త్రీల సంయుక్త ఆకాంక్ష'గా కుల మతాలకు అతీతంగా స్త్రీలకు ప్రత్యేక 'ఎలక్టొరేట్' కావాలని ప్రకటించింది. స్త్రీల హోదాను 'wife hood' తో నిర్ణయించే సామాజిక ఆచరణలను తిరస్కరిస్తున్నామని, బహిరంగ ప్రకటన చేసింది. స్త్రీల హక్కుల ఉల్లంఘన అధ్యయనానికి ఒక కమీషన్ వేయడానికి డిమాండ్ చేసింది. మొత్తానికి విడాకుల చట్టం, భరణం, వివాహ చట్టం, వారసత్వ చట్టం, ఆస్తి హక్కు, హ్యూమన్ ట్రాఫికింగ్, అనాధ శిశువులకు – వితంతువులకు వసతి గృహాల చట్టాల కోసం పనిచేసి, ఈ సంఘం సంస్కరణ ఉద్యమానికి హైదరాబాద్ ని కేంద్రంగా చేసింది. బేగం రుస్తుం జంగ్ ప్రారంభించిన ఆనాటి సంస్కరణ ఉద్యమ ఫలితాలను ఇప్పటి తరం భారతీయ స్త్రీలందరూ అందుకుంటున్నారు. అందుకు ఆనాటి W.A.E.S.A. సంఘ సభ్యుల నిబద్ధతే కారణం.

స్త్రీల సాధికారత కోసం తాము చేసే యుద్ధంలో చేయి కలపమనే ఆహ్వాన ప్రకటనలతో W.A.E.S.A సంఘ సభ్యులు అన్ని శ్రేణుల్లోని స్త్రీపురుషులను చేరే ప్రయత్నం చేసారు. ఫలితంగా ఎన్నో సంస్థలు, సంఘాలు W.A.E.S.A. తో కలిసి పనిచేయడం ప్రారంభించినై. మహిళా నవజీవన మండలి, హైద్రాబాద్ డిస్ట్రిక్ట్ మెథడిస్ట్ సంఘం, అంజుమన్–ఎ–ఖవాతుమ్ దక్కన్, గర్ల్స్ గైడ్స్, ఇండియన్ రెడ్ క్రాస్, బాలల సంక్షేమ సంఘం వంటి సంఘాలు ఈ సంస్కరణ ఉద్యమంలో పాలుపంచుకున్నై. గుల్బర్గా(బేగం గౌస్ యార్ జంగ్), వరంగల్ (శ్రీమతి వార్దేకర్), పూర్బానీ, ఔరంగాబాద్ ల్లో కూడా ఈ సంస్కరణ సంఘ ప్రతినిధులు పనిచేసేవారు. నాటి వారి కార్యాచరణల విస్తృతీ – పరిధి గమనిస్తే ప్రజాస్వామిక భావనలను సమాజానికి పరిచయం చేయడంలో అప్పటి స్త్రీలు చూపిన చొరవ అర్థమౌతుంది.

జాతీయవాదం పురుష ధోరణుల ఊతంతో నడుస్తున్న కాలంలో, ఫ్యూడల్ వ్యవస్థలను తిరస్కరిస్తూ, వ్యక్తులుగా పౌరులుగా సమూహాలు సంఘర్షిస్తున్న సంధికాలంలో, తమ అస్తిత్వ చేతనల్లోంచి 'బహుళత్వాలను' చాటి ప్రజాస్వామిక వ్యవస్థలకు సైద్ధాంతిక భూమికను సిద్ధం చేసినవారు తెలంగాణా మహిళా సంస్కర్తలు. స్త్రీల స్వావలంబన కోసం మహిళాగిల్డ్, ఉద్యోగినుల కోసం వసతి గృహం, మహిళా వృత్తి శిక్షణా కేంద్రాలు, బాలికల పాఠశాలలు, చార్మినార్ వద్ద 'లెర్న్ & ఎర్న్' తరగతులు వంటి కార్యక్రమాలతో స్త్రీలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతూనే, పౌరసమాజంలో ప్రజాస్వామిక విలువలను పెంచే ప్రయత్నం చేశారు. ఇట్లా సంక్షేమ భావనలతోనే ఆగిపోకుండా స్త్రీల రాజకీయ హక్కుల కోసం కూడా పనిచేసారు. కొన్ని 'సంస్కరణ వాద' పరిమితులున్నప్పటికీ ప్రగతిశీల సమాజం కోసం పాటు పడ్డారు. నేటితరం స్త్రీ ఈ మాత్రంగానైనా ఆత్మవిశ్వాసంతో నిలబడగలిగిన నేపథ్యాన్ని సమకూర్చారు.

ఈనాడు అన్ని స్త్రీవాద సంస్థలు చేస్తున్న పనులను ఆనాడే W.A.E.S.A. చేసిందంటే తెలంగాణ స్త్రీల ఆధునిక చేతన ఎంతటిదో అర్థమౌతుంది. కానీ దురదృష్టవశాత్తు ఆ చరిత్రంతా మన జ్ఞాపకాల్లోంచే పోయింది. అందువల్లనే 90 నుంచి స్త్రీవాద ఉద్యమం ఇక్కడ మొదలైందని భావించే తరం తయారయింది. ఏవో కొన్ని స్త్రీవాద సంస్థలను కీర్తించే సాహిత్య చరిత్రలు, సామాజిక విశ్లేషణలు స్త్రీలలో 'శిష్ట' వర్గాన్ని తయారు చేసినై. స్త్రీవాద (సంస్కరణ) ఉద్యమాల్లో ఆదివాసీ, దళిత, బహుజన, మైనారిటీ తెలంగాణా స్త్రీల భాగస్వామ్యాన్ని నిరాకరించే, రద్దు చేసే పరిస్థితులను కల్పించినై. తెలంగాణాలో స్త్రీవాదమే లేదన్న విపరీత వాదనలు చేసే 'అకడమిక్' రచనల పరంపరకు దారులు తెరిచినై. స్త్రీవాదులను పురుష ద్వేషులుగా, తెలంగాణ స్త్రీలను వెనుకపడినవారిగా ముద్రవేసి తమ ఆధిపత్యాలకు భంగం వాటిల్లకుండా వుండేందుకు అంతర్గత వలస,పురుషస్వామ్యం, మనువాదం కలిసి పనిచేసినై. అందువల్ల భిన్న శ్రేణుల్లోని తెలంగాణా స్త్రీలకే గాక ప్రగతిశీల మార్పుల కోసం కలలుగనే స్త్రీపురుషులందరికీ నష్టం వాటిల్లింది. స్థానిక స్త్రీవాద మూలాలను గురించిన అవగాహన కొరవడిన విద్యావంతుల తరం తయారయింది. ఫలితంగా ఆనాటి స్త్రీవాదుల ప్రజాస్వామిక చైతన్యాన్ని అందిపుచ్చుకోవడంలో ఈ నాటి ఉద్యమకారులు విఫలమయ్యారు.

అగ్రవర్ణ స్త్రీల సమస్యలను తలకెత్తుకున్న ఆనాటి పురుషుల సంస్కరణలకు భిన్నంగా భిన్న వర్గాల-కులాల జీవితాలను ప్రభావితం చేసే రక్షణ చట్టాల గురించి కానీ, విద్యా సామాజిక సంస్కరణల్లో గానీ తొలినాళ్ళ ఈ మహిళ సంస్కర్తలు చూపిన చైతన్యం గాఢమైంది. స్థల-కాల సామాజిక, రాజకీయ సందర్భాలను సంలీనం చేసుకున్న స్త్రీల దృక్పథాలకు వారి ఆచరణలు నిదర్శనంగా కన్పిస్తై. సమాన పౌరహక్కులు, సమాన వేతనం, సమాన గౌరవం అనే రాజ్యాంగ హక్కుల కోసం స్త్రీవాదులుగా ఆనాటి మహిళా సంస్కర్తలు చేసిన కృషిని ఇప్పటి తరం ఇంకా అందుకోవాల్సి వుంది.

సిస్టర్ హుడ్, పౌరస్పృహ, మతసహనం, భాషా సాంస్కృతిక వైవిద్యాల పట్ల గౌరవం వంటి ప్రజాస్వామిక పునాది భావనలు ప్రచారం చేయడంలో గానీ, ఆచరణలో చూపడంలో గానీ ముస్లిం స్త్రీల నాయకత్వంలో సాగిన 'స్త్రీ విద్యా సామాజిక వికాస సమితి' (W.A.E. S.A.) చేసిన కృషి ఏ అత్యాధునిక ఉద్యమాలకు తీసిపోనిది. ఆనాటి వారి నిబద్ధత ఈ మధ్య తమ హక్కుల కోసం షాహీన్ బాగ్ లో ప్రతిఘటనోద్యమాన్ని సమర్థమంతంగా నడిపిన ముస్లిం స్త్రీల నాయకత్వంలో సైతం చూడొచ్చు. మొత్తం మీద ఆనాటి మహిళా సంస్కర్తల కార్యచరణలు స్త్రీల హక్కుల కోసం ఉద్యమించే ఉద్యమకారులందరికీ స్ఫూర్తినిచ్చేవి. అంతేకాదు, సామాజిక రంగంలోనే గాక సాహిత్య కళారంగాల్లో తమదైన ముద్రవేసిన ఆ సంఘ సభ్యులైన సరోజనీ నాయుడు, ఇందిరాదేవి ధన్ రాజ్ గిర్: ప్రగతిశీల రచయిత్రులైన జీనత్ సాజీదా, జీలానీ బానో వంటి వారి ఆచరణలు తెలంగాణ స్త్రీల సాహిత్యోద్యమాలకు ఊతమిచ్చినై. ఆనాటి W.A.E.S.A. కార్యాచరణకు ఒక దశలో నాయకత్వం వహించి సాహిత్య కళారంగాలకు తన ఇంటినే కేంద్రంగా మలిచి ఈనాటికీ పనిచేస్తున్న ఇందిరా ధన్ రాజ్ గిర్; సమ్మిళిత సంస్కృతుల కూడలిగా చర్చా వేదికను స్థాపించి హైదరాబాద్ సాహిత్య సాంస్కృతిక కళా రంగాల కోసం పనిచేస్తున్న జిలానీ బానో వంటి వారి కార్యాచరణలు అందుకు నిదర్శనంగా ఇప్పటికీ కొనసాగుతున్నై. మొత్తానికి 1950ల నాటికి తోసుకు వచ్చిన బ్రాహ్మణీయ పితృస్వామిక రాజకీయ ధోరణుల మూలంగా కేవలం పిటీషన్లు సమర్పించే సంఘంగా మిగిలిపోయే వరకు ఎందరో సామాజిక కార్యకర్తలకు W.A.E.S.A. వేదికగా కొనసాగింది. స్త్రీల జీవితాల్లో మార్పుల కోసం అహర్నిశలు పనిచేసింది. ఆధునిక స్త్రీవాద ఉద్యమాలకు నేపథ్యాన్ని సమకూర్చింది. ఆ తర్వాత కాలంలో వ్యక్తులుగా, బృందాలుగా తెలంగాణ స్త్రీలు కొనసాగించిన/ కొనసాగిస్తున్న ఉద్యమ కార్యాచరణలే అందుకు దాఖలా..

స్త్రీల ఉద్యమాలకు పురిటిగడ్డ తెలంగాణ. ఆ చరిత్రనంతా యేరి కూర్చి ముందు తరాలకు అందించాల్సివుంది. స్త్రీలను 'రిజర్వు శ్రామిక దళం'గా తప్పితే పౌరులుగా గుర్తించని ప్రస్తుత సామాజిక రాజకీయ సందర్భాలను మార్చాల్సి వుంది. ప్రస్తుతం మన దుస్తులపై, మన ఆహారం పై, మన శరీరాలపై, మన ఆలోచనల పై ఆధిపత్యం చూపిస్తున్న బ్రాహ్మణీయ పితృస్వామ్య పెడ ధోరణులను మనందరం ఒక్కటై నిలువరించాల్సి వుంది. మన రాజ్యాంగ విలువలను కొనసాగేట్టు చేయాల్సి వుంది. అందుకు మనందరం ఈరోజు నుంచే ఉద్యమించాలి. 'Think locally- act globally" అనే నినాదంతో మన స్థానిక అవగాహనలను అంతర్జాతీయంగా పంచుకొని సంఘటితంగా మందుకు సాగాలి. మన చరిత్ర మనమే రాసుకోవాలి. ఈ 2022 అంతర్జాతీయ మహిళా దినోత్సవం అందుకు నాంది కావాలి.

కథ

# నిర్ణయం




పోర్షియాదేవి

Phone no: 9441319856


సన్నగా వర్షం పడ్తూ వుంది , కిటికీ లోంచి వర్షాన్ని చూస్తూ వంట చేస్తుంది అనిత , పాప హోంవర్క్ చేస్తూ పేపర్ తిరగేసే చప్పుడు తప్ప ఇల్లంతా నిశ్శబ్దం రూమ్ లో రవి ఉన్నాడనడానికి సాక్ష్యం అప్పుడప్పుడు గాలిలో తేలివచ్చే సిగరెట్ స్మెల్

చిన్నగా నిట్టూర్చింది అనిత , ఆలోచిస్తూ వుంది ఎందుకీ స్తబ్ధత ఏంటి ఈ నిశ్శబ్దం దీని లోంచి ఎలా బయటకు రావాలి ఎంత హాయిగా ఉండాల్సిన టైం ఇది, ఎందుకిలా తనజీవితం అయింది .

పాప హోంవర్క్ పూర్తయినట్టుంది రవి రూమ్ లోకి వెళ్లి ఏదో మాట్లాడుతుంది పాపమాటలకు గట్టిగా నవ్వుతున్నాడు .

నిజంగా రవి నవ్వితే ఎంతబాగుంటుంది, కళ్ళు కొంచెం మూసుకుని హాయిగా అలలు అలలు లాగా , ఆ నవ్వు చూడడం కోసమే తను ఎన్నెన్నో జోక్స్ చెప్పేది టీవీ లో ఏదైనా కామెడీ ప్రోగ్రాం వస్తుంటే రవి ఒడిలో పడుకుని రవి నవ్వుతుంటే ఆ మొహాన్ని చూస్తూ పరవశించి పోయేది .మళ్ళీ ఆ రోజులు వస్తాయా !

పాప వచ్చి అన్నం పెట్టమంది వేడి వేడి అన్నం లో నెయ్యి , పప్పు వేస్తుంటే గుర్తొచ్చింది రవికి తన చేతులతో ముద్దపప్పు, గోంగూర పచ్చడి కలిపి పెడ్తుంటే ఎంతిష్టముగా తినేవాడో , రవి తినడని తెలుసు కానీ ఎందుకో ఈ రోజు అవే చెయ్యాలనిపించింది .

బయట వర్షం అగినట్టుంది రవి చెప్పులేసుకుంటున్న శబ్దం వినిపిస్తుంది , మళ్ళీ దీర్ఘం గా నిట్టూర్చింది అనిత.

ఇప్పుడు ఏదయినా బార్ కి వెళ్లి తాగి ,ఏ బిరియానియో తిని వస్తాడు లేదా ఇంటికి తీసుకోచ్చుకుని తాగి తినేసి అలాగే పడుకుండి పోతాడు .

తొందరగా పాపకి వడ్డించి తనూ అన్నం పెట్టుకుని తింటుంటే కళ్ళలోంచి ధారలుగా కన్నీరు స్రవిస్తుంది ఏమైంది అమ్మా ఎందుకేడుస్తున్నావని పాప అడుగుతుంటే ఏమి చెప్పాలో తెలియక పచ్చడి కారంగా ఉందమ్మా అని చెప్పి గబగబా తినేసి పాపని పక్కలో వేసుకుని పడుకుంది .

పాప ఆ కబురు ఈ కబురు చెప్తూ నిదుర పోయింది .

మళ్ళీ చిన్నగా వర్షం మొదలయింది రవి ఎలా వస్తాడో అనుకుంటుంటే వచ్చేసిన శబ్దం అయింది తెచ్చుకున్నట్టున్నాడు ఫ్రిడ్జ్ లోంచి వాటర్ బాటిల్ తీసుకుని రూమ్ లోకి వెళ్ళిపోయాడు.

ఎంతకీ నిద్ర రావడం లేదు కళ్ళలోంచి నీళ్ళు తలగడని తడిపేస్తూనే వున్నాయి .ఈ పరిస్తితి కి ఎవరుకారణం

అనుకుంటుంటే అంతరాత్మ నవ్వింది , ఇంకెవరు నువ్వు చేతులారా తెచ్చుకున్నది కదా అని నిలదీస్తుంటే ఒక్క సారి గతంలోకి వెళ్ళింది .

మేనత్త మేనమామ పిల్లలయిన రవి తను, ఎంతో ఇష్టపడి ఒకర్నొకరు కోరుకుని పెళ్ళిచేసుకున్నారు ఎంత సంతోషం గా గడిపేవారు .

రోజులు క్షణాల్లా, గడిచిపోయేవి పాప పుట్టేంత వరకు .

తరువాత చిన్నగా గొడవలు ప్రారంభమయ్యాయి గొడవలకు పెద్ద కారణాలు ఏమీ లేవు ,రవి చెప్పిన టైంకి రాకపోవడం ,సినిమాకి వెళ్ళాలనుకుని రవికి ఏదో పని వలన వెళ్ళలేకపోవడం ,ఇలాంటివే .

తనకి చిన్నప్పటినుంచి విపరీతమయిన కోపం, మొండితనం ,ఏమనుకుంటే అది అయిపోవాలి . చిన్న చిన్న విషయాలకు అలగడం , తిండి మానేయడం చేసేది .రవి ఎప్పుడూ సర్దుకుని పోయేవాడు కొన్ని సార్లు మాత్రం కోపంతెచ్చుకుని తిరిగి తిట్టేవాడు తను తిట్టాడని ఇంకా ఎక్కువ గొడవ చేసేది తను .

ఆ రోజు తన జీవితం లో కాళరాత్రి , ఏదో చిన్నగోడవ చిలికి చిలికి గాలివాన అయింది ఆవేశంలో రవి చెయ్యి చేసుకున్నాడు తను తట్టుకోలేకపోయింది చచ్చిపోతానని

బెదిరించింది చస్తే చావు అని రవి కోపం గా పాపని తీసుకుని బయటకు వెళ్ళిపోయాడు తను ఆవేశంతో ఆయిల్ పోసుకుని మండుతున్న స్టౌమీద చెయ్యి పెట్టేసింది తన అరుపులు విని ఇరుగుపొరుగు వారొచ్చి మంటలు ఆర్పి రవికి కాల్ చేసారు .

ఇంకా తరువాత ఆరు నెలలు హాస్పిటల్ లోనే గడిచాయి దేవుడి దయ వలన కళ్ళు పోలేదు ప్లాస్టిక్ సర్జరీ చేసి కొంత వరకు అసహ్యంగా కనిపించకుండా చేసారు . కాని కుడి చెయ్యి బాగా కాలిపోవడం వలన అరచెయ్యి పై వరకు కుడి చేతిని తొలగించేసారు .

హాస్పిటల్ నుంచీ పుట్టింటికి చేరుకుంది ఇరువేపుల ఆవేశాల వలన వ్యవహారం కోర్ట్ వరకు వెళ్ళింది .కొన్ని రోజులు కేసులు నడిచిన తరువాత పెద్దలు కలగజేసుకుని రాజీ ప్రయత్నాలు చేసారు .

అప్పటికే తనకి రవి లేకుండా బ్రతకడం ఎంత కష్టమో తెలిసొచ్చింది అనుక్షణం రవి ద్యాస లోనే వుండేది ఎప్పుడు రాజీ అయిపోయి రవి కౌగిలి లో వాలిపోదామా అని తహతహలాడిపోయింది .

కాని రవి ఇక కలిసి వుండడానికి ససేమిరా ఒప్పుకోలేదు జైలుకయినా వెళ్తాను కాని ఇక కలిసి ఉండనని తెగేసి చెప్పేసాడు . ఇరువైపులా పెద్దలు ఎంతో నచ్చచెప్పారు పసిపిల్ల భవిష్యత్తు ఆలోచించమని ఎంతో చెప్పిన మీదట ఒక కండిషన్ తో తనని ఇంట్లోకి రానిచ్చాడు దాని పలితమే ఇలా అపరిచతుల్లా..

ఆ రోజు రవి అన్నమాటలు ఇంకా చెవిలో మారుమ్రోగుతున్నాయి , ఏమంత తప్పుచేశానని ఇలాంటి పని చేసింది కావాలంటే ఆస్తి అంతా రాసిచ్చేస్తాను తనని ఇంట్లోనే ఉండమనండి కాని నేను తనచేతి వంట తినను , తనని ముట్టుకోను , ఆ చేత్తోనే తన పనులు చేసుకుంటూ అదే చేత్తో వండి వడ్డిస్తే నేను తినలేను ఇష్టమయితే రమ్మనండి లేదా ఇంకా కేసులు పెట్టమనండి నాకు కోర్టు ఏ శిక్ష వేసినా హాయిగా అనుభవిస్తాను అని తెగేసి చెప్పేసాడు .

తనకి అవమానభారంతో నిజంగానే చచ్చిపోవాలని పించింది. రవి తనని ముట్టకోకుండా తను వండితే తిన్నప్పుడు ఎందుకు కలిసుండాలి అని పౌరుషం వచ్చింది కాని కనీసం రవిని రోజూ కళ్ళారా చూసుకోవచ్చు పాపకి తండ్రి చెలిమి అవసరం అనుకుని ఒప్పుకుంది .కానీ ఇలా బ్రతకడం మాత్రం తనవల్లకాదు .

ఆలోచిస్తూ ఎప్పుడు నిద్రపోయిందో తెలియదు తెల్లవారి లేచేసరికి రవి అలికిడి లేదు

ఆదివారం అవడం వలన బాక్స్ పనిలేదు నిదానంగా లేచి పనులు చేసుకుంటూనే ఆలోచిస్తూ వుంది .

ఏమి బ్రతుకు తనది ఇంత సిగ్గులేనిదానిలా బ్రతికేకన్నా చనిపోవడం బెటర్ కదా మొక్కలకి చీడపట్టిందని నిన్నేదో పురుగులమందు తెచ్చినట్టున్నాడు కదా త్రాగేస్తే ఈసారి ఖచ్చితంగా చనిపోతుంది ఈనరకం నుంచి శాశ్వతంగా విముక్తి కలుగుతుంది .

ఒక్కసారి తృళ్లిపడింది అనిత ఛ తనకింకా బుద్ధిరాలేదా పాప కోసమైనా బ్రతకాలి తను అనుకుంటూ స్థిరనిశ్చయానికి వచ్చినదానిలా పాపా కొంచెం బయటకెళ్లివస్తాను నువ్వు టీవీ చూస్తూ వుండు అని చెప్తూ బయటకు నడిచింది .

రెండురోజుల తరువాత రవి తయారయి బయటకు వెళ్లబోతుంటె రవీ ఒక్కనిముషం ఆగు అంటూ వచ్చింది అనిత .

బహుశా ఏదో అద్భుతమైన టిఫిన్ చేసా తినమంటుందేమో ఆ ఎడంచేత్తో చేసింది తిననని తెలిసినా అప్పుడప్పుడూ ఈ సీను తప్పడం లేదు అనుకుంటూ ఏంటీ అంటూ చిరాగ్గా మొహం పెట్టాడు.

నువ్వేమీ భయపడకు రవీ నీతోకొంచెం మాట్లాడాలి ఏమన్నావు రవీ నువ్వపుడు బాత్రూమ్ పోతే ఆచేత్తోనే కడుక్కుని అదే చేత్తో వంటచేస్తే తిననుఅనేకదా నావల్ల నీకేమీ ఉపయోగం లేకున్నా విశాలహృదయంతో నన్నింట్లో వుండనిచ్చావు అందుకు చాలా కృతజ్ఞురాలిని

నేనింక నిన్ను ఇబ్బందిపెట్టదలచుకోలేదు నాలుగిళ్లవతల ఇళ్లు చూసుకున్నాను అలాగే పక్కవీధిలో వున్న అంగవికలుల పాఠశాలలో టీచర్ ఉద్యోగం దొరికింది నేనీరోజు ఆ ఇంటికి వెళిపోతున్నాను ఇల్లు ప్రక్కనే కదా పాపని నువ్వెపుడైనా చూడొచ్చు, దానితో గడపొచ్చు, ఇంటికి తెచ్చుకోవచ్చు దానికి తండ్రి ప్రేమని దూరం చెయ్యకూడదనే దగ్గర ఇల్లు తీసుకున్నాను.

కానీ రవీ నీకు తెలుసా పిల్లలు పసివాళ్లుగా వున్నపుడు తల్లి అన్నిపనులు ఎడంచేత్తో మాత్రమే చెయ్యదు రెండుచేతులతోనూ ఎత్తి కడిగి పోస్తుంది కానీ తినేటపుడు ఎపుడూ అసహ్యించుకోదు అదే తల్లి గొప్పతనం .నీలాగ తల్లులు అలోచిస్తే ప్రతిఒక్కరి బాల్యం మలమూత్రాల మయంగానే గడిచేది .వెళ్లొస్తాను రవీ అంటూ మాన్పడినిలుచున్న రవిప్రక్కనుంచి ఎడం చేత్తో పాపని తీసుకుని బయటకు నడిచింది.

ఇపుడామెలో ఆత్మహత్య ఆలోచనలు లేవు, తనకి కుడిచెయ్యిలేదన్న బాధలేదు భవిష్యత్తు మీద ఆశతప్ప.

కథ

# నా జాన్ జిగిరి



- జూపాక సుభద్ర

రెండు మూడు రోజుల కాన్నుంచి ఒక కొత్తనంబర్ నుంచి ఒకటే ఫోనులు వస్తున్నాయి కానీ తీస్తలేను. ‘కొత్తనంబర్ కాల్స్ ఎత్తొద్దు, ఎత్తితే మీ బ్యాంక్ బ్యాలెన్స్ పోగొట్టుకుంటారని వాట్సప్ మెస్సేజులొస్తున్నయ్. కొత్తనంబర్లను తీస్తలేము. కానీ అదే పనిగ ఆ... ఒక్క నంబర్ నుంచే వస్తుంటే... ఎవరో ఏమో, ఏం పనో ఏమోనని ఏదయితె అదయితదని ఫోనెత్తి ‘హలో’ అన్నా.

“హలో ఆంటీ నేను మీ దోస్తు బెల్లం పెల్లి రోజ్ లీల కొడుకును. నువ్వు, మా అమ్మ నాలుగో తరగద్దాక సదువుకున్నరట గదా! అమ్మ రిటైర్మెంట్ కోసము నిన్ను పిలుసుకోవాలని చాన ఖాయిషు బడ్డది. యిగో అమ్మ మాట్లాడ్తదట”, “సక్కూబాయి, యాదిబట్టినవా”

“ఏయ్ రోజీ యెంత కాలానికి, ఎన్ని రోజులకు రోజ్ గిప్పుడు యాదొచ్చిన్నాబ్బ. నీ నంబర్ కోసం, నీ కోసం యెట్లెతికిన్నో తెల్సా... యేందబ్బా! గా ఫోనులు లేని కాలంల లేకపాయె సెల్లు ఫోనులచ్చినంక, మా అన్నవాల్లను అక్క వాల్లను బతిమిలాడి నీ ఫోన్ నంబర్ సంపాయించినంక ఒక్క రోజు గూడ కలువక పోతినబ్బా. యాదుండదా! రోజ్ బాలశిక్షకాన్నుంచి నాలుగో తరగతి దాకా సదివిన తడ్కల బడిని మర్చిపోతనా. ఆ బల్లె మనిద్దరం సదివింది ఆడింది పాడింది మర్చిపోతనా రోజ్!” అన్నా కొంచెమ్ బాధగా.

‘అవును తెల్సింది నువ్వు నన్ను బాగా అడుగుతవని మీ సుట్టాలు, మన బెల్లంపల్లి బస్తి దోస్తులు సెప్పేది. నువ్వు నన్ను అట్లయాది బెట్టుకునుడు నాకు చాన సంతోషమైతది. మన్సంత యెగిరి దునుకుతది. అందికే రిటైర్ మెంట్ టైములనన్నా నిన్ను కండ్లారా జూస్కొని కడుపు నిండ మాట్లాడ్కుందామనుకొని పోను జేయించిన. నువ్వు ఫోన్ ల దొర్కలేదాయె. నువ్వు పెద్ద ఉద్యోగస్తురాలవని మా ఆస్పత్రిల చెప్పుకుందామనుకున్న సక్కు. నిన్ననే దిగిపోయిన. ఒకసారి మాట్లాడ్దామని మల్లా ఫోన్ జేపిచ్చిన. ఏమనుకోకు”.

“ఎహే! నేనెందుకనుకుంట రోజ్” అన్నాను ఆత్మీయంగా

“నేనేమో నాలుగుల్నే సదువాపేస్తిని. మా అమ్మ, నాన జేసే పాకిపనిల్నే కుదురుకుంటిని. నువ్వే మన తడ్కల బడికల నాలుగోతరగతి నుంచి పెద్ద బడికిబోయి అట్నించటే వరంగల్కు బోయి బాగ బాగ సదువుకొని నౌకరి జేస్తున్నవని షాన సంతోషపడ్డ. బాల శిక్షకాన్నుంచి యిద్దరమ్ తడ్కల బడిల సదువుకుంటిమి. నేంగూడ సదువుకుంటె బాగుండని అప్పుడప్పుడనిపిచ్చేది”. అని నారాజుగమాట్లాడితే...

“సరె రోజ్ నువ్వెట్లున్నవ్, ఆరోగ్యమ్మంచిగున్నదా! మీ కుటుంబమెట్లున్నది” ఆ నారాజు మూడ్ నుంచి తీస్కొచ్చేదానికి.

‘గట్లనే వున్న సక్కు అవ్వెనుక బిడ్డేడ్సినట్లు. యిద్దరు కొడుకులు, ఒక బిడ్డె. అందరికి పెండ్లీచేసిన, అమ్మనానబోయింద్రు. వాల్ల డ్యూటీనే నేంజేసిన”.

“ఏంజదివింద్రు”.

“సదువెక్కడిది పదిల్నే సదువు బందుబెట్టింద్రు. బిడ్డెకు ఏడుల్నే పెండ్లిజేసిన. పెండ్లీలు సెయ్యకపోదునుగాని నా పెనిమిటి జెయ్యబట్టి సేసుడైంది. కరెంట్ పోల్స్ మీద పని. ఓ రోజు పోల్ మీంచి జారిపడితే నడుములిరిగినయి. మంచానబడ్డడు. ‘నేనుంటనో పోతనో పిల్లల పెండ్లీలన్న సూసి పోతనంటే’ అప్పులు సప్పులు జేసి పెండ్లీలు జేసిన. యీ నాటిగ్గూడ మంచాల నుంచి లేవలేదు. అన్ని నేనేజేస్త. మీ అన్నలు, అక్కలు యిక్కడ

వున్నప్పుడు ఎప్పుడన్న కలిస్తె, నీ గురించి సెప్పేటోల్లు వీల్లందరు బూపాల పెల్లి బొగ్గు చాయిలకు యెల్లిపోయినంక మొత్తమ్ లింకులే లేకుంట బొయినయి.

మనతోని సదువుకున్నోల్లు మంచిగనే బాగుడప్డరు నౌకర్లు జేస్తున్నరు కొద్దిమంది. నేనే తెర్లయితి. నాతోని నా పిల్లలు గూడ తెర్లాయె అని రందిపడ్త. పెద్దోన్ని కరెంటాపీసుల ఔట్ సోర్సింగ్ల బట్టిచ్చిన సీపర్ గ, సిన్నోన్ని నేంజేసిన ఆస్పత్రిల్నే బెట్టిచ్చిన పాకి పనిల. ఏం జేత్తును. సదువు గీత లేకపాయె. గీ నా సొదలన్ని జెప్పి, నిన్ను పరేషాన్ జేత్తన్న ఏమనుకోకు సక్కు! నువ్వు బాగా యాదికొస్తవు కష్టంల సుఖంల. యిప్పుడు మన తడ్కల బడిలేదు మనమాడుకున్న జాగలు కనబడకుంట బొయినయి. నువొస్తే గయన్ని మల్ల కల్సి సూద్దామ్ రా" అని బతిమిలాడినట్లూ మాట్లాడింది. "తప్పకుంటొస్త రోజ్! మల్లా బెల్లం పల్లి బస్తంత తిరుగుదామ్, తడ్కల బడి పక్కన మన యిండ్లెట్లున్నవో నీతోని యాజ్జేసుకుందామ్ 'హాప్పీ రిటైర్డ్ లైఫ్' డ్యూటి దిగిపోయిన నీ జీవితము మంచిగుండాలెనని కోరకుంటున్న కలుద్దామ్" అని ఫోన్ పెట్టేసిన దిగాలుగ రోజ్ లీల కష్టాలన్ని దుక్కపెడ్తుంటె.

★ ★ ★

రోజ్ లీల కుటుంబము, మాకుటుంబమ్ బత్కొచ్చినోల్లమే సింగరేణి కాలరీకి. పాలేరుగున్న, మా అయ్యను దొరకొడితె, బెల్లంపెల్లి సింగరేణికి పారిపోయి వచ్చి, బొగ్గుబాయిల పనికి కుదిరిండు. యీ సింగరేణి బొగ్గుబాయిల దిగి పంజేసేటోల్లందరు రకరకాల కారణాల్తోని బత్కొచ్చినోల్లే. వూల్లెపనులు దొర్కక కొందరొస్తే.... పంటల్లేక కొందరు, వూల్లె కామందులతోని పడకకొందరు వచ్చేది. ఎక్కువగ కరింనగర్, వరంగల్, ఆదిలాబాదోల్లే బాయి పనిల కార్మికులుగ వచ్చేటోల్లు. యిగ క్లర్కులు, ఆఫీసర్లు, డాక్టర్లు, యింజనీర్లు, టీచర్లు, నర్సులు అంతా ఆంధ్రోల్లే వుండేది. బొగ్గు బాయి కార్మికులకు సింగరేని కోటర్స్ వుండేయి. ఒకగది, చిన్న పాకతోని రేకుల కప్పు వుండె. అవి దొర్కాలంటె చాన పోటి వుండేది. లంచాలు బెట్టి తిరుగాలె. కంపిని కోటర్స్ లేనోల్లు, రానోల్లు ఖాలిజాగల గుడిసెలేస్కుంటరు. అట్లా కోటర్సు రానోల్లు కూడా ఒక దగ్గెరేసుకోరు. కులపోల్లు, కులపోల్లు కల్సి యేస్కుంటరు గుడిసెలు. బీసీకులాలు ఒక దిక్కు, మాదిగోల్లు, ఎస్టీలు, మాలోల్లు ఒక్కోదిక్కు గుడిసెలేసుకొని వుండేది కంపిని జాగల. అట్లా మేంగూడ మాదిగ గుడిసెల దిక్కు గుడిసేసుకున్నము. మా యింటి పక్క పోంటే అ ఆల నుంచి నాలుగో తరగతి దాక తడ్కల బడుండేది. దాంట్లె పగలు పిల్లలు రాత్రి ఆవులు, బర్లుండేయి. ఆ బడికి ఒక చెప్రాసి, ఒక సారుండేది. మా తడ్కల బడికి తలుపులు, తాళాలు గిట్ల ఏముండకపోవు. సార్ లేనప్పుడు రసూలే మాసారు. కింద గచ్చుబోసిన నేలే గాని, ఎడ్లు బర్లు దొక్కి గచ్చంత కరాబై గుంటలు బడివుండేది. రసూల్ పొద్దుగాల్నే వచ్చి గొడ్ల రొచ్చంత యెత్తి పోసినా, బడిగొంట వరకు ఆరకపోయేది. అంత రొచ్చు రొచ్చుగన్నా... యేనాడు వాసనొస్తందని ముక్కిరిసిన యాదిలేదు. గంతలు తెచ్చుకొనేది కూసోనీకి పిల్లలమందరము. నాకు రోజు గంత తెచ్చుకునుడు కాకపోయేది. మా యింట్ల నేందెచ్చుకునే గంతల ఓ రోజు బొగ్గు, ఓ రోజు ఎర్రమట్టి వో రోజు సుద్దవుండేది. అది ఖాలిగున్నప్పుడే బడికి తెచ్చుకునేది. కానీ నేను గంత తెచ్చినా లేకున్నా నా దోస్తు రోజ్, రోజు తెస్తుండేది గంత. రోజ్ మా యిండ్లకు ఆకర్న వుండేది. వాల్లది గుడిసె గాదు మంచిగూనయిల్లు, సిమెంటు యిటికెల యిల్లు. కిరాయికి వుండెటోల్లు. 'రోజ్'ను మా గుడిసెలోల్లంత ప్రేమగ రోజా అనీ, పాకోల్ల రోజా అని పిలిసేది. ఆ పిలుపుల తక్కువోల్లు, కక్కోసులు కడిగెటోల్లనే చిన్న చూపు వినబడక పోయేది ఆనాడు. యిప్పుడ యాదొస్తే బాదైతది. రోజ్ వాల్ల తాతవాల్లు గూడ ఎక్కన్నుంచో వచ్చింద్రని చెప్పుకుందురు. రోజ్, వాల్ల అమ్మనానకు వొక్కతే బిడ్డ. సింగరేని కాలరీ ఆస్పత్రిల కక్కోసులు కడిగే ఉద్యోగమ్. వాల్లకు చాలా మంచి పేరుండె... వాల్లను మా మాదిగ గుడిసెలోల్లు గౌరవంగా చూద్దురు. వాల్ల కట్టు బొట్టు మాకన్నా వేరుగా వుండేది, వాల్ల మాట గూడ ఆంధ్రమాటుండె. రోజ్ కి యివ్వేవి రాలే. అదేందో రోజ్ వాల్ల అమ్మా నాయిన మా గుడిసెలోల్లతోని ఎవ్వరితోని మాట్లాడకపోయేది. వాల్లడ్యూటి, యిల్లు, రోజ్ యిదే లోకంగుందురు. రోజ్ లీల వొక్కతే బిడ్డని చాలా షోకు షోకుగా వుంచేది. మా తడ్కల బడిల ఏ పిల్లలేసుకోని బట్టలు మారోజ్ వొంటిమీదుండేయి. రంగురంగుల బట్టలు, డిజైన్ డిజైన్ బట్టలు, బొట్లు, రిబ్బండ్లు, గాజులు, చెప్పులు, మెడల గొలుసు, చెవులకు గున్నాలు బెట్టుకొని క్లాసుకొచ్చేది. పిల్లలు అందరు రోజ్ షోకుల్ని కన్నార్పకుంట జూద్దురు. స్కూల్ బ్యాగు రోజ్ కి మాత్రమే వుండేది. అదీ చాన ఖరీదుబ్యాగు. ఆమెనందరం ప్రత్యేకంగా చూద్దుము. మాకెవ్వరికి లేని ఆడంబరాలు రోజ్

కుండేటియి.

నేను అఆలు, బాలశిక్ష నేర్చుకున్నది రోజ్ తోనే. నల్లగా నాజూగ్గ పరికిపండోలె వుండేది. పొద్దుగాల నేను మొకంగడుక్కోక ముందే రోజ్ మంచిగ తయారై మాయింటికొచ్చేది. గడియారంలేని మా యింటికి రోజ్ వచ్చిందంటే 'అబ్బో' బడి టైమైందని దబ దబ మొకం గడుక్కొని 'బట్టలు మంచిగున్నయా, మాసినయా?' అని రోజ్ నడిగి మంచి గున్నయంటే సరే, వద్దు మాసిపోయినయంటే... వేరే వుతికినయి యేసుకొని రోజ్ చెయ్యి పట్టుకొని బడికి వురికేది. రోజ్ కి యింట్ల చానా గారాబం, అపురూపమైన ఒక్కతే బిడ్డాయె, వాల్లమ్మ షోగ్గా తయారు చేయించి బడికి తోలేది. నాకంత సీన్ లేదు. నాకు పెయికి నీల్లు బోసెటోల్లు, జెడలేసెటోల్లు కనబడకపోయేది. బడి టైమప్పుడు మా అవ్వ (అమ్మ) ఏదో ఒక పనిలుండేది. అందికే నేనే మీద మీద దువ్వుకొని పాయేది బడికి. రోజ్ ఓపికతోని నేను తయారై వచ్చేదాక నిలుసునేది. 'కూసో' అంటే... 'మీ గద్దెలు ఎర్రమట్టితోని అలికినయి, కూసుంటె నా బట్టలు మాసిపోతయి' అని కూసోక పోవును.

క్లాసుల మేమిద్దరం పక్క పక్కన్నే కూసుందుము. 'షోగ్గా చక్కని చుక్కలాగ తయారై వస్తవుగానీ నోరు తెరిసి ఒక్క అక్షరమ్ముక్క పలకవు రాయవు' అని సారు తిట్టేది. మా బడికి ఒక్కడే సారుండె. ఏందో రోజ్ ఆ వయసులో గూడ చాన మౌనంగా, సుకుమారంగా, మెత్త మెత్తగా, బెల్లం బెల్లంగా మాట్లాడేది. 'నీకు పొద్దుగాలేసిన బట్టలు సాయంత్రమయేటాలకు గంతలోలె మాపుతవు, గానీతోటి పిల్ల రోజు బట్టలు గింత మర్కగావు' అని మెచ్చుకునేది మా అవ్వ, అక్కలు. రోజ్ నాలాగ సంగ సంగ యెగురది దునుకది, మట్టిల ఆడది, కూసోకపోవును. నాకు రోజ్ నీటు సోయి లేకుండె. దుబ్బతోని ఆడుకునుడు, దుబ్బల పండి పొర్లాడుడు చానిష్టముండె. రోజ్ నేమో మట్టిని తాకకపోయేది. మా యింట్లో రోజ్ కి నాకు పోలిక బెట్టి కుక్క తిట్లు తిట్టేది. బడిల గూడ బాగ లొల్లి జేసేది నేనే వుంటి. 'గయ్యాలి గంప, రంపరాకాసి' అని పేరే గాని మంచి బాలిక అనే పేరు లేకుండె. గింత గడుసు పిల్లకు నోర్లేని, కామ్ గుండే రోజ్ లీలకెట్ల దోస్తు కుదిరిందని ఆశీర పోయేటోల్లు. నాలుగో తరగతిల ఒక ఐదారుగురుదప్ప అందరు పాసయింద్రు. దాంట్ల నలుగురైదుగురే హైస్కూల్ బడికి వచ్చినము. మిగతోల్లందరు బడిమానేసింద్రు. బడిదూరమనీ, యింట్లోపనికోసం, ఆడపిల్లను దూరంబడికి ఎందుకు? రోజులు బాగలేవనీ సదివిన కాడ్కి సాల్లే' అని తల్లిదండ్రుమానిపిచ్చింద్రు. నన్ను గూడ మానిపిద్దురు. మాసారు 'నీ బిడ్డకు క్లాసులనే ఎక్కువ మార్కులొచ్చినయి, నీ బిడ్డమంచిగ సద్వుతది. సదివియ్యండ్రి' అని చెప్పింద్రు. యిదో కారణమైతే, యింకో కారణమేందంటే.. 'దీన్ని యింట్ల వుంచద్దు, సదువులేక ఖాలీగుండి సుట్టుపక్కల పిల్లల్తోని రోజుకో లొల్లిదెస్తది, బల్లేస్తనే సక్కగైతది' అని మా అక్కలు, మా యింట్లోల్లంత మా అయ్యవ్వకు సెప్తే... 'సరే తియ్యి సదువుకోనియ్యి' అని నన్ను పెద్ద బల్లేసింద్రు. కాని రోజ్ లేకుంట బోవుడు దుక్కంగుండె. రోజ్ పాసయితే వాల్ల అమ్మనాయినను బతిమిలాడి రోజ్ ను 'తీస్కపోవుడు తీసుకొచ్చుడ నా జిమ్మేదారి, తోలుండ్రి' అని ఒప్పిద్దును. కానట్ల జరుగకపాయె. వాల్లమ్మ నాయిన చాన మంచోల్లు 'ఎందుకు ఫెయిలైనవు' అని ఒక్క మాట గూడ అనలే రోజ్ ను. వాల్లిద్దరు పొద్దుగాల బోయి సాయంత్రమొస్తరు. రోజ్ ని అపురూపంగా కాలికి మట్టి అంట కుంట చూస్కుంటరు. బిడ్డ ఫెయిలైతే నిశ్శబ్దంగా బడి మానిపిచ్చింద్రు. నాకు పెద్ద బడిల సదువుకునుడు యిష్టమే, గాని రోజ్ లేకుంట బడికి బోవుడు కష్టమైంది చానా రోజులదాకా. రోజ్ నేను బాగా యేడ్సుకున్నమ్. మొదట్ల, బడిల జరిగినయన్ని రోజ్ తో సెప్పుకునేది. తర్వాత మాకు కంపిని కోటర్సు వచ్చిగుడిసె ఖాలీజేసి వచ్చినం దూరం.

నేను సదువుల పడి రోజ్ వాల్ల యిల్లు దూరమై, రోజ్ ను కలువనీకి కుదురలే. ఆ దూరాలు అట్లా పెరిగిపోయినయి. అమాయకత్వమ్, సెన్సిటివ్ గా, మంచిపిల్లగా, డాబుగా, షోగ్గా రోజ్ వుంటే, వీటన్నిటికి వ్యతిరేకంగా నేనుండేది. రోజ్ ని ఎవ్వరేమన్నా వాల్లను కొట్టేది. పడనోల్లు సదువురాకున్నా షోకులెక్కువనీ, పాకోల్ల రోజ అన్నా, నల్లబిషి అని బనాయిచ్చినా మీదబడి పిచ్చకొట్టుడు గొట్టేది. ఈగవాలినా ఈరంగం జేసేది నేను.

అందుగ్గావచ్చు రోజ్ నన్ను విడిపోయిన కాన్నుంచి ఒక జీవితకాలం గుండెల దాసుకొని తన రిటైర్ మెంట్ కి పిల్చుకొని ఏం చెద్దామనుకున్నదో! ఛల్ మిస్సయితి. మిస్సయితేంది యిప్పుడు బోత రోజ్ దగ్గరికి. దాదాపు అయిదు దశాబ్దాల దూరాన్ని, యిప్పుడు దగ్గరజేస్కుంటమ్. నా జాన్ జిగిరీ దోస్తు రోజ్ కి ఫోన్ గొట్టిన "రోజ్ నేను వస్తున్నా" అని.

★ ★ ★

కవిత

# నా కైతే సిగ్గుగా ఉంది



గీతాంజలి
మొబైల్ :889791964

పొద్దుట్నించీ వాట్సాప్పుల్లో...
హాపీ వుమెన్స్ డే శుభాకాంక్షల వెల్లువ చూస్తుంటే..
నాకైతే చదవడానికే కాదు..
పంపడానికి కూడా అవమానంగా ఉంది.
కోపంగా ఉంది
అసహనంగా ..అసహ్యంగా ఉంది.
ఆమె ఎవరో..ఒంటి నిండా ..కర్ర విరిగేదాకా భర్త
మృగం....... ఖైమా లాగా విరగ్గొట్టిన దేహపు నొప్పిని
పంటికొసన భరిస్తూ..
బట్టలుతుకుతున్నది.
మరొకామే..నెలసరి నొప్పిని మెఫ్తాల్ స్పాస్ టాబ్లెట్ తో
గుటుక్కున మింగేసి...
భర్తగారి లంచ్ బాక్స్ లోకి తన రక్తం లోని శ్రమని
అన్నంగా వండుతున్నది.

ఇదిగో ఈమె...కొంచెం ఆ తలుపు రెక్క తప్పించి
చూడండి...
రాత్రి భర్త శృంగారం పేరుతో...
సరసంగా రేప్ చేసేస్తే..
గాయాన్ని రెండు కాళ్ళ మధ్య దాచేసి...
కన్నీళ్ళని కళ్ళ లోపలికి తోసేసి.. పరదా చాటునుంచి
చిరునవ్వు మొఖం తొడుక్కుని.. వంటింటి వైపు
నడుస్తున్నది.

ఇక్కడ ఈ గుడిసెలో చూసారా... పని కావాలంటే మేస్త్రీకి
కొంగు పరవాల్సిందేనట...
వాడి మొఖం మీద తుపుక్కున ఉమ్మిన ఆమె ఆత్మగౌరవపు
ఆకలి పేగులు శ్రామిక స్త్రీల విముక్తి గీతాన్నీ పాడుతుంటే...
ఇన్ని మంచినీళ్లు తాగి ముడుక్కుని పడుకుంటున్నది...!

ఇక్కడ హాస్పిటళ్లల్లో.. స్కానింగ్ సెంటర్ లలో ఒకసారి
తొంగి చూడండి... యోనులు ఛిద్రమై చచ్చి పోయిన
ఆరేళ్ళ ఆసిఫాలు చెప్పారేమో...
గర్భాల్లో ఆడపిండాలు..యోనుల స్థానాల్లో ఖడ్గాలు
మొలిపించుకుని పుట్టక ముందే.. యుద్ధానికి
సిద్ధమవుతున్నాయి...

మరి దీన్నేమంటావు ..?
నీ గృహ బానిసల ఫ్యాక్టరీ ల్లో.. అదిగదిగో..అమ్మలు
ఇరవై చేతులతో..ఆరేసి కాళ్లతో వింత జీవుల్లా గాజు
కళ్లతో.. వంటిళ్ళకి.. ప్రసవపు గదులకి ..బెడ్ రూంలకి
మధ్య.. వేల కిలో మీటర్లు యుగాలుగా తిరుగుతూనే
ఉన్నారు.
పోరా...పో...
"One Woman Countless Roles "....లాంటి నీ
కీర్తి కిరీటాలు మాకు వద్దు...
నువ్వు చేసిన ఈ గాయాల చుట్టూ..
ఒక జరీ అంచు పట్టుచీర చుట్టేసుకుని..
వచ్చేస్తామనుకున్నావా?
నీ కోరలు నోట్లో దాచేసుకుని.. నీకు కావలసిన ఆదర్శ
అమ్మల..భార్యల..కూతుళ్ళ నమూనాల్లో పేనుబెత్తం తో
మమ్మల్ని కుదించేసి...తృప్తిగా త్రేన్చేసి.. మాకు...
నీ గృహ బానిసలకు .. కపటపు ప్రేమతో ఇచ్చే
పూల బొకేలు...నీ మొసలి కన్నీళ్ల కవిత్వాలు...
బంగారు పూతల ఆదర్శ స్త్రీల మెమెంటోలు ...
తీసేసు కుంటామనుకున్నావా??
వద్దు..వద్దు గాక వద్దు !
మాకు కప్పే షాలువల కింద నీ నైచ్యం
కప్పెయ్యడానికి
నీకు సిగ్గు లేదేమో కానీ..
మా కైతే సిగ్గుగా ఉంది.
పోరా... ఫో...!

ఇంటర్వ్యూ

# "మహిళా దినోత్సవం సందర్భంగా స్ఫూర్తి దాయకమైన శ్రామిక మహిళతో మాటా - ముచ్చట"



- జయంతి వాసరచెట్ల
9985525355

స్త్రీ శక్తికి మరో రూపం. ఆమె తలుచుకుంటే ఏదైనా సాధించగలదు. కుటుంబం కోసం, కుటుంబ బాధ్యతల కోసం, తన శక్తి యుక్తులను ఉడిగి, తనకు తాను నిలదొక్కుకొని, కుటుంబానికి ఆసరాగా నిలబడి బ్రతికి చూపించగలదు.

అక్షరాలు తనను అక్కున చేర్చుకోకపోయినా బ్రతుకు తెరువు లేక భర్త అనారోగ్యంతో బాధ పడుతుంటే, ఏం చేయాలో పాలుపోని పరిస్థితుల్లో తనకున్న శక్తితోనే, కూతుర్ని చక్కగా చదివించు కుంటూ.. కుటుంబ భారాన్ని మోస్తూ స్ఫూర్తిగా నిలిచిన ఒక మహిళను గూర్చి ఇప్పుడు తెలుసుకుందాం.

గత కొంతకాలంగా ఆమెను గమనిస్తూ వస్తున్నాను. మా కాలనీలో ఒక అపార్ట్మెంట్ ముందు ఉదయం తోపుడు బండి పై కూరగాయలు సాయంకాలం 6:00 గం నుండి 9:00 గంటల వరకు అదే అపార్ట్మెంట్ ముందు ఒక పక్క కట్టెలపొయ్యి పై రొట్టెలు చేస్తూ కనిపిస్తుంది.

అప్పుడప్పుడు కూరగాయలు పండుగలప్పుడు బంతిపూలు అలా కొనడానికి వెళ్తాను. నవ్వుతూ పలకరిస్తుంది. కానీ నేనెప్పుడూ ఆమె పేరు అడగలేదు.

జ్వలితగారు మహిళా దినోత్సవం సందర్భంగా అలాంటి వారిని పరిచయం చేద్దాం అని అన్నప్పుడు నాకు ఆమే కళ్ళముందు మెదిలింది.

రోజూ ఇంట్లో మా అమ్మాయితో అనేదాన్ని ఆ రొట్టెలు చేసే ఆంటీతో మాట్లాడాలి కానీ కుదరడం లేదని. ఈరోజు మా అమ్మాయి వస్తూంటే పొయ్యి శుభ్రం చేస్తూ తను కనిపిస్తే నాకు ఫోన్ చేసింది "మమ్మీ ఆంటీ జొన్న రొట్టెలు చేస్తుంది నీవు మాట్లాడాలని అన్నావు కదా ! వచ్చేసేయ్" అంది.

అనుకున్నదే తడవుగా ఓ నోట్ బుక్కు పెన్ను తీసుకొని బయలుదేరాను.

నేను కనిపించగానే అదే ఓ నవ్వు నేనూ నవ్వాను.

"నీ పేరు ఏమిటమ్మా... నా పేరు జయంతి" అన్నాను.

"నాపేరు భారతి ఇదే అపార్ట్మెంట్ కి వాచ్మెన్ గా చేస్తాను.

★ ★ ★

జయంతి: భారతీ నేనెందుకొచ్చానో తెల్సా ?

భారతి : ఏమోనమ్మా మీ బిడ్డ అన్నది, 'నీతోటి మాట్లాడేందుకు మా మమ్మీ వస్తానన్నది' అని. నా తానికి రానీకె అడగాల్నా అమ్మా ...? మీ ఇద్దర్నీ రోజూ చూస్తుంటాను కదా!"

జయంతి: అవును చూస్తుంటావు.. కానీ నీగురించి తెలుసుకుందామని వస్తానన్నాను.

భారతి: నాగురించి ఏముంటదమ్మా ? ఏంచెప్పాలె అడుగుండి.

జయంతి : ఎల్లుండి అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఉంది.

ఆ విషయమై ఆడవాళ్ళ గురించి వారి జీవితం గురించి తెలుసుకుని మాపత్రిక ఒకటి ఉంది " బహుళ " అని ఆ పత్రికలో ప్రచురిస్తాము.

నీకు అభ్యంతరం లేకపోతే చెప్పు భారతీ .

భారతి: మీకు చెప్పడం వల్ల మా అపార్ట్మెంట్ వాళ్ళు మమ్మల్ని ఏమీ అనరు కదా ?

జయంతి: నేను నిన్ను అడిగే విషయాలకు అపార్ట్మెంట్ కు ఎలాంటి సంబంధం లేదు.

భారతి: అట్లైతే అడుగుండి మేడం.

జయంతి: ఎవరెవరుంటారు ఇక్కడ ?

భారతి: నేను, నా భర్త, నా ఇద్దరు పిల్లలు.

జయంతి: మీది ఏ ఊరు ? సిటీకి వచ్చి ఎన్నేళ్ళయ్యింది? ఎందుకొచ్చారు?

భారతి: మాది జహీరాబాద్ దగ్గర రాయికోడ్. మా అత్తగారోళ్ళను గువ్వోళ్ళు అంటారు. వాళ్ళకు ఐదు మంది మగపిల్లలు. ఆస్తిపాస్తులు ఏమీలేవు. బ్రతుకుతెరువు ఏమీ లేక ఇద్దరు మగపిల్లలను ఇల్లరికం ఇచ్చింద్రు. ఇద్దరు ఊళ్ళోనే ఉంటారు. మేం పెండ్లి అయిన వెంటనే పట్నం వచ్చినం.

జయంతి: ఎన్నేళ్ళైంది పట్నం వచ్చి?

భారతి: ఆ... మేము పట్నం వచ్చి 23 ఏండ్లు అయితాంది.

జయంతి: నీవు చూస్తే చాలా చిన్నదాని లాగా కనిపిస్తున్నావ్! అన్నాను (ఆశ్చర్యంగా).

భారతి: నాకు చిన్నతనాన్నే.. అంటే పదకొండుఏండ్లకే పెండ్లి చేసింద్రు, మా అమ్మా నాయినా.. అప్పుడు నాకు తెల్వదు పెండ్లి చేస్తే అత్తగారింటికి పోవాల్నని. నన్ను సాగదోలింద్రు. ఏంచేయాల్నో నాకు అర్థం కాలేదు.

నా మొగుడు నేను రొండు గిన్నెలు తీసుకుని పట్నం వచ్చినం. చాలా మందిమే వచ్చినం ఒక జాగాల సాఫ్ చేసుకోని గుడిసెలు వేసుకున్నం. ఒక రొండు మూడు నెలల తర్వాత గుడిసెలు జాగా ఫ్లాట్లు అని తెలిసింది. గా ఫ్లాటోళ్ళు మాదగ్గర గుడిసెకు 100/- , 200/- వసూల్ చేసేటోళ్ళు. అప్పుడు అది మాదాపూర్ అంటరాని నాకుబీ తెల్వదు. మాదాపూర్ మేమొచ్చినప్పుడు అడివిలెక్క ఉండె. మురికి తుమ్మ చెట్లు బాగా ఉంటుండె. అప్పుడప్పుడే ఇండ్లు కడుతుండ్రి. ఇద్దరం కూలీ పనికి పోయేటోళ్ళం. నా మొగుడు సిమెంట్ పని చేస్తే నేను ఇసుక మోసేదాన్ని. వచ్చిన మూడేండ్లకు నేను కడుపుతోటి ఉన్న అని తెలిసింది.

కాన్పు గూడా ఆన్నే అయ్యింది. ఆడిపిల్ల పుట్టింది. జర పెద్దగైతుంటే.. ఈ చందానగర్ లో అపార్ట్మెంట్స్ కడుతున్నారని తెలిసింది. ఓ పెద్ద మనిషి చెప్తే, ఇక్కడికి వచ్చినం. అప్పటి నుండీ ఇక్కడనే ఉంటున్నాం.. మాబిడ్డె ఇక్కడనే పెద్దగయ్యింది.

జయంతి: ప్రతిరోజు ఈ అపార్ట్మెంట్ మందు రొట్టెలు చేస్తూ కనిపిస్తావు. అపార్ట్మెంట్ వాళ్ళు ఆబ్జెక్షన్ చేయలేదా?

గేట్ ముందే కదా... 'పొగ వస్తుందని గేట్ ముందు ఏందిది అంతా' అని ఎవరూ ప్రశ్నించలేదా?

భారతి: ఏం లేదమ్మా ఎవరూ ఏమీ అనలేదు. ఇలా



పెట్టనివ్వరు కదా మేడం!

జయంతి: నిజానికైతే ఎలా పెట్టుకోనిస్తారు భారతి ?

అలా పెట్టనివ్వరు. కానీ మీ అపార్ట్మెంట్ వాళ్ళు చాలా మంచివాళ్ళున్నట్లున్నారు!

భారతి: అవునమ్మా ఇంతవరకూ ఏమీ అనలేదు. రెండేళ్ల క్రితం అంటే కరోనా రాక ముందు, రోజూ ఒక తోపుడు బండి మీద ఒకతను, ఎక్కడి నుండో వచ్చి ఇక్కడ జొన్న రొట్టెలు చేసి అమ్ముకుని పోయేటోడు. అప్పుడు నేను కూలీపనికి పోయేదాన్ని నామొగుడు ఇక్కడ వాచ్మెన్ గా చేస్తుండె.. ఒకరోజు నేను కూలీకి పోయి మార్కెట్ నుండి వస్తుంటే కండ్లు తిరిగి పడిపోయిన. కాలు బాగా నొప్పి పెట్టింది. నెలరోజులు పండిన చాలా తిప్పలైంది. వాచ్మెన్ గా చేస్తే మాకు నెలకు 4000/– వస్తయి.

మాకు చదువులేకున్నా నా బిడ్డెను బాగా చదివించాలి అనుకున్నా...

నా బిడ్డె పెద్దగైంది స్కూల్ కు పంపాలె, బాగా చదివించాలె, ఖర్చులకు తిప్పలైంది. నన్ను డాక్టర్ కు చూపిస్తే మల్ల నెలతప్పిన అని తెలిసింది.

పైసలకు కష్టమైంది. మా అపార్ట్మెంట్ వాళ్ళు ఇక్కడ నీవే రొట్టెలు చేస్తే ఆఫీస్ లకు వెళ్ళి వచ్చేవాళ్ళు తీసుకుంటారుకదా..? అన్నారు.

ముందు ఒకతోపుడు బండి మీద పొద్దున కూరగాయలమ్మి, పొద్దుమూకి జొన్న రొట్టెలు చేస్తుంటి. తరువాత కొన్నిరోజులకు గేటు ముందు నున్నగజేసి, సిమెంట్ తోటి పొయ్యి వేసుకుని, ఇట్ల కట్ట గట్టుకున్న . చుట్టుపక్కల రిపేర్లు చేస్తున్న ఇండ్లల్లో తలుపులచెక్కలు అట్లాంటివి ఏమన్నా ఉంటే తెచ్చుకుంటాం. అట్లనే నడుస్తుందమ్మా.

జయంతి: నీ భర్త కు అనారోగ్యం అన్నావు ?

భారతి: అవునమ్మా నాకు పెద్దపిల్ల పుట్టినంక 15 ఏండ్లకు మల్ల చిన్నపిల్ల పుట్టింది. నేను కిందపడి నప్పటి నుండి నడుములో బాగా నొప్పి వస్తుంది నేను బెల్టు పెట్టుకునే పనిచేసుకుంటా....ఇంక ఆయన మీద పని మొత్తం పడింది పోయిన సంవత్సరం సుస్తీ చేసింది. డాక్టర్ కు చూపిస్తే కిడ్నీ ప్రాబ్లం అన్నారు. ఎక్కువ బరువులు ఎత్తలేడు, బయట పనులు చేయలేడు. ఏంచేయాలో అర్థం కాకొచ్చింది.

జయంతి: మీ అమ్మాయి ఏం చదువుతుంది? ఇక్కడుందా?

భారతి: ఇగో మేడం.. ఈమెనే నాబిడ్డ, పేరు లతశ్రీ గాయత్రీ కాలేజీలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, గదేందో ఏమ్.పీ.సి. చదువుతున్నది. చిన్న బిడ్డ పేరు లాస్య యాణ్ణర్థం పిల్ల.

జయంతి: (ఒక నవ్వు నవ్వి) భారతీ నీకు ఇప్పుడు నీబిడ్డ ఏమన్న సాయం చేస్తుందా..

భారతి: చేస్తదమ్మా రోజూ నేను చేసిన రొట్టెలు అందరికీ ప్యాక్ చేసి ఇస్తుంది.

నేను: రోజూ ఎన్నికిలోలు పిండి ఖర్చవుతుంది ?

భారతి: 1,2 కిలోలు అవుతయ్ అమ్మా

జయంతి: కూరగాయలు అమ్మడం వల్ల ఏమైనా లాభం ఉందా ?

భారతి: ఉందమ్మా రోజు 200/– ఆసరా వస్తాయి.

జయంతి: జొన్న రొట్టెలు ధర ఎంత ?

భారతి: 15/– ఒకటి అమ్మా నేను జొన్న పిండి మాత్రమే వాడుతాను బియ్యం పిండి కలపను.

జయంతి: ఇంకా ఎంతసేపు చేస్తావు ?.

భారతి : 9:00 గంటల వరకు చేస్తానమ్మా.

జయంతి: భారతీ ! నీ కష్టాలకు కారణం ఎవరనుకుంటున్నావు?

భారతి: ఎవరినీ కారణం అని నేను చెప్పలేనమ్మా. తల్లిదండ్రులు బిడ్డకు పెండ్లి చేసేటప్పుడు మగపిల్లగాడు పనిమంతుడా ? కాదా ? బిడ్డను బాగా చూసుకుంటడా లేదా? అని ఆలోచించి వాళ్ళకు ఏమన్నా ఆస్తిపాస్తులు ఉన్నాయా కనుక్కుని ఇవ్వాలి. ఆడపిల్ల అనంగనే ఎప్పుడు పెండ్లి చేసి పంపించి, చేతులు దులుపుకుందామా... అనుకోవద్దు. నా సంగతి చూడుండి.. మేం ఇద్దరం ఆడపిల్లలం, ముగ్గురు మగపిల్లలు. మా ఇద్దరికీ వెంటనే పెండ్లి చేసిండ్రు, మా అన్నలను చదివించిండ్రు.

అప్పటినుండి ఇప్పటిదాకా పోరాడుతనే ఉన్నా.

జయంతి: అయితే మీ తల్లిదండ్రులు నీపట్ల వివక్ష చూపించారని అనుకుంటున్నావా?

భారతి: అంతేకదమ్మా నన్నూ జర చదివించినుంటే బాగుండేది.

అట్ల కాకున్నా పిల్లలను పెంచుడు చాతకాకపోతే కనేది లేకుండే కదా?

నామొగుడన్నా చదువుకున్నాడా అంటే అదీలేదు. సంపాదనలేదు ఇప్పుడు ఇక్కడినుండి పొమ్మంటే మాకు బ్రతుకు తెరువు లేదు. (కళ్ళనిండా నీళ్ళతో....)

జయంతి: బాధపడకు భారతీ.. ఎవరైనా ఏదైనా సాయం అందిస్తే బాగుండు అనుకుంటున్నావా?

భారతి: ఎవరైనా నాకెందుకు సాయం చేస్తారమ్మా? నేను ఎవరి నుండీ ఏమీ కోరుకోవడం లేదు. నేను ఇప్పుడు చేస్తున్న పనే ఇంకా బాగా పెంచుకోవాలనుంది.

జయంతి: నీవు కోరుకుంటున్నావని అనడం లేదమ్మా .., ఒకవేళ ఇప్పుడు ఇక్కడ జొన్న రొట్టెలు చేసుకోవడానికి ఎలాగైతే అనుమతి ఇచ్చారో అలాగే ఇంకేదైనా సాయంచేస్తే అన్నాను.

భారతి :ఎవరన్నా సాయంచేస్తే ఒక గాజులదుకాణం పెట్టుకోవాలనుందమ్మా.

జయంతి: సరే భారతీ.. చాలా థాంక్స్

భారతి: అమ్మా.. ఇవన్నీ రాయడం వల్ల ప్రభుత్వం నుంచి ఏదైనా ఆర్థిక సాయం దొరుకుతుందా?

నేను: అదేం లేదు భారతీ.. ఇప్పుడు రాసింది పత్రికలో ప్రచురిస్తాము. అది ఎవరైనా చదివి ఏమైనా సాయం చేయాలనుకుంటే.. చేయొచ్చు అంతే.

భారతి: అవునా మేడం, సరే మేడం.. ఇంతసేపు నాపక్కనే కూర్చుని మాట్లాడింద్రు.. నాకు గొప్పగా అనిపించింది.

జయంతి: సంతోషం భారతీ.. నాకు రెండు రొట్టెలు ప్యాక్ చేయి. ఇదిగో డబ్బులు.

భారతి: ఇదిగో తీసుకోండి మేడం ఏమైనా బతుకు తెరువు గురించి విషయాలుంటే చెప్పండి.

కవిత

# మగువా నీ పోరాటం ఇంకెన్నాళ్లు ??




మామిడాల శశిరేఖ
చరవాణి :- 9908878287


మగువా నీ మనుగడకై పోరాటం ఇంకెన్నాళ్లు
ఈ సృష్టికే ప్రతిసృష్టి నువ్వే అయినా
నీ సృష్టే ప్రశ్నార్థకమైనదెందుకని ?
నీవు లేనిదెక్కడ నీకు అసాధ్యమైనదేమిటి ?

విద్యా ,వైద్యా, వైమానిక, వ్యవసాయ
వేవేల రంగాల్లో రాణించగల రుద్రమవే నీవు
పురిట్లో నుండి పాడెనెక్కే వరకు
నిత్య యోధురాలివే నీవు
రవ్వంత అలసిపోక ఓటమికి కృంగిపోక
ఒంటరి పోరాటం చేయగల ధీరత్వమే నీది..!

అక్షరాలలో మాత్రమే అంబరానికెత్తేస్తూ
అన్నింటా అధఃపాతాళానికి తొక్కేస్తుంటే
కామంతో కూడిన క్రూర మృగాలకు సమిదవుతూ
వరకట్న వేధింపులకు
బలయ్యే విషాదం ఇంకెన్నాళ్లు ... !

చట్టాలెంత కఠిన తరమైనా
అడుగడుగునా అఘాయిత్యాల అగ్నిగుండాలేనాయే..!
అడియాశల యదగోశలు వినిపించేలా
అన్యాయం దహియించే మండుతున్న కాగడవై
నీ కలలను వెలిగిస్తూ అనుకున్నది సాధించు..!

బరువెక్కిన నీ గుండెకు బ్రతకడమే నేర్పించు
ఆధునిక సమాజాన ఆధిపత్య సంఘంలో
ఆర్థిక జీవం పొంది అధికారం చేపట్టి
ముందొచ్చే నవతరాలు నినదించేలా
మగజాతికి సరిధీటుగా తెగువను చూపుతూ
నీ జీవితాన్ని పూల బాటగా మార్చుకో ..!

వ్యాసం

# ఆదిమ సమాజాల స్త్రీవాది ద్రౌపది



- నందిగామ నిర్మలకుమారి
చరవాణి : 09490369252

ఆదిమ సమాజాలలో మనిషి అల్లుకున్న అపు రూపమయిన అల్లిక ప్రతి రూపం పురాణం. మనిషి తనకు తాను విదించుకున్న బౌద్ధిక నియమాల సమాహారం పురాణం. వేల ఏళ్ళుగా ప్రజల నాలికమీద అలరారుతున్న ఇతిహాస పురాణాలు ఆ కాలాన ప్రజలు విశ్వసించుకొని సృష్టించుకున్న ప్రతి రూపాలు పురాణ పురుషులు. వేదాల తర్వాత ఈ నేలమీద తొలి మౌకిక–లిఖిత ఆధారం కూడా పురాణమే. ఆ పురాణ పురుషుల, ప్రబంధ కావ్యకన్యకల మీద విస్తృతమైన విలక్షణమైన సాహిత్యం వచ్చింది . ప్రాచీన కాలంలో ఒక స్త్రీ పలువురు పురుషులను వివాహం ఆడడం సహజం. అది ఆ కాలపు సామాజిక కట్టుబాటు. అది ఒకరి వైయుక్తిక ఆలోచనల అనుసరణ నా లేదా నాటి పితృస్వామిక విలువనా అనేది మనం చూసే ధోరణిని బట్టి ఉంటుంది. ఆ అమానవీయ విలువ మూలంగా అలా కట్టుకున్న వాడు విధి వశాత్తు చనిపోతే తన సహచరునితోనే అగ్నికి ఆహుతి అవడం అనే అమానవీయ విలువ కూడా ఆకాలపు స్త్రీ పురుష సంబంధాల మధ్య విదించబడిన కట్టుబాటు. అమానవీయమైన పితృస్వామ్య బహు భతృత్వం ఆకాలం లో ఉండేది. ఆ నాటి విలక్షణ బార్య భర్తల సంబంధాల నేపథ్యంలో ద్రౌపది మీద మరింత వివాదాస్పదమయిన చర్చకూడా జరిగింది.

ఈ విశ్వంలో సహనానికి, సహృద్భావానికి చిరునామా ద్రౌపది. ఐదుగురు భర్తలతో సహజీవనం బహుశా ధరిత్రిలో ఆమె ఒకతే చేసింది. పురాణాల మీద పురాణ కావ్యకన్యకల మీద విస్తృతమైన వ్యాఖ్యానాలు వచ్చాయి. ఆధునిక సామాజిక శాస్త్రాలు అభివృద్ధి చెందేకొద్దీ పాత్రల స్వభావ స్వరూపాలు మారుతూ నూతన చర్చలను లేవనెత్తుతున్నాయి. ఉత్తరాదిన రాముడు దేవుడు అయితే ద్రావిడ ప్రాంతాన రావణునికి దేవళాలు ఉన్నాయి. అంటే పురాణ పురుషులను అంచనా వేసే క్రమం లో ప్రతి ప్రాంతానికి తమదయిన సాంస్కృతిక ఆస్తిత్వం ఉంటుంది. ఆ సాంస్కృతిక అస్తిత్వ నేపధ్యం లో పురాణాలను ప్రభంద కావ్యాలను మారిన చారిత్రిక సాంస్కృతిక నేపధ్యం లో సమీక్షకూ కాలపరీక్షకూ లోనవుతూ వచ్చాయి . ఈ క్రమం లో ద్రౌపది అంతరంగం మీద జరిగిన చర్చ ను పరిశీలించే పని చేసే క్రమం లో ఈ పరిశోధనా పత్రం రాయాలి అనిపించింది.

పురాణాలు ఇతిమిద్ధంగా ఒకటి నుండి ఇదో శతాబ్దాల మధ్య నిర్మించ బడ్డాయి అని దేశీ విదేశీ చరిత్రకారులు నిర్ధారించారు.సంస్కృత పురాణాలు దేశీ పురాణాలుగా అనువాదం పన్నెండో శతాబ్దంలోనే మొదలయినాయి.ఆ ప్రయత్నానికి ఆద్యుడు పాల్కురికి సోమనాధుడు.అయితే పురాణ కథనాలకు వ్యాఖ్యానాలూ భాష్యాలూ కూడా ఆకాలం లోనే మొదలయినాయి.అయితే ఆ పాత్రలు వివిధ ధార్మిక,పాయలకు అనుగుణంగా మార్చబడినాయి. కానీ నేడు ఆ పురాణ పాత్రలు పోరాట ప్రతీకలుగా,పౌరుషానికి చిరునామాగా మారాయి. కనుకనే కవి శివసాగర్"శంభూకుడు పెదాల మీద చిరునవ్వుతో రామున్ని వధిస్తున్నాడు.ఏకలవ్యుడు ద్రోణుని బొటనవేలును గొడ్డలితోనరుకుతున్నాడు.బలి తన చిరు పాదాలతో వామనున్ని పాతాళానికి తొక్కేస్తున్నాడు."

ఆధిపత్య పురాణ ప్రతీకలను వినిర్మాణం చేసాడు. ఆ విధంగా శంభూకుడు,సీత,రావణుడు,ద్రౌపది నేడు వివిధ అస్థిత్వాలకు పోరాట ప్రతీకలుగా మారాయి. ఈ పత్రం లో ఆధునిక స్త్రీ మనోగతాన్ని అర్థం చేసుకోడానికి ద్రౌపది సహనాన్ని,త్యాగ నిరతిని పునః సమీక్ష చేస్తూ ఆదిమ కాలాన తొలి స్త్రీవాది ద్రౌపది ఎలా అయిందో వివరిస్తా.

మహాభారతం లో ద్రౌపది ఒక అపురూపమయిన స్త్రీ, ఆదిమకాలాలలో బహుభర్తృత్వం అమలులో ఉన్న ఉదంతాలు ఆనాటి పురాణ ప్రభంధ కావ్యాల లో లిఖితం అయినాయి. దానిద్వారా అర్థం అయింది ఏమిటి అంటే కుటుంబం లో స్త్రీని సమంగా పంచుకొనే ఒక ప్రజాస్వామిక వాతావరణం పునాదులు పురాణాల కాలం లో ఉన్నాయి అని అర్థం అవుతోంది. అయితే ఈ పురాణ ప్రభంద కావ్యాలు మౌఖికంగా ఒక తరం నుండి మరో తరానికి వ్యాప్తి చెందాయి.అవి సుమారుగా ఒకటి నుండి ఏడో శతాబ్దాల మధ్య రాగి రేకులమీద తాళపత్ర గ్రందాల మీదా గ్రంధస్తం అయినవి అని అనేక మంది దేశీ విదేశీ పౌరాణిక చరిత్రకారులు అభిప్రాయ పడ్డారు.ఈ క్రమం లో పురాణ ప్రభంద కావ్యాలను అనేక విధాలుగా తిరగ రాయడం జరిగింది. దానికి ప్రధాన కారణం ఆనాటి రాజరిక కుటుంబాలలో కలిగిన ధార్మిక భావనలు మారడంతో బాటు ప్రజల వ్యక్తిగత సామాజిక, సాంస్కృతిక, ధార్మిక విస్వాశాలలో మితి మీరిన రాజరిక జోక్యం మూలంగా అనేక ధార్మిక శాకాలు ఉప శాకల ఆవిర్భావం కూడా ఆ కాలం లోనే జరింగి.

మధ్యయుగాలలో మత మార్పిడిల మూలంగానేమి, ఒక ప్రాంతం మీద మరొక ప్రాంతం బలవంతంగా ఆక్రమించుకోవడం దాడులు చేసుకోవడం తో పాటు స్వచ్చందంగా ప్రజలు వందల వేల ఏళ్ళుగా విశ్వసించిన ధార్మిక భావనల మీద దాడులు, దుస్ప్రచారాలూ జరిగాయి.ఆ విధంగా ఒక ధార్మిక పాయ మీద మరోక ధర్మిక పాయ బలవంతపు బెదిరింపులు,దాడులు హత్యలూ హననాలూ జరిగినావి. ఆ క్రమం లో అంతులేని ప్రాణ,మాన ధన నష్టం జరిగి సమాజం లో ఒక అశాంతి బయలు దేరింది. అలా మితి మీరిన అధికార దాహం ఒక వైపు బలీయంగా విశ్వసిస్తున్న మత జోక్యం మూలంగా అప్పటి దాకా మౌఖిక రూపం లో ఉన్న ధార్మిక,పురాణ ప్రభంద సాహిత్యం తిరగ రాయించడం,వాటికి భాష్యాలు రాయించడం జరిగింది. ఆ క్రమంలో వేదవాఙ్మయ సాహిత్యానికి భాష్యాలూ, పురాణ ప్రభంధ సాహిత్యానికి వ్యాఖ్యానాలూ,పురాణ,ఉప పురాణ,స్థల,కుల పురాణాలుగా వ్యాప్తి చెందాయి. ఆ క్రమంలో బయలు దేరినదే పన్నెండో శతాబ్దం లో రాయబదినదిగా భావిస్తున్న పాల్కురికి సోమనాధుని బసవపురాణం ఒకటి. అప్పటివరకూ అతీంద్రియ శక్తులు భూమిక గా నడిచిన పురాణం బసవపురాణం తో భక్తుల చరిత్రలు పురాణ దారులు అయ్యారు.అప్పటి నుండి పురాణానికి ఉండాల్సిన పంచలక్షణాలు సడలుతూ వచ్చాయి.

తెలుగు వాక్యం సంకేత భాషనుండి ప్రవచనం నుండి పద్యం గా వచనంగా వ్యావహారికంగా,శిష్టవ్యావహారికంగా మారే క్రమంలో వచనం అనేక సంస్కరణలకు లోనయింది. ఆ క్రమం లో వాక్య నిర్మాణంలో రూప సారాల్లో అనేక మార్పులకు లోనయినాయి. వలసవాద ప్రభావంతో సాహిత్యాన్ని చరిత్రను తార్కికంగా హేతుబద్ధంగా అధ్యయనం చేయడం మొదలయింది. ఆ క్రమం లో పురాణ సాహిత్యాన్ని కూడా హేతుబద్దంగా అధ్యయనం చేయడం కూడా మొదలయింది. ఈ దశలో పురాణాలను తిరగరాసే క్రమం మొదలయింది. ఒక నాటి వేద సాహిత్యానికి ఒక కుల కట్టుబాటు ఉండేది. సమాజం లో కొన్ని ఆదిపత్య శక్తులు మాత్రమె వేద అధ్యయనానికి అర్హులు అని నియమం ఉండేది. ఆదిమ కాలాలలో ఆ కట్టుబాటును దిక్కరించి కొందరు వేదం అధ్యయనం చేసి పలు శిక్షలకు గురి అయ్యారు. ఆ క్రమంలో కొందరు చనిపోయారు కూడా అంతే కాకుండా, వేదాల అధ్యయనం మీద ఇప్పటికీ కొన్ని కులాలకు అధికారం లేదు పైగా ఆ పద్దతి మీద అప్రకటిత నిషేధం కూడా అందుబాటులో ఉండేది.ఒక రకంగా కొన్ని కులాలకు మాత్రమె వాటిమీద గుత్తాధిపత్యం ఉండేది. ఆ క్రమాన్ని మొదట ఎదిరించే పనిని ఆది భౌతికవాదులుగా పేరుగాంచిన లోకాయతులు, చార్వాకులు కొనసాగించారు. అంతే కాకుండా వేద,పురాణ వాఙ్మయ గుట్టును కనిపెట్టి అనేక వ్యాఖ్యానాలు చేసారు. అలా వందలాది ఏళ్ళుగా సాంస్కృతిక ఆధిపత్యానికి వ్యతిరేకంగా అనేక మంది పురాణ ప్రభంధ కావ్యాలను పూర్వపక్షం చేస్తూ రాసారు.

సామాజిక శాస్త్రాలు ఒక కావ్యాన్ని అధ్యయనం చేయడానికి అనేక ప్రమాణాలను నిర్దేశించింది.అది వలసవాద,సామ్యవాద,వలసవాదానంతర,వామపక్ష,అస్తిత్వ,నిర్మాణ ,వినిర్మాణ,మనోవిజ్ఞాన,ఆధునిక,ఆధునికాంతర దృక్పదాల వెలుగులో సాహిత్యాన్ని అధ్యయనం చేయడం,విశ్లేషణ,పరిశీలన ,పరిశోదనాత్మకంగా చూసే ధోరణులు మరింతగా రోజు రోజుకీ పెరిగిపోయాయి. ఈ నేపధ్యంలో రామాయణ మహాభారత కావ్యాలలో పాత్రలను మారిన సామాజిక సాంస్కృతిక నేపధ్యాల వెలుగులో అధ్యయనం చేయడం మొదలయింది. ఒక దశలో రచయిత కేవలం ఆ రచన వరకే పరిమితం కావాలి అని దాని లోతుపాతులు చర్చించే అధికారం రచయితకు ఏమాత్రం లేదనీ కొన్ని సిద్ధాంతాలు బయలుదేరాయి. ఆ క్రమం లోనే రచన మారిన సామాజిక సాంస్కృతిక దృక్పదాల వెలుగులో పరిశీలన చేయడం మొదలు పెట్టారు.ఆ నిశితమైన పరిశీలన మూలంగా రచయిత పరిమితి తగ్గి విమర్శకుడి జోక్యం మరింతగా పెరిగింది.

సాహిత్య పాత్రలను వాటి మానసిక ధోరణులను లోతుగా విమర్శనాత్మకంగా అధ్యయనం చేయడం ఇటీవల బయలు దేరింది. ఒక రచనను లోతుగా అర్థం చేసుకోవాలి అంటే కేవలం రచనను మాత్రమె ప్రామాణికంగా తీసుకోకుండా ఆయా పాత్రల మానషిక ప్రవృత్తిని పరిగణలోకి తీసుకోవడం సాహిత్య విమర్శలో ఒకనూతన దృక్పదంగా ఇటీవల విమర్శకులు అనుసరిస్తున్నారు.ఆ క్రమం లో నాటి స్వాభిమాన ఉద్యమాల వెలుగులో అనేక మంది పురాణాలను విమర్శనాత్మక ధోరణిలో అధ్యయనం చేయడం మొదలు పెట్టారు. ఆ క్రమం లోనే రామాయణ మహాభారత పాత్రలు వర్తమాన చర్చల్లో వినిర్మాణం చేయడం మొదలయింది.ఆ చైతన్యం తోనే త్రిపురనేని, రామస్వామి చౌదరి, శంభూకవధ, సూతపురాణం, లాంటి రచనలు అనేక బలమైన కావ్యాలుగా ప్రసిద్దిపొందాయి. వాటి కొనసాగింపులో బాగంగానే ప్రముఖ తమిళ నాటక ప్రయోక్త ప్రళయన్ దళిత ఉపకథ పేరుతో రామాయణ,మహా భారత ప్రసిద్ద పాత్రలను వి నిర్మానం చేసాడు. అదేవిధంగా అనేక భారతీయ బాషలలో ఈ ప్రయత్నాలు తీవ్రతరం అయినాయి. కన్నడం లో ఎస్ ఎల్ బైరప్ప,గిరీష్ కర్నాడ్, లాంటి వాళ్ళ రచనలు ప్రపంచ వ్యాప్తంగా ప్రజామోధం పొందాయి, అనేక జాతీయ అంతర్జాతీయ బాషల్లోకి విరివిగా అనువాదం అయినాయి. వీటి కొనసాగింపులో బాగంగా రాముడు,రావణ, శూర్పణఖ, శశిరేఖ, సావిత్రి, రేణుకా ఎల్లమ్మ పాత్రలను నేడు మనో విజ్ఞాన తాత్విక చింతనల వెలుగులో కావ్య వస్తువులు అయినాయి.

గత కొన్ని దశాబ్దాలుగా సాహిత్యంలో అస్తిత్వవాద భావధార బలంగా వినిపిస్తోంది.ప్రాంతీయ,లింగ,కులవర్గ ప్రాతిపదికన సాహిత్యం విస్తరించింది. పురాణ ప్రతీకలు అస్తిత్వ ప్రతిరూపాలుగా మారిన నేపధ్యం లో సహనానిక చిరునామాగా భావించే సీత,ద్రౌపది పాత్రలు వర్తమాన సాహిత్య చర్చల్లో కావ్య నాయకలు అయ్యారు. ముఖ్యంగా భర్త మాట జవదాటని సీత అని శీలం పేరుతో అవమానించిన వైనాన్ని వివక్షగా,కరుడు గట్టిన రాజరిక,పితృస్వామిక దాష్టీకానికి ఎలా బలి అయిందో అనే చర్చ నేటి సాహిత్య వస్తువు అయింది.ఆధిపత్య పురాణాల ప్రతీకలను వర్తమాన సామాజిక ఉద్యమాల వెలుగులో విమర్శనాత్మకంగా అధ్యయనం మొదలు పెట్టిన నేపధ్యంలో ద్రౌపది పాత్ర ఆదిమ సమాజాల పితృస్వామిక దాష్టీకానికి ఎలా బలి అయిందో నేడు ప్రాధాన్యత సంతరించుకున్నాది.

ద్రౌపది కాలానికి బహు బత్రుత్వం బలంగా ఉంది ఆ కాలాన ఒక బార్యకు పలువురు భర్తలు ఉన్న నానుడి ఉంది. అయినా ద్రౌపది అంతరాల లో దాగున్న మనో సంఘర్షణ ను నూతన దృక్పదాల వెలుగులో పరిశీలించారు. నాటి ఆమె మానసిక మనో స్థితి యురోపియన్ సమాజాలలో బయలుదేరిన ఫ్రాయిడ్ మోనో విశ్లేషణ పద్దతుల ద్వారా అధ్యయనం చేస్తే మాత్రమె ఆమె లో దాగిన భిన్నమైన మనోభావాల అంతస్సంఘర్షణ గురించి శాస్త్రీయమైన అధ్యయనం అంచనా చేయగలం అని ఇటీవల పరిశోధనలు రుజువు చేస్తున్నాయి. అంతే కాకుండా కౌరవుల దుష్కార్యాలకు పితృస్వామిక దాష్టీకానికి ఎలా బాలి అయిందో,ఆ క్రమం లో కట్టుకున్న భర్తల నిస్సాహాయ మనోస్థితి అంతస్సంఘర్షణను మరింత కూలంకుషంగా పరిశోధన చేయాల్సిన అవసరం ఎంతయినా ఉంది. ఏది ఏమయినా వర్తమాన స్త్రీవాద చైతన్యంలో ద్రౌపది ఆదిమ కాలాలలో ఇచ్చిన ధీరోదాత్తమ స్ఫూర్తి ఆదిమ కాలాన ఉన్న ప్రాపంచక స్త్రీవాద దృక్పద పునాదులు ఉన్నాయి.

కథ

# కొత్త టీచర్



- తులసీ గుగులోతు
హైదరాబాద్, 99087 33389

అది ఒక సిటీకి దగ్గరలో వుండే పల్లెటూరు (చిన్న తండా). ఆ ఊరిలో ఒక ప్రైమరీ స్కూల్ అందులో మధువాణి మేడం ప్రధానోపాధ్యాయురాలు.. అభివృద్ధిలేని ఊరిలోనీ పాఠశాల కోసం ఎంతో పాటుపడ్డారు.. ఎందరో తల్లి ,దండ్రులను కలిసి పిల్లలను బడికి పంపెలా మార్చారు. చాలా స్ట్రిక్ట్ గా వుండే వారు. పిల్లలకు మేడం అంటే ఎంతో ఇష్టం పెరిగి పోయింది. ఊరి వాళ్ళందరూ ఎంతో అభిమానించే వారు.. ఎంతో ఆదరణ పొందారు..సరిగా చదవని విద్యార్థులకు శిక్షించినా తల్లి, దండ్రులు ఏమి అనేవారు కాదు. మీరే చూసుకోండి పంతులమ్మ అనే వారు గానీ ఎప్పుడు మేడంతో మా పిల్లలను ఎందుకు కొట్టారు.? అని అడిగేవారు కాదు. రోజు పిల్లలతో ఆటలు ఆడేవారు. డాన్సు నేర్పే వారు. అలా పిల్లల మనసులో గొప్ప స్థానాన్ని సంపాదించారు. అలా గడచి పోతున్న కాలంలో భాగంగా టీచర్ కి ట్రాన్స్ఫర్ అయింది.. పిల్లలు మా టీచర్ మాకు కావాలి... అని ధర్నాలు చేసేదాకా వచ్చింది. అంతటి అభిమానం సంపాదించారు మధువాణి మేడం.. కానీ బదిలీలు సహజం అని టీచర్ అందరినీ సముదాయించారు..

స్కూల్ అంతా కన్నీటి సంద్రం అయింది. మేడం అందరినీ వదిలి కొత్త స్కూల్ కి వెళ్ళారు.అలాగే ఈ స్కూల్ కి కొత్తగా కళ్యాణి మేడం వచ్చారు. కానీ,

కొత్తగా వచ్చిన మేడం నీ జీర్ణించుకోలేక పోయారు పిల్లలు.మేడం ఎప్పుడు కోపంగా వుందని అనుకునే వారు. ఒకరి మీద ప్రేమ మరొకరి మీద ద్వేషం లా.... పిల్లలు కళ్యాణి మేడం మీద కోపం పెంచుకున్నారు. ఒకరోజు కొంత మంది పిల్లలు కలిసి మేడం కూర్చునే చైర్, హ్యాండ్ బ్యాగ్, అన్నిటి మీద దురద ఆకు పొడి చేసి వేసేశారు... కళ్యాణి మేడం చుస్కోకుండా వాటిని ముట్టుకున్నారు. అంతే వళ్లంతా దురద, ఎర్రగా వుండే మేడం పూర్తిగా రక్తం తేలి చాలా నరకం చవి చూసారు..మొదట దురదతో గోకడం మొదలు పెట్టగానే పిల్లలు నవ్వుకున్నారు. వుండగా వుండగా మేడం పరిస్థితి ఘోరం గా మారిపోయింది.. పిల్లల ముఖాల్లో నవ్వు మాయం అయి ఆందోళన మొదలైంది. చివరకు మేడం పరిస్థితి చూసి ఏడ్చేసారు...అది చూసి తట్టుకోలేక పిల్లలు ఈ తప్పు మేమే చేశాం అని ఒప్పు కున్నారు. మేడం వాళ్ళను తిట్టలేదు, కొట్టలేదు. ఏడుస్తూ వెళ్ళిపోయారు. ఊరిలో ఈ వార్త పాకింది. పెద్దలు స్కూల్ కి వచ్చారు. ఇప్పుడే ఎలా తప్పులు చేస్తే భవిష్యత్తులో నేరాలు చేస్తారు మీరు అని అన్నారు.మీకు శిక్ష అవసరం అని అన్నారు పెద్దలు. స్కూల్ అందరి పిల్లల తరపున స్కూల్ లో పెద్ద క్లాస్ పిల్లలు పెద్దల ముందు వారితప్పు ఒప్పుకొని మాకు తెలియక చేశాం క్షమించండి అని అడిగారు.. మేడం పెద్దల తో చిన్న పిల్లలు వదిలేయండి ఇంకెప్పుడు అలా చేయరు అని చెప్తుంటే పిల్లలకి ఇంకా ఏడుపు వచ్చింది.పెద్దలు సరే మేడం మీ మాటలకు మర్యాద ఇచ్చి పిల్లలను ఏమి అనము, వదిలేస్తాము.కానీ పిల్లలు, మీరే మేడం నీ క్షమాపణ మా ముందు అడిగితేనే అని చెప్పారు. పిల్లలు కదా ఎలా అడగాలో కూడా అర్థం కాలేదు.ఏడుస్తూ అందరూ వెళ్ళి మేడం కాళ్ళ మీద పడి క్షమాపణ అడిగారు. మేడం అయ్యో లేవండి. ఇలాంటివి ఏమి వద్దు. అందరూ బాగా చదవడం, అల్లరి మానేయాలి, బాగా ఆడాలి. ఏ పోటీలకు వెళ్ళినా అన్నీ చోట్ల నెగ్గి స్కూల్ కి మంచి పేరు తేవాలి అని అన్నారు.. పిల్లలు అందరూ అలాగే అని మాటిచ్చారు.క్రమంగా మేడం మీద కూడా ఇష్టం పెంచుకున్నారు.నిజంగానే అన్నిట్లో ముందు వుండేలా మారి పోయారు. స్కూల్ అంటే ప్రవహించే నది లాంటిదే,ఆగడం అంటూ వుండదు. కానీ నది మలుపులు లాగా కొత్త నీరు మార్పు వస్తు వుంటుంది.. సహజమైన వాటిలో మార్పు స్వాగతించాలి. అని తెలుసు కున్నారూ పిల్లలు.

# పుర్రె



గంధం విజయ లక్ష్మి

లచ్చిమి చిన్నవోయి దిక్కులు చూసుకుంటు కూసుంటది అదే టైముల లచ్చిమి వాళ్ళ కాక పోశయ్య జానస్తాడు పోశయ్య శ్మశానంలో కాటి కాపరిగా ఉంటడు

ఎందె లచ్చిమి గట్ల గుచున్నవ్

పుల్చుబుడ్డి మోకం వేసుకొని ఏమైంది అవ్వ అయ్య ఎక్కడికి జానింద్రు

కాక అవ్వ అయ్య పచ్చాం తీసుకురానికి జానింద్రు పచ్చాం పీసాంలు అల్లానికి

లచ్చిమి శావిడి కొక్కిడిగాడి శాఖముతోని మెస్కినవ, కర్కొటిగాడి శాఖముతో మెస్కినవ

లచ్చిమి ఏమి అనకుండ నోటికి విడమిచ్చింది

లచ్చిమి నీతో ఆడుకునే శిర్పగాండ్లు శిర్పకోటిలు లేరా అంటాడు పోశయ్య అశోడే పల్క్యాడు అంటాడు పోశయ్య కడుపు కాలిపోత ఉంది.

మత్తెలో మ్యాత లేదు

నాకు కండ్లు చిమ్మ కారుట్లు అయితున్నయి కాక

అయ్యో పింకె మత్తెలో శావిడి శాఖము లేదా

లచ్చవ్వ హోటలుకు వోయి మెస్కివద్దాం

ఇద్దరు కలిసి హోటలుకు పోతారు

పెద్ద బల్లలను బెంచిలను కప్పగుడ్లలాంటి తన కండ్లతోని అద్దమ్ల తనను తాను జూసుకొని మైమరిచిపోతది పెద్దపెద్ద తన జడలను చూసుకుంటు మురిసిపోతది

కాక నీతాట కంచికం ఉన్నయి

పింకె పలుకకు లచ్చవ్వ కాజాలు శాఖము మెస్కుతవ అశ్కాటి శాఖము మెస్కుతవ

నాకు కురుంగాండ్ల శాఖము గావాలె

శిర్పకోటి గట్టిగా పల్క్యాటం పల్కకు నెట్కించి గెదుముతరు

లచ్చిమి పోషయ్య ఆశ్కాటి శాఖముతో మెస్కుతరు

తిన్నంకడ పోశయ్య బ్రేవ్‌మని బేక్ తిస్తాడు అందరూ వీళ్ళవంక ఎవరు వీళ్ళన్నంటు చూస్తరు

అట్ల అందరు జూసే సరికి లచ్చిమికి అవమాన మన్పిస్తది, హోటలు సర్వరు బిల్ తీసుకువచ్చి ఇస్తడు.

కాక దగ్గర గింజాలు ఉన్నవ లేదా అని మదిల అనుమానమైతది లేకపోతే ఇప్పుడెట్లా మంకాదు దెహిప్తదు అసలే కార్కుడు మోకపోడు

కాక ఎప్పుడు పుచ్చకాయనె

కాక కంచికం లేవా అని అబ్యాతకంగా అడుగుతది లేవు అని సిర్పువామును అడ్డంగా ఊపుతాడు.

ఒక ఉపాయం వచ్చింది సిర్పువాం నువ్వు జానిరా అని చెయ్యి పట్టుకొని ఇద్దరు కలిసి మేనేజరు బల్లదగ్గరకు పోతరు

హోటల్‌వాడు డబ్బులు అడగ్గానే

హరహరమహదేవ శంభో శంకర అంటాడు పోశయ్య పోశయ్య జోలెలోంచి బూడిద తీసి నొసలికి పూసుకుంటడు ఒరెయ్ డబ్బులియ్యమంటే బూడిద రాసుకుంటు తమాష

చేస్తున్నవ ఏమిట్రా నీ సంగతి నీ అయ్య అంటుండగానే నా దగ్గర సిర్సువాం తప్ప ఏమి లేదు అంటాడు పోశయ్య నీతల ఎవడికి గావాల ఏమిట్రా బలిసిందా పైసలు దియ్యి అని హోటల్ యజమాని అగ్గిమీద గుగ్గిలమైతడు

లచ్చవ్వ మనస్సులో బాగా బుగులు వడ్డు కలువలాంటి కాటుక కండ్లను కరములతో కౌగిలించుకుంటుంది

లచ్చవ్వ మనస్సులో కాక దగ్గర కంచికం ఉన్నాయనుకొని జానస్తి హోటల్ వాడితో గంట్లు పల్యాటాలు హోటల్ వాడు దెహిపిస్తే బొల్లకొటి వచ్చుడు కాయం ఇప్పుడెంది

ఆ ఆలోచన మనస్సుల రాగానే

కాళ్ళకింద భూమి గిర్రున తిరిగినట్టు అయితుంది

ఒరేయ్ నువ్వు ముందు నా బల్ల మీదనుంచి అది తియ్యిరా

నువ్వు పోరా ఇక్కడ్నించి

ఒరె గుడిసెలోడా నువ్వు బిల్లు కట్టకుంటే కట్టక పోయినవురా నువ్వు ఇడికేని పోరా అనే మాటలు విన్పిస్తుంటే కండ్లు తెరవకుండానే

చెవుల పిల్లిలెక్క రిక్కరించి ఇంటంది

మెల్లమెల్లగ కండ్లు తెరిచి చూస్తది

బల్లమీద అరె నెనాడుకునే పుర్రె

పోశయ్య అది చూపించుకుంటూ సామి మనమందరం

ఇట్లనే అయితం సామి ఎందుకు ఈ దత్తు అంటుండగానే

ఒరె నువ్వు పోరా అని అంటడు హోటల్‌వాడు

లచ్చవ్వ జానిరా అనగారే

అరె తీస్కపోరా గజగజవణుకుతూనే హోటల్ వాడు సరేసామి ఇదే నా ఆస్తి అని పుర్రెను జోలెలో వేసుకుంటడు అది జూసి లచ్చవ్వకు ఆశ్చర్యం అయితది

ఎందుకట్లా భయపడ్తుండు మంకాడు పుర్రెను జూసి

మర్మం దెలిసిన కాక ఇగ్లాటం చేస్తూనే లచ్చవ్వ చెయ్యివట్టుకొని....

కవిత

# ఆమెల గురించి మాట్లాడదాం...




- సీహెచ్. ఉషారాణి

ఫోన్ :9441228142


అవును ఇప్పుడు ఆమెల గురించే మాట్లాడుకుందాం

గుట్ట పక్క పొలంలో వినిపించే పదం తాలూకు గొంతుకు ముగ్దులవుదాం ....

నీటికుంట అద్దంలో రెక్కలు ముక్కలు చేసుకుంటున్న ఆమె చెమట సౌందర్యాన్ని గురించి పోటీపెడదాం....

చిక్కుడు పాదు కింది బాజ్రా రొట్టెను తాలుస్తూ....

చినపిలగాడి ఆకలి తీర్చడమే కలగా కంటున్న స్వప్న లిపి భాష అర్థం అయ్యే వరకూ శ్రమిద్దాం...

కుండకు ప్రాణం పోస్తూ ఎడతెరిపిలేని మట్టి సావాసం చేసే ఆ చేతి సౌందర్యాన్ని చూద్దాం...

మోపుల్ని ఎత్తి విరగదీసుకున్న ఎన్నుతో నడకలాంటి పరుగుల్ని చూసి మోహిద్దాం...

ఆకు మడతలు చుట్టే ఆ వేలి కొసల నిపుణతను గురించి పాటై చూద్దాం.....

జల్లెడేస్తూ ఇసుకరేణువుల వేగంతో పోటీ పడుతూ ఇసుకకెరటమైన ఆమె నిబ్బరాన్ని కీర్తిద్దాం...

గాయమైన గుండెను పోర్లిస్తూ అమ్మకమైన ఆమెల గురించి చర్చిద్దాం...

సమీక్ష



# చక్కని శైలితో సాగిన 'పృథ' దృశ్యకావ్యం


- శైలజామిత్ర
9290900879

Wrong thinking is only problem in life,..– Bagavadgeetha

తప్పుగా ఆలోచించడమే జీవితంలో పెద్ద సమస్య అనే మాట మన భగవద్గీతలో అంటారు

తన ధైర్యమే తనకు కిరీటం అని రామాయణంలోని మాట. అలాగే జీవితంలో ప్రతి నిముషం ఎంతో ధైర్యంగా, స్థైర్యంగా కనిపించే ప్రతి స్త్రీ వెనుక విరిగిన బాల్యపు మనోతునక ఉంటుంది అంటారు మను ధర్మ శాస్త్రంలో. కాకుంటే శారీరకంగా స్త్రీ కొన్ని చోట్ల బలహీనురాలిగా కనిపిస్తుంది కానీ మానసికంగా మాత్రం ఎప్పటికీ కొండల్ని పిండిచేయగల శక్తిని కలిగివుంటుంది అనేది అనేక చోట్ల, అనేక పురాణాల్లో మనకు తార్కాణాలు వినిపిస్తూనే ఉన్నాయి, సుఖపడతాం.. ఏమవుతుంది? పరుగెడతాము. నవ్వుతూ ఉంటాము. పదిమందికీ మనగురించి చెప్పుకుంటాం. లేదా చెప్పిస్తాం. అదే విధంగా కష్టపడతాం..ఏమవుతుంది? పడతాము. విరిగిపోతాము ..శిధిలమైపోతాము. అయితే.. మనిషిగా ఎంత కష్టపడినా లేవగలము.. కానీ మానసికంగా అంటే నిలబడటానికి కొంతకాలం పడుతుంది. అలా నిలబడీ నిలబడలేని సమయంలో చేసే పోరాటమే ఒక చరిత్రగా నిలుస్తుంది. అలా మనకు కనిపించే ఒక అమాయకమైన మహిళ కుంతి.

కుంతి మాత్రమే ఎందుకు? అనే ప్రశ్న మళ్ళీ ఉదయిస్తుంది. భారత భాగవత పురాణాల్లో అనేకమంది ఉన్నారు కదా? అనుకోవచ్చు. ఈ సమాజంలో చాలామందిని ఆలోచింపజేసే, మిక్కిలి బాధించే అనేక సంఘటనలు చరిత్రలో నిక్షిప్తమై ఉన్నాయి. కానీ కొన్ని మనల్ని అనుసరిస్తుంటాయి అంటారు కవయిత్రి రేణుక అయోల. కవయిత్రి చిన్నతనం నుండి నిత్యం వెంటాడే, నిలదీసి, పశ్నించే సమస్య కుంతి అంటారు. అందుకు సమాధానం కోసం కొన్ని గ్రంథాలు చదివారు. కానీ సమాధానం దొరకలేదు. అందుకేనేమో.. ఆమె హృదయాన్ని



స్వాంతన పరుచుకోవాలనే కాదు ఆమె లానే అనేకమందిలో కలిగిన సందేహాలకు సమాధానం ఇవ్వాలనుకుని ఈ గ్రంథ రచన చేసారని అంటారు. అయితే చదవినవారికి సమాధానం దొరికిందా లేదా దొరుకుతుందా అనే ప్రశ్నలకు సమాధానం రావాలంటే ఈ గ్రంథంలోకి ప్రయాణించాల్సిందే..

ప్రాచీనంలో పద్య కవిత్వం ద్వారా ఒక రాజును పొగుడుతూనో లేక రాణి అందాల్ని వర్ణిస్తూనో, లేక రాజ వైభవాలను వివరిస్తూనో., ప్రకృతిని వర్ణిస్తూనో సాగేవి.

కొన్నాళ్ళకు వచన కవిత్వం ప్రజాదరణ పొందిన తర్వాత దళిత వాదం, స్త్రీ వాద కవిత్వం, దిగంబర కవిత్వం, అభ్యుదయ కవిత్వం వంటి కవిత్వాలతోటి వాస్తవ సంఘటనలను తరచి చూసి ఆయా కవులు తమదైన ముద్రను శాశ్వతంగా తెలుగు సాహిత్య చరిత్రలో నిలబెట్టుకున్నారు.ఆ తర్వాత రానురాను ప్రతి కవిత్వం లోనూ తమకు తాము అనుభవించిన వేరొకరు అనుభవాల్ని చూసినా, విన్నా, చదివినా ఆయా సంబంధిత ఆవేదనల్ని, అన్యాయాలపై కవుల కలాలు ఎక్కుపెడుతుండటం విశేషంగా చెప్పుకోవాలి. రవి కాంచని చోట కవి కాంచున్ అనేది ఒకప్పటి మాట నేడు ఊహాజనితమైన కవిత్వాలకు దాదాపుగా స్వస్తి పలికిందనే చెప్పాలి.

1979లో ఎస్ ఎల్ బైరప్ప గారు కన్నడ భాషలో రచించిన నవల 'పర్వ' ను రచిస్తే అది సాహితీ చరిత్రలో ఒక పెద్ద విస్ఫోటనాన్నే కలిగించింది. మహాభారతంలోని దైవత్వాన్ని పక్కకు పెట్టి అద్భుతమైన విశ్లేషణతో పాత్రలను పాఠకులకు వివరించే ప్రయత్నం చేసారు. అప్పటినుండి అనేకమంది సాహితీ వేత్తలు ఆ ప్రభావం నుండి చాలా కాలం వరకు బయటపడలేదనే చెప్పాలి. భారతీయ సాహిత్యంలో ఎప్పటినుండో అనేక ప్రయోగాలు జరుగుతూనే ఉన్నాయి.

అప్పట్లో రామాయణాన్ని కూడా ద్రవిడజాతి వారసులుగా మరో కోణంలో చూపించిన పెరియార్ విషయం మనకు తెలియనిది కాదు.

అలాగే రాజగోపాలాచారి గారు రామాయణాన్ని మహాభారతాన్ని తనకు తోచిన పంథాలో రచించి అప్పటి పాఠకులను మెప్పించారు. ఎవరు ఎన్ని రాసినా, నిలదీసినా, తప్పులు ఎత్తి చూపినా ఇది నిజం ఇది కాదు అని ఎలుగెత్తి నిలదీస్తున్నా కూడా ఇప్పటికీ ఇంకా ఇంకా ఆయా సంబంధిత పాత్రల గురించి తెలుసుకోవాలనే జిజ్ఞాస పాఠకుల్లో కలుగుతూనే ఉంది. కారణం మనం దాదాపుగా మన జీవితాలన్నీ రామాయణ మహాభారత వాతావరణంలో ఇమిడిపోయామనే చెప్పాలి. ఎందుకంటే రామాయణ మహాభారతాల్లోని పాత్రలు అక్కడితో సమసిపోలేదు. అప్పట్లో అక్కడక్కడా ఉంటే ఇప్పుడు ప్రతిచోటా ఆ పాత్రలే పురుడుపోసుకుంటుండటం విశేషం.

రేణుక అయోలా ఎప్పుడూ ఒక కొత్తదనం కోసం పరితపించే కవయిత్రి. తన కవిత్వం నిత్య నూతనంగా ఉండాలని నిరంతరం తపిస్తారు. అందుకు ఉదాహరణ ఇదివరకు రచించిన దీర్ఘకవిత మూడోమనిషి. ఇప్పటి కుంతి. తెలుగు సాహిత్యంలో అతి తక్కువ దీర్ఘ కవిత్వాలు వచ్చాయి. వచ్చిన ప్రతీదీ నిలబడిరదా అంటే సందేహమే. అలా నిలబడాలి అంటే అందులో కొత్తదనం ఉండి తీరాలి ఆ విషయంలో రేణుక గారి రచనలు దాదాపుగా నిలబడతాయనే చెప్పాలి.

అసలు ఆకాలం నుండి నేటి దాకా జీవితాల్ని పరిశీలన చేస్తుంటే పెద్దగా మార్పు అంటూ ఏమీ కనిపించదు. ఆనాడు సమాజ నియంత్రణలోనే జీవితాలున్నాయి. ఇప్పుడు కూడా సమాజానికే ఉపయోగపడుతున్నాయి.

''కొన్ని సార్లు ఎందుకో అసహజంగా / మనల్ని మనమే బంధించుకుంటామేమో''

ఒక విధంగా ఆనాటి స్త్రీలలోనే ఆలోచన , అవగాహన ఉండేదేమో అని అనిపిస్తోంది. అప్పుడు స్వేచ్ఛపేరిట, స్వాతంత్ర్యం పేరిట తనకు తాను సంకెళ్ళు వేసుకుంటోందేమో అనిపించక మానదు. ఎలాగ అనే అందరూ అనుకోవచ్చు. నేడు స్త్రీని రాజకీయంగా అవసరార్థం వాడుకునే తీరును కూడా గమనించకుండా తనకు తాను ఎదిగిపోయాననే భ్రమలో బతికేస్తోంది. ఎలాగంటే అమాయకంగా సంసారాన్ని మాత్రమే చూసుకునే భార్య నేడు సంపాదనలో పడిరది. మార్కెట్‌లో సరుకుగా మారింది. ఒకవిధంగా జీవితాన్ని అలసటలోకి లాక్కెళుతోంది. ఒకప్పుడు పాతివ్రత్యం , సాంప్రదాయం అనే చట్రంలో బిగించిన సమాజం ఇప్పుడు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం అనే పాతివ్రత్యంమనే చట్రంలో బిగిస్తోంది. ఈ రోజు తనకు తాను బంధనాలనుండి విముక్తి అయిపోయానని అనుకునే మహిళ తనకు తానే బంధీగా మిగిలిపోతున్నానని తెలుసుకోలేకపోతోంది. అందుకే ఒక్కోసారి అనిపిస్తుంది స్త్రీ జీవితంపై సమాజ నియంత్రణ అనే విషయానికి ప్రాధాన్యత ఇవ్వాలి అనిపిస్తోంది.

సరే.. ఇవేవీ కావు అనుకుందాం కాస్సేపు. ఒక్కసారి ప్రతి స్త్రీ తమకు తాము తమను ప్రశ్నించుకుందాం.. అసలు మనం మారామా? మనం అనుకున్న స్వేచ్ఛ మనకు వచ్చిందా? స్వాతంత్ర్యం అనే విషయాన్ని మనం అనుభవిస్తున్నామా? ఇష్టమైతేనే పెళ్ళి అంటున్నాము. ఇష్టమైనవారినే పెళ్ళి చేసుకుంటున్నాము. ఆకాశంలో సగం అంటున్నాము. నిజంగా మనం అలా బతుకుతున్నామా? ఇంకా ఇంకా సమాజం, కుటుంబం కట్టుబాట్ల మధ్య నుండి బయటకు వచ్చామా? సమాజ నియంత్రణనుండి బయటపడ్డామా? అనేది సమాధానం లేని ప్రశ్న. ఇలాంటి అనేక ప్రశ్నలకు సమాధానం రేణుకా అయోలా గ్రంథం పృథ..

ఆనాడు పృథకు దుర్వాస మహర్షి ''నువ్వు ఎవరిని తలుచుకుంటే వాళ్ళు ప్రత్యక్షమవుతార''నే వరమిచ్చి తన జీవితాన్నే నరకప్రాయం చేస్తే నేడు ఎన్నో పనికిమాలిన వరాలిచ్చి, మోసమనే చట్రంలో బిగించి స్త్రీని ఒక విలాసవస్తువుగా వాడుకుంటున్న మునులు మనకు కనిపించడంలేదా? అనిపించకమానదు.

''తకాంక్షతో విద్యత్తుపోతో రగిలిపోయే/ నీకు భవిష్యత్ దర్శనం తెలియదా?''

ఆ వరం పొందిన తర్వాత ఆ వరం తనకి ఉపయోగకరమైందా లేదా? ఉపయోగమైతే ఎంతవరకు? అనే ఆలోచన ఆ తెలిసీ తెలియని తనంలో అమాయకత్వంలో ఎదురుగా భగ భగా మండే ఆ సూర్యుడిని పిలుద్దామా? పిలిస్తే ఒకవేళ అతను వచ్చేస్తే ఈ భూగోళం అంతా మాడి మసైపోతుందా? అసలు వస్తాడా? ఈ గ్రహం మనిషి ఎలా అవుతాడు అనే ఆలోచనతో సూర్యుడిపై ఆ వరాన్ని ప్రయోగించింది. ఆ ప్రయోగించిన వెంటనే మామూలుగా ఏ లాంటి భగభగలు లేకుండా సామాన్య మానవుడిలా ప్రత్యక్షమై కుంతి కోరికను తీర్చేస్తాడు. తెప్పరిల్లిన కుంతి ఎంతో సందిగ్ధంలో పడిపోతుంది. పుట్టిన బిడ్డను తండ్రికి ఎలా చూపించాలి? తండ్రి ఎవరు అని అడిగితే సూర్యుడ్ని చూపితే ఎవరు నమ్ముతారు? రేపు ఈ బిడ్డ పెద్దవాడై తన తండ్రి గురించి ప్రశ్నిస్తే వేరే గ్రహానికి తీసుకుని వెళ్లాలా? అనే నిస్సహాయ స్థితిలో తనను తాను వోదార్చుకోలేని స్థితిలో పడిపోతుంది.

''కొన్నిసార్లు కొన్ని నిర్ణయాలు/ ఎవరికీ అవకాశం ఇవ్వవు/ వాటి ప్రతిఫలాలకి విధి అనే పేరు పెట్టి వదిలేస్తారు అంతే '' అనే భావం వాస్తవం అనిపిస్తుంది

అయితే విషయం తెలిసిన తల్లితండ్రులు, స్నేహితులు, భయపడిపోయి నువ్వు పెళ్ళీడుకొచ్చిన పిల్లవి. నీకు కళంకం ఏర్పడుతుంది. వాడిని వదిలేయమంటున్నారు. ఆ పసిబిడ్డ రేపు పెద్దవాడై తనను అడిగే ప్రశ్నకు సమాధానం చెప్పగలదా? అని భయంతోనే వదిలేస్తుంది. కానీ అప్పుడు కుంతి ఎంతో మధన పడిపోతుంది. ఏమి? మహర్షికి సేవ చేయమని చెప్పేటప్పుడు తన పెళ్ళీడు వయస్సు గుర్తుకు రాలేదా? అవసరం ఒకటే కనిపించిందా? అని ఎంతో మధన పడిరది.

చు''ట్టుతా ఒక గీత గీసి/ ఇదే రాచరికపు మర్యాద అన్నప్పుడు/ తండ్రి ఇచ్చిన బాధ్యతకు ఉలిక్కిపడిరది/ రాచరికం అప్పగించిన బాధ్యత/ఊహించని మలుపు తిప్పిన జీవితం/ నేర్పిన మొదటి పాఠం''

సమయం, హృదయాన్ని తెలుసుకోవడానికి కొంత సమయం కొంత పరిచయం కావాలి గుండెల్లో దాచుకున్న గాయం మానిపోవడానికి కొంత ఊపిరి కావాలి. దొరకని సమయాలలో మనసు ఆలోచనలతో కొట్లాడుతూనే ఉంటుంది.

''కొన్ని సార్లు ఎందుకో అసహజంగా / మనల్ని మనమే బంధించుకుంటామేమో''అనిపిస్తుంది అంటారు

''అపరిచితపు రాచరికపు ప్రపంచంలో/ బళ్ళకొద్దీ కానుకలతో పడే అడుగులకి/ సందేహమే కానీ శాంతిలేదు/ పెళ్లి చేసుకున్నాక తన వెంట బండ్లతో కానుకలున్నాయి. పట్టుచీరలున్నాయి. నివసించేందుకు రాజభవనం ఉంది. కానీ ఒక స్త్రీకి కావాలసినంత శాంతి లేదు. అని చెప్పడంలో ఉపయోగించిన ఈ వాక్యాలు ఎంతో ఆర్ద్రంగా అనిపిస్తాయి.

ఉలికిపాటు స్పర్శలో / చేజారిన స్వప్నాలు రాలిపోయాక/ ఎవరి కళ్ళల్లోకి చూడలేని/ఒక అనాధతనం/ కాళ్ళకు బంధనాలు వేసింది''

అలాగే మరోచోట మేధావుల్ని సైతం ఆలోచించే వాక్యం చూడండి ''రాత్రి హింసకి శరీరాన్ని సిద్ధం చేసుకోవాలి'' వంటి పదునైన పదప్రయోగాలు మనం ఈ గ్రంథంలో గమనించవచ్చు.

ఆ తర్వాత కుంతి జీవితంలో ఘట్టం పెళ్ళి..ఆ వార్త తనని ఆనందపెట్టలేదు''పెళ్ళి చేసుకోవడానికి కొంత ఇష్టం/ కనీసం ఆలోచించుకోవడానికి సమయం, కావాలంటారు .. ఆ కాలాల్లో అంత సమయం స్త్రీ కి ఇచ్చేవారు కారు.. కానీ స్త్రీ

తన వివాహానికి తన అనుమతి తీసుకుంటే బావుండేది అనేది ఉంటుంది అని చెబుతారు కవయిత్రి

మరోచోట ''కాలం తీర్పు గమ్మత్తుగా ఉంటూనే/ కొన్ని జీవితాలను అర్థంకాని రస్తాలో/ వదిలేస్తుంది'' అంటారు. మనసుకు నచ్చని వివాహం చేసుకున్నాక ఆ ఇల్లు, ఆ వాతావరణం అంతా ఒక శూన్యంలా ఉంటుంది. రణగొణ ధ్వనులను వినిపించే ఒక చౌరస్తాలా అనిపిస్తుంది అంటారు.

కానీ ఏం చేద్దాం ..? ఇప్పటిలా వదిలేసి వెళ్లడం అప్పుడు లేవు. అప్పటి వివాహాలు ఎలాగైనా కలిసి బతకడానికే. ఇప్పటి వివాహాలు ఏదోఒకటి చేసి బయటపడటానికే అన్నట్లు ఉన్న ఈ పరిస్థితుల్లో ఆ కన్నెపిల్లలో కలిగిన భావాలను తెలిపే తీరులో ఈ కవయిత్రి చేసిన ప్రయోగాలు చూడండి..

ఇంకో చోట శృంగారంలో మరణించిన దేహాన్ని/ సాంబ్రాణి ధూపంలో పొగలు కమ్మిన / యవ్వనాన్ని జీవింపజేయడం ఎలాగో తెలియక/ మొదటి రాత్రిని కావలించుకుని/ వెక్కి వెక్కి ఏడుస్తూ/ గోడమీద వాలిన బొమ్మని/ అడుగుతోంది కుంతి'' ఇక్కడ పాఠకుడు ఉలిక్కిపడేటంత భావాన్ని వ్యక్తీకరిస్తారు.

శృంగారంలో మరణించడం అనే మాటకంటే కవిత్వంలో మరో మాట లేదేమో అనిపిస్తుంది. ఈ మాట వాడటం నిజంగా ఈ కవయిత్రి సాహసమే చేసారు అనిపించేలా ఉంది.భర్త ఎంత గొప్పవాడైతేనేం..? వివాహం అయ్యాక ఒక స్త్రీకి అమ్మను కావాలనే తపన ఉంటుంది. కానీ తనకు తల్లయ్యే భాగ్యం లేదని గ్రహించాక

ఆమె మనసులోని మాటలు ''అధికారం విసిరిన ద్రోహపు రాయిని/ శబ్దం చేయకుండా నదిలోకి విసరడం ఎలా?/ ఈ నష్ట వీరుడిని ఏం చేసుకోవాలి?'' అనడం ఎంతో ఔచిత్యంగా ఉంది..ఇక్కడ రేణుక వాడిన గొప్ప పద ప్రయోగం ''నష్టవీరుడు''

ఇలా ప్రతి చోట సరికొత్త భావాన్నో, సరికొత్త పదప్రయోగాన్నో ప్రయోగించడం కవయిత్రి రేణుక గ్రంథం లో గమనిస్తాము . బాధను వ్యక్తీకరించినా, సంతోషాన్ని ప్రకటించినా ఉపయోగించి పదశైలి విభిన్నరీతిలో ఉండాలనుకోవడం వీరి ప్రత్యేకత.

''ఒక్కోసారి కొన్ని మాటలు/ జీవితం కింద మంట పెడతాయి/ ఆ మంటలో కాలిపోయిన ఒక హృదయం/ సమాజానికి అద్దంలా నిలబడుతుంది'' ప్రణయ ప్రయాణం మొదలవ్వక కాలాన్ని మింగేస్తుంటే / చెవిలో అన్న మాట నువ్వు సరైన ఆడదానివి కావని!''

''హింస మత్తుని, భ్రమని, కొనుగోలు చేసాక/ శరీరంలో ఆత్మలో తేజస్సు ఎక్కడుంటంది? / ఎవరున్నారు ఎవరూ లేరు/ఒక అపరిచిత ప్రశ్న వోడిపోతూ గెలుస్తూ చుట్టూ తిరుగుతోంది''

''ఎందుకీ ఆత్మలేని దేహంతో ఆటలు?/ కుంతి కళ్ళల్లో సందేహం/ పన్నీటి పాత్రలో బింబమై తేలుతోంది'' ''కొన్ని సమయాలు రాత్రిని అనుభవించిన స్వప్నాల్ని/ కడిగేసి ఖాళీ జీవితాల్ని నిలబెడతాయి''

మాద్రి సతీ సహగమనం చేసాక కవయిత్రికి కలిగిన భావాలు ''ప్రపంచ సౌందర్యంలో/ స్త్రీ దేహానికే మరక అంటుకుంటుంది/ తవ్వీ తవ్వీ బయట పడ్డ పుర్రెలకి/ వ్యభిచారి అనో/ హంతకి అనో/ పతివ్రత అనో/ బిరుదులుంటాయి'' అంటారు. అంతే కదా .. స్త్రీ ఎంతగా పాటుపడిన చివరికి మిగిలేది అనేలా రచించారు ..

Finally.. Everyone has experiance that this material pleasure comes to an end. Spiritual enjoyment, however, does not end., Rather it increases, That is the difference..

కొన్ని కవిత్వాలు ప్రశ్నలుగా ఉండిపోతాయి. కొన్ని సమాధానాలు కూడా ఇస్తాయి. కొన్ని సామరస్యాన్ని తెస్తాయి. కొన్ని సమస్యల్ని సృష్టిస్తాయి. కొన్ని పరిష్కరిస్తాయి. ఆయా కవుల ఆలోచనల్ని అనుసరిస్తూ ఏదయినా రమ్యంగా అక్షరీకరించడమే కవిత్వ ఉద్దేశ్యం. ఆ విషయంలో కవయిత్రి రేణుక అయోలా తమదైన ముద్రను తాము సాధించుకున్నారనే చెప్పాలి. విషయ విపులీకరణతో పాఠకుల్ని ఆకట్టుకోవడమే ప్రయోగాల ఉద్దేశ్యం. ఆ రకంగా ఆలోచిస్తే ఈ గ్రంథం ఆసాంతం సరికొత్త ప్రయోగం. యుగాలు దాటుతున్నా స్త్రీ జీవితంలో మార్పులేదు. తాము కట్టుకున్న బట్టల్ని తామే తగలపెట్టుకుంటూ అవే వెలుగులు అని భావించే తీరులో మార్పు వస్తే తప్ప ఎప్పటికీ స్త్రీ పరిస్థితిలో మార్పురాదు అనేది నా ఉద్దేశ్యం. కవయిత్రికి నా అభినందనలు..

వ్యాసం

# హిజాబ్ ఎందుకు అభ్యంతరమైంది ?




**తిరునగరి దేవకీ దేవి**

**9949636515**


ప్రాఫెట్ మహ్మద్ కాలంలో ముస్లిం స్త్రీలు చాలా స్వేచ్ఛగా ఉండేవారని ...డ్రెస్ కోడ్ నియమాల నిబంధనలు లేవని...అర్ధరాత్రి కూడా స్త్రీలు స్వేచ్ఛగా ఉండేవారని చెప్తారు. ఒకానొక కాలంలో స్త్రీలపై జరిగిన అత్యాచారాలను పురస్కరించుకొని సమాజం ఆందోళన పడ్డది.అదే సందర్భంలో ఏంజిల్ జిబ్రాయిల్ ప్రాఫెట్ మహ్మద్కు " ప్రవక్తా ! నీ భార్యలను...కుమార్తెలను..విశ్వాసమైన స్త్రీలను వారి శరీరాలపై అంగీలను గీయమని(draw).అడగండి. ఈ విధంగా వారు సద్గురువులుగా గుర్తించబడు తారు.మరియు వేధింపులకు గురికాకుండా ఉండే అవకాశముంది .(ఖురాన్ : 33.59) " ప్రాఫెట్ ఆ విషయాన్ని ప్రజలకు బోధించాడనీ ఆ క్రమంలో ముస్లిం స్త్రీలు తమ వెంట్రుకలు కనపడకుండా తలకు కట్టుకునే వస్త్రమే హిజాబ్ అని అంటారు..ఐతే కొందరు శరీరాన్ని పైనుండి కింది వరకు (కళ్ళు మినహా ) బురఖా గా కప్పుకుంటారు. మరి కొందరి బురఖాల ధారణలో ముఖం కనపడుతుంది.ఆ వస్త్రం రంగులలోనూ వాళ్ళ ఇష్టాన్ని అనుసరించో నమ్మకాన్ని అనుసరించో తేడాలు ఉన్నై. అంతేకాదు దేశాలననుసరించి కూడా విభిన్నత్వం కనబడుతుంది.

పై విషయాన్ని విన్నపుడు ప్రాఫెట్ కు జిబ్రాయిల్ కు గల సంబంధం ఏమిటి అన్న ఆలోచన వస్తుంది. ఏంజిల్ జిబ్రాయిల్ అల్లా నుండి తెచ్చిన సందేశం.. ఖలీల్ జిబ్రాయిల్ ఆయా సందర్భాలలో చెప్పిన విషయాలను ప్రాఫెట్ ప్రచారం చేసేవాడని ..ప్రాఫెట్ కు చదువు రాకపోవడం వలన ఆయన అభ్యర్థన మేరకు జిబ్రాయిల్ తాను చెప్పిన విషయాలనే తిరిగి క్రమబద్ధం చేసి రాసిందే ఖురాన్ అంటారు.

ఇక దానిని లేక వాటిని అనుసరించడం అన్న విషయానికి వస్తే విభిన్నంగా కనబడుతున్నది. కొందరు స్త్రీలు దానిని మాన్డేటరీగా భావిస్తే....మరి కొందరు తమ ఐడెంటిటీగా ధరిస్తున్నరు. ఇంకొందరు కుల పెద్దల ఆంక్షలతో ధరిస్తున్నరు. అంటే పితృస్వామ్యం విధించిన చట్రంలో భాగంగా వాళ్ళ అలవా టు కొనసాగుతున్నది.

ప్రస్తుత విషయానికి వస్తే కర్నాటక లో ఓ ప్రభుత్వ పాఠశాల లో హిజాబ్ ధరించి రాకూడదనే అంశాన్ని కొత్తగా తెరమీదికి తెచ్చింది. 2021 డిసెంబరు 31 వరకు అభ్యంతరం కాని హిజాబ్ అంశం 2022 జనవరి ఒకటిన అభ్యంతరమైంది. మొదట షిమోగా ప్రభుత్వ పాఠశాలలో మొదలైన ఈ సమస్య మాండ్యా..బాగల్ కోట..ఉడిపి మొదలుకొని కర్నాటక రాష్ట్రమంతటా పాకింది. విద్యార్థినులు స్కూల్ యునీఫాంను ఫాలో అవుతూనే పైన హిజాబ్ ను ధరిస్తున్నారు. కాలేజి నిబంధనలలో హిజాబ్ ధరించవచ్చనే నిబంధన ఉందని అకస్మాత్తుగ / కొత్తగా దీనిని వ్యతిరేకించడమెందుకని షిమోగా విద్యార్థినులు ప్రశ్నిస్తున్నారు. న్యాయంగా ఏవేని కొత్త నిబంధనలు అకడమిక్ ఇయర్ ప్రారంభంలో పెట్టడం సాధారణంగా జరుగుతుంది. కాని ఇంచుమించు సిలబసులు ఐపోయి పరీక్షలు దగ్గరవుతున్న సమయంలో ఈ హిజాబ్ వ్యతిరేకతకు రాజకీయమే కారణమంటున్నారు విజ్ఞులు. దానిని వ్యతిరేకించీ తీరాలనే కక్షతోనే ఎన్నడూ లేంది కాషాయ కండువాల ప్రదర్శన మొదలవడమే కాదు..హిజాబ్ ను అడ్డుకోకపోతే మేము కాషాయ కండవాలతో వస్తామని ప్రతిపక్ష విద్యార్థులు భీష్మించుకున్నారు. ఆ విషయాన్ని అడ్డం పెట్టుకొని ఎవరూ మతపర చిహ్నాలతో రాకూడదని విద్యాశాఖ మంత్రితో సహా స్కూళ్ళ ప్రిన్సిపాల్స్ ..తెగేసి చెప్తున్నారు. దీనికి ప్రభుత్వం వంత పాడుతున్నది. ఆ తర్వాత హిజాబ్ తో రావొచ్చు కాని వాళ్ళకు తరగతులు వేరుగా నిర్వహిస్తామనే కొండి పెట్టిన్రు.

ఉడిపి కళాశాల ప్రిన్సిపాల్ . అది తమ ఆత్మాభిమానాన్ని దెబ్బతీయడం గా ముస్లింలుభావిస్తున్నారు.

భారతదేశం మతాతీతమైనదని మన రాజ్యాంగం చెపుతున్నది . ఐనప్పటికి మనదేశంలోని విద్యాలయాలే కాకుండా అనేక సంస్థలలో ప్రారంభోత్సవాలలో.. జాతీయపండుగలప్పుడు....ఇంకా అనేక సందర్భాలలో హిందూ సంప్రదాయ ప్రకారంగానే పూజలు జరుపుతుంటారు. ఈ విషయాన్ని నేను నా చిన్నతనం నుండి ఆలోచించేదానిని. మరీ ముఖ్యంగా తెలంగాణాలో మన పాత్రం వాళ్ళు ముస్లింల వేషధారణను అనుకరించేవాళ్ళు. అంతేకాదు పీర్లపండుగలో అభిమానంతో పాల్గొనేవారు. దర్గాలను దర్శించేవాళ్ళు. మతవాదులు సమస్యలు సృష్టించినా ...సాధారణ జనం అన్యోన్యంగా ఉండేవారు. పైగా మనరాజ్యాంగం ఆర్టికల్ 19 భావ ప్రకటనా స్వేచ్ఛను ఆర్టికల్ 21 మత స్వేఛ్ఛ గురించి చెప్తుండగా ఈ రాద్ధాంతం ఎంత వరకు సమంజసం ? జనవరి 31 న ఉడిపికి చెందిన అమ్మాయి కర్నాటక కోర్ట్ లో హిజాబ్ ఎందుకు ధరించగూడదంటూ వేసిన పిటీషన్ ను బ్రాహ్మణుడైన దేవదత్ కామత్ వాదిస్తూ " ఒకవేళ నా కొడుకు నామం పెట్టుకొని స్కూల్ కు పోతే స్కూలు అనుమతించిందా? ....ఈ. మత సంబంధ మైన విషయానికి రాష్ట్ర ప్రభుత్వానికి గల సంబంధం ఏమిటి? " అని ప్రశ్నించారట. ఐనా ఈ హిజాబ్ ను అడ్డగించే వారికి గతంలో కేంద్రమంత్రిగా పనిచేసిన ఉమాభారతి ప్రస్తుతం ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి ఐన యోగి ఆదిత్యనాథ్ కాషాయ వస్త్రాలతోనే చట్టసభలలో పాల్గొంటున్న విషయం ఎందుకు విస్మరిస్తున్నారు?. అంతేకాదు అయ్యప్ప భక్తులు ..శివభక్తులు ..దుర్గామాత భక్తులు ఆయా దీక్షలు తీసుకొని తత్సంబంధ మైన బట్టలు వేసుకోవడాన్ని తెలియనట్లు నటించడం ఎంత వరకు సమంజసం ? . మంత్రులుగా చేసిన ప్రమాణాలను బహిరంగంగా విస్మరించడమే కదా! ఇదంతా కళ్ళుమూసుకొని పిల్లి పాలు తాగిన చందంగా ఉంది. అకస్మాత్తుగా ఎన్నికల సమయంలో ఈ రగడ సృష్టించడం కేవలం ఓట్ల రాజకీయమని వేరే చెప్పాల్సిన పని లేదు..నాయకులంటే మార్గదర్శకులు. మతపరమైన వివక్షకు బాటలు వేయడం ఎంత వరకు సబబు. ఒకవైపు హిజాబ్ ను ధరించడం శాంతి విఘాతమంటూ వాళ్ళే ఆ శాంతి విఘాతానికి పూనుకోవడం . ఇది ప్రభుత్వానికి ఏ మాత్రం తగినది కాదు. ప్రపంచం గర్హించే చర్య. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం అధికారులు విజ్ఞతతో మసలుకోవడం మంచిది.

కవిత

# సానిటరి ప్యాడ్స్




- వితలాపురం పుష్పలత
మొబైల్: 9573162399


కంటికింపుగా కనపడినా
లోపల కల్లోల కడలియే..!
కడుపులోన పేగు మెలిపెట్టి తిప్పుతుంటే
పైనపానం పైనే పోతున్నట్టుంటది..!

అంతవరకు
లేడిపిల్లలా గంతులేసినా
ఒంట్లోని సత్తువంతా
ఎవరో గుంజేసుకపోయినట్టు
ఒక్కసారిగా శరీరం పానమున్న పీనుగైతది..!

ఆధారంలేనిదే నడుము వాలదు
పరుపులో ఉన్నా మెలకువే
నిద్రపట్టామా తడిలేపి కూర్చోబెడతది..
కళ్ళలోని బాధను
మనసులోకి ఒంపేసుకుని
చేయూతనిచ్చే
మనసున్న మనుషులు కావాలి..!

అదో సహజప్రక్రియే కానీ
నలుగురితో పంచుకోవడానికి
నామోషీగా ఫీలైతరు..
బాధ శరీరాన్ని నలిపేస్తున్నా
పెదవిమాటున దాచేసి
చిరునవ్వు అతికించుకొని
సాగిపోయే మగువలోవైపు..

మహిళల ఆత్మగౌరవాన్ని కాపాడే
ఇంత గుడ్డముక్కకు నోచుకోక
వీధులంతా కలియ తిరిగే
అతివలున్న దేశం నాది.

ఊదరగొట్టే పథకాలకన్నా..
మహిళల ఆత్మ గౌరవాన్ని కాపాడే
సానిటరీ పాడ్స్ కావాలిప్పుడు..!

కథ

# బంగారు భూమి



- వనజ తాతినేని

పళ్ళు తోముకుంటూ పై  అంతస్తులో నుండి కిందకి చూసింది లావణ్య. అత్త వర్ధనమ్మ  పశువుల శాల పక్కనున్న ఇనుప జల్లెడ కోళ్ళ గూడును తెరిచింది. కోళ్ళన్నీ బిల బిల బయటకు పరిగెత్తాయి. చద్దన్నంలో ఆవకాయ కారం కలిపి తీసుకొచ్చిన గిన్నె చేతిలోకి తీసుకుని అన్నాన్ని నలువైపులా వెదజల్లింది. అవి తింటూ వుంటే  ఆమె తదేకంగా వాటినే చూస్తూంటే " అవి ఒట్టి అన్నం తినవా నాయనమ్మా! వాటికి కూర కలపకుండా కారం యెందుకు కలిపావు? పాపం కోడిపిల్లలకు మంట పుట్టదూ, రేపు నెయ్యేయి" అన్నాడు చిన్న మనుమడు కార్తీక్. ఆమె నవ్వుకుని మనుమడిని యెత్తుకుని ముద్దు పెట్టుకుంది.  ఇదిగో యీ మాయ ప్రేమలు కురిపించే ఆమె పిల్లలనూ తన పిల్లలనూ కూడా జారిపోనీయకుండా భద్రంగా గుప్పిట్లో పెట్టుకుంటుందని పళ్ళు నూరుకుంది లావణ్య. "తెల్లారిందా గొడ్ల చావిట్లో తిరగడానికి. పైకి రా, బ్రష్ చేసుకుందువుగాని" అని  కొడుకుని గట్టిగా పిలిచింది.

పాలేరు షెడ్ శుభ్రం చేస్తుంటే గేదెలకు చిక్కని కుడితి తాపించింది వర్ధనమ్మ.  పాలు పిండి ముందు పాలని ఒక కేన్లో పోసిచ్చి అమ్మకు యిచ్చిరా అని  కార్తీక్ కి యిచ్చి పైకి పంపింది. ఎనక తీసిన పాలను ఇంకో కేన్లో పోసింది. పాలేరొచ్చి యింకో గేదె పాలను తీసి కేన్ లో పోసాడు. నువ్వు టీ తాగి పొలమెళ్ళు. కేంద్రానికి పాలు వంశీ బాబు తీసుకెళుతాడు లే అని అతన్ని తొందరజేసింది. తర్వాత ఆవుపాలు తీసుకుని పైకొస్తుంటే కొడుకు నరేష్ పాలేరు కలసి పొలానికి వెళ్ళడానికి కిందకి వస్తూ ''అమ్మా..  వూర్లో వాళ్ళు బీర గింజలకు వస్తారు మానిక పదిహేను వందల లెక్కన యిచ్చేయి'' అన్నాడు. అంత తక్కువకా అన్నట్టు ఆశ్చర్యంగా ముఖం పెట్టింది. మరో మాట మాట్లాడే అవకాశం లేకుండా మోటర్ సైకిల్ పై పాలేరుని యెక్కించుకుని వెళ్ళిపోయాడతను.

వంటగట్టుపై పాల తపాళ పెట్టి.. "మానిక మూడు వేలు లెక్కన కొనుక్కొచ్చి అందులో సగం రేటుకు యివ్వమంటాడు వీడికేమైనా పిచ్చి పట్టిందా యేంటి" అంది కోడలితో.

కోడలు ఆ మాటకు యేమి మాట్లాడకుండా "పాలు పాలేరు యిచ్చి వచ్చేవాడు కదా'' అంది. "పిల్లలకు చిన్న చిన్న పనులు చెప్పాలి. వాళ్ళు పని నేర్చుకుంటారు. పాలు కొలవడం పోసుకొనేటపుడు లెక్కపెట్టడం రీడింగ్ చూసుకోవడం ఇవి మాత్రం చదువు కాదేంటి'' అంది.అసంతృప్తిగా ముఖం పెట్టి ఆమెకు మామగారికి కాఫీ కలిపిచ్చి పిల్లలకు పాలు కలిపి తను గ్రీన్ టీ తీసుకుని హాలులోకి వచ్చింది లావణ్య.

వంశీ తాతతో కలిసి డాబాపై ఎండబోసి పెట్టిన బీర గింజలు తీసుకొచ్చి వరండాలో గుమ్మరించి చచ్చు గింజలను సన్న గింజలను యేరిపారేస్తూ కనిపించాడు. పిల్లలిద్దరికీ పాలు తాగించి వారికి పాల కేన్ యిచ్చి పాలకేంద్రానికి పంపింది వర్ధనమ్మ.

మామగారు టిఫిన్ బాక్స్ లు తీసుకుని చేలోకి వెళుతుంటే నేనూ వెళతానని బయలుదేరుతున్న కొడుకుతో.. " అబ్బాయ్ వంశీ! నువ్వు కూడా మీ నాన్నలా తయారైతావా యేమిటి? పుస్తకాలు అంటుకోకుండా చేను చెట్టు గొడ్డు గ్రాసం ట్రాక్టర్ దుక్కి సాళ్ళు అంటూ తెగదిరుగుతున్నావ్. మీ పెదనాన్నలా అమెరికా వెళ్ళి వుద్యోగం చేయవా" అనడిగింది లావణ్య.

''అమ్మా! నువ్వసలు ఆ మాటన్నావంటే వూరుకోను. నేను అసలు ఆ అమెరికా వెళ్ళే చదువులు చదవను ఆ వుద్యోగం చేయను. రోజూ చేలోకెళ్ళి వ్యవసాయం నేర్చుకుంటా. నాకిదే బాగుంది. నువ్వు రోజూ యిదే మాటంటే నేనసలు బుక్ పట్టుకోను నన్ను కొట్టినా సరే'' అని విసురుగా వెళ్ళిపోయాడు వంశీ. ఆ మాటలు చెప్పిన కొడుకు తీరుకు విస్తుపోయింది

లావణ్య.

వీడికి రోజు రోజుకు తిక్క పెరిగిపోతుంది ఆన్లైన్ క్లాసులకు అటెండ్ అవకపోతే యెలా అనుకుంది. ''మీ అబ్బాయికి సబ్జెక్టు కంప్లీట్ అవదు. నెక్స్ట్ క్లాస్ కు ప్రమోట్ చెయ్యలేం. ఇప్పటికే మీ అబ్బాయి స్టడీస్ లో చాలా డల్'' ఓపికగా చెప్పింది టీచరు. కొడుకు బదులు క్లాస్ కు తెర మీద ప్రత్యక్షమైన లావణ్యను చూసి.

''ఈ వొక్కరోజుకే లెండి. రేపటికి యెలాగోలా బుజ్జగించి క్లాస్ కి కూర్చోబెడతాను. ఏ లెసన్ చెబుతున్నారో చెపితే నేను సాయంత్రం చదివిస్తాను'' అన్న లావణ్యను చూసి మనసులో విసుక్కుని లెసన్ నెంబర్ చెప్పింది టీచర్.

సాయంత్రం చేను నుండి వచ్చిన వంశీకి స్నానం చేయించి అత్తమామలతో పాటు ఛానల్స్ ముందు కూర్చోనీయకుండా పుస్తకాల ముందు కూర్చోబెట్టే ప్రయత్నాలన్నీ వీగిపోయాయి లావణ్యకు. మనుమడు చెబుతున్న పొలం కబుర్లన్నీ విని మురిసిపోతూ మరిన్ని విషయాలను వాడి బుర్ర కెక్కిస్తుంటే వుడికిపోయింది.

"ఎపుడూ యివే ముచ్చట్లా మీకు. కొడుకును యిట్టా తయారుచేసింది గాక మళ్ళీ వీడినికూడా అట్టాగే తయారు చేయడానికి చూస్తున్నారు. అసలీ మట్టి పిసుక్కోవడంలో అంత ఆనందం యేముందండీ? ఎకరాలు వున్నాయని చెప్పుకోవడమే కానీ పొద్దస్తమానూ కష్టపడటమే గాని యిందులో మిగిలేదమన్నా వుందా చచ్చిందా? ఎపుడూ తవ్వుకోవడం పూడ్చుకోవడం. పిల్లలకు బాగా చదువుకోవాలని చెప్పడం పోయి ఆ పొలం అట్టా ఈ పొలం ఇట్టా అని చెప్పి వ్యవసాయం నూరిపోస్తున్నారు. వీళ్ళను తీసుకెళ్ళి హాస్టల్ లో పడేస్తేకానీ మాట వినరు " అని వంశీకి రెండు తగిలించి బరబరా వేరే గదిలోకి లాక్కుపోయింది.

"వాడు చదువుకుంటానంటే మేము వద్దన్నామా, అయినా వాడేమన్నా అయ్యేయస్ లు అయ్పీయస్ లు చదువుతున్నాడా? చిన్న పిల్లాడు, చదివేనాటికి వాడే చదువుతాడు.మా పిల్లలిద్దరూ అట్టా చదివినోళ్ళు కాదూ "అంది అత్త గారు.

నరేష్ ట్రాక్టర్ పనిచేసిన లెక్కలు రాసుకుని విత్తనాల సేకరణ గురించి మాట్లాడి ఇరుగుపొరుగు రైతులతో ముచ్చట్లు రాజకీయాలు అన్నీ ముగించుకుని ఇంట్లోకి వచ్చేటప్పటికి తొమ్మిది దాటిపోయింది. స్నానం భోజనం ముగిసేటప్పటికి మరో అరగంట. అప్పటిదాకా ఓపిక పట్టిన లావణ్య నోరు విప్పి భర్త ముందు గట్టు తెగిన ప్రవాహమే అయింది.

''మీరు పిల్లలను రోజూ యిలా వెంటేసుకుని తిప్పితే వారికి అక్షరం ముక్క రాదు. ఇప్పటికే వచ్చిందంతా మర్చిపోతున్నారు. ఒక్క పదం కరెక్ట్ గా రాయలేరు చదవలేరు. అన్నీ స్పెల్లింగ్ మిస్టేక్ లే! అసలు చదువు మీద శ్రద్ధ లేదు. ఈ సంవత్సరం కూడా స్కూల్ మాములుగా నడవకపోతే వాళ్ళకు ఫీజులు కట్టడం కూడా దండగ. పిల్లలను పొలాలెంట తిప్పొద్దు అంటే మీరు వినరు.తొమ్మిదేళ్ళ పిల్లాడు రాజకీయాలు కూడా మాట్లాడుతున్నాడు. ఇట్టా వుంటే నేను అస్సలు ఊరుకోలేను. సిటీలో కాపురం పెట్టి చదివిచ్చుకోవాలి లేదా పిల్లలను హాస్టల్ లోనైనా వెయ్యాల్సిందే '' అంది.

నరేష్ యేమి మాట్లాడలేదు. అతనంతే! ఎక్కువ మాట్లాడడు. చెప్పాల్సింది వొక్కసారే చెబుతాడని లావణ్య కు తెలుసు కాబట్టి అంతకుముందొకసారి చెప్పినదానిని మరొకసారి గుర్తు చేసుకుంది.

'పిల్లలు చదివి ఉద్యోగాలు చేయకపోతే వాళ్ళు బతకలేరా. ఏం మనం బాగా బతకడం లేదా? ఎపుడూ సిటీ సిటీ అని మోజు పడతావ్. ఏం తక్కువైంది నీకు? పట్టణంలో వుండే సౌకర్యాలతో అంత కన్నా ధీటుగా అరవై లక్షలతో కట్టిన యిల్లు నౌకరులు పాడి పంట ధనం ధాన్యం అన్నీ వున్నా యేదో లోటు వున్నట్టు ముటముట లాడిపోతావు. పిల్లలు ప్రకృతిలో పెరగాలి. పొలాల్లో తిరగడం వ్యవసాయపు పనులు యెలా చేస్తున్నారో చూడటం నేర్చుకోవటం కూడా విద్యే. నేచులర్ సైన్స్ అది. ఇక ఇంగ్లీష్ చదువులంటావా? ఏం మా అన్న నేను పదవతరగతి వరకూ తెలుగు మీడియంలో చదివి తర్వాత ఇంగ్లీష్ మీడియంలో చదివి వాడు సాఫ్ట్వేర్ ఇంజినీర్ అవలేదా నేను ఎమ్ పార్మసీ చెయ్యలేదా. నువ్వు ఊగినట్టు నేనూ ఊగి అమ్మ నాన్నలను వొదిలేసి పొలం కౌలుకిచ్చేసి ఏ హైదరాబాద్ లోను ఉద్యోగం చేసుకుని బతకొచ్చు. ఉద్యోగాలు చేసేవాళ్ళు యింతకన్నా యేం బావుకుని తింటున్నారు. నాణ్యమైన పాలు దొరకక కూరగాయలు దొరకక దోమలతో కుట్టిచ్చుకుంటూ అగ్గిపెట్టెలాంటి గదుల్లో బతకడమేగా. ఇక్కడున్న గౌరవం తృప్తి అక్కడ వుంటాయా? ఆలోచించుకుని అసంతృప్తిని తగ్గించుకుంటే యిల్లు ప్రశాంతంగా వుంటుంది అని. అతని మాట అప్పుడేనా యెప్పుడైనా అదేనని ఆ మౌనానికి అర్థం అదేనని అర్దమై నిట్టూర్చింది.

లావణ్యకు జీవితం పట్ల అసంతృప్తి పేరుకుపోతుంది. రేపుదయం అత్త తో మాట్లాడాలి అనుకుంది. లావణ్య మేనత్త హేమ ఇంటి విషయాల నుండి అంతర్జాతీయ విషయాల దాకా అరటి పండు వొలిచి నోట్లో పెట్టినట్టు మంచి చెడూ విశదీకరించి చెబుతుంది. పిల్లల చదువుల విషయంలో అత్త సలహా తీసుకోవాలి అనుకుని నిద్రకు ఉపక్రమించింది.

మర్నాడు మధ్యాహ్నం భోజనాలు అయ్యాక మేనత్త హేమకు ఫోన్ చేసింది లావణ్య. కుశల ప్రశ్నలయ్యాక ఆటోమేటిక్ గా వ్యవసాయం వైపు మళ్ళాయి కబుర్లు.

పట్టిసీమ నీళ్ళు పక్కనే పుష్కలంగా పారుతూ ఉన్నాయి అని సంబరపడ్డాము. రెండు పంటలూ పండితే పంటసిరి దంతసిరి వున్నట్టే అనుకున్నాం. నాలుగేళ్ళకే వరి పండించడం అనేది బుద్ధి తక్కువ పనని తెలిసొచ్చింది మాకు. ఖర్చులు చూస్తే తడిసి మోపెడు చేతికొచ్చేది చింకి చాటెడు. అందుకే ఈ సంవత్సరం రైతులందరూ కలసి చేపల చెరువులకు లీజుకు యిస్తున్నారు. ఎకరానికి నలభై వేలు అంట. నాలుగు సంవత్సరాలకు బాండ్ రాయించుకుని నాలుగోవంతు అడ్వాన్స్ తీసుకుని యిచ్చేస్తున్నారు అని చెప్పింది లావణ్య.

“అది యెట్టాగమ్మా!? బంగారం పండే పొలాల్లో చేపల చెరువులా?ప్రభుత్వం అనుమతి యివ్వొద్దూ, అయినా ఆ తర్వాత పంటలు పండవు పొలాలు చవకేసి పోతాయి. ఎందుకట్టా బంగారంలాంటి మాగాణి గడ్డనంతా పాడు చేసుకుంటున్నారు ఇంకోసారి ఆలోచించుకోండి.” అంది హేమ.

“ అసలు రైతుకు యేం మిగులుతుందత్తా? మగకూలీలకు రోజుకు ఎనిమిది వందలు ఆడకూలీలకు ఆరొందలు అంట. ధాన్యం తోలిన నాలుగు నెలలకు కూడా ప్రభుత్వం డబ్బులివ్వకపోయే. వ్యవసాయం చేసి చేతి చమురు వదిలిచ్చుకునే కంటే చెరువులకీయడమే నయం అంటున్నారు నరేష్. మేము నాలుగు యెకరాలిచ్చాం. అవి పిల్లల ఫీజులకి సరిపోతాయి. ఇంకా రెండు యెకరాల్లో ఆర్గానిక్ పద్దతిలో తినడానికి వరి వేస్తున్నాడు. ఎకరానికి యెనిమిది బస్తాలు లెక్కన పండుతున్నాయి. అవి యింట్లోకి సరిపోతాయి. ఈ వేసవికి రెండు యెకరాల్లో బీర వేసాము. పూత వచ్చిన దగ్గర్నుండి మందు కొట్టడమే. లేకపోతే పువ్వు పిందె అవకుండా రాలిపోవడమే. మందు రెండువేల ఐదొందలు మందు కొట్టిన కూలీకి ఐదొందలూ మొత్తం మూడువేలు. రోజు మార్చి రోజు మందు కొట్టాల్సిందే. రెండు లక్షలు వచ్చాయి. ఖర్చులకు లక్షా నలభై వేలు పోనూ మిగిలింది అరవై వేలు. రెండెకరాలలో అన్ని రకాల విత్తనాల పంట పెడుతున్నారు.పదెకరాల మిరప చేను పదెకరాల మొక్కజొన్న. మిరపలో మిగలడం అనేది లాటరీ తగిలినట్టే అనుకో. కాస్త పరవాలేనిది మొక్కజొన్న వొక్కటే. పాలేరుకు రెండు పూటలా భోజనం టిఫిన్ టీ లు, నెలకు ఇరవై వేలు జీతం. పనికి రానిరోజు కి జీతం యివ్వాల్సిందే. ట్రాక్టర్ డ్రైవర్ కు పద్దెనిమిది వేలు అదనంగా బేటాలు. వీళ్ళందరికీ వంట మనిషిలా వంట చేయాలి నేను అంది విసుగ్గా.

''అవునా.. పెద్ద కమతం అమ్మా మీది. ఖర్చులు కూడా యెక్కువే “ అని ఆశ్చర్యపోయింది హేమ.

''చూడటానికి ముప్పై యెకరాల జరీబు,పెద్ద యిల్లు, కారూ, బుల్లెట్, ట్రాక్టరూ మందీ మార్భలం. అత్తగారిని హాస్పిటల్ కు తీసుకెళ్లాలన్నా పిల్లలను హాస్పిటల్ కు తీసుకెళ్ళాలన్నా ఆయనకు యేనాడు తీరిక వుండదు.ఎప్పుడూ పనుల ఒత్తిడి! బస్సుల్లో ఆటోల్లో పడి నేను పోవాల్సిందే. పిల్లలు పొద్దున్నే ఏడింటికి స్కూల్ బస్ యెక్కితే సాయంత్రం పావు తక్కువ ఐదింటికి వచ్చేది. తీసుకెళ్ళేటపుడు తీసుకొచ్చేటపుడు బస్ లో పడి యెన్ని వూళ్ళు తిరుగుతారో. మొదట యెక్కి చివర దిగేది మా పిల్లలే. ఈ కోవిడ్ లాక్ డవున్ వల్ల పిల్లల చదువులు చట్టుబండలయ్యాయి. పుస్తకం అంటుకునే పని లేదు. పొద్దస్తమాను చేలల్లోనే.ఆర్గానిక్ వ్యవసాయం చేస్తాను బోలెడు డబ్బులు వస్తాయి అంటాడు పెద్దాడు. ఏటి ఈత లంక మేత చందాన. తల బొప్పి కట్టి పోతుంది పిల్లలతో. నాకు ఇంత సుఖం లేదూ సరదాలు అసలే లేవు'' అని అన్ని విషయాలు కలగాపులగంగా కలిపి చెప్పేసింది లావణ్య.

మేనత్త హేమ అంతా విని అనునయంగా మందలించింది “ఎందుకమ్మా అంత నిరాశ. భవిష్యత్ ను కలగనాలి. భవిష్యత్ లో నీ కొడుకు గొప్ప వ్యవసాయ శాస్త్రవేత్త అవుతాడేమో, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కాగలడమో! పిల్లలకు ఆసక్తి వున్న పనులలోనైతేనే రాణించగలరు. చదువులలో వెనకబాటు అంటావా! చిన్న తరగతులే కదా,ట్యూషన్ పెట్టించి శ్రద్ధ పెడితే త్వరగానే దారిలో పడిపోతారు. స్వతహాగా నీ పిల్లలు తెలివైన వాళ్ళు చురుకైన వాళ్ళూనూ. దిగులుపడకు”అని మంచి మాటలు చెప్పింది.

''ఎంత కష్టపడ్డా యెప్పటికైనా వున్న పొలంలో సగమే

కదత్తా మాకు వచ్చేది. మా బావగారు వాటా పంచుకోకుండా యెందుకు వూరుకుంటారు. ఏ రెండేళ్ళకో చుట్టం చూపుగా వచ్చిపోతారు. ఇక్కడ పెద్దవాళ్ళ అనారోగ్యాలు చూసుకోవాలి వ్యవసాయపు యిబ్బందులు పడాలి పెద్దవాళ్ళ పెత్తనాలు భరించాలి. అసలు యెన్ని వుంటయ్యో! వాళ్ళకు అన్ని కరెక్ట్ సమయాలకు జరిగిపోవాలి ఐదు నిమిషాలు ఆలస్యం అవకూడదు. ప్రతి దానికి వొంకలు పెట్టుద్ది మా అత్త గారు'' అంది లావణ్య.

''అమెరికా వాళ్ళు ఆస్థుల్లో వాటాలకు రారని చెప్పలేం. వస్తే వచ్చారులే. మనిషికి తృప్తి వుండాలమ్మా. నరేష్ కు పుట్టిన వూరు కన్న తల్లిదండ్రులు భూమి సెంటిమెంట్. అతనికి అందులో తృప్తి వుంది. కష్టమైనా నష్టమైనా వ్యవసాయం చేయడంలో అతనికి ఆనందముంది. ఇప్పుడు భూములకు రేట్లు పెరుగుతున్నాయి. వున్నదాంట్లో సగం వచ్చినా నీకు తక్కువేముందమ్మా. ఎవరి కష్టాలు వాళ్ళకుంటాయి. ఆ వాటాల గురించి ఆలోచించకు. ఇక పెద్దవాళ్ళంటావా, వాళ్ళు అలాగే వుంటారు లేమ్మా. మన అమ్మ నాన్నలను బాగా చూసుకోవడం లేదని తమ్ముడు మీద మనకు కినుక వుండదూ! అత్తమామలనే అమ్మనాన్న అనుకో. నరేష్ మంచోడు.వివేకం కలవాడు.తల్లిదండ్రులను నొప్పించలేక మౌనంగా వుంటాడు కానీ నిన్ను కష్టపెడతాడా చెప్పు.బట్టలుతకడానికి మనిషి ఇంటి పని చేయడానికి సహాయానికి మనిషి వుంటారు కదా. వంట చేసేసి నీకిష్టమైన పుస్తకాలు చదువుకో, టీవి చూడు. పైన రూఫ్ గార్డెన్ పెంచుకో. అసంతృప్తి పెట్టుకోబాకు. జీవితంలో బోలెడు కష్టాలున్నవాళ్ళున్నారు వాళ్ళతో పోల్చుకుని సంతోషపడు. నువ్వు కూడా టూ వీలర్ నడపడం నేర్చుకో. చేనుకు వెళ్ళు లేదా విటిపియస్ దగ్గర ఆర్గానిక్ ప్రొడక్ట్స్ అమ్మే షాపు పెట్టుకో. కూరగాయలూ పాలూ పెట్టవచ్చు. కారం పేకింగ్ లు చేసి ఆర్డర్ యిచ్చిన వాళ్ళకు పంపడం లాంటి పనులు చేసుకో. ఉత్సాహంగా వుంటుంది'' అని సర్ది చెప్పి అనుకూలమైన సూచనలు చేసింది.

"అంతేలే అత్తా! నువ్వు చెప్పింది కూడా బాగానే వుంది. నీతో మాట్లాడితే మనసు తేలికపడుద్ది ప్రశాంతంగా వుంటది. థాంక్యూ అత్తా"అంది.

నవ్వుకున్న హేమ "అసలు మీకున్న వసతి పొలం అండ దండ వుంటే మా అబ్బాయిని అమెరికా పంపేవాళ్ళం కాదు. పిల్లలను పంపి మేమెలా అలమటించి పోతున్నామో నన్ను మీ అత్తగారిని చూస్తూ కూడా నువ్వు అమెరికా అమెరికా అని కలవరిస్తావు యెందుకమ్మా. భూమిని నమ్ముకుని కష్టపడాలి ప్రయోగాలు చేయాలి. ఏ రంగంలో సవాళ్ళు లేవు చెప్పు? పట్టణాలలో ఎంత సంపాదించినా తినే తిండి పీల్చే గాలి అన్నీ కల్తీలై అనారోగ్యాలతో జనం అలమటిస్తున్నారు. పల్లెల స్వచ్ఛతను కాపాడుకుంటూ ఆధునిక వ్యవసాయం చేసుకోవాలి. అవన్నీ చేయలేకపోయినా స్వంతానికైనా పండించుకుని మంచి ఆహారం తినగల్గాలి. ముందు ముందు రైతే రాజు, అది మర్చిపోకు" అని తీపి ఆశ కల్గించింది.

మేనకోడలు తేలికైన హృదయంతో ఫోన్ పెట్టేసాక ఆలోచనలలో మునిగింది హేమ.

ఆర్గానిక్ ఫార్మింగ్ అని పలవరిస్తున్నారందరూ. అసలీ భూములను కాలుష్య రహితం చేయడం సాధ్యమయ్యే పనేనా? ఇన్నేళ్ళు విచ్చలవిడిగా రసాయన ఎరువులు కుమ్మరించి పురుగుమందులు వెదజల్లి కలుషితం అయిన నేలను శుద్ధి చేయడం అంత సులువైన పనా? ఆర్గానిక్ పద్ధతిలో పండిస్తే ఎకరాకు ఏడెనిమిది బస్తాలకు మించి పండటం లేదని యిపుడేగా చెప్పింది మేనకోడలు. పెద్ద రైతులు యేదో విధంగా వొక దాంట్లో పోయినా మరొకదాంట్లో సరిజేసుకుంటారు. చిన్నా చితక రైతు నిలబడేది యెట్టా? వాళ్ళు అప్పుల ఊబి నుండి బయట పడటం సాధ్యమేనా? అసలు ఆర్గానిక్ ఉత్పత్తులు అని అమ్మేవాటిలో నిజమెంత!?

ఇందాక తను చెప్పినట్టు నిజంగా రైతు రాజయ్యే రోజు వస్తుందా? కూలీ అయ్యే రోజు లేదా కార్పొరేట్ ఫ్యాక్టరీలలో దినసరి కూలీ అయ్యే రోజు వస్తుందా!? అసలు విచ్చలవిడిగా రసాయన ఎరువులు పురుగు మందులు చల్లిన పంటలు తిని మనుషులకు యెన్నెన్ని రోగాలు. ఆ విపత్తును తలుచుకుంటే వణికిపోయింది. దాని కన్నా కోవిడ్ 19 విపత్తు చాలా చిన్నది. పంచభూతాలను పిడికిట బిగించి వికృతంగా నవ్వుకుంటున్న మనిషి.ప్రపంచాన్ని అదుపులో పెట్టి మొట్టమొదట స్థానంలో వుండాలనుకున్న దేశం కుట్రో తప్పిదమో వైరస్ బారినపడిన పడి విలవిలలాడే మనుషులు. ఏముందీ,యెక్కడుంది వికాసం!? ఉత్థాన పతనాలలో మానవజాతి. విచారంతో ఆ రాత్రంతా హేమకు కంటి మీద కునుకే లేదు.

మర్నాడు సాయంత్రం వేళ పక్కింటి శాంతితో కలసి కూరగాయల దుకాణంకి వెళ్ళింది హేమ. అది హోల్సేల్

దుకాణం. ఆ ఊరులోనూ చుట్టు ప్రక్కల ఊర్లలోనూ పండించిన కూరగాయలను రైతులు అక్కడ ఎక్కువగా అమ్ముతుండటం వల్ల ఎప్పుడు చూసినా నవ నవలాడే కూరగాయలే వుంటాయి.

శాంతి వంకాయలు బెండకాయలు బీరకాయలు క్యాలీఫ్లవర్ క్యాబేజీ చిక్కుడుకాయలు పచ్చి మిరపకాయలు టమాటాలు కొంటూ వుంటే నాణ్యమైనవి ఎంచి తూకం గిన్నెలో వేయడానికి సాయపడింది కానీ హేమ తీసుకోలేదు. ఆఖరికి ఆకు కూరలు కూడా తీసుకోలేదు.

అది గమనించిన శాంతి "మీరేమీ తీసుకోవడంలేదు.. అన్నీ నేనే తీసుకుంటున్నాను. తీసుకోండి మీరు కూడా " అంది.

మీరు తీసుకున్న కూరగాయలన్నింటికి విత్తు నాటినప్పటినుండి ఎరువులు క్రిమి సంహారక మందులు వాడుతుంటారు.పిందె నిలవడానికి పుచ్చుపట్టకుండా పురుగు రాకుండా వుండటానికి విపరీతమైన పురుగుమందులు పిచికారీ చేస్తారు. ఇక రసాయన ఎరువులు సంగతైతే చెప్పనవసరమే లేదు. ఈ కూరగాయలు తింటే పోషక ఆహారం సంగతి అటుంచి కాలక్రమేణా వ్యాధుల బారిన పడతాం. మీకు తెలుసు కదా, నేను అల్సర్ తో ఎంత ఇబ్బంది పడుతున్నాను.

అందుకే వీలైనంత తక్కువ పురుగు మందులు చల్లి పండించిన కూరగాయలు తీసుకుంటాను.. అవి ఏమిటంటే .. రండి నేను కొనేటపుడు చూద్దురు గాని.. అంటూ తన వెంట తిప్పింది.

దొండకాయలు, మునక్కాయలు, దోసకాయలు, పచ్చి అరటికాయలు, కేరెట్, సొరకాయ, గుమ్మడికాయ, పొట్లకాయ గోరుచిక్కుడు కాయలు చిలకడ దుంపలు తీసుకుంది.

శాంతి ఆసక్తిగా చూస్తూ వుంది.తిరిగి వస్తూ మరిన్ని విషయాలు ముచ్చటించుకుంటూ నడక సాగించారు.

" శాంతీ! నేను ఏ కూరగాయను ముట్టుకున్నా మొక్క, చెట్టు, తీగ మొదళ్ళలో రసాయన ఎరువులు కుమ్మరిస్తున్నట్లూ పైన పురుగు మందులు పిచికారీ చేస్తున్నట్లూ అన్పిస్తూ వుంటుంది. కంచంలో అన్నం వడ్డించుకుని కూర్చుని ముద్ద నోట్లో పెట్టుకోబోతుంటేనూ అదే ఫీలింగ్ నన్ను వెంటాడుతుంది. అందుకే ఆచీ తూచీ కూరగాయలు తీసుకుంటాను. నగరంలో పుట్టి పెరిగి నగరాల్లోనే వుంటున్న మీరెప్పుడూ కూరగాయలు పండించే పొలాల్లోకి వెళ్ళి చూడలేదేమో! నేను అపుడపుడు చూస్తుంటాను కాబట్టి ఇవ్వన్నీ నాకు తెలుసు" అంది హేమ.

"ఈ ఊరు పాడిపంటలకు కూరగాయలకు ప్రసిద్ధి కాబట్టి అన్నీ ఫ్రెష్ గా చీప్ గా దొరుకుతాయి, పల్లెటూరి వాతావరణం ప్రశాంతంగా వుంటుందని ఇక్కడ ఇల్లు కొనుక్కొన్నాం అండీ. మీరేమో ఇలా వుంటుందని చెబుతుంటే భయమేస్తుందండీ".

చిన్నగా నవ్వింది హేమ "ఈ ఊరు ఇప్పుడున్న ఊరిలో పావువంతు వుండేది అదివరకు. మూడొంతులు మీలా ఆశించి వచ్చి స్థిరపడినవారే! పంట పొలాలన్నీ కాలనీలుగా మారిపోయాయి. మనదేశ జనాభాకి సరిపడ ఆహారం పండించాలంటే సేంద్రియ వ్యవసాయంలో కుదరదు. అందుకే సంకరజాతి విత్తనాలు వాడి అధిక దిగుబడి సాధించడం అవసరమైపోయింది. వ్యవసాయం అధిక ఖర్చుతో కూడిన పని అవడం వల్ల అధిక దిగుబడుల కోసం ఎరువులు గుమ్మరిస్తున్నారు. మన పెద్దల తరానికి మన తరానికి ఆరోగ్యాలలో మార్పు ఆహారం వలనే శాంతి. మీరు కూడా రూఫ్ గార్డెన్ ఏర్పాటు చేసుకుని వారానికి నాలుగు రోజులైనా సహజంగా పండించిన కూరగాయలు తినే ప్రయత్నం చేయండి అని సలహా యిచ్చింది.

"రూఫ్ గార్డెన్ చేయాలని ఉంది కానీ ఇంట్లో వాళ్ళ సహకారం లేదండీ."అని వాపోయింది శాంతి.

నిన్న మా మేనకోడలు ఫోన్ చేసింది. వాళ్ళు పండించిన బీర తోటకు చల్లిన పురుగు మందుల గురించి చెబుతుంటే వణుకు వచ్చింది.రాత్రంతా నిద్రపట్టలేదనుకోండి. మనం తిండి కాదు రసాయనాలు తింటున్నాం అనిపించింది. ఇప్పటికైనా మనం కళ్ళు తెరవకపోతే మన భావితరాల వారు నిత్య అనారోగ్యం పాలవుతారు. అంది ఒకింత దిగులుతో.

"మనమొక్కరమే ఏం చేయగలం చెప్పండి!? నలుగురితో పాటు నారాయణా అనుకోవడమే"

"లేదు శాంతి నాకొక ఆలోచన వుంది. స్త్రీలు తలుచుకుంటే ఏదైనా చేయగలరు. అదీ కుటుంబ ఆరోగ్యం కోసం. కమ్యూనిటీ కిచెన్ గార్డెన్ కోసం మా భూమిని సిద్ధం చేయాలనుకుంటున్నాను. సొంత స్థలం లేని వారందరూ తలాకొంత భూమిని కౌలుకు తీసుకుని సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో కూరలు పండించుకోవడానికి అవకాశం కల్పించాలని అనుకుంటున్నాను.నాతో కలిసి నడిచే వారి కోసం ప్రయత్నిస్తున్నాను. ఇద్దరు ముగ్గురు కలిసి పనిచేయడానికి

ఉత్సాహంగా వున్నారు.

మా అందరి ముందున్నదీ వున్నది వొకటే లక్ష్యం. ఆ లక్ష్యాన్ని చేరుకోవాలంటే చాలా కష్టనష్టాలుంటాయి. అయినా సరే సిద్ధపడుతున్నాము.మీరు కూడా మాతో కలిసి పనిచేయవచ్చు అని ఆహ్వానించింది.

“అలాగేనండీ! ఇంట్లో వొప్పుకుంటే అలాగే చేద్దాం. మీరు చెప్పేది వింటుంటే నాకు ఉత్సాహంగా వుంది ”.

ముందు మనమంతా ఈ కోవిడ్ మహమ్మారిని జయించాలి.మనందరికీ రేపటి గురించి ఆశ వుండాలి. ఫలవంతమైన జీవితాల కోసం కమ్మని కలలతో తీపి ఆశతో రేపును ఆహ్వానిద్దాం. సరేమరి. ఇకవుండనా మరి అని లోపలికి వచ్చింది హేమ.

కాళ్ళు చేతులు శుభ్రం చేసుకుని వచ్చి టేబుల్ పై వదిలి వెళ్లిన మొబైల్ ఫోన్ తీసుకుని చెక్ చేసింది. కాల్ లిస్ట్ లో మేనకోడలు లావణ్య నెంబరు కనబడింది. నీళ్లసీసా తీసుకుని బాల్కనీలోకి వచ్చి కాల్ చేసింది.

అత్తా! నీకొక స్టన్నింగ్ అండ్ గుడ్ న్యూస్ చెప్పాలని వెయిట్ చేస్తున్నాను. మా బావగారూ తోడికోడలు పిల్లలూ అందరూ ఇండియా వచ్చేస్తారు అంట.ఈ సంవత్సరం అంతా కూడా రిమోట్ వర్కే కదా! అది చేసుకుంటూనే ఇక్కడ డైరీ ఫామ్ పెట్టడానికి పనులు మొదలు పెడతారంట. అక్కడ సంపాదించిన డబ్బంతా ఇక్కడ పెట్టుబడి పెడతారంట. తమ్ముడిని కూడా పార్టనర్ ని చేస్తాను అని చెబుతున్నారు మా బావగారు. ఇక మా భూములన్నీ ప్రయోగశాలగా మారిపోనున్నాయి”

“మంచి విషయమే! మీ వాళ్ళకు అక్కడ జీవితం నచ్చలేదేమో,ఇక్కడికి తిరిగిరావడం కూడా అంతకన్నా మంచి అవకాశాలు లభిస్తాయనేమో! ఏదైతేనేం తెలివి తక్కువ ఆలోచన మాత్రం కాదు. ఎంతోమంది యువత కూడా ఇక్కడ వారికి వున్న వనరులను సద్వినియోగం చేసుకోగలమని నమ్మకంతో తిరిగి వస్తున్నారు.సంతృప్తికరమైన ఫలితాలు సాధిస్తున్నారు. అదే కొన్ని విదేశాలకు కడుపుకూటికి వెళ్ళిన వాళ్ళు అంతో ఇంతో ఇంటికి పంపుదామనే ఆశతో వెళ్ళిన వాళ్ళు ఇలాంటి నిర్ణయాలు తీసుకోలేరుగా.

వారివి బాధలైతే వీరివి అవకాశాలు.అవకాశాలు సృష్టించుకునే వారికి చేజిక్కించుకునే వారికి కొదవేముంది? అందులో మీకు రాజకీయ పలుకుబడి కూడా వుంది కదా” అంది హేమ.

ఈ మాటా నిజమే అత్తా! అక్కడ పదిహేనేళ్ళపాటు పెరిగిన పిల్లలు ఇక్కడెలా అడ్జెస్ట్ అవుతారో ఏమిటో! సడన్ గా ఈ నిర్ణయాలు ఏమిటో! ఆ పిల్లలే ఇక్కడ వుండటానికి వస్తుంటే నా పిల్లల గురించి నాకు బాధ ఎందుకు!? వారి ఉద్దేశ్యాలు మంచివైతే ఉమ్మడి కుటుంబంగా కలిసి వుంటాం. లేకపోతే విడిపోతాం. ఏదైనా వాళ్ళు మంచి నిర్ణయం తీసుకున్నారు అని సంతోషపడుతుంది మా అత్తగారు. చూద్దాం ఏం జరగనుందో!

లావణ్య మాటలలో ఎన్ని అనుమానాలు సంశయాలు వున్నప్పటికీ పాజిటివ్ థింకింగ్ తో స్పందించడం చాలా పాజిటివ్ గా అనిపించింది హేమకు. మేనకోడలి సంతోషంలో తన సంతోషం కలగలిపి “వలస వెళ్ళిన ఏ భారతీయుడు తిరిగి వచ్చేసేదన్న మాట విన్నా అనావృష్టికి ఎండిపోయిన ఊరి చెరువు తొలకరికే నిండి తొణికిసలాడుతున్నట్లు వుంటుంది. ఊరంతా పచ్చదనం పగిలినట్టువుంటుంది. మనసులో ఏదో తీపి ఆశ ఆకాశమంత ఆవరిస్తుంది” అంది కవితాత్మకంగా. అప్రయత్నంగా ఓ సినీగీతం అందుకుని “పాడిపంటలకు పసిడి రాసులకు కళకళలాడే భూమి.. మన జన్మభూమి బంగారు భూమి ఇక్కడ ఏం తక్కువ అనుకుంటాను” అంది పాటా మాటా కలిపేసి ఒకింత గర్వంగానూ అతిశయంగాను.

“నీకు మరీ అంత దేశభక్తి పనికిరాదు. జాగ్రత్త అత్తా! ఈ సారి నేను ఫోన్ చేసేటప్పటికి నీ ఆలోచనలు మారిపోయి నిస్పృహగా ఏముంది ఈ దేశంలో కులం మతం అవినీతి తప్ప అంటావ్ చూడు” అని నవ్వుతూ ఫోన్ పెట్టేసింది లావణ్య.

మేనకోడలి మాటల్లో సత్యం చురుక్కుమనిపించింది హేమకు. “తలదాచుకోవడానికి ఇంత నీడ కూడు గుడ్డ లేని నిరుపేదలు ఎన్ని కోట్లమంది ఈ దేశంలో. వారి గురించి ఆలోచించే వారెవరూ!? వారి బతుకులతో కూడా వ్యాపారం చేయాలని చూసేవారు తప్ప అన్న చింత తరచూ ఆమె మెదడును తొలుస్తూనే వుంటుంది.ఐదు వేళ్ళు ఎప్పటికీ సమానం కాలేకపోతే మానె కానీ ప్రతి పూటా ప్రజలందరికీ ఐదు వేళ్లు తినే కంచంలో పెట్టగల్గే భాగ్యం వుంటే బాగుండును కదా! అదే కదా అసలు సిసలైన బంగారు భూమి.ఈ బంగారు భూమిలో మనుషుల మనస్సులో విషం భూమిలో విషం పండించకుండా వుంటే అంతే చాలు అనుకుంది భారంగా నిట్టూర్చి.

కథ

# సావిత్రి




చల్లా సరోజినీదేవి
ఫోన్ : 98498 26634


జాన్ బీ మా బడిలో అటెండర్ గా ఈ మధ్యే చేరింది. అంతకు ముందు వాళ్ళ నాన్న రసూల్ ఆ పని చేసే వాడు. అతనికి ఏ నలభయ్యేళ్ళ వయసులో నో ఎవరో రాజకీయ నాయకుడి దయ వల్ల ఆ ఉద్యోగం వచ్చిందిట. అయితే అప్పుడు అతని వయసు ఏకంగా ఓ ఇరవయ్యేళ్ల ను తగ్గించి రికార్డ్ చేసారు. అంటే అతనికి 60 నిండినా ఇంకా 20 ఏళ్ళ సర్వీస్ వుంది. మా బడిలో అతను చాలా కష్టపడి డ్యూటీ చేసే వాడు. అతను టీచర్లను భలే తమాషాగా విష్ చేసే వాడు. H.M కూ, ఇంకో ఇద్దరు ముగ్గురు పెద్దవాళ్ల కు " గుడ్ మార్నింగ్ సార్" అనీ, మిగిలిన వాళ్ళకు " నమస్తే సార్/ మేడం" అనీ చేప్పే వాడు. నేను హిందీ టీచర్ ను అనేమో, కేవలం నాకు మాత్రమే" ఆదాబర్సే జీ" అనే వాడు. నాకు మొదట్లో అర్థం కాలేదు. కానీ తరువాత తెలిసింది" ఆదాబ్ అర్జ్ హై" అని. అంటే వినయ పూర్వక వందనం అన్నట్లని మా ఫ్రెండ్ చెప్పింది. అతను ఏ రోజైనా రాక పోతే , అతని పెద్ద కూతురు జాన్ బీ గానీ, వాళ్ళావిడ గానీ డ్యూటీ చేసే వారు. ముస్లిమ్ వాళ్ళయినా తెలుగే మాట్లాడేవారు. వారి కుటుంబం గురించే ఎందుకు చెప్పుతున్నానంటే కథంతా వాళ్ళదే కాబట్టి.

రసూల్ కు ఆరుగురు సంతానం. అంతా ఆడ పిల్లలే. ఎలాగో పెద్ద కూతురు జాన్ బీ కి పెళ్ళి చేసారు. అయితే దురదృష్టం, ఆమె పై మోజు తీరగానే ఆ అల్లుడు వెధవ చేతికి అందిన వరకూ విలువైన వస్తువులు తీసుకొని ఉడాయించాడు. అప్పుడు జాన్ బీ గర్భవతి. ఎంత వెతికినా, ఎదురుచూసి నా భర్త రాడని గ్రహించిన ఆ అభాగ్య మహిళ కన్నీళ్ళతో పుట్టిల్లు చేరింది. అత్తింటి వారు ముందే ముఖం చాటేశారు. రెండో కూతురికి కూడా పెళ్ళి కుదిరింది. మేమంతా తోచిన రీతిలో సహాయం చేసాం. ఎలాగో ఆ శుభ కార్యం గట్టెక్కింది. ఇంకా నలుగురు అమ్మాయిలు న్నారు పెళ్ళికి. పైగా పెళ్లయినా "మొగుడు వదిలేసాడు "అనే నింద మోస్తూ పెద్దకూతురు కూడా ఇంట్లోనే వుంది. అదీ కాక ఆమె గర్భవతి కూడా. వయసు పైబడిన రసూల్ ఒక్కోసారి అనారోగ్యం తో డ్యూటీ ఎగ్గొట్టేవాడు. అప్పుడు ఎక్కువగా జాన్ బీ నే వచ్చేది. చాలా ఓపికగా ఎవరు ఏది చెప్పినా , మారు పలుక కుండా చేసేది. వారానికో రోజు సంత జరిగితే , అక్కడి నుండి ఎవరు కోరిన కూరగాయలు ,ఆకుకూరలు వారికి తెచ్చిచ్చేది. ముఖ్యంగా లేత మొక్కజొన్న కండెలయితే ఏరేరి తేవడం వల్ల అప్పుడప్పుడు నేనూ, నా కొలీగ్ ఆశా అవి తెప్పించుకొని, కొన్ని తనకూ ఇచ్చేవాళ్ళం.

రసూల్ రెండో కూతురు కూడా గర్భవతి అని తెలిసి, ఆ అమ్మాయిని తీసుకొని రావడానికి అతని భార్య వూరు వెళ్ళింది. అయితే అప్పటికి జాన్ బీ కి ఇంకా ప్రసవం కాలేదు. దురదృష్టం కొద్దీ ట్రైన్ ఎక్క బోతున్న రసూల్ భార్య కాలు జారి అదే రైలు క్రింద పడి దుర్మరణం చెందింది. సరిగ్గా అదే సమయానికి జాన్ బీ కి ప్రసవం జరిగి బాబు పుట్టాడు. దేవుడి లీలలు ఎంత విచిత్రమో! పసివాడు పుట్టినందుకు ఆనందించాలో, ఇంటికి పెద్ద దిక్కయిన ఇల్లాలి మరణానికి దుఖిం చాలో అర్థం కాని పరిస్థితి రసూల్ కు ఎదురైంది. పచ్చి బాలింత జాన్ బీ కి కొందరు దగ్గిరి చుట్టాలు, ఆమె చెల్లెళ్లు తోడయ్యారు. మాకు కూడా చాలా బాధ కలిగింది. ఎంతో కొంత ఆర్థిక సహాయం చేసాం. అంతకు మించి ఏం చేయగలం?

ఇంక రసూల్ పూర్తిగా మంచం పట్టాడు. నెలల బిడ్డ అయిన రెహ్మాన్ ను చెల్లెళ్ళకు వొప్పగించి జాన్ బీ నే డ్యూటీ చేయసాగింది. ఆమె భర్త వేరే పెళ్ళి చేసుకుని సుఖంగా వున్నాడు. ఆ దుర్మార్గుడు, కొడుకును చూసేందుకు కూడా రాలేదు.

అప్పుడప్పుడు అది తలచుకొని ఏడ్చేది ఆమె. మేము" అలాంటి మొగుడు ఉన్నా, లేకున్నా పెద్ద తేడా వుండదు. ఎలాగూ మీ నాన్న ఇంక పని చేయలేడు. సర్వీస్ చాలవుంది. ఆ జాబ్ నీకే ఇప్పించే ప్రయత్నం చేస్తాం. హాయిగా సంపాదించు కొంటూ నీ కొడుకును చక్కగా చదివించుకో" అని ధైర్యం చెప్పాం. అన్నట్లుగానే మా కొలీగ్ రామ చంద్ర రావు గారూ, H.M గారూ పూనుకొని గట్టి ప్రయత్నం చేసి జాన్ బీ కి తండ్రి స్థానం లో అటెండరుగా మా వద్దే పోస్టింగ్ ఇప్పించారు. అప్పటి నుండి ఇంక పూర్తిగా జాన్ బీ నే డ్యూటీ చేయసాగింది.

తన సంపాదన తోనే చెల్లెళ్ళందరికీ తగిన సంబంధాలు చూసి పెళ్ళిళ్ళు చేసింది. రసూల్ వృద్ధాప్యం లో కూతురి ఆలన లో సేద తీరుతూ సుఖంగానే చని పోయాడు. చెల్లెళ్ళ పురుళ్లు పుణ్యాలు కూడా జాన్ బీ చక్కగా నిర్వహించింది. రహ్మాన్ మా బడిలోనే చదివే వాడు. చాలా చురుగ్గా, తెలివిగా వుండేవాడు. ఏక సం త గ్రాహి వాడు. మేమయితే పదవ తరగతి లో అత్యధిక మార్కులు తెచ్చుకొని స్కూల్ కే పేరు తేస్తాడని అందరం నిశ్చయంగా అనుకొనే వాళ్ళం. ఒక్క కొడుకు బాధ్యత తప్ప మరే ఇబ్బందులూ లేవు జాన్ బీ కి. టెన్త్ వరకూ ఎలాగూ ఉచిత విద్యే కదా? వాడిని ఇంజనీర్ను చేయమని అందరం సలహా ఇచ్చే వాళ్ళం. అప్పట్లో ఒకే వూరిలో సుదీర్ఘ కాలం పని చేయడం సర్వ సాధారణంగా వుండేది. జాన్ బీ జీవితంలో జరిగిన ఇన్ని మార్పులూ నేను స్వయంగా చూసాను. రహ్మాన్ 8 వ తరగతి లో వుండగా నాకు ప్రమోషన్ తో వేరే ఊరికి బదిలీ అయింది.

పాతిక మంది స్టాఫ్ వున్నా అందరం ఒక కుటుంబ సభ్యుల లాగే ఎంతో ఆప్యాయంగా వుండే వాళ్ళం. మా మధ్య వివాదాలు దాదాపుగా లేవనే చెప్పాలి. ఏవైనా చిన్నా చితకా తేడాలు వచ్చినా వెంటనే H.M గారి సారథ్యంలో చర్చించుకొని క్లియర్ చేసుకొనే వాళ్ళం. నేనైతే ఎప్పుడూ, ఏ కలహం లో నూ దూరలేదు. అందుకే పుట్టిల్లు వదిలి వెళ్ళడం లాంటి బాధ కలిగింది. అందరూ ఘన మైన వీడ్కోలు పలికారు. జాన్ బీ కూడా కళ్ళ నీళ్ళు పెట్టుకొంది. అందరికీ పేరు పేరున ధన్యవాదాలు చెప్పి ఆ వూరి నుండి బయలు దేరాను. వచ్చే ముందు జాన్ బీ కి " రహ్మాన్ ను బాగా చదివించ డం లో వెనుకడుగు వేయవద్దు" అని నొక్కి చెప్పి, వాడి చేతిలో ఒక 50/ ల కాగితం పెట్టాను. ఇప్పుడు 50/ అంటే అసలు లెక్కే లేదు. కానీ ఆ రోజు ల్లో అది పెద్ద మొత్తమే.10/ కే చిన్నవి అయితే ఎనిమిది, కొంచెం పెద్దవి అయితే ఆరు మొక్క జొన్న పొత్తులు వచ్చేవి అప్పుడు. ఇప్పుడయితే ఒక్కటి కూడా రావడం లేదు కదా?

సరే, ఆ ఊరినుండి వచ్చేసాక కొత్త స్కూల్, కొత్త వూరు, పరిసరాలు అన్నీ అలవాటు పడడానికి సమయం తీసుకోవడం వల్ల చాలా వరకు పాత సంగతులన్నీ మరిచే పోయాను. కొన్నేళ్ళు గడిచినవి. టెన్త్ క్లాస్ స్పాట్ వాల్యేషను సెంటర్ లో అనుకోకుండా నా విద్యార్థి కూడా పేపర్స్ దిద్దడానికి వచ్చాడు. నా విద్యార్థి అంత ఉన్నత స్థితికి రావడం ఎంతో సంతోషం కలిగించింది. వాడే నన్ను గుర్తు పట్టి ఎంతో వినయంగా నమస్కరించి, తనను తాను పరిచయం చేసుకున్నాడు. చాలా సేపు ఎన్నో విషయాలు మాట్లాడుకున్నాం. మాటల మధ్య రహ్మాన్ అనుకున్నట్లే ఇంజనీర్ అయ్యాడనీ, తనతో పాటు చదువుకొన్న ఒక తెలుగు ( హిందూ) అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడనీ చెప్పాడు. జాన్ బీ కూడా సంతోషంగా ఆ పెళ్ళికి ఒప్పుకొందని విని , ఆమె మంచితనానికి చాలా ఆనందించాను. అంతే కాదు జాన్ బీ కి అదే ఊరిలో ప్రభుత్వం ఇంటి స్థలం ఇచ్చిందనీ, అందులో చిన్న ఇల్లు కూడా కట్టుకొందనీ తెలిసి మరి మరి సంతోషించాను." ఇన్నాళ్ళకు జాన్ బీ కష్టాలు గట్టెక్కినవి" అనుకొన్నాను. తనను అడిగినట్లు చెప్పమని నా స్టూడెంట్ తో చెప్పాను .అంతే. మరో కొన్నేళ్ళు కాల గర్భంలో కలిసిపోయినవి.

★ ★ ★

కొన్ని సార్లు కొన్ని విషయాలు తెలియ కుండా వుంటేనే మంచిదేమో! విధి లీలలు వింతగా వుంటాయి అనేది ముమ్మాటికీ నిజం. ఒక రోజు ఏదో పని వుండి ఆ వూరికి వెళ్ళాను. ఒక్క జాన్ బీ తప్ప అందరూ కొత్త వాళ్ళే. లేడీ H.M నాకు అంతకు ముందు బస్ మేట్ కావడం తో నా పని తేలిగ్గానే అయిపోయింది. జాన్ బీ ముఖం లో అంతకు ముందు వుండే సంతోషం కనపడలేదు. నన్ను చూసిన ఆనందం క్షణికమే అనిపించింది. నేను పలుకరిస్తే కళ్ళ నీళ్ళు పెట్టుకొంది. నేను కంగారు పడ్డాను. " ఏమైంది జాన్ బీ? అందరూ బాగున్నారు కదా? రెహ్మాన్ హైదరాబాద్ లోనే జాబ్ చేస్తున్నాడా? ఏమైనా పిల్లలా?"

అని అడిగాను.

అందుకు ఆమె "ఇక్కడే వున్నాడు మేడం. దగ్గిరే . రండి మా ఇంటికి" అని అన్నది. ఆమె గొంతులోని దుఃఖాన్ని నేను గుర్తించాను. కానీ ఏమీ అడుగ లేక పోయాను. స్కూల్ టైం కూడా అయిపోయింది. నాకు జాన్ బీ తో వెళ్ళి, రహ్మాన్ ను

చూడాలనీ, ఆమె బాధకు కారణం తెలుసుకోవాలని బలంగా అనిపించింది." సరే, పద" అని ఆమె వెంట వెళ్ళాను. కొద్ది దూరం వెళ్ళగానే ఒక కిరాణా షాపు కనిపించింది. అక్కడికి వెళ్ళి ఆగింది జాన్ బీ. ఆమె వెనుకే నడుస్తున్న నేను చూసిన దృశ్యంతో దిగ్భ్రాంతికి లోనయ్యాను. అప్రయత్నంగానే నా కళ్ళలో నీళ్ళు తిరిగాయి." ఏమిటిది? అసలు ఎలా?" అర్ధం కాలేదు. గల్లా పెట్టేముందు ఎత్తైన కుర్చీలో మోకాళ్ల దగ్గిరనుంచి రెండు కాళ్ళు లేని రహ్మాన్ కూర్చుని, ఎవరికో ,ఏదో పొట్లం కట్టిస్తున్నాడు. "ఇదేమిటి జాన్ బీ? ఏమైంది?" అని ఏడుస్తూనే అడిగాను. నా గొంతు విని అప్పుడే నా వైపు చూసాడు రహ్మాన్. చాలా సంవత్సరాలు గడిచినా నన్ను గుర్తు పట్టి" నమస్తే మేడం. బాగున్నారా?" అంటూ చిరునవ్వుతో చేతులు జోడించాడు. నాకు దుఃఖం ఆగడం లేదు. అసలేమైంది అనేది తెలియక మనసు మరింత మదన పడసాగింది." మేడం, లోపలికి వెళ్ళి మాట్లాడుకుందాం. రండి" అని షాప్ ప్రక్కనే ఉన్న చిన్న గేట్ తెరిచింది జాన్ బీ. " మేడం, నేను ఒక అరగంట లో వచ్చేస్తాను. మీరు మాట్లాడుతూ వుండండి" అదే చెదరని చిరునవ్వుతో చెప్పాడు రహ్మాన్. నేను విషాదంగా వాడి వైపు చూస్తూనే జాన్ బీ వెనుక నడిచాను. చిన్నదే అయినా, పొందిగ్గా, శుభ్రంగా వున్న డాబా ఇల్లు అది. హాల్ లో చిన్న పేము సోఫా పైన మెత్తటి దిండ్లు వున్నాయి. వాటి గలీబులపైన చక్కని పువ్వులు ,లతలు పెయింట్ చేయ బడి వున్నాయి." కూర్చోండి మేడం" అన్నది జాన్ బీ." కూర్చుంటాలే గానీ, అసలు ఏం జరిగిందో చెప్పు ముందు" కొంచెం అసహనం తో పాటు ఆరాటం కూడా ధ్వనించింది నా గొంతులో.

" అంతా నా రాత మేడం. బంగారం లాంటి కోడలు దొరికింది. ఇద్దరూ హైదరాబాద్ లోనే ఉద్యోగాలు చేసుకొంటూ చిలుకా గోరింకల్లా గ వుండే వాళ్ళు. నన్ను నౌకరీ వదిలేసి రమ్మనేది కోడలు కూడా. ఇంకో ఆరేళ్ళు చేస్తే దిగిపోవచ్చు." అని నేను వినిపించుకోలేదు. నిరుడు ఇదే రోజుల్లో బండి మీద పోతుంటే వెనుకనుండి వచ్చి పెద్ద బండే గుద్ది పోయిందిట. కాళ్ళు పోయినా నా కొడుకు నాకు దక్కిండు. అదే పది వేలు అనుకుంటున్నా మేడం. కోడలికి కూడా బాగనే దెబ్బలు తగిలినయి. కానీ తొందరగానే తగ్గినయి. నా కోడలు పేరు సావిత్రి. బళ్ళో అందరూ అంటుంటే తెలిసింది మీ పురాణాలలో ఎముడు తో పోట్లాడి మొగుడిని బతికించుకొన్న సావిత్రి అనే ఆమె కథ ఉన్నదట కదా? అగ్గో, నిజంగా అట్లనే నా కోడలు సావిత్రి కూడా ఆ దేముడు తో కొట్లాడి తన మొగుడిని బతికించుకొన్నది. వాడి కోసం తన బంగారం అంతా అమ్మింది. బేంకుల దాసుకొన్న పైసాలన్ని కర్సు పెట్టింది. ముందే ఒక కొడుకు పుట్టిండు. మల్ల ఇప్పుడు నీళ్ళు పోసుకొన్నది". నేను నిర్ఘాంత పోయి వినసాగాను. "ఇంకొల్లయితే ఈ అవిటి మొగడు నాకెందుకు? అని ముగం మీద తన్ని పొయ్యే టోల్లు. కానీ నా కోడలు దేవత మేడం. వాళ్ళ అమ్మ నాన్నలు రమ్మన్నా గాని" ఎట్లున్నా నా మొగుడు నాకు గావాలే. ఇదే నాకు అయితే ఎట్లుండేది? " అని అడిగింది. అంత మంచి పిల్ల కు దేవుడు ఎంత దుకం రాసిండో సూడండి మేడం " అంటూ ముగించింది జాన్ బీ. నా ప్రమేయం లేకుండానే నా కళ్ళు వర్షిస్తున్నాయి." మరి వాళ్ళ ఉద్యోగాలు?" అని అడిగాను.

" అవి గవుర్మెంట్ వి కాదుగదా మేడం? కాళ్ళు పోయినవని వాడికి కొన్ని రూపాయలు ఇచ్చి ఇంటికి పొమ్మన్నరు. నా కోడలు కూడా వద్దనుకొని వచ్చింది. దవాఖానా లోనే చాలా ఖర్చయింది.ఇంటికి రాంగానే ఈ కొట్టు పెట్టించింది." చెప్పింది జాన్ బీ. " మరి తను ఏదీ? నీ మనుమడు ఎక్కడ?" అన్న నా ప్రశ్నకు సమాధానంగా జాన్ బీ " తను సిటీ ల జాబ్ చేస్తున్నది కాలేజీ ల. కొడుకును రోజూ తన తోటే తీసుకొని పోయి ప్రైవేట్ బడిల చదివిస్తున్నది. పొద్దున ఎనిమిదింటికి పోయి అయిదింటికల్ల వస్తారు" అన్నది.

. " ఎలా వెళ్తారు?" అని అడిగాను. "చిన్న బండి మీద పోయ్యొస్తరు మేడం" అన్నది జాన్ బీ. గోడకు తగిలించిన ఫొటోస్ వైపు చూసాను. రహ్మాన్ ప్రక్కన అందంగా వున్న యువతి కనిపించింది. మరో ఫోటో లో వాళ్లిద్దరి మధ్య చిన్న బాబు నవ్వుతూన్నాడు. "చక్కని కుటుంబం. ఎవరి దిష్టి తగిలిందో? లేక ఆ దేవుడే చూడ లేక పోయాడో?" అనిపించింది.

ఈ లోపు వీల్ చైర్ తోసుకుంటూ రహ్మాన్ వచ్చాడు. వాడి చేతిలో మాంగో జ్యూస్ బాటిల్ వుంది. వీల్ చైర్ రావడానికి వీలుగా ద్వారాలు ఉన్నాయి. "ఎక్కడుంటున్నారు మేడం? అందరూ బాగున్నారా? సార్ ఎలా వున్నారు? మీ పిల్లలు ఏం చేస్తున్నారు?" అంటూ ఏకబిగిన ప్రశ్నలు వేసాడు రహ్మాన్. వాడి ముఖం లో ఏ విచారం కనిపించడం లేదు. అంత కష్టం లో కూడా చిరు నవ్వులు చిందిస్తూ వున్న వాడిని ఆశ్చర్యంగా చూడ సాగాను. ఈ లోపు జాన్ బీ గాజు గ్లాస్ లో జ్యూస్ పోసి నాచేతికి ఇస్తూ" తాగండి మేడం" అన్నది." ఇప్పుడు ఈ మర్యాదలు

అవసరమా?" అన్నాను.

"ఏదో మా తృప్తి కోసం మేడం. మీకు మర్యాదలు చేసేంత వాళ్ళమా?" నవ్వుతూ అన్నాడు రహ్మాన్. వాడి నవ్వు నాకు వింతగా అనిపిస్తోంది.

" ఇంత బాధలో కూడా ఎలా నవ్వ గలుగుతున్నావురా?" అన్నాను బాధగా.

" ఈ నవ్వు ల వెనుక నా భార్య అపార కృషి, పట్టుదలతో పాటు మోటివేషన్ ఎంతో వుంది మేడం" అంటూ అక్కడే డెస్క్ లో వున్న కొన్ని పుస్తకాలు తీసి నాముందు పెట్టాడు రహ్మాన్. అవి తెలుగు, ఇంగ్లీష్ లో వున్న వేర్వేరు మాగజిన్స్. వికలాంగులైన వారు తమ పట్టుదలతో, ఆత్మ విశ్వాసంతో వేర్వేరు రంగాలలో సాధించిన విజయాలకు సంబంధించిన సమాచారం బొమ్మల తో సహా ప్రచురించబడింది. నేను వాటిని నిశితంగా పరిశీలించి, "రియల్లీ యూ ఆర్ లక్కీ రహ్మాన్" అన్నాను మనస్ఫూర్తిగా. "అవును మేడం. నేను ఒకానొక స్టేజీ లో సూసైడ్ చేసుకొందామనేంత డిప్రెషన్ లో కి వెళ్లాను. అది గమనించిన సావిత్రి కంటికి రెప్పలా నాతోనే వుండి, ఎన్నో మాటలతో, ఇదిగో ఈ ఆర్టికల్స్ తో నన్ను ఇన్స్పైర్ చేసి , నాలో నుండి ఆ ఆలోచనలు దూరం చేసింది. తను నా భార్యగా దొరకడం నిజంగా నా అదృష్టం మేడం" అన్నాడు రహ్మాన్."అవును . అందుకే నువ్వు లక్కీ ఫెలో వి అని అన్నాను." అంటూ నేను నవ్వాను." నిజమే మేడం. తను మా ఇంటి దేవత" అన్నది జాన్ బీ.

ఈ లోపే స్కూటీ శబ్ధం విని పించింది.

"అదిగో, తను వచ్చింది" అని జాన్ బీ సంతోషంగా బయటికి వెళ్ళి,ఐదేళ్ల మనుమడిని ఎత్తుకొని లోపలికి వచ్చింది. ఆమె వెనుకే తన కోడలు సావిత్రి కూడా వచ్చింది. అలవి కాని కష్టాలను కూడా అలవోకగా ఎదుర్కొని, మొక్కవోని ధైర్యంతో జీవన సమరంలో ముందుకు సాగుతున్న ఆ అసమాన మానవతా మూర్తి వంక ముగ్ధురాలినై , ఆరాధనగా చూసాను. అందమైన సావిత్రి కూడా నవ్వుతూ "నమస్తే మేడం. మీ గురించి ఎన్నో సార్లు అత్తయ్యా, రెహ్మాన్ చెప్పారు." అన్నది.

" అవునా, నాగురించి ఏముంది చెప్పేందుకు?" అన్నాను తెల్లబోతూ.

" అదేంటి మేడం, ఎందుకు లేదూ? ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ, పిట్ట కథలు చెప్తూ" నాన్నా" అని ప్రేమగా పిలుస్తూ , ఒక్కసారైనా కొట్టకుండా పాఠాలు నేర్పింది మీరు ఒక్కరే. అందుకే మీరంటే మాకు చాలా ఇష్టం. ఇంకా పేపర్ తో రకరకాల బొమ్మలు చేయడం నేర్పింది కూడా మీరే. ఇప్పుడు కూడా అవి మా వాడికి నేర్పిస్తున్నాను. " అంటూ నవ్వాడు రహ్మాన్.

జాన్ బీ అందుకొని " మిగిలిన అందరూ ఏదన్నా పని చెప్తే రుబాబుగ చెప్పెటోల్లు. మీరొక్కరే చాలా మెల్లగ బుదగరించినట్లు చెప్పేది. ఇంకా ఏది తెచ్చినా, కూరలతో సహా నాకు ఇచ్చేటోల్లుగదా? మా అమ్మ పోయినప్పుడు ఎంత గనంగ ఓదార్చినరో నాకు ఇంకా యాది కున్నది. గట్లనే నాకు ఏ ఆపతి వచ్చినా ఆదుకున్నారు. మీరు మ రిచిపోయినా మేమెట్ల మరిచి పోతం మేడం?" అన్నది. ఏదో సమయానికి చేతనైన, తోచిన సహాయం చేసిన నన్ను వాళ్ళు ఇంతగా గుర్తు పెట్టు కోవడం నాకు అబ్బురం అనిపించింది. అమాయకమైన వారి అభిమానం ముచ్చట గొలిపింది. రెహ్మాన్ కొడుకు కూడా తండ్రి లాగే చాలా తెలివైన వాడు. నేను వున్న కాసేపటి లోనే ఎంతో మాలిమి అయ్యాడు. వాడు బడిలో నేర్చుకొన్న బోలెడన్ని రైమ్స్, పద్యాలూ వినిపించాడు." ఏంటీ, మీ బడిలో తెలుగు పద్యాలు కూడా నేర్పిస్తారా?" అని అడిగాను. " కాదు, డాడీ నేర్పించాడు" అన్నాడు ఆ బుడతడు." అవునా?" కావాలనే అన్నాను ఆశ్చర్యం ప్రకటిస్తూ.

" నిజం మేడం, మా డాడీకి బోలెడన్ని రైమ్స్, పద్యాలూ వచ్చు"అని చాలా గొప్పగా చెప్పాడు వాడు." ఆహా, అలాగా? మరి మీ అమ్మకు ఏం వచ్చు?" అని అడిగాను.

" అమ్మకైతే చాలా కథలు వచ్చు" అన్నాడు బాబు. వచ్చీ, రాగానే నడుం చుట్టూ కొంగు దోపి పనిలో పడింది సావిత్రి. నేను బాబుతో మాట్లాడుతూనే గనించ సాగాను. "వాడికి నిద్ర వచ్చే దాకా మాకు అదే పని మేడం" అని నవ్వాడు రహ్మాన్. చాలా సేపు వాళ్ళ అందరితో కబుర్లు చెప్పుకొంటూ గడిపి చీకటి పడిందని బయలు దేరాను. ఆ చిన్నారికి 500నోటు ఇస్తూ " నువ్వు మీ నాన్న కన్నా గొప్ప వాడివి కావాలి" అన్నాను. "మేడం, ఇప్పుడు అవెందుకు?" అని అటు సావిత్రీ, ఇటు రెహ్మాన్ ఒకే సారి అన్నారు. ఆ బాబేమో నోటు అందుకోకుండా, వాళ్ళ నానమ్మ వైపు చూసాడు. "అదేంటీ, నేను ఇవ్వ కూడదా? ఏంటీ జాన్ బీ, నువ్వు చెబితేనే తీసుకుంటాడా?" అన్నాను. జాన్ బీ

నవ్వుతూ " లేలో మున్నా" అన్నది. మొదటి సారిగా ఉర్దూ విని ఆశ్చర్య పోయాను."ఓయ్, ఆ భాష కూడా నేర్పిస్తున్నారా?" అన్నాను. " అప్పుడప్పుడు అది కూడా నేర్పిస్తున్నా మేడం" అన్నది జాన్ బీ. ఆమె చెప్పాకే నోటు అందుకొని

" థాంక్యూ మేం" అన్నాడు బాబు. వాడి చిన్న బుర్రలో వున్న తెలివికీ, సంస్కారానికి ముచ్చట అనిపించింది. "Its ok" అని వాడి బుగ్గ పైన ముద్దు పెట్టుకొని బయలు దేరాను. బస్ స్టాండ్ వరకూ వచ్చి , బస్ వచ్చాక నన్ను ఎక్కించి వెళ్ళి పోయింది జాన్ బీ. దేవుడి లెక్కలు ఎప్పుడూ సరిగానే వుంటాయి. ప్రమాదాలు కలిగించి న ఆ దేవుడే ఏదో ఒక రూపంలో ప్రమోదాలూ కలిగిస్తాడు. సావిత్రి లాంటి ఉత్తమురాలిని ఆ ఇంటి కోడలిగా చేసి జాన్ బీ కి స్వాంతన అందించాడు. రెహ్మాన్ టెన్త్ క్లాస్ వాళ్ళకు లెక్కలు టూషన్ కూడా చెప్పుతున్నడట. ఏదో ఒక విధంగా ఆ కుటుంబానికి ధనం చేకూరుతుంది.

ఫ్యూచర్ లో కంప్యూటర్ వాడకం బాగా పెరుగుతున్నది. తెలివైన రెహ్మాన్, సావిత్రి కూడా అవకాశాలను అంది పుచ్చుకుని, ఆ రంగంలో కూడా అడుగు పెట్టారట. ఇంక వారి కుటుంబానికి సంబంధించినంత వరకూ లోటుండదు. నిస్వార్థ సేవకు, ప్రేమాభిమానాల కు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఆ అత్తా కోడళ్లను మనసులోనే అభినందించి, తృప్తిగా కళ్ళు మూసుకుని సీట్ కు జారగిల్లాను.

కవిత

# ఆమెకు ఆమే సాటి



- నస్రీన్ ఖాన్
9652432981

కోడి కూత విన్న తొలి పొద్దులా
ఇంటిల్లిపాదికీ అలారమ్ ఆమె
కసువు తీసి,
కొట్టమూడ్చి,
నునుపైన వాకిలిలో సానుపుతో ముగ్గె కళకళలాడుతుంది

తడియారని కురులను ముడివేసి
వేకువ కిరణపు వెచ్చదనాన్ని ప్రేమారగ
ఆహ్వానిస్తుంది

కుడితి కలిపి, పాడి పశువుల
కడుపు నింపే అమ్మ
పాలు పితికి
ఉపవాసపు రాతిరిని తరిమికొట్టి
నిద్దుర కళ్ళతో అలుముకున్న బిడ్డల
ఆకలి తీర్చే అన్నపూర్ణ

బీడు వారిన పంట చేల
దుక్కి దున్ని
దాహం తీర్చే అపర భగీరథి
అయినా
ఆకలేగా ఆమె చిరునామా

పిడికెడు మెతుకులు వెతుకుతు
పట్టణపువలస జీవియై అడ్డా కూలీగా
ఉప్పర పనిలో నిమగ్నమై
రెక్కలు ముక్కలు చేసుకునే సమిధా ఆమెనే

తీరైన కట్టూ బొట్టుతో నిండైన రూపం
హుందాగా కార్యాలు నిర్వర్తించే
దక్షత నిండిన ఆఫీసర్ గా
నీరాజనాలు అందుకుంటున్నదీ ఆమే

చురుకుదనపు పాదరసం ఆమె!
సాంప్రదాయాధునికత మేళవింపుల వారధి ఆమె!
మన సంస్కృతికి ప్రతిరూపం ఆమె!
సాటి లేని ప్రతిభకు ప్రతిబింబం ఆమె!!

కవిత

# ఎర్ర మరక

- సాకేర
9949333391

ఉదరంలో తిండికై బాధ
ఆకలి
రుధిర ధారలో కడుపు నరాలు
నడుముని మెలివేసే బాద
నెలసరి

మలినం అయినా మనసుల్లో
దురాచార మరక అంటించిన
పవిత్ర రక్తపు వ్యధ ఇది
నా కథ ఇది

నా అనుమతి లేకుండా
వచ్చే రక్త స్రావంలో
జీవనది ఎండిపోతూన్నట్లు
ప్రతి నెలా 5 రోజుల
జీవన్మరణ వేదనా నాది

నా అవసరాన్ని నేనే గుర్తించని
సంప్రదాయంలో కొనసాగుతున్న
మూఢాచారాన్ని

అణచివేతకు
ముడిసరకుగా మారిన ఆటవస్తువుని
చిర కట్టులో
దాగిన ఇంటి పరువుని

నవ మాసాల బాధకు
తల్లిని
నెలసరి స్రావంలో
తీవ్రమైన అసమ్మతిని

గాయం అయితే కన్నీరు,
భరించలేని నొప్పి
గాయం లేకున్నా
పేగు తెగెంతా నొప్పి,

ధారల రక్తంవచ్చిన
పట్టదు ఎందుకని ?

మొన్నటి వరకు
మురికి గుడ్డలో
బిగుసుకున్న సుకుమార
మర్మాంగం పై
ఫంగస్ పుండ్ల తో బాధపడుతూ
శానిటరీ ప్యాడ్ కు బదిలీ అయ్యింది

దాన్ని కూడా
దొంగ చాటున పేపర్ మాటుగా
కొనుక్కోనే, నా దుస్థితి
మౌనంగా దాక్కుంది

నా శారీరక అవసరం ఇంకా
పరువుకి బలి అవుతునే ఉంది

పొట్ట నరాలు గుంజె గుండె దడా
కాళ్లు పట్టి లాగే బాధ

నడుస్తూ వుంటే
నడుము విరిచినట్టు
పని చేస్తుంటే పానం పోయినట్టు

ఇంతటి బాధను
నవ్వుతూ సహిస్తూ
నీ ముందే తిరుగుతూ
కావలసినది చేసి పెడతా

అయినా
నువ్వు చూసే కోణం
మారాలేదు
నా పానంతో ముడిపడిన
మూఢం పోలేదు

అడుగు తీస్తే అపశకునం
మూలకు ఉంటే
సుచి కాపాడిన
మంచితనం

యోని నుంచి వచ్చే బిడ్డకు
లేని మరక
యోని నుంచి వచ్చే రక్తాన్ని
అంటుకున్నది

నా నెలసరిని
మరకగా చూస్తూన్న నీవు
నా గర్భంలోని
రక్తపు మడుగు లో
ఏనాడో మునిగావు
నీకు అంటని మరక
నాకే ఎందుకు అంటుకుందో!

నా తొడల మధ్య సుఖాన్ని
అంగీకరించిన పురుషుడా
నా రక్త స్రావన్ని ఎందుకు
అంగీకరించ లేదో ?

పుట్టే బిడ్డకైనా గర్భంలో
బ్రహ్మండం దాచిన విధాత
ఆ రక్తాన్ని నా కడుపులోనే
ఎందుకు దాయాలేదో?

రతి పై ఆసక్తి లేకున్నా
ని వీర్యపు వ్యర్ధాన్ని భరించే నేను
తరాలుగా నా దేహం పై
అత్యాచారాలు చేసే నువు
నా రక్తపు మరకని
భరించలేకున్నావు
అని గుర్తు చేస్తూంటుంది

ఇంటర్వ్యూ

# మహిళానుబంధాల సాక్ష్యం



- లావణ్య

ప్రపంచాన్ని వణికించిన కరోనా, ఎందరో జీవితాలను అతలాకుతలం చేసింది. ఆ భయంకర భీభత్సంతో పాటు కొంత మంది కొత్త వ్యక్తులను పరిచయం చేసి, కొత్త విద్య నాట్యం నేర్చుకొనే అవకాశం ఇచ్చింది నాకు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవ ప్రత్యేక సంచిక 'బహుళ' కోసం, ఒక నాట్యగురువును ఇంటర్వ్యూ చేశాను.. నేను లావణ్య, నా పదేళ్ళ చిన్న కూతురు శ్రేష్ఠతో కలిసి ఒకే గురువు దగ్గర నాట్యం నేర్చుకొని.. మా విశాఖపట్నంలోనే కాక 'కాళహస్తి' వంటి ప్రదేశాలలో కూడా ప్రదర్శనలిచ్చాము.. రండి వారితో మాట్లాడి కొన్ని స్ఫూర్తిదాయకమైన సంఘటనలు విందాం..

నేను(లావణ్య): నమస్కారం మేడం ఈరోజు మీకు శిష్యురాలిగా కాక వేరే మాట్లాడటానికి వచ్చాను మేడం...

డాన్స్ టీచర్ (శశిలత): రా అమ్మా... ఎలా వచ్చినా.. నీకు ఆహ్వానమే లావణ్యా...

లావణ్య : మీ పేరు, అమ్మా నాన్నల పేర్లు, మీ పుట్టిన తేదీ చెప్పండి. మీ వృత్తి...

శశిలత :మా నాన్నగారి పేరు కృష్ణ, అమ్మ పేరు ఈశ్వరవేణి. నేను నవంబర్ 9, 1988లో పుట్టాను. మాది చెన్నై. నేను ఫైన్ ఆర్ట్స్ లో ఎం.ఎ, ఎం.బీ.ఏ. చేశాను. నా పేరు పి. శశిలతా కృష్ణ. నేనొక ఉద్యోగిని.. ప్రస్తుతం డాన్స్ టీచర్ని.

లావణ్య : ఏమి చేస్తున్నారు.. ఈ కరోనా టైంలో...

శశిలత : ఈ పాండమిక్ టైం మొదట ఒకటీ రెండు వారాలు ఉంటుందనుకున్నాను. ఒక రోజు టీవీ లో 'చైనాలో మొదలైన వైరస్' గురించి విని కెనడాలో వున్నా కజిన్ కు చెప్పాను. తను అంత సీరియస్ గా తీసుకోలేదు తరువాత వైరస్ ఎక్కువ అవడం తో అయన నమ్మి కేర్ తీసుకున్నారు. నాకు కూడా జాగ్రత్తలు చెప్పారు.

కరోనా టైం లో నేను చెన్నై నుంచి ఆంధ్ర యూనివర్సిటీలో క్లాస్ చెప్పడానికి వచ్చి అకస్మాతుగా లొక్డౌన్ లో చిక్కుకు పోయాను. ఆ టైంలో మా అత్తగారు, మామగారు, మా ఆయనగారు చాలా దిగులు పడ్డారు, నాకు మా ఫ్యామిలీ నుండి తిరిగి వచ్చేయమని ఒత్తిడి పెరిగింది. ఆ టైమ్లో నేను కొంచెం డిస్టర్బ్ అయ్యాను. ఎటూ వెళ్ళలేని పరిస్థితి, పరిమిషన్ ఇవ్వడం లేదు చెన్నై వెళ్ళడానికి.. చాలా దిగులు పడ్డాను.

లావణ్య: మరేంచేశారు ఆ సమయంలో...?

శశిలత: అపుడే ఆంధ్రా యూనివర్సిటీ వాళ్ళు ఆన్లైన్ క్లాసెస్ స్టార్ట్ చేసారు... అదే టైమ్ లో మా నాన్నగారు, మా అన్నగారి పిల్లలకు కూడా కూచిపూడి నాట్యం నేర్పించామన్నారు.

అంతే.. మరలా నా డ్యాన్స్ క్లాస్ ని ప్రారంబించాను. తాళం శబ్దం విని పక్కన ఉన్న వారు కూడా వచ్చి మా పిల్లలకు నేర్పమని అడిగారు.

అప్పుడే కొంత మంది పెద్దమనుషుల సహాయంతో మా అపార్ట్మెంట్లో ఒంటరిగా కాళీగా ఉన్న షెట్టర్లో క్లాసులు ప్రారంభించాను.. దానితో పాటు ఆన్లైన్ ఇంటర్నేషనల్ క్లాసులు కూడా చెప్పేదాన్ని.

లావణ్య : మరి మీ కుటుంబ సభ్యులు అంగీకరించారా?

శశిలత: ఇంకా కొన్నాళ్లు వైజాగ్ లో వుండడం తప్పదు.

కాబట్టి కొన్నిరోజులు క్లాసులు చెప్పుకోమని మా ఆయనగారు నన్ను ప్రోత్సాహించారు.

లావణ్య : అసలు ఈ కళారంగంలోకి ఏల వచ్చారు ?

శశిలత: నా బాల్యంలో సినిమా పాటలకు డ్యాన్స్ చేస్తూండేదాన్ని. అది చూసి మా అమ్మానాన్నలు నన్ను భరతనాట్యం తరగతులకు పంపారు. అపుడు నా వయసు సుమారు ఐదు సంవత్సరాలు. అలా రెండు సంవత్సరాలు భరతనాట్యం నేర్చుకొని, ఆ తర్వాత కూచిపూడిని కంటిన్యూ చేసాను.

లావణ్య: నాట్య గురువుగా ఎప్పడి నుండి నేర్పుతున్నారు?

శశిలత: నాకు పదిహేడు సంవత్సరాల వయసులో డి.వి.ఎం. కళాశాలలో క్లాస్లు చెప్పాను. మా గురువు గారికి ఒక నమ్మకస్తురాలయిన విద్యార్థిగా వుండేదాన్ని. 2010లో మా అమ్మగారి అనారోగ్యం వల్ల, నెలకు నాలుగు ప్రోగ్రాముల నుండి ఒక ప్రోగ్రాము చేయాల్సి వచ్చింది.

లావణ్య: మీరు ఏమి చదువుకున్నారు ?

శశిలత: ఫైన్ ఆర్ట్స్ లో ఎమ్.ఎ. చేసాను. జూనియర్ గా వున్నపుడు స్కాలర్షిప్ సంపాదించుకున్నాను. 2211 మరల సీనియర్ గా ఒక స్కాలర్షిప్ని సంపాదించుకున్నాను.

లావణ్య: మీ జీవతంలో ఆనందకరమైన సంఘటనలు చెప్పండి ?

శశిలత: మా నాన్నగారు నేను చేసే ప్రతిపనిని ప్రోత్సాహించే వాడు. కానీ, నా ఒక్క ప్రోగ్రామ్ కు కూడా ఆయన హాజరు కాలేదం. 2006లో అనుకుంట! మా నాన్న 'నా సోలోప్రోగ్రాం' చూశారు. ఆ ప్రోగ్రామ్ లో మా నాన్నగారు కళ్ల నీళ్ళు పెట్టుకున్నారు. అది నేను చూసాను. మా నాన్నగారు నా ప్రోగ్రాంకి రావడమే నా జీవితంలో గొప్ప ఆనందకర సంఘటన.

లావణ్య: అవమానాలని అనుభవించారా? ఎలా వాటిని అధిగమించారు ?



శశిలత: నాట్యం నేర్చుకోవడానికి మనము అర్హులం కామని, అదో ఒక బ్రాహ్మణ జాతికి చెందిన కళని వేరే కులాలు వాళ్ళు నేర్చుకోవాలనుకున్నా నేర్చుకోలేరని, శ్లోకాలు ఉచ్ఛరించలేమని, పాటలు పాడలేమని, మనని అవమానించాలని అనుకున్న వారికి, నేను సమాధానంగా ఈరోజు నిలబడ్డాను.

లావణ్య: జీవితంలో మీరు సాధించిన విజయాలు..

శశిలత: నేను ఎంచుకున్న నాట్య కళే నేను సాధించిన విజయం అని చెప్తాను. ఎందుకుంటే ? నాట్యం నుంచి చాలా నేర్చుకుంటాము. పెద్ద వాళ్ళతో మన వ్యవహార శైలి ఎలా ఉండాలి, గౌరవం, మర్యాదల, సంస్కారం అన్నీ నేర్పుతుంది. మన సంస్కృతి సంప్రదాయాలను జీవింప చేస్తుంది. అన్నింటి కన్నా దేవుని కి దగ్గర వుండేలా చేస్తుంది.. నాట్యం ఒక ఆరాధన!! అన్నమయ్య తన కీర్తనలతో ఆరాధించినట్లు మనం నాట్యంతో ఆరాధిస్తామన్న మాట.

వ్యక్తిగతంగా సాధించినవి జాతీయ స్థాయిలో ఒకసారి స్వర్ణపతకం, మరోసారి రజత పతకాన్ని సాధించాను.

లావణ్య : మీ జీవితంలో ఎటువంటి వివక్షనైనా ఎదుర్కొన్నారా ?

శశిలత: చాలా వివక్షను ఎదుర్కొన్నాను అని చెప్పాలి. కొన్ని సంవత్సరాల క్రితం నాట్యం నేర్పే గురువులు మగవారే ఉండేవారు. నాట్యం నేర్చుకునే వారు కూడా పురుషులే ఉండేవారు. దీనికి కారణం ఏమిటంటే ? ఒక ప్రాంతంలో నాట్యం చేసి, మరొక ప్రాంతానికి వెళ్లడానికి స్త్రీలకు ప్రమాదమని కారణం చెప్పేవారు. పెళ్లయిన తర్వాత ఈ నాట్యాన్ని స్త్రీలు కొనసాగించ లేరు. పెళ్లితో నాట్యం ఆగిపోతుందని ఉద్దేశంతో ఆడవాళ్లను నాట్యం నేర్చుకోవడానికి ప్రోత్సహించేవారు కాదు. కొన్ని బ్రాహ్మణ సమూహాలు స్త్రీలను బానిసలుగానే ఉంచాలి అనుకునేవారు. స్త్రీలకి ఎటువంటి జ్ఞానం, కళ, చదువు లాంటివి నేర్చుకోవడానికి అవకాశం ఇచ్చేవారు కాదు.

**కవిత**

# తరువు_తనువు

**శారద ఆవాల**
**9295601447**

తరువో  తనువో
పరులకోసం పాటుపడని
పుటకేం పుటకని?
పచ్చదనాలను ప్రసవిస్తూ తరువు
శిశిర శిలల శిరసెత్తి
చిగురించే అవసరాన్ని లోకానికి
గుర్తుచేస్తుంటుంది
తరువులు తరునులు
ఒకరినిని ఒకరు పోలివుంటారేమో
జీవజలాల్ని తోడి
సేవా సుమాలుగా విచ్చుకుంటు ఒకరు
అమృత ఫలాలై పండి
మాధుర్యపు రుచులు పంచుతూ ఒకరు
ఎపుడనావిరగపండిన తరువును చూసారా
పిల్లల్ని పొదువుకున్న అమ్మలా వుంటుంది
ప్రాణవాయువును ప్రసరిస్తూ ఒకరు
ప్రాణాలకు ప్రాణం పోసి ఒకరు
తమ గర్భాలలో ప్రే మను పొదిగి
కాలాత్తో సాగిపోతువుంటారు
అవసరాలకు బీరపాదులా అల్లుకొని
చేతులు సాచి నీడలు పరుస్తారు
కమ్మతెమ్మెరలుగా వీచి
గుప్పెళ్ల హాయిని పంచుతారు
ప్రేమ ధార లుగా కురిసి
జీవ సారమై మొలకెత్తుతారు
మిట్టపల్లాల లోకంలో
మిన్ను విరిగి మీద పడలేదంటే
అందుకు బలమైన కారనం
అమ్మలూ కొమ్మల కరుణ కాదూ
ఎందుకంటే వారు
మట్టి మీదమిగిలిన జీవసంతకాలు

వ్యాసం

# శ్రీమతి బండారు అచ్చమాంబ గారి కథల విశిష్టత



**ముద్దు వెంకట లక్ష్మి**

"నేను పెండ్లాడిన భార్యను కానీ దాసిని కాను. వివాహం ఆడుట వలన భర్తకు దాసి అగుదునా?"

మగువ స్వతంత్ర పోకడకూ హేతుబద్ధమైన ఆలోచనా విధానానికీ తార్కాణమైన ఈ వాక్యం ఈ ఆధునిక యుగం లోని 21వ శతాబ్దపు ఏ రచయిత్రో అన్నది కాదు, 19వ శతాబ్దపు చివరి సంవత్సరాలు, 20వ శతాబ్దపు తొలి సంవత్సరాలకు మధ్య అంటే 1898 – 1904 మధ్య ఒక స్త్రీ వ్రాసిన మొట్టమొదటి తెలుగు కథలోనిది అంటే ఎంతో ఆశ్చర్యంగా ఉంటుంది కదూ, కానీ ఇది వాస్తవం మన మహిళలందరికీ గర్వ కారణమైన విషయం. తెలుగు కథా సాహితీ చరిత్రలో మొట్టమొదటి కథగా గుర్తింపు పొందిన 'గుణవతి యగు స్త్రీ' అనే కథను వ్రాసిన ప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి బండారు అచ్చమాంబ గారి గురించి చెప్పబోతున్నాను. శ్రీ గురజాడ అప్పారావు గారు వ్రాసిన 'దిద్దుబాటు' కథకు పదేళ్ళకు ముందే అంటే 1901 లోనే అచ్చమాంబ గారు వ్రాసిన ఈ కథ 'తెలుగు జనానా' అనే పత్రిక మే సంచికలో వచ్చింది. ఇంకా 'ధన త్రయోదశి' అనే కథ కూడా 'దిద్దుబాటు' కు ముందే 1902 లో 'హిందూ సుందరి' అనే పత్రికలో వచ్చింది.

శ్రీమతి బండారు అచ్చమాంబగారు కృష్ణా జిల్లా నందిగామ వద్ద పెనుగంచిప్రోలు అనే గ్రామంలో జన్మించారు. ఈమె ఆంధ్ర విజ్ఞానసర్వస్వము అనే పరిశోధనా గ్రంథాన్ని రచించిన శ్రీ కొమఱ్ఱాజు వేంకట లక్ష్మణరావు గారికి అక్క. ఈమెకు ఆరేళ్ళ వయసప్పుడే తండ్రి చనిపోయారు; పదేళ్ళ వయసులోనే మేనమామ మాధవరావు గారితో వివాహం అయ్యింది, తల్లి, తమ్ముడు వీరితో పాటే ఉండేవారు. భర్త ఉద్యోగరీత్యా కొన్నాళ్ళు నాగపూర్ లో ఉండడం వల్ల మరాఠీ, హిందీ భాషలు నేర్చుకున్నారు. మాధవరావు గారు ఆరోజుల్లో ఆమెకు విపరీతమైన ఘోషా పెట్టేవారుట, కాలి మట్టెలు కూడా ఎవరికీ కనిపించకూడదనేవారుట. అయితే, స్వతంత్ర భావాలున్న అచ్చమాంబ గారు తన సౌశీల్యంతో, చక్కని ప్రవర్తన తో ఆయనలో గొప్ప పరివర్తనను తీసుకు వచ్చేరు. ఆమె ఏమీ చదువుకోలేదు గానీ చాలా తెలివైనది. తన తమ్ముడు ఎమ్ ఏ తెలుగు కోసం చదువుకుంటూ ఉంటే వారి పుస్తకాలు తీసుకుని చదివేవారట. స్త్రీ పురుషులిద్దరూ సమానమేననీ, కుటుంబంలో సమాజంలో ఈ సమానత్వ భావన పెంపొందాలంటే, సంఘంలో అందరూ ప్రగతిని సాధించాలంటే ముందుగా స్త్రీలలో చైతన్యం రావాలనీ, అందుకోసం వాళ్ళు బాగా చదువుకోవాలనీ ఆమె దృఢంగా నమ్మేవారు. స్త్రీలు కూడా మేధస్సు విషయంలో పురుషులతో సమానులేననీ, చదువుకుంటే ఇంకా బాగా రాణిస్తారనీ అనేవారు. చదువు విషయంలో తల్లిదండ్రులు, సంఘం చూపుతున్న పక్షపాతం వల్లనే స్రీలు వెనక బడిపోతున్నారు గానీ వారు తెలివితేటల విషయంలో

పురుషులకు ఎంతమాత్రమూ తీసిపోరనీ అంటూ అచ్చమాంబ గారు ఇటువంటి భావాలతో గుణవతి యగు స్త్రీ, ధనత్రయోదశి, లలితాశారదులు, అద్దమునూ సత్యవతియూ, స్త్రీవిద్య మొదలైన ఉత్తమ కథలు వ్రాశారు. ఇప్పటి మన రచయిత్రులు వ్యక్తపరుస్తున్న స్త్రీవాద భావాలన్నీ ఈ కథల్లో కనిపిస్తాయి, అంతే కాదు ఈమె కథల ద్వారా నాటి సమకాలీన వివిధ భాషల రచయిత్రుల గురించి కూడా తెలుస్తోంది. అంతే కాకుండా, తమ్ముడు లక్ష్మణరావు గారి సహాయంతో 'అబలా సచ్చరిత్ర రత్నమాల' అనే పేరుతో అప్పటికి వెయ్యి సంవత్సరాల కాలంలో చారిత్రకంగా ప్రసిద్ధికెక్కిన మహిళల జీవితాలను మృదుమధుర శైలిలో వర్ణించి, సాటి స్త్రీలకు శాశ్వతమైన ఉపకారం చేసేరు. ఈ పుస్తకాన్ని శ్రీ కందుకూరి వీరేశలింగంగారు ప్రచురించారు. ఈమె ఇంకా ఒక శతకము, క్రోషియా, ఊలు అల్లికల గురించి పుస్తకాలు కూడా వ్రాసారట, కాని అవి ప్రస్తుతం అలభ్యం.

1902 వ సంవత్సరంలో శ్రీమతి ఓరుగంటి సుందరీ రత్నమాల గారితో కలసి మచిలీపట్నంలో 'బృందావన స్త్రీల సమాజం' అనే మొదటి మహిళా సమాజం స్థాపించారు. రాష్ట్రవ్యాప్తంగా పర్యటించి ఎన్నో స్త్రీల సంఘాలను ఏర్పరిచారు. అనాథ పిల్లల్ని చేరదీసి చదువు చెప్పించేవారు. సామాజిక సేవలో భాగంగా, ఆరోజుల్లో నాగపూర్ లో వ్యాపించిన ప్లేగువ్యాధి బారిన పడిన రోగులకు సహాయం చేస్తూ, తనకే ఆ ప్లేగు రాగా ఆవిడ పరమపదించారు. కన్ను మూసేటప్పటికి ఆవిడ వయస్సు 30 సంవత్సరాలు మాత్రమే. ఆమె కనుక ఎక్కువ కాలం జీవించి ఉంటే ఇంకా ఎన్నో ఉత్తమ రచనలు చేసి ఉండేవారు. ఇంత గొప్ప వ్యక్తీ, రచయిత్రీ అయిన శ్రీమతి బండారు అచ్చమాంబ గారి గురించి ఈ వ్యాసం వ్రాసే అవకాశమిచ్చిన నిర్వాహకులకు హృదయపూర్వక ధన్యవాదాలు.

కవిత

# సాధికారత వైపు...!




**అయిత అనిత**

**మొబైల్ :8985348424.**


ఆలోచనలలోనూ ఆత్మీయతలోనూ
ఓర్పులోనూ నేర్పులోనూ
అణుకువలోనూ అనుబంధంలోనూ మేటి!
నేటి మహిళ....!!

గృహ నిర్వహణలో సవ్యసాచి
విధి నిర్వహణలో లేరెవ్వరూ సాటి
రెంటిని సమపాళ్లలో నిర్వర్తిస్తూ
అవనిపైనా ఆకాశంలోనూ
తన ఘనత చాటే నేటిమహిళ..!

గడియారపు ముళ్లతో పాటు గమిస్తూ
సూర్యునితో పోటీపడుతూ
ఉత్తేజ బాటలో పయనిస్తుంది నేటి మహిళ..!

అయినా!
స్వేచ్ఛా రెక్కల కత్తిరింపులలో నలుగుతూ
ఆంక్షల కంచెలో ఆవేదన చెందుతూ
అణచివేత పర్వంలో బాధను భరిస్తుంది...!

వేదికలనెక్కినా వేదనలు తగ్గలేదు..!
విజయాలు సాధిస్తున్నా సాధింపులు తగ్గలేదు..!
ముందుడుగేస్తున్నా ఎదురుదెబ్బలు వీడలేదు..!

ఇక ..
రావాలి మార్పు మనలోనే...!
సమాజంలో సంచరించేందుకై
ఆత్మస్థైర్యం పొదువుకుని పదండి పోదాం ముందుకు..!
అలుపు సొలుపు లేక గళం విప్పుతూ..
కలం కదుపుతూ..
నారి భేరిని మ్రోగిద్దాం!

కథ

# అక్షరానుబంధం



నాంపల్లి సుజాత,

మొబైల్ : 9848059893

ఇంటర్వెల్ టైమ్ లో కొత్త నంబర్ తో ఫోన్ రింగయ్యింది...!

హెచ్డీఎఫ్సి లోన్ గూర్చి సోది కాదుకదా అనుకుంటూనే..

'హలో 'అన్నా..!

అవతలి నుంచి కూడా

'హలో..! గుడ్ మార్నింగ్ మేడం.!' అంటూ ఆగింది ఓ సన్నటి తియ్యటి గొంతు.

ఈ వేళప్పుడు ఎవరబ్బా నా కోసం నేను బడిలో ఉంటానని తెలియని వారేమో అనుకుంటూ..

"గుడ్ మార్నింగ్ ..ఎవరూ..!? కొంచెం గట్టిగానే అడిగా

'మేడం, నేను..నన్ను గుర్తుపట్టలేదా..!?

కాసేపు ఆలోచించండి మేడం ప్లీజ్

నేను తప్పక గుర్తొస్తాను..మీ..మీ..నంటూ ఊరిస్తోంది

పేరు చెప్పకుండా ఆ సన్నటి తియ్యటి వాయిస్.

స్టూడెంట్స్ ఎవరో అయ్యుంటారులే.. పలకరిస్తూనే ఉంటారు కదా ఉపాధ్యాయులని ఆత్మీయంగా

ఇప్పటి వాళ్లే కాదు,పూర్వ విద్యార్థులూ కూడా మాట్లాడుతుంటారు కదా..ఒకటీ రెండు మాటల్లో

నా మెదడు ..ఫ్లాష్ ను అంది పుచ్చుకుంది.

"ఓహో..! నువ్వు ..లతా కదూ..!" అన్నానో లేదో.. అటునుంచి ఆనందాశ్చర్యంగా

'హా..మేడం..నేనే, మీ లతని..పెద్దసముద్రాల బడిలో చదివిన మీ ప్రియ విద్యార్థినిని నేనే..!'

ఉత్సాహంగా చెప్పుకుంటూ పోతోంది.

'తెలుసు రా..! నువ్ స్కూల్ టాపర్వి కదా.!అందునా చురుకైన పిల్లవాయే ఎలా మరచిపోతాం ఎవరితోనైనా స్నేహంగా ఉంటావు కదా ..నిన్నెలా మరుస్తాం రా..చెప్పమ్మా

ఎక్కడున్నావ్..ఏం చేస్తున్నావ్..!? 'అంటూ కుశలప్రశ్నలను ఒక్కసారే సంధించా..! ఆనందంగా

పూర్వవిద్యార్థుల పలకరింపులు ఉపాధ్యాయులను పులకింప చేసేవే..! వాళ్ళు వెలిగించిన దీపాలు కదా

ఎంత మేరా చీకటిని పారదోలాయో ఎంత వరకు తమను తాము వెలిగించుకుంటున్నాయో తెలుసుకునేందుకు ఆరాటపడతారు. బడి చదువు అయిపోయిందంటేనే బాధ్యత తీరిందని కాదు..వారి భవిష్యత్ ప్రణాళికలూ, కెరీర్ గైడెన్స్

సక్రమ తొవ్వ చూపాలని తాపత్రయ పడుతుంటారు.

నేను తన విషయాలను ఒక్కొక్కటే ఉత్సాహంగా అడుగుతూ తను చెప్పేది ఆలకిస్తూఉన్న..!

ఇప్పుడెలాగూ లీజరే..చాలా రోజుల తర్వాత కదా లతా నన్నే వెతుక్కుంటూ కలిసింది తీరికగా మాట్లాడాలి.

కడుపున పుట్టకున్నా విద్యార్థులంతా గురువులకు సొంత పిల్లల్లాంటి వాళ్లే.

చాలా సంవత్సరాలకు ఇలా కలిసామనేమో ఎన్నో విషయాలను పంచుకుంటోంది లత వాళ్ళ అమ్మతో పంచుకున్నట్టుగానే ప్రేమా ఆప్యాయతలను మేళవించి

'చదువంటే నాకు ప్రాణమనీ, నా లక్ష్యం టీచర్ అవ్వాలనీ మీకు తెలుసుకదా మేడం.!'

నా బాడ్ లక్..! అలాంటి నాకు చదువుకునే అదృష్టం లేకుండా పోయిందంటూ..ఏకధాటిగా తన బాధను విప్పి

చెపుతూనే ఉంది ఆతృతగా అమ్మను వాటేసుకున్న పాపలా

'ఏం ఎందుకూ.!?'

ఏమయ్యిందసలూ  అలా ఎందుకనుకుంటున్నావంటూ ఆరా తీశా..!

'అప్పుడు మీకు చెప్పలేదు కానీ,నాకు చిన్నప్పటినుంచే డయాబెటిక్ అటాక్ అయ్యింది మేడం'..

పదో యేటనుంచే నా దేహంలో మధుమేహం నిండిపోయింది

వారసత్వంగా మావాళ్ళు నాకు పంచినట్టున్నారంటూ

జీరగొంతుతో.. తన బాధని మొదటిసారి పంచుకుంటోంది బడి వదిలిన పదేళ్ల అనంతరం లత

'అయితే ఏంటి..!?'అంతలా విచారించడమెందుకు

దానివల్ల చదువు మానేయ్యాల్సినంత ప్రమాదమేమీ లేదుకదా ట్రీట్మెంట్ తీసుకుంటూ చదూ కోవచ్చనీ,

ఆ మాటకొస్తే.. మనదేశం లో సగం మందికి వాళ్ళ దేహం లో చెక్కెరను నింపుకున్న వాళ్లే నంటూ తను గ్రహించకుండా ఓదార్చే ప్రయత్నమ్ చేస్తున్నా..!

చదువు కొనసాగించేందుకు నా కళ్ళు నాకు సహకరించలేదు ఇంటర్ మధ్యలోనే మానేశా..! అప్పటినుంచీ ఇంట్లోనే గడుపుతున్నా.. మేడం

ఈ రోజెందుకో మనసేమ్ బాగలేక  జీవితం మీద విరక్తి పుట్టీ మీతో మాట్లాడలనిపించీ, పోషక్క దగ్గర మీ నంబర్ తీసుకున్నా.!

అందుకే  ఇప్పుడిలా డిస్టర్బ్ చేస్తున్నా..మేడం

'డాక్టర్స్ కి చూపించారా..ఏమంటున్నారు..!' లతా

'అన్నీ అయిపోయాయి..అందరినీ సంప్రదించాం.. ఇంట్లోనే ఉంటూ ఇన్సిలిన్ తీసుకోమన్నారు మేడం.!'బాధని కనబడ నీయకుండా గలగలా చెపుతోంది.కాస్త కృత్రిమ నవ్వుని మేళవించి.

'జనరల్ గా  షుగర్ ఎంతుంటుంది..!?

అయినా

ఏం కాదమ్మా..జీవనశైలీ..ఆహారపు అలవాట్లు

మార్చుకోవాలి అదే తగ్గిపోతుంది..!'

అన్నాను కానీ గుండెను పిండేసిన బాధ..! ఎలా ఓదార్చాలో కూడా తెలియడం లేదు. ఇంత చిన్నప్పటినుంచే ఇదేం వారసత్వ సంపదో..!

'మేడం మిమ్మల్ని ఓ సారి చూడాలనుంది..'

లోగొంతుకతో ప్రాధేయ పడ్డట్టు..లత

'సరే రా..! నేను వీలు చూసుకొని రెండు మూడు రోజుల్లో

నిన్ను కలుస్తా..!

★ ★ ★

అవును.. ఈరోజెలాగైనా లతా వాళ్ళింటికెల్లాలి

తన ఆరోగ్యం ఇంకా క్షీణించినట్టుంది..కిడ్నీస్ సరిగ్గా పనిచెయ్యడం లేదని చెప్పింది..! ఏదైనా చదవాలన్నా, రాయాలన్నా చూపు సహకరించడం లేదు.టీవీ కూడా చూడలేదు.ఏమిటో జీవితాలు ఎప్పుడెవరికి ఏమి జరిగేనో

ఎవరూహించెదరు.?

నేను బైక్ మీద కదా వెళ్ళేది ఇంకో రెండు నిముషాల్లో నా పూర్వ విద్యార్థినిని  పలుకరించి తనకు సాంత్వన నింపాలి.

'లతా..! ఉన్నావా..!!

ఏంచేస్తున్నావ్..ఎలా ఉన్నావు..నీకేం తెచ్చానో చూడు' ప్రేమగా పిలిస్తూ చేతులు చాచా..

లత ముఖంలో ఆనందం

'నాకోసం వచ్చారా..ఇంత దూరం

నాకేమీ వద్దు మీరొస్తే చాలు..నాకు ప్రాణం లేచి వస్తుంది..మీ మాటలు వింటే

కొండంత ధైర్యం..! కన్నుల్లో తడి కనబడనీయకుండా

పైకి నవ్వుతోంది..ఆత్మీయంగా దగ్గరకు తీసుకున్నా..!

'ఇదిగో.. నీకోసం ట్రాన్సిస్టర్  తెచ్చాను రా' ఇకనుండి నువ్వు..ప్రపంచాన్ని వినొచ్చు..పాటలు..మాటలు..అన్నీ నీ దగ్గరకే వస్తాయి ఓకే నా..! చూడు తీసుకో..!

కళ్ళింతలతో  బడిలో గెలుచుకున్న బహుమానం లా అపురూపంగా అందుకుంది.

ఉపాధ్యాయులకూ వారి విద్యార్థులకూ నడుమ ఎన్నటికీ విడదీయలేని  కనబడని ఓ ప్రేమానుబంధం పెనవేసుకునే ఉంటుంది.

లత ఆరోగ్యం గూర్చి వాళ్ళ అమ్మ అన్ని విషయాలు

వివరంగా చెపుతూ దుఃఖించింది..డాక్టర్లు కూడా ఏమీ చేయలేమని ఇంటికి పంపించారంది..ఈ అమ్మాయి కూడా ఇంక ఏ హాస్పిటల్ కి వెళ్లే ఓపిక లేదనీ  ఎటూ రానంటుందని చెప్పింది.

రోజులు గడుస్తూనే ఉన్నాయి రాను రాను లత ఇంటికీ.. మంచానికి పరిమితమయ్యింది .! తెల్లగా పిండిబొమ్మలా అందంగా ఆకర్షణీయంగా ఉండే చురుకైన అమ్మాయి..

గుర్తుబట్టలేనంతగా చిక్కిపోయివుంది.వీలు చేసుకొని అప్పుడప్పుడు కలిసి వెళుతున్న.

వారానికి ఒక సారైనా తప్పకుండా నాతో ఫోన్ లో మాట్లాడుతుంది..

ఇప్పుడు ఎందుకో కొత్తగా నన్ను అమ్మా అనిపిలుస్తోంది..

రేడియో లోంచి విన్న ముచ్చట్లని వార్తలని పంచుకుంటోంది ఉత్సాహంగా..

కూతుర్లు లేని నాకు..కొత్తగా ఈమె పై ప్రేమా వాత్సల్యం

పెరిగిపోతున్నయి..ఈ మధ్య ఆమె ఆరోగ్యమూ

వ్యక్తిగతవిషయాలతో పాటూ ప్రాపంచిక విషయాలనూ నాతో పంచుకొని తేలిక పడుతోంది!

అప్పటి వీళ్ళతరగతి వాళ్ళు ఆత్మీయసమ్మేళనం పెట్టుకున్నారట..తనూ బడికి అన్నతో బండిమీద వస్తుందట

ఉపాధ్యాయులను అందరినీ ఆహ్వానిస్తున్నారనీ

నేను కూడా తప్పకుండా వస్తానని..మురిసిపోతోంది.. లత ముందుగానే.!

అవును ఇంకా వారం రోజులకే వీళ్ళ బ్యాచ్ గెట్ టుగెదర్ సమావేశం.పిల్లలంతా మా అందరినీ ఆహ్వానించారు

తప్పకుండా వెళ్ళాలి.అప్పుడు లతని కూడా స్కూల్ కి తీసుక రావాలి.అందరితో కలిసేట్లు చూడాలి..అన్నీ మరచి ఇంకాసిన్ని రోజులు ఆనందంగా జీవిస్తుంది..

నా ఫోన్ లో లతా మిస్స్డ కాల్ ..ఎప్పుడు చేసిందో ఏమో..! నేనే పండగ పనుల్లో పడి చూసుకోలేదు..

తిరిగి చేస్తే ఎందుకో ఫోన్ కలవడం లేదు..!

సరే ఇంకో నాలుగైదు రోజుల్లో ఎలాగూ కలుస్తాను కదా అప్పుడన్నీ మాట్లాడొచ్చు లే..! అనుకొని తిరిగి కాల్ చెయ్యలేదు

పదీ పన్నెండేళ్ల తర్వాత కదా అప్పటి పిల్లలను

ఇప్పుడే మళ్ళీ చూడ్డం..పేర్లు మరచిపోయుంటామ్.

వాళ్ళు పెద్దవాళ్ళై గుర్తించలేనంతగా మారిపోయుంటారు..! అనుకుంటుండగానే..

ఫోన్ రింగయ్యింది. మధు నుంచి కాల్..

'హలో..! ఏంటి మధూ..రేపుకదా సమావేశం..!

ఇన్ టైం లోనే వాస్తలే.!'వాడి మాటలు వినకుండానే అన్నీ నేనే చెప్పేస్తున్నా..!

'మేడమ్..! సారీ మేడం ఓ విషాద వార్త.! మీటింగ్ పోస్ట్ ఫోన్ అయ్యింది..విచారంగా..

'ఎందుకూ.. మధూ..ఏమయ్యింది..! ఆత్రంగా అడిగా

మా క్లాస్ మెట్..లతా లేదూ మేడం

తను నిన్న రాత్రే..మా అందరినీ వదిలిపెట్టి తిరిగిరాని లోకానికి

వెళ్ళిపోయింది..!ఆర్ధ్ర గొంతుతో..మధూ

' అయ్యో..! నిజమా..!! ఎంత పనయ్యిందీ...నాకైతే

దుఃఖం కట్టలు తెంచుకుంది . కళ్ళ ముందు 'అమ్మా' అంటూ గలగలా మాట్లాడే లత ఇక కనబడదా.!?

నిజానికి తనెవరో నేనెవరో.. రక్తబంధం లేకున్నా మనసుకు దగ్గరయ్యింది.గుండె మెలిపెట్టిన బాధ ఎంతకూ తెరుకోలేక పోతున్నా..

మొన్నటి తన మిస్స్డ కాల్ నేనే చూసుకులేదు. ఎంత అవస్థ పడిందో, ఏం చెప్పాలనుకుందో.. బిడ్డ..! శాశ్వతంగా మిస్ అయ్యాను..!

ఒక పువ్వు వికశించకముందే రాలిపోయింది..!

ప్రవహించే ఓ సెలయేరు అర్ధాంతరంగా ఆగిపోయింది.

ఒక పాట గమ్యానికి చేరకముందే ఆగింది

వాళ్ళ అమ్మానాన్న ఎంత రోధిస్తున్నారో..! కొన్నాళ్ళు నన్నల్లుకు పోయిన విద్యార్థి..నా కళ్ళముందు అదేపనిగా మెదులుతోంది.

తరాలనుంచీ,యుగాలనుంచీ ఈ అక్షరబంధం ఇలా కొన సాగుతూనే ఉంది,ఉంటుంది.

తల్లి దండ్రుల తర్వాత అంతటి స్థానం ఎవరూ పూరించని ఆచార్యులదే.. విద్యార్థులకూ ఉపాధ్యాయులకూ నడుమ జీవితకాల అనుబంధం కొనసాగుతూనే వుంటుంది

అందుకే అంటారు..

మాతృదేవోభవ.

పితృ దేవోభవా..

ఆచార్య దేవోభవా..అని..!

కథ

# కొత్తతరం



- జయంతి వాసరచెట్ల
హైదరాబాద్, 9985525355

టెక్నాలజీ అంతగా అభివృద్ధి కాని రోజులవి .

సమయం ఉదయం 6 గంటలు కావస్తుంది......

సిద్దాయి పల్లె వీధుల్లోని ఇళ్ల ముందు సందడి మొదలైంది. ఒక్కొక్కరే పెద్దర్వాజ తెరిచి ఇంటిముందు ఊడ్చి సాన్పి జల్లి ముగ్గులు పెడుతున్నారు.

వడ్లోళ్ళ సందుకాడ బండి పట్టలు కాల్వనింకె "పట్టల సుట్టు"పిడకలు పేరుస్తున్నరు.

బలిజోళ్ళు ...పసులను చేనుకాడికి కొట్టుకపోనింకె కొట్టం కాడికి పోయి .....గుంజకున్న తలుగు లు ఇడిసి దూళ్ళను అదలాయిస్తున్నరు.

కుమ్మరి రంగయ్య తెల్లవారుజామున "ఒందుబండి"కిపోయి వచ్చినట్లు న్నాడు.

ఇంటి ముందర కుప్పపోసిన "ఒందుమన్నును" జల్లెడ పట్టి పారతోటి ఒక్కదగ్గరికి అంటున్నాడు.

వీధి నల్ల దగ్గర బిందెలు లైన్లలో పెట్టిండ్రు . నల్లల రమేష్ సైకిల్ మీద పోతూ డబ్బ సప్పుడు చేస్తున్నడు.

"గదే కిలో ది ఆయిల్ డబ్బ ఉంటది గదా దాని మధ్యలో రంధ్రం చేసి వైరుతోటి సైకిల్ దండెం కు కట్టి సప్పుడుజేస్తడు" అట్లా సప్పుడు చేస్తే ...10 నిముషాల్లో నల్ల వస్తుంది అన్నట్లు.

ఓ...రమేషా నల్ల చాలుజేయనింకె పోతున్నావురా .వారీ!...జరనిదానంజేస్కో నేతిరంతా పొలానికి నీళ్ళువెట్టనింకె చేనుకాడ్నే ఉందుడయ్యింది కరెంట్ లేకుండె జరతెల్లారినంక చాలుజెయ్యరాదా బిడ్డా ....!!

పాచిపని ఇంకాగాలేదు అంటూ మహాదేవమ్మ అవ్వ,నర్సవ్వ ,బాలయ్య తాత కేకలేస్తున్నరు.

"అట్నే అట్నే ...,అవ్వా ....నేనూ.... చేనికి పోవాలె కదా!అని ...నసుగుకుంట ముందుకు పోయిండు నల్లల రమేష్.

★★★

పట్నం పొలిమేరల్లో కాస్తా వేరుచేసి నట్లుగా కనిపించే ఊరు సిద్దాయి పల్లె ఒక మారుమూల పల్లెటూరు.

మొత్తం 200 ఇళ్ళు ఉండవచ్చు. కులవృత్తులకు ఖజానా అంటరు.

ఉన్న ఒకటి రెండు ఎకరాలు సాగు చేసుకుని మిగిలిన రోజుల్లో వారివారి కులవృత్తులు చేసుకుంటారు. ఒక్కరోజు కూడా ఖాళీ గా ఉండరు .

రాత్రనక పగలనకా కష్టపడి పనిచేస్తారు.

★★★

రోజూలాగే ఈరోజు కూడా గాండ్లోళ్ళ ఇంటి ముందు పాలు పోయించుకోవడం కోసం జనాలు క్యాన్లు పట్టుకొని క్యూలో నిలబడ్డరు.

మెల్ల మెల్లగా ఊర్లో సందడి మొదలైంది.

ఓమల్లవ్వా .....జప్పున పాలుపొయ్యి నల్లలరమేష్ నల్లతిప్పనింకె పోయిండు పాలు ఇంట్లో పెట్టి నీళ్ళు నింపుకరావాలె మల్లవ్వ అని

"పాలకొచ్చినోళ్ళందరు తొందరవెట్టవట్టిండ్రు."

"నోరులేని జీవాలు.... దాంట్లకేంతెలుసు బిడ్డా ..".మనతొందరా ...!

ఆగంజెయ్యకుండి ఇప్పుడే కుడిదిదాగినయి . పోరగాడు లేగలను ఇడ్సిండు పిండంగనే తెచ్చిస్తడు ఏంటనే పోస్త జర ....తమాయించుండి నేనుగిన్నే కూకుంట అని మల్లమ్మ కూర్చున్నది.

★★★

అమ్మా..... స్కూల్ కు టైం అవుతుంది ....జెల్దిన రావే ...జడలెయ్యి....అంటూ కేకలేస్తుంది 9వ తరగతి చదువుతున్న రేవతి.

తల్లి ఇంకా రాకపోయేసరికి.......

అటూఇటూ చూస్తూ ఏదో ఆలోచనలో పడింది

ఇంట్లో అందరూ హడావిడిగా తిరుగుతూ ఎవరి పనుల్లో వాళ్ళు ఉన్నారు .

"నాయనమ్మ పాలకొచ్చినోళ్ళకు పాలుపోస్తుంది ఇప్పట్లో అక్కడినుంచి జరుగదు."

"అమ్మ రాత్రంతా నూనె గానుగ కట్టే దగ్గర ఉన్నది తెల్లారి ఏ 3గం లకో పడుకున్నుంటది.

మళ్ళీ పొద్దున్నే లేచి పాచిపనిజేసి 6గంటలకల్లా వంటజెయ్యాలె... నాకు చెల్లెలు కు జడలెయ్యాలె... చేను దగ్గర కల్లం కాడ కావలిగాసే గాసగాళ్ళకు రొట్టెలు చేసి సద్దిగట్టాలె. గానుగకట్టించుకోనింకె ఒచ్చినోళ్ళకు అంబలి చేసి దూపపొయ్యాలె.... అమ్మ ఒక్కతే ఎంతనిజేస్తది ఇన్ని పనులు....?"

రోజూ స్కూల్ నుంచి వచ్చినంక నాకు చేతనైనంత పని నేనూ చేస్తున్న చెల్లెలికి హోంవర్క్ చేయిస్త.... సామాన్లు తోమి మంచినీళ్ళ బోరింగ్ కు పోయి నీళ్ళు కొట్టుకొచ్చి కట్టమీద పెట్ట .

"నాన్న పశువులకు వేయనింకె చొప్పకత్తిరిస్తుంటే మోపులు కత్తెర్లపెట్టి పట్టుకుని నిలబడుత... కత్తిరించిన చొప్పను గంపలకెత్తుకుని కొట్టంలో ఉన్న గాట్లె పోస్త..."

"ఎంతజేసినా ఒడువనిపని ఇంతగనం అందరం కష్టపడినా నాకు ట్యూషన్ ఫీజు కట్టనింకె పైసలు లేవు అంటారు."

"పుట్టినరోజు నాడు కొత్తబట్టలు కావాలంటె కూడా

"మొన్న పండుగకు తెచ్చింది కొత్తదేకదా ఇస్త్రీ చేసుకుని వేసుకో బుజ్జి జర అర్థం చేసుకో బంగారు అంటారు."

"నాయనమ్మ నేమో ఆడిపిల్లలు మీకెందుకే సదువు వచ్చే యాడాది పెండ్లి జేసి పంపుతాం అంటది ."

"ఏం మేము ఆడపిల్లలు అయితే సదువుకోవద్దా....?"

మాకు పుట్టినరోజులు ఉండవా..?

అమ్మా... మేం పుట్టినప్పుడు పండుగ చెయ్యలేదా..?

ఎందుకమ్మా ఆడపిల్ల లు మనుషులు కారా.?

ఎన్నో ప్రశ్నలు..గట్టిగా అడిగింది కానీ.మాటలన్నీ పెదాలు దాటి బయటకు రాలేదు."

చుట్టాలింట్ల కార్యాలయితే అప్పుజేసన్న పెట్టుపోతలు చేస్తారు.

ఏమన్నంటే మనకు కావలిసినోళ్ళకు పెట్టాలె బిడ్డా రేపుపొద్దున మనం ఇంట్లో ఏం జరిగినా వాళ్ళు తెస్తరుకదా అంటారు.

ఎప్పుడో మనకు తెస్తారని ఇప్పుడు మనదగ్గర లేకున్నా అప్పుచేయాల్నా ?

మనం బాగా బతుకుతుంటే అవతలోల్లకు ఏమన్నా పెట్టొచ్చు మనం సరిగ్గా లేకుండా ఏంపెడ్తము అంటాను నేను '

ఆరిందమాటలు మాట్లాడకు బుజ్జీ చిన్నపిల్లవు నీకేందెల్వదు పెద్దోళ్ళ మాటలు.

ఊకో మీ నాయనమ్మ ముంగట అనేవు "నోరుమూసుకో" పో అవతలికి అంటారు అమ్మా బాపు.

అవును

"నేనుచిన్నదాన్నే కానీ నా ఆలోచన మంచిదే కదా ..!"

రాత్రీ పగలూ అందరూ ఇంత కష్టపడుతుంటరు ఎట్టి కష్టం ఎంత కాలం జేస్తారు ?

కొంచెం తెలివిని ఉపయోగిస్తే చేసే పనిలోనే మంచి లాభాలు తెచ్చుకోలేమా?

పుస్తకాల్లో కులవృత్తుల ప్రాధాన్యత గురించి చాలా చదివిన కదా ?

"అంతరించిపోతున్న కులవృత్తులు మళ్ళీ ప్రాణం పోసుకోవాలి..."

మరోసంవత్సరం అయితే 10వ తరగతి అయిపోతుంది.

నా చదువు ఆగిపోతుంది .పై చదువులు చదువాలంటే పట్నం పోవాలె .

"నా చదువు ఆగిపోతుంది"

నాకు ఇంకా చదువుకోవాలని ఉంది..

ఇందుకోసం నేనేమన్నా చేయగలుగుతనా ?

అని రేవతి ఆలోచిస్తూ కూర్చుంది."

★★★

వంట చేసి కట్టెలు బయటకు లాగి. కడుక్కున్న చేతులుతుడుచుకుంటూ...

"రామ్మా.. రేవతి నీకు తొందరగా జెడ అల్లి గానుగ కాడికి పోవాలె గిరాకీ చాలా ఉంది అంటూ దువ్వెన తీసుకుని వచ్చింది రేవతి తల్లి ప్రభావతి."

"ప్రభా ...ప్రభా..నూనె కొచ్చింద్రు చూడు రేవతి తండ్రి

భార్య ప్రభావతిని కేకలేస్తున్నడు.సరేనయ్యా. అన్నది ప్రభావతి.”

“పిల్లలు స్కూలుకు పోవాలె కట్టలేమోమందుతలేవు.

వంట అయ్యేసరికి ఇంత టైం అయ్యింది.

రిబ్బన్లు కట్టి కుచ్చులేసింది రేవతి కి” తలె ల” రోట్టె పప్పు పెట్టిన తిని పో బిడ్డా... అనుకుంటూ.. వెనక్కి చూడకుండాపోయి.

నూనె పావు తీసుకొని ఏమి నూనె పోయాలమ్మ చిట్టి?

నువ్వులనూనె పెద్దమ్మా

ఎంత ?

10 రూపాయలది అన్నది చిట్టి.

10 రూపాయలకి నూనె పోసింది ప్రభావతి ఆ అమ్మాయి ముఖం సంతోషంగా లేదు మళ్ళీ కొంచెం నూనె కొసరు పోసింది ప్రభావతి.

చిట్టి ముఖం వెలిగిపోయింది.

ఫ్రీగా కొంచెం నూనె పోసే సరికి ఎంత సంతోషం ఆపిల్లకి.

అనుకుంది రేవతి.

★★★

మధ్యాహ్నం లంచ్ టైం అయ్యింది.క్లాస్ దోస్తులతోటి కలిసి భోజనం చేస్తుంది రేవతి.

ఎవరైనా వెళ్ళి ఆఫీస్ రూం నుండి స్టాఫ్ రూం కీ మా లంచ్ బ్యాగ్ లు తీసుకుని రండమ్మా.! అన్నది శ్యామల టీచర్.

అందరం తింటున్నాం కదా ఎలా ?

అని ఒకరిముఖాలు ఒకరు చూసుకున్నారు రేవతి దోస్తులు.

నేను పోయి ఇచ్చొస్తనే..మీరు తినుండి ఎవరమైనా చేతులు కదుక్కోవాలికదా.? అన్నది రేవతి.

★★★

టీచర్ మీ లంచ్ బ్యాగ్ లు ఎంత బాగున్నాయో.!

దేనితోటి తయారుచేస్తారు?

ఇవి జ్యూట్ బ్యాగులమ్మా. నారతోటి చేస్తారు అంది టీచర్.

రేటు ఎంతుంటది టీచర్.?అంది రేవతి.

సైజును బట్టి 200,250,350 అట్లా ఉంటాయి ఎందుకమ్మా టీచర్

ఊరికేనే టీచర్.

“ఆ వాటర్ బాటిల్స్ అన్నీ పడేస్తారా టీచర్? అన్నది రేవతి.”

ఇవి యూస్ అండ్ త్రో బాటిల్స్ వాడుకుని పడేయాలి రి యూజ్ చేయకూడదమ్మా...

మేము హైదరాబాద్ నుండి వస్తాము కదా షాపులో వాటర్ బాటిల్ కొని బ్యాగులో వేసుకుని వస్తాము .

తాగేసిన బాటిల్స్,తిన్న డబ్బాలు అన్నీ డస్ట్ బిన్ లో పడేస్తారు ఇలా కుప్పలు తెప్పలుగా ఎక్కడంటే అక్కడే చెత్త పేరుకుపోతుంది.... ఒక్కోసారి చాలా బాధగా అనిపిస్తుంది. ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి..పెద్దగా నిట్టూర్చింది టీచర్.

“టీచర్ అంటూ రేవతి పిలిచేసరికి. హా... మళ్ళీ ఈలోకంలోకి వచ్చింది..!”

ఇంకా ఏమేముంటాయి టీచర్ హైదరాబాద్ లో అన్నది రేవతి.

లేనిదంటూ ఏమీ లేదమ్మా అన్నీ ఉంటాయి ఆప్యాయతలు తప్ప అన్నీ దొరుకుతాయి.

నీకో విషయం తెలుసా.? అన్నది టీచర్

ఏంటి టీచర్.?

మేము మాఇళ్ళల్లో వాడే ప్రతీ వస్తువు పల్లెలనుండే వస్తుంది .ఇక్కడ తక్కువ ధరకు కొని మాకు ఎక్కువ ధరకు అమ్ముతారు.

అంటూ అన్నీ విడమర్చి చెప్పింది టీచర్ రేవతి తో.

రేవతి కి మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

అంతలోనే

..రేవతీ బెల్ కొడుతున్నారు. రావే..అంటూ దోస్తులు పిలిచేసరికి

...టీచర్ క్లాస్ కు టైం అయ్యింది వెల్తాను

అంటూ వచ్చి సగం తిన్న బాక్స్ మూతపెట్టి సంతోషంగా క్లాస్ లోకి వెళ్ళిపోయింది.

★★★

సాయంత్రం స్కూల్ నుంచి తిరిగి వస్తున్న సమయంలో రేవతి దోస్తులు అందరితో ఏయ్ మీకో ముచ్చటజెప్పాలె అంటూ తనకొచ్చిన ఆలోచన పంచుకుంది.

ఏమోనే మాఇంట్లో ఏమంటారో ఏమో అడిగిచూస్తా

అందిమంగ

మాఇంట్లో నేను చెప్తే ఎవ్వరూ వినరక్కా అంటూ కిరణ్

నేను మా నాన్నతో చెప్పిచూస్తా. అంటూ గౌరి

ఇదేదో మంచి ఆలోచనే అనుకున్నట్లు జరిగితే మనం కూడా చదువుకోవడానికి మనిండ్లల్ల ఒప్పుకుంటారు అంటూ నిర్మల.

చూదుండే మనం మన ఇంటిని చక్కబెడుతున్నాం ఇందులో నష్టం లేదు ఇంకా మన ఊరి పేరు జిల్లా లో మారుమోగుతది.

ఇంకా మనం ఆదివారం రోజు కొత్త కొత్త ఆలోచనలు చేయొచ్చు.

ప్రస్తుతం మనూరోళ్ళమే 50 దాకా పిల్లలముంటం

పక్క ఊరోళ్ళు చాలా నే ఉన్నారు . అందరూ కలిస్తే ..?

ముందు మనం ఊర్లో మన ఇండ్లల్లో మొదలుపెట్టి ఒప్పుకుంటే పక్కూరోళ్ళకు చెప్దం సరేనా అంటూ రాజు..

సరే చాలా టైం అయ్యింది అనుకుంటూ అందరూ ఎవరి ఇళ్ళల్లోకి వాళ్ళు వెళ్ళిపోయారు.

★★★

చూస్తుండగానే 6నెలలు గడిచాయి.

ఈ 6 నెలల్లో...

రేవతి వాళ్ళ నాన్నతో మాట్లాడి గోబర్ గ్యాస్ ప్లాంటు కట్టించింది.ఇప్పుడు మంట సరిగా మండని కట్టెలతోటి కష్టపడుతలేదు వాళ్ళమ్మ.

గోబర్ గ్యాస్ తో ఇంట్లో 2 బల్బులు కూడా వెలుగుతున్నాయి

గ్యాస్ తయారైన తర్వాత బయటకు వచ్చిన పేడను పొలాల్లో చల్లితే

మంచిదని తీసుకుపోయి చల్లేవారు.

పొలాల్లో కూరగాయలు, ఆకుకూరలు పండించేవారు.

పట్నం కు పోయి ఖాళీ సీసాలు తెప్పించి నూనె పావుకిలో, అరకిలో, కిలో చొప్పున సీసాల్లో నింపి స్వచ్ఛమైన గానుగ నూనె ను వారంవారం జరిగే సంతకు పంపేవారు.

కుమ్మరి రంగయ్య తో మట్టితో చేసే ఫ్లవర్ వాజ్ లు,ఇసుకకుండలు, టీ కప్స్ తయారుచేసి చిన్నచిన్న షోపీస్ మోడల్స్ చూపించి చేయించి అందరూ కలిసి వాటిమీద మంచి డిజైన్లు వేసారు.

సూపర్ మార్కెట్లో మాట్లాడి నూనె డబ్బాలు సప్లై చేసేవారు.

వడ్ల చంద్రయ్య తాత ఆర్డర్ ను బట్టి తలుపులు కిటికీలు, టేబుల్స్,స్టూల్లు తయారుచేయించి పంపేవాడు.

పట్నంలో సిద్ధాయి పల్లె ఊరు పేరు మారుమోగుతోంది.

హైదరాబాద్ నుండి కూడా వచ్చి నూనె కూరగాయలు, మట్టి పాత్రలు, ఒకేసారి తీసుకువెళ్ళే వారు.

మారుమూల పల్లెకు క్రమంగా రవాణా సౌకర్యాలు పెరిగాయి.

పెద్దపెద్ద కాలనీల్లో పేరుకుపోయిన చెత్తను తెప్పించుకుని రీయూస్ చేయడం ఎలాగో అవగాహన పెంచుకున్నారు. కూలీదొరకని రోజుల్లో ,వాళ్ళ పొలాల్లో పనిలేని రోజుల్లో చెత్తను వేరుచేసి రకరకాల వస్తువులు తయారు చేసి దగ్గరలోని

పట్టణాలకు ఎగుమతి చేయసాగారు.

డబ్బు సంపాదించడం పై అవగాహన పెరిగింది.

పనికి తగినట్లుగా ప్రతిఫలం రాసాగింది. శారీరకశ్రమ తగ్గింది. మానసికంగా దృఢంగా అయ్యారు. ఆలోచనా శక్తి పెరిగింది.

ఇప్పుడు సిద్ధాయిపల్లి ఒక ఆదర్శవంతమైన గ్రామం.

★★★

ఈరోజు పదవతరగతి పరీక్షా ఫలితాలు వస్తాయని

అందరూ ఆత్రంగా ఎదురుచూస్తున్నాను.

ఒక్క రేవతి తప్ప అందరిముఖాల్లో ఉద్విగ్నత కనిపిస్తుంది.

స్నేహితులందరూ ఒకదగ్గర చేరి సమావేశమయ్యారు.

మనం అనుకున్న విధంగా ఎంతో కష్టపడి మనమన తెలివితేటలు ఉపయోగించి మనవాళ్ళకు మన ఊరివాళ్ళకు మంచి గుర్తింపు తెచ్చాము.

రిజల్ట్స్ వస్తాయి పాస్ అయినా 'ఏం చేయగలము!'. నాకు బెంగగా ఉంది అంది రేవతి.

మాకూ అంతేనే ఇంకా చదువుకోవాలని ఉంది ఇంట్లో మనకు పెళ్ళిళ్ళు చేసి పంపేస్తామన్నారు కదా..!

అంటూ అందరూ ఏడుస్తున్నారు.

..హే.గౌరీ మీ నాన్న వస్తున్నాడు చూడు అంది రేవతి.

కుమ్మరి రంగయ్య  పేపర్ పట్టుకుని సంతోషంగా పరుగెత్తుకుంటూ వస్తున్నాడు.

అతనితోపాటు ఇంకా నాలుగైదు మంది వస్తున్నారు.

ఓ...అందరూ ఇక్కడే ఉన్నారా..?

మీరందరూ ప్రథమ శ్రేణిలో పాస్ అయ్యారు సాధించారమ్మా..

గెలిచి చూపించారు. అమ్మా గౌరీ అంటూ తన కూతురును వీపుతట్టి మెచ్చుకున్నాడు.

అందరినీ మీ టీచర్లు స్కూల్ దగ్గరకు రమ్మన్నారు అంటూ ప్యూన్ సుబ్బయ్య పిలిచాడు.

ఇప్పుడా అంది రేవతి.

అవునమ్మా !ఇప్పుడే అందరూ వస్తున్నారు రండి అన్నాడు.

★★★

స్కూల్ దగ్గర బ్యానర్లు కట్టారు.ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు టెంట్ వేసారు

ఝండావందనం నాడు ఎలా చేస్తారో అలా ఏర్పాట్లు చేసారు.

ఊరి జనం అంతా అక్కడే ఉన్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులు కూడా వచ్చారు.

పిల్లలందరూ లైన్లో వెళ్ళి వారి స్థానాల్లో కూర్చున్నారు.

అంతలోనే ఒక కార్ వచ్చి ఆగింది.

అందులోంచి జిల్లా కలెక్టర్ గారు దిగారు.

వేదికపైకి వచ్చి గ్రామ అభివృద్ధి ని ఎంతగానో పొగిడారు.

గ్రామస్తులందరికీ నమస్కారం.

ఒకప్పుడు సిద్ధాయిపల్లి అంటే ఒక మారుమూల పల్లె

ఇప్పుడు జిల్లాలోనే ఆదర్శవంతమైన గ్రామం

మీరు ఆడపిల్లలను కాదు ఆణిముత్యాలలాంటి పిల్లలను కన్నారు.

వారికి మీరు జన్మనిస్తే వారు మీ జీవితాలను మార్చారు

తలరాతలను తిరగరాసారు

ఉద్యోగాలు లేక ఏంచేయాలో తెలియక ఎంతోమంది తమ కాలాన్ని జీవితాన్ని వృధా చేసుకుంటారు.

మీ పిల్లలు 10 వ తరగతిలోనే భవిష్యత్తు గురించి ఆలోచించి.అద్భుతం సృష్టించారు.

ఇంకా పై చదువులు చదివిస్తే దేశ ప్రగతినే మార్చేస్తారు.

ఇప్పటినుండి మీ పిల్లల చదువుకు అయ్యే ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది.

ఎంతవరకూ చదువుకుంటారో ?

ఏం చదువు కుంటారో ?వాళ్ళిష్టం

చదువులో ఫస్ట్ క్లాస్ లో పాసయ్యినందుకు అందరికి అభినందనలు.

అంటూ కలెక్టర్ గారు విద్యార్థుల తల్లిదండ్రులందరికీ పూలమాలలు తో సత్కరించారు

పాఠశాల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు .

మీరు నేర్పిన విద్య వల్లనే పిల్లలు ఇంత చక్కగా తయారయ్యారు.

పుస్తకాల్లో ఉన్నదే చదువుకాదు.

బ్రతుకుతెరువు చూపించేదే నిజమైన చదువు అని నిరూపించారు.

ఇంతటితోనే ఆగిపోకుండా తరువాతి బ్యాచులను కూడా తీర్చిదిద్దాలి అంటూ ఉపాధ్యాయులను.ఎంతగానో కొనియాడారు.

చప్పట్లతో ఆప్రదేశమంతా మారుమ్రోగింది.

★★★

అమ్మా ఆఫీస్ కు టైమయితుంది జడవెయ్యి రామ్మా తొందరగా అంటూ రేవతి తొందరపెడుతుంది.

అబ్బా ఇంకా చిన్నపిల్లవా బుజ్జీ పెళ్ళి చేస్తే ఇద్దరు పిల్లలకు తల్లివయ్యేదానివి జడవేసుకోవడం చేతకాదా ? అంది వాళ్ళ నాయనమ్మ .

మధ్యలో తండ్రి కల్పించుకుని

'అమ్మా..!' తొందరపడి పెళ్ళి చేసుంటే

నా బిడ్డ ఇంతపెద్ద చదువులు చదివేదా ..?

ఇంతమందికి ఆదర్శమయ్యేదా.?

ఇప్పుడు సమాజం పోకడలు తెలుసుకుంది కాబట్టి దాని భవిష్యత్తు కు ఎలాంటి ఢోకాలేదు మన 'కులదీపమమ్మా !'రేవతి మన కులదీపం అంటూ రేవతిని దగ్గర తీసుకుని నుదుటిపై ముద్దుపెట్టుకుని ఆశీర్వదించాడు తండ్రి.

వ్యాసం

# పాకాల యశోదారెడ్డిగారి వచన కవిత్వంలోని కొత్తచూపు



- డా. కొండపల్లి నీహారిణి

తొలితరం రచయిత్రులలో కవయిత్రులలో ఖ్యాతిగాంచిన వారిలో పాకాల యశోదారెడ్డిగారు ఒకరు. తెలంగాణ మాండలిక సొబగులను, వాడుక భాషను కవితల మాలలో మరువంలా, అగ్ని గుండంలోని ఎగిరే నిప్పుకణికల్లా రాసిబోసిన గొప్ప కవయిత్రి.

కథా రచయిత్రిగా ఎక్కువ ప్రాచుర్యంలో ఉన్నారు గాని యశోదారెడ్డి గారి వచన కవిత్వం చదువుతుంటే ఇజాలన్నీ ఆమె కలంపోటుకు తలవంచాల్సిందే అని అనిపిస్తుంది. సమాజంలోని చిత్ర విచిత్ర పోకడలన్నీ ఆమె వాక్యాలలో ఒదిగిపోయాయి. ఆమె కళ్ళల్లో పడిన ఎన్నో అంశాలను స్పృశిస్తూ చురకలు వేస్తుంటే పాఠకులు ఆశ్చర్యానికి గురి కావాల్సిందే! నిక్కచ్చిగా, సూటిగా ఎత్తుకున్న విషయాలను గమ్మత్తు చమక్కులతో కవిత్వీకరించారు. 'మా ఊరి ముచ్చట్లు', 'ఎచ్చమ్మ కథలు' వంటి స్థానిక పద సౌరవాలను వారి కథల్లో ఎట్లా అందించారో కవిత్వంలో తమదైన ముద్రతోనే రాసి వచనకవిత్వ లక్షణాలను , లక్ష్యాలను అందించారు.

''ఉగాదీ! నీ వయస్సెంతో తెలియదునాకు

కృతయుగపు తొలినాటి అరుణోదయం

అన్నారు నీ నవోదయం / అదే నీ శుభోదయం...

అంటూనే ఉగాది వస్తుగుణ ఉపమానాలతో ఈనాటి మానవ వికృతత్త్వాన్ని, మానవ ప్రకృతినీ కలుపుతూ రాస్తూ,

''నీ కాలంలో సుఖింపనిమ్ము / సర్వజనుల పేదల చెమ్మటల్ నీరుగా పోసి / చెమన్లు పెంచుకొనక యుండ / వాసింపనిమ్ము'' అంటారు. చెమన్లు అనే పదాన్ని వాడటమైనా, వాటిని పెంచడానికి పేదల చెమటను వాడుకోకుండా చూడాలని ఉగాదికి విన్నవించుకోవడమైనా సామాన్య ప్రజల పక్షాన కవయిత్రిగా నిలుచున్నదీ చూస్తాం. కృతయుగం నుండీ నీ గురించి తెలుస్తున్నది నీవు సర్వశుభాలనూ మోసుకొస్తవని , కానీ ఏమైంది ఇప్పటికీ బడుగుజీవుల కష్టాల్లో పెనుమార్పులేవలేవని అనడం ఈ కవితకు జీవకళను తెప్పించింది.

'కాశ్మీరలక్ష్మి 'కవితలో ''ఉత్తరదిక్కున పార్వతీపతి

కాలి అందెల మువ్వఒకటి

రాలిపడ్డట్లు వినిపించిందొక ఆర్తనాదం

అది / ఆల కూయిని మించిన

ఆడకూయి / ఆమె / మసక ముసుగలో

కారే కన్నీటితో శిగజారిన పూలతో....''

అంటూ కాశ్మీర్ దుఃఖ చరిత్రకు పద చిత్రిక పట్టారు యశోదారెడ్డిగారు.

సంప్రదాయ కవిత్వాన్ని ఎంతగా ప్రామాణికంగా వ్రాశారో, వచనకవిత్వాన్ని అంతే శిల్ప సమేతంగా రాశారు. గొప్ప పరిశోధక గ్రంథాలను రచించిన వీరు వ్యాస రచనలో ఎంతటి పాండిత్యంతో రాసారో పద్య రచనలోనూ తనదైన ముద్రతో రచనలు చేశారు. 1996 లో 'ఉగాదికి ఉయ్యాల' అనే కవితా సంపుటిని వెలువరించారు యశోదా రెడ్డి గారు. వీరి ఈ పుస్తకం లో వీరు రాసుకున్న అభిప్రాయం లో వారుంటారు ,

" నా పుస్తకానికి ముందుమాటను రాస్తూ మహాకవి విశ్వనాథ గారు "అమ్మాయీ! రసవంతంగా పద్యం వ్రాయడంలో కూడా ఘటికురాలే!'' అన్నారు . అట్లా మరోమారు విశ్వనాథ వారు మెచ్చుకునేలా ఏదైనా కావ్యం వ్రాయాలి కానీ, వచనకవిత్వం ఏమిటి? అని ఈసడింపూ, నిగూఢ గర్వరేఖ కాదు, తెలియనితనం ఒకటి నా మనస్సులో గూడు కట్టుకొని వుండేది. " అని రాస్తూనే, తాము సభల్లో అతిథిగా పాల్గొంటూ చూసిన వైనాన్నీ గుర్తుచేసుకున్నారు యశోదారెడ్డిగారు.

17 కవితలున్న ఈ సంపుటిలో కవితలన్నీ ఒకదాన్ని మించి మరోటి ఉన్నాయి. ఉగాది, మానవత పుట్టింది, హరివిల్లు, దుందుభి, తెలుగునాడు, కాలంకట్టిన కిరీటం, మార్పు – వంటి కవితా శీర్షికలన్నీ ఎంతో ఆలోచనాత్మంగా ఉన్నాయి. వారి కవితలలాగానే!

''మహాకవులనుండి మాటైనా పలుకనేర్వని పసరుకాయల వరకూ కలాల్లో సిరాలు నింపి, వచన కవిత్వాన్ని గంపలకెత్తి గాదెలు నింపారు. అందరూ కవులయ్యారు! ఆంధ్రదేశం కవి పురషమైంది. నాకెంతో సంతోషమైంది, ... నా కలం వచన కవితలకు రుచి మరిగింది'' అంటారు యశోదారెడ్డిగారు.

కవిత్వం ఎందుకు రాస్తున్నామో అనే స్పృహ కూడా లేకుండా పేరువస్తుందనే ఆశతో తోచినట్లు రాసేవారున్నారు. పొడుగు వాక్యాలను పొట్టిచేస్తున్నారు,వ్యాసం రాస్తున్నట్టు,వాచ్యం చేస్తున్నట్టు రాస్తున్నారు. మరి ఇలాంటి పెద్దలూ, విజ్ఞులూ, భాషా శాస్త్రాలను పుక్కిట బట్టి , భాషానైపుణ్యాలను పిడికిటబట్టి ,కావ్యాలపై సాహిత్య విమర్శనా సిద్దాంతాలకు అనుగుణంగా విమర్శలు వ్రాసి, వ్యాకరణాంశాలనూ అనర్ఘళంగా చెప్పే శక్తిని ఒడిసిపట్టి న ఇలాంటి యశోదారెడ్డిగారి లాంటి విదుషి ఊరుకుంటారా? ఆమె అభిప్రాయం క్రిస్టల్ క్లియర్ గా ఉన్నది. వచనకవిత్వానికంటూ ఒక చక్కని శైలీ సంపద ఉండాలి. భావాలను వాక్యాలలో ప్రజెంట్ చేయగలిగే శిల్పనైపుణ్యమూ , పద ప్రయోగ చాతుర్యం ఉండాలి. ఇదిగో చూడండి 'తెలుగువాడు' కవితలో తాతముత్తాతల కథలన్నీ చెప్తూ, పేరిణీ నాట్యాన్ని తలుస్తూనే ,

''చాళుక్య సూర్యులో? చంద్రులో... వ్యాసకృత మహాభారతమందారం ..." అంటూనే , "తెలివిగా తన ఇల్లు చక్కదిద్దుకున్నాడు...'' అని రాస్తూనే ,నాగార్జునిని, శ్రీశైల మల్లన్నను, శిగనున్న గంగమ్మనూ తలుస్తూ....

''గోదావరీ, కృష్ణభద్రల ఒడలెల్ల కాళ్ళుగా పారుతూ..

అరమరికలు మాని ఎద ఎదలు పలుకరింపగా....'' అని ఆనాటి దేశకాల పరిస్థితులనుండి రాష్ట్రీయత వరకు ఉటంకిస్తూ కవితానర్తనం చేశారు. తెలుగు భాషా వైభవమంతా చరణకింకిణుల ఘల్లు ఘల్లులుగా మనకువినిపించారు యశోదారెడ్డిగారు. కథలన్నీ ఒదిగి కవితాపంక్తులయ్యాయి. వచన కవితా శిల్పసంపదతో విరాజిల్లాయి. భారతీయ అంతా కూడా భవ్యమయమవ్వాలన్న భావమయ్యింది వీరి కవిత్వం. ఇది కవికి ఉండాల్సిన బాధ్యత. తల్లిపాలు త్రాగి రొమ్ముగ్రుద్దే తనయ, తనయులు ఎన్ని నీతి సూత్రాలను వల్లించినా వృథా అనే వీరి అభిప్రాయం. ఈ దేశంలో పుట్టావు, నీ ఇంట్లో నువ్వు పుట్టినట్టే నువ్వు ఈ దేశంలోనే పుట్టావు. అది మరచి ప్రవర్తించరాదు అని వీరి అభిప్రాయం. ఒక్క ఇంట్లో పుట్టిన నలుగురన్నదమ్ములు అక్కచెల్లెళ్ళే ఒక్కలాగా ఉండరు. అటువంటిది ఇన్ని వైరుధ్యాలున్న ప్రజలంతా ఒక్క దేశపు గొడుగు క్రింద జీవిస్తున్నప్పుడు సంబంధ బాంధవ్యాలు బాగుండాలీ అంటే సంయమనంతో కలిసి మెలసి ఉండాలి అని వీరి భావం.

''నివురూదిన నిప్పుకల శోభతో

విరగ బడి నవ్వే మోదుగుపూలను

తన సింగిణీకి శిగపువ్వులుగా – సజాయిస్తున్నాడు'' అంటూ 'ప్రజోత్పత్తి' కవితలో కాలపురుషుని వర్ణనతో ప్రారంభించి, రాజకీయ దళారులను, అంతుదొరకని దైవాన్ని, రామజన్మ భూమినీ, బాబ్రీమసీదునూ ప్రవహింపజేస్తూ మతోన్మాదం పై కలమనే కత్తిజళిపిస్తూ కవిత్వమై సాగుతారు యశోదరెడ్డిగారు.

మరో కవితలో స్త్రీ స్వామ్య భావాలకు సరిపడే లా , జీవన చక్రాల వంటి పంక్తులన్నీ రాస్తూరాస్తూ

'కాసెబిగించిన సోదరీమణీ

లేచి / స్త్రీలంటే ఎవరనుకున్నారు?

మీరు / బిసతిప్పిన బొమ్మలా?

మీ / చేతిలో ఛత్రీలా /

మీకు / వీచె విసనకర్రలా /

మీ / కాళ్ళ పాపోసులా?

ఎవరనుకున్నారు? / సాగనీయం /

ఇక / ఈ పురుష హతకుల / సార్వభౌమత్వం

కూలిపోతుంది /పీడకలలా / పిడికిలి కుచ్చెనలా....'' అంటూ, ఇట్లా చైతన్య స్రవంతిలా, పౌరుష పదమంజరీ మంజీర ధారలా కవిత్వమై పొంగిన కవిత్వం యశోదారెడ్డిగారిది. సమాజ పోకడలను, అహంకార హూంకారాల దాష్టీకాలనూ ఎక్కడ ఎట్లా ఎత్తి ఎట్లా చూపాలో, ఎట్లా కొరడా జళిపించాలో బాగా తెలిసిన కాలం వారిది. ఛత్రీ, పాపోసులు , బిసతిప్పిన , పిడకల కుచ్చె వంటి పదాలను ఉపయోగించి తెలంగాణ ప్రాంతీయతకు పెద్ద పీట వేసారు . ' మార్పు' అనే మరో కవితలో –

'ఉన్నట్లుండి మా ఊరు నిలువెత్తు లేచింది... మా ఊరి నడుమ పెద్దమర్రి ఊడలన్నీ / భూదేవికి దింపుతూ / దొరికినంత మేర తనదిగా ముద్రవేసుకొని...'' ఇట్లా సాగుతున్న ఈ కవితలో ఎన్నికలప్రచారాలను స్పృశిస్తూ రాజకీయాలకూ స్పృశిస్తూ రాజకీయ నాయకులనూ స్పృశిస్తూ కదులుతారు. 'అమ్మా! ఓటు – అయ్యా ! ఓటు / అంటూ గొంతుమార్చె / అంగరార్చే భిక్షపాత్రలను / చూచి / కొత్త బిచ్చగాడేమొ?'' అంటూ అవకాశ వాదతత్వాన్ని, స్వార్థపరత్వాన్నీ తెలియజేస్తూ, నాయకుల స్వభావాల్నీ అంతర్లీనంగా చూపిస్తూ ,'' అన్ని పార్టీలు పైకి / నిగనిగా తళతళ మంటూ / విషాన్నిదాచిన / మారెడుకాయల్లా / మేడి పండుమేలిమితో / మెరుస్తున్నాయి " అంటూ రాశారు . ఇక్కడితో ఆగిపోయె కలమా ఈమెది? మహాశక్తివంతమైంది – ''ఇక్కడ కావలసింది / చదువూసంస్కారం / వివేచనా శక్తికాదు / అందుకే / కామరూపనైన ఓ దివ్యశక్తీ మా చేత ఓటును / మంచి పాత్రలో / వేయించుకుంటున్నాను'' ఇక్కడ కొద్తారు దెబ్బ! పైన చెప్పిన భిక్షపాత్రలో ఓటు భిక్ష అనేది కామరూపును కలిగిఉంటుంది అంటారు. ఓటువేసే ప్రతి ఒక్కరి మనసులో అనేక ప్రశ్నలు, అనేక అనుమానాలూ తొలచివేస్తుంటాయి. అయినా తప్పదు. ఒక పౌరహక్కును వినియోగించడమనేది అవసరం. అందుకే కామరూపవై అంటూ దివ్యశక్తిగా పోలుస్తారు. స్వార్థపూరిత తత్వాలతో నిండిపోయిన మనుషులకు ఇంతకన్నా ఎట్లా చెప్తారు? ఓ దివ్యశక్తి అని అనడమంటే ఆ శక్తి ఎక్కడిది? నీదైన 'ఆలోచన' అనే శక్తి తో, స్ఫూర్తితో ఓటు హక్కును వినియోగించుకొమ్మంటున్నారీ కవయిత్రి యశోదా రెడ్డి గారు.

శీలాసుభద్రాదేవి, భార్గవీ రావు సంపాదకత్వం వహించిన 'ముద్ర' వనితల కవితల సంకలన పుస్తకంలో యశోదారెడ్డి గారి 'నాకు తెలిసిన నిజం' అనే కవిత ఉన్నది.

''తండ్రీ! జగన్నాయకా

నీవెప్పుడో ! సత్యం నా రూపం అన్నావట

వచ్చింది చిక్కు / పట్టింది గొంతు

కనబడని మీరిద్దరూ / అవసరం కొద్దీ

అందరికీ కావాల్సిన వాళ్ళై కూర్చున్నారు

నీకూ ! సత్యానికీ

మరీ ఎక్కువైందీనాడు /

నోటుకు – ఓటుకూ / సీటుకూ,

బీటుకూ.... ఎక్కడ చూసినా మీకే పందిళ్ళట !'' ఎంత వ్యంగ్యం దాగి ఉన్నదీ కవితాపంక్తులలో! ఇట్లా ఉండాలి కవిత్వం. ''అందరికీ కావలసినవారై కూర్చున్నారు'' అనడానికి ముందు ఎందుకు కావాల్సినవారైనారు? అంటే ''అవసరం కొద్దీ'' అనే విషయం దాగి ఉన్నదికాబట్టి అంత బాగా చెప్పారు. ఇలా రాస్తూనే – నాయకత్వాన్ని కొనుక్కుంటున్న ఓటు బేరాలపై చురకలేస్తారు. ఇంకా అంటారు,

''ప్రభూ! నా తిక్క కాకపోతే / అపురూపమైన పదార్థం – ఆ! / ఈ గాలి చొరబడని బిరడా సీసాల్లో ఉంటే శోభిస్తుంది గానీ, మానవమాత్రుల నోట్లోనాన్తే హేయం కాదా తండ్రీ'' ! అంటారు ! ఎక్కడిదీ ఊహ? ఎంత గమ్మత్తైన పోలిక? ఇలా ఉండాలి కవిత్వమంటే. ఇలా రాస్తూనే పురాణ పాత్రలను

ఆనాటి అన్యాయాలకు ఉదహరిస్తూ రాస్తారు ఇది వీరి కవిత్వ పటుత్వాన్ని పట్టిస్తున్నది.

'పగ' అనే కవిత మత్తడి (పేజి 224) లో ఉన్నది. 1996 ఫిబ్రవరి 'భావిక' లోనిది.

''పగ / దీర్ఘాలులేవు / వొత్తులు లేవు / నిండుసున్నాలు, అరసున్నాలు అసలే లేవు / ఉన్నవి / ఉత్త రెండక్షరాలు / అది పొట్టి పొడి మాట / పాపం పగ / కానీ – అది / వసనాభికన్నా / విషకన్యకన్నా / కాలకూటం కన్నా / తారాక్షిపణి కన్నా / ప్రమాదకారి / అది బహురూపి / నటనా చతుర / దానికి లింభేదం తెలియదు / అది ఒక్కొక్కసారి పులిలా గర్జిస్తుంది / పిల్లిలా నడుస్తుంది / నక్కలా పొంచి ఉంటుంది / నల్లిలా కుడ్తుంది / జర్రిలా పీలుస్తుంది / దొంగలా దోస్తుంది / బొంతపురుగులా చీదర లేపుతుంది / మంటలా కాలుస్తుంది / పొగలా ఉక్కిరిబిక్కిరి చేస్తుంది... పొగ తాకిడికి రక్షణ ఉంది / కాని, పగకు దాహం తప్ప / విరుగుడులేదు విరుగుడులేదు / కోరికల్లాగానే / పగ పగతో తీరదు / అది ఇద్దరినీ తుదముట్టించ చూస్తుంది / అది అణిగి ఊరట చెందుతుంది క్షమాగుణంలోనే! అని రచించిన ఈ కవిత గగుర్పాటును కలిగిస్తుంది. పగ విషం వంటిది, పులి, నక్క, నల్లి, జర్రి వంటి జంతుజీవాల లక్షణాలను కలిగింది. పగకు దాహం ఉంటుంది దాహం అంటే దప్పి – ఒకసారితో ఒ క రోజుతో తీరేది కాదు. దాహం అంటే కాలడం. పగ కాల్చేస్తుంది. మంట ఈ పగ, పొగ ఈ పగ! అందుకే పగదరిదాపుకు రాకుండా ఉండాలన్నా, పగను మంచితనంతో జయించాలన్న క్షమాగుణం తప్పని సరి ఉండాలి అని యశోదరెడ్డిగారు బోధించారు.

''దేశమంటే ఏందోయ్, మట్టీ మనుషులు రెడోయ్

మట్టికున్న మమకారం నీకేం తెలుసోయ్'' అంటూ స్థానికతపై అపేక్షను ఇలా రాయడం యశోదారెడ్డిగారికే చెల్లింది. ఇది కదా కవిత్వంమటే! ఇట్లా కవితలన్నీ గొప్పగా ఉన్నవి. యశోదరెడ్డిగారు వారి కాలం నాటికి సమాజంలో తారాడుతున్న అన్ని దౌర్భాగ్యపు విషయాలన్నీ తెగడుతూ చక్కని శిల్ప నైపుణ్యంతో గొప్ప భావధారతో రచించిన కవిత్వాన్ని మనకందించారు.ఇలాంటి వారు ఆదర్శనీయులు. ఈ కొత్త చూపును మనమూ అందుకుందాం!

**కవిత**

# నాలోకి నేను




**వనితా రాణి నోముల**

**7396320424**


నాలోకి నేను దీర్ఘంగా
పయనించాలనుంది ఉందోసారి..
దిగంతాలకు చేరిన ఉనికికి.
ప్రాణం పోయాలనుందోసారి..

చిలిపితనపు ఆనవాళ్ళెక్కడ
జారిపోయాయో..
వెతుక్కోవాలనుందోసారి..

అరవిచ్చిన నవ్వుల పుప్పొడిని
ఏరుకోవాలనుందోసారి..

ఆగక గమిస్తున్న కాలపు పరుగు పందెంలో..
జారవిడుచుకున్న ఆనందపు అంబరాన్ని
ఆబగా తాకాలనుందోసారి..

పాలుగారే చెక్కిటిపై
 ఉప్పగ లేని తీపిభాష్పపు ఉప్పెనై ,
కట్టలు తెంచుకోవాలనుందోసారి..

నిర్మల స్నేహ సౌరభాలను ,
ఆఘ్రాణించాలనుందోసారి..

గులాబీ ముళ్ళ కలతలతో చిక్కుబడ్డ,
మనసును గట్టిగా ,హత్తుకోవాలనుందోసారి..

ఆడతనం మాటున ,ఆవిరైపోయిన
సరదాలు కొన్నింటిని స్పృశించాలనుందో సారి..

ఎల్లలే లేని ఆనాటి అల్లరి అమ్మాయిగా
 మళ్ళీ కొత్తగా పుట్టాలనుందోసారి..

కథ

# మనో ధైర్యం.!



డాక్టర్ ప్రతిభా లక్ష్మి
-9885315750

"ఆ హైద్రాబాద్ సంబంధం వాళ్ళు ఏం అన్నారు బాబాయ్!?" ఆశగా అడిగాను

"వాళ్లకు అమ్మాయి బాగా నచ్చిందమ్మా.. అన్ని విషయాలు ఓకే.. కానీ..." ఏదో చెప్పలేక ఆగాడు.

"పర్లేదు.. చెప్పండి బాబాయ్.." అన్ని విధాలా బాగుంది సంబంధం. అబ్బాయి బాగున్నాడు, పైగా బాంక్ ఉద్యోగి తను తెలుసుకున్న వారంతా మంచి కుటుంబం అనే చెప్పారు.. ఎలాగైనా నా కూతురు వీణ పెళ్లి ఆ అబ్బాయితో చేస్తే బాగుంటుంది. దానికోసం ఏమైనా చేయడానికి సిద్ధం అనుకుంటూ అడిగా .

"చూద్దాం లే అమ్మ.. నేను మళ్ళీ వాళ్ళతో మాట్లాడతా లే.."

"పర్లేదు బాబాయ్.. దేని గురించి వాళ్ళ అనుమానం.. చెప్పండి.." అడిగాను.

"అమ్మాయి వాళ్ళ నాన్న గురించే అమ్మా.. 'డిప్రెషన్ వంశ పారంపర్యంగా రాదు కదా..' అని వాళ్ళ చుట్టాలెవరో అడిగారట.." అన్నాడు తడబడుతూ..

అలాంటి మాటలు వినీ వినీ ఇంకిపోయాయి, అనుకున్న కన్నీరు మళ్ళీ నా కళ్ళల్లోకి చేరాయి.

"అబ్బాయికి చాలా ఇంటరెస్ట్ ఉందమ్మా.. వాళ్ళు అందరూ కూడా నిజానికి ఇష్టంగానే ఉన్నారు.. నేను మాట్లాడతా లే.." ధైర్యం చెప్పాడు బాబాయ్.

పక్కనే ఉన్న మా అమ్మ, "పోయిన వాడు బాగానే పోయాడు, అందరినీ గాలికి వదిలేసి.. ఏ జన్మలో ఏ పాపం చేసిందో., పాపం నా బిడ్డ జీవితం అంతా కష్టాలే..!!" అంటూ తన ఆవేదనను వ్యక్తం చేస్తుంది. ఆ పెళ్లి జరగడం పూర్వ జన్మ పుణ్యం అంటూ మొదలయిన నా వైవాహిక జీవితం., ఇంచు మించు ఆదిలోనే ఆగిపోయి, ఇలా పూర్వ జన్మ పాప ఫలం అనే వరకు వచ్చింది.

ఏదో జన్మలో చేసిన తప్పుకు శిక్ష అనుభవిస్తున్నా అన్న మాటే కొంత మెరుగ్గా అనిపిస్తుంది.. కానీ, ఈ జన్మలోనే, నేను ఏమైనా తప్పు చేసానేమో అనే మాటలు మాత్రం చాలా బాధ పెడుతుండేవి. అలాంటి మాటలతో గత ఇరవై ఏళ్లుగా నాతో నేనే సంఘర్షణ లో ఉన్నా.. 'లేదు.. నేను ఏ తప్పు చేయలేదు!!' అని పదే పదే అరవాలి అనిపించేది. ఏకాంతంలో మౌనంగా అరుస్తూ ఉండే దాన్ని.. మొదట్లో నా ఆవేదనను వ్యక్తం చేసే ప్రయత్నం చేసా, కానీ, కష్టం, నష్టం అత్యధికంగా అనుభవించే నేను, మరొకరికి సంజాయిషీ చెప్పే, ఇతరులను ఒప్పించే అవసరం లేదు అని అర్థం చేసుకొని వదిలేసా. కానీ, ఇప్పుడు నా కూతురి పెళ్లి విషయంలో కూడా అదే అడ్డు అవుతుందని ఊహించలేదు.

★★★

మా ఇంట్లో నలుగురు పిల్లల్లో చిన్న దాన్ని అవ్వడంతో, చిన్న తనం నుండి చాలా గారాబంగా పెరిగాను. ఇద్దరు అన్నయ్యలు, ఒక అక్క.. ఇంట్లో నేను ఏది చెప్తే అదే.. పెద్దగా చదువు ఇష్టపడకపోయినా, డిగ్రీ పూర్తి చేశాను నేను. అక్క,

పెద్ద అన్న పెళ్లి అయ్యాక, మంచి కుటుంబం, మంచి అబ్బాయి అని చూసి, మహేష్ తో పెళ్లి సంబంధం చూసారు నాకు. పెళ్లి చూపుల్లో చూడగానే మహేష్ నాకు బాగా నచ్చాడు. మంచి ఎత్తు, ఒత్తైన జుట్టు, అందమైన కళ్ళు, నవ్వితే సొట్టలు పడే బుగ్గలు. అందం ఒక్కటే చూసే వయసు అవ్వడంతో వెంటనే సరే అన్నా. అబ్బాయి M.SC., B.Ed చదివాడు. లెక్చరర్ ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాడు. ప్రస్తుతానికి ఏదో ప్రైవేట్ స్కూల్లో టీచర్ గా చేస్తున్నాడు. మంచి కుటుంబం. తండ్రి ప్రభుత్వ ఉద్యోగి. తల్లి గృహిణి. ఒక తమ్ముడు, కుమార్. అతను కూడా డిగ్రీ పూర్తి చేసి, ఏదో గ్రూప్స్ పరీక్షలు రాస్తున్నాడు. ఇది అప్పుడు నాకు చెప్పిన వివరాలు. 'అన్నీ బాగున్నాయి. చాలా మంచి సంబంధం. వాళ్ళు దొరకడం నీ అదృష్టం, ఏ జన్మలో ఏ పుణ్యం చేస్కున్నావో', అని అందరూ అంటుంటే ఎంతో సంతోషించా..

అందరు ఆడపిల్లల్లాగే, ఎన్నో ఆశలతో ఆనందంగా పెళ్లి చేసుకున్నా. కూతురు లేని ఇంట్లో ఒక కూతురిలాగా మెలిగా. నా మరిది కుమార్ తో సహా, అందరూ నన్ను ఆ ఇంటి అమ్మాయి లాగే చూసే వారు. పెళ్లి అయిన మూడు నెలలకే పాప కడుపులో పడింది. దానితో అందరికి నా మీద ప్రేమ ఇంకా ఎక్కువ అయింది. కుమార్ కి మంచి ఉద్యోగం రావడంతో, నేను అడుగు పెట్టిన వేళా విశేషం అంటూ అందరూ సంతోషపడ్డారు. వాళ్ల కుటుంబంలో మొదటి ఆడపిల్ల అవ్వడంతో అందరూ వీణ ని ఎంతో ప్రేమగా చూసుకునే వారు. వీణ నా దగ్గర కన్నా, మా అత్తమ్మ, మామయ్య, కుమార్ దగ్గరే ఎక్కువ సమయం ఉండేది. జీవితం ఎంతో సంతోషంగా గడుస్తున్న సమయంలో, వీణకి ఆరు నెలల వయసులో అనుకోకుండా నేను మళ్ళీ గర్భవతిని అయ్యా..

★ ★ ★

"నాకు సరైన ఉద్యోగం లేదు.. సరిపడా సంపాదించట్లేదు అనే కదా.. నువ్వు ఇప్పుడే రెండవ బిడ్డ వద్దు అంటున్నావ్..!?" అన్నాడు మహేష్. నా మీద కోపంతో అంటున్నాడు అనుకున్నా.

"అలా ఏం లేదండి.. వీణ ఇంకా చిన్నగా ఉంది. ఇద్దరు పిల్లల్ని చూసుకోవడం కష్టం అవుతుందేమో అని అన్నా.. అంతే. " నా ఉద్దేశం చెప్పా..

"లేదు.. మా తమ్ముడికి ఉద్యోగం వచ్చినప్పటి నుండి గమనిస్తున్నా.. నీలో చాలా మార్పు వచ్చింది. నాది చిన్న ఉద్యోగం అని నీకు చులకనగా కనిపిస్తున్నా కదా.." అన్నాడు.. ఊహించని ఆ మాటలకు ఉలిక్కి పడ్డా.. బాధలో అన్నాడు అనుకున్న..

"అయ్యయ్యో.. అదేం మాటండి.. నేను ఎప్పుడైనా మిమ్మల్ని అలా ఏమైనా అన్నానా!? మీ తమ్ముడు బాగు పడితే మనకు సంతోషమే కదండీ..!" ఇది మన కుటుంబం అనే నా ఆలోచనని వివరించా.

"మనం ఏమి ఎదగట్లేదు.. బాగుపడట్లేదు.. అని దెబ్బి పొడుస్తున్నవా!?" అన్నాడు.

ఎందుకు అలా మాట్లాడుతున్నారో అర్ధం కాక అయోమయంలో పడ్డా.

"అదేంటండీ.. అలా అంటున్నారు.. అంత చదువుకున్నారు మీరు.. ఇవాళ కాకపోతే రేపు మీకు కూడా మంచి ఉద్యోగం తప్పకుండా వస్తుంది.. " ఓదార్పుగా చెప్పా.

"ఎంత చదివి ఏం లాభం.. నాకు మంచి ఉద్యోగం లేదు అని అంటున్నవా!?" అన్నాడు.

ఆ మాటలతో ఆశ్చర్యపోయి, నేనే ఏదో తప్పుగా మాట్లాడుతున్నానా అనే అనుమానం కలిగింది.

"మీకు ఏం అయింది ఇప్పుడు.. మీతో నేను మాట్లాడలేను.. వెళ్లిపోతున్నా.." భయంతో అక్కడి నుండి వెళ్లిపోయా.. ఆ తరవాత ఎప్పుడూ మళ్ళీ ఆ విషయం మాట్లాడలేదు. కానీ.. ఆ రోజు ఆ మాటలు నిజంగా తను ఎంత బాధ పడుతూ మాట్లాడుతున్నాడో అర్థం చేసుకోలేక పోయా.

ఆ రోజు మొదలు, ప్రతి దానికీ, బాధ పడే వాడు. ఎవ్వరితో సరిగ్గా మాట్లాడకపోయే వాడు. ఇంట్లో ఎక్కువ సేపు ఉండకుండా ఉండడానికి, ఎక్కువ సమయం బయట స్నేహితులతో ఉండే వాడు. ఇంట్లో తను ఏమీ పట్టించుకోక పోయినా, తను సంతోషంగా ఉంటే చాలు అనుకుంటూ, తనకు ఎలాంటి ఒత్తిడి ఇవ్వకుండా, ఇంటి పెద్ద కోడలిగా, నా వంతు ధర్మం నేను నిర్వర్తిస్తూ వెళ్ళా. ఒక సారి ఆయన పద్దతి బాగా లేదని అత్తగారికి చెప్పడానికి ప్రయత్నించా.

“వాడు లెక్చరర్ పోస్ట్ కోసం ఏవో ప్రయత్నాలు చేసుకుంటున్నాడు. వాడి భార్యగా నువ్వు అర్థం చేసుకోవాలి.” అన్నారు..

ఒక సారి మామయ్య కి వివరించే ప్రయత్నం చేసా.. “ఏదైనా వ్యాపారం పెట్టించండి మామయ్య, నేను కూడా నా వల్ల అయినంత సహకరిస్తా.. ఈ ఉద్యోగంతో ఆయన సంతోషంగా లేరు” అని చెప్పా.

“వ్యాపారం పెట్టడానికి డబ్బులు కావాలి కదమ్మా.. ఇంకా కొన్ని రోజులు చూద్దాం.. ఇంకేం మంచి ఉద్యోగం రాకపోతే అప్పుడు ఆలోచిద్దాం..” అన్నారు. అంత కన్నా ఎక్కువ వివరించడం నాకు రాలేదు.

రోజులు అలా భారంగా గడుస్తున్నాయి. నాకు విహాన్ పుట్టాడు. కొడుకు పుట్టాడు అని ఇంట్లో అందరూ చాలా సంతోషించారు. కానీ, ఖర్చులు ఎక్కువ అయ్యాయి అని మహేష్ కి ఇంకా టెన్షన్ ఎక్కువ అయినట్టు కనిపించి, నేను ఇంకా కంగారు పడ సాగాను. మామూలుగా కూడా నాది చాలా సాధారణ జీవనం. పెద్దగా ఆడంబరాలేమీ ఇష్టపడను. కానీ నన్ను చూస్తూ, మహేష్ నన్ను సంతోషంగా చేసుకోలేక పోతున్నానని బాధ పడే వాడు. ఎన్నో సార్లు ప్రేమగా చెప్పడానికి ప్రయత్నించా. ‘మీరు, పిల్లలు బాగుంటే చాలు.. నాకు ఇంక ఏమీ వద్దు’ అని.. ఎంత చెప్పినా, తనని తాను అసమర్థుడని, నేను అసంతృప్తితో బ్రతుకుతున్నానని అనుకునే వాడు. “మీకు ఉద్యోగం ఉంది., విహాన్ కొంచం పెద్దగా అయ్యాక నేను ఏదైనా ఉద్యోగం చేస్తా, ప్రేమగా చూసుకునే అత్తయ్య మామయ్య ఉన్నారు. సొంత ఇల్లు. ఇంకా మనకు ఏం కావాలి.. సంతోషంగా బ్రతుకుదాం.. అధైర్య పడకండి.” అని ఎన్నో సార్లు నాకు తెలిసిన రీతిలో చెప్పే ప్రయత్నం చేసా. తను నవ్వి వదిలేసే వాడు. అర్థం చేసుకుంటాడనే అనుకున్నా.

ఒక రోజు సాయంత్రం, బయటకు వెళ్లిన మహేష్ మళ్ళీ ఇంటికి రాలేదు. ఆ రోజు అంతా నేను చాలా కంగారు పడ్డా. ఇక ఆగలేక, అర్ధ రాత్రి దాటాక, కుమార్ ని పిలిచి, ఆయన్ని ఎక్కడైనా వెతికి రమ్మన్నా.. చాలా సేపు వెతికి వచ్చి, “ఎక్కడా లేడు వదిన.. రేపు పొద్దున్నే వచ్చేస్తాడు లే.. కంగారు పడకు.” అని చెప్పి వెళ్ళాడు. ఆ రాత్రంతా ఒక్క క్షణం కూడా కంటి మీద కునుకు లేదు. ఎన్నో ఆలోచనలతో, భయం భయంగా గడిపాను. పొద్దున దాదాపు పది గంటలకు వచ్చాడు. ఎక్కడికి వెళ్ళాడు అని అత్తయ్య వాళ్ళు కోప్పడితే, నవ్వుతూ, ‘ఏదో ముఖ్యమైన పని మీద పొరుగు ఊరు వెళ్ళాను’ అని చెప్పాడు. ఫోన్ అయిన చేసి చెప్పొచ్చు కదా.. అంటే..

‘కంగారు పడకుండా ఉండడం అలవాటు చేసుకోండి’ అన్నాడు. ఆ తరవాత కూడా, ఒక రెండు సార్లు అలాగే చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోవడం చేసాడు. నేను మళ్ళీ మళ్ళీ అత్తమ్మ, మామయ్య వాళ్లకు మహేష్ మానసిక స్థితి గురించి చెప్పే ప్రయత్నం చేసే దాన్ని. కానీ ఎవ్వరూ దాన్ని పెద్దగా పట్టించుకోలేదు. అంతగా బాధ పడే అవసరం ఏమీ లేదు అనేది వారి అభిప్రాయం. నిజానికి అది నిజమే, కానీ మహేష్ ఉన్న మానసిక స్థితికి అది అర్థం అవ్వకపోయేది.

ఇంట్లో ఉన్నంత సేపు, పిల్లలని ఆడిస్తూ, అందరితో సరదాగా నవ్వుతూ ఉండడంతో, ఆయన మనోభావాలు ఎవరూ చదవలేక పోయే వారు. ఏవో ప్రయత్నాలల్లో ఉన్నాడు, అందుకే బిజీ గా ఉంటున్నాడు అనుకునే వారు. ఆయన మనసులో చెలరేగుతున్న ఆలోచనల విధ్వంసాన్ని ఎప్పుడు బయటికి చూపించే వాడు కాదు. నాకు కూడా అప్పుడప్పుడు అనుమానం కలిగేది, కేవలం నన్ను భయపెట్టడానికే అలా అసంతృప్తిగా మాట్లాడతారేమో అని! ఆ రోజున మహేష్ కి ఉన్నది ఒక మానసిక రుగ్మత అని, దానికి సరైన వైద్య సహకారం కలిగించి ఉంటే బాగుండునని నాకు అప్పుడు తెలియదు.

అలా అందరిని తన నవ్వులతో, మాటలతో, చేతలతో మభ్య పెట్టి, ఒక రోజు ఊహించని రీతిలో, రాత్రి నిద్రపోయిన మహేష్ ఉదయం విగత జీవిగా కనిపించాడు. మహేష్ పక్కన ఉన్న నిద్ర మాత్రల డబ్బా అందరినీ షాక్ కి గురి చేసింది. తననే నమ్ముకుని ఉన్న నన్ను ఇలా వదిలేసి ఎందుకు వెళ్లిపోయాడో అర్థం కాక నేను నిర్ఘాంతపోయి ఉండిపోయా. ఎవరినీ ఏమీ అనలేక, ఆ భగవంతుడిని నిందిస్తూ మిగిలిపోయా. ఆ క్షణం నా జీవితం అంతా శూన్యంగా, దిక్కు తోచని స్థితిలో కనిపించింది నాకు. ఇరవై నాలుగేళ్ళ వయసులో ఆరు నెలల కొడుకు, రెండేళ్ల లోపు కూతురితో నేను ఒంటరిగా మిగిలాను. ఇంటి వాళ్ళు ఎంత సహకరించినా, సమాజంలోని వారు, నేనే ఏదో

తప్పు చేసి ఉంటానని అంటున్న మాటలు ముందు నన్ను చాలా క్రుంగదీసాయి. కానీ అప్పుడు ఎవరిది తప్పు అని ఆలోచించే స్థితిలో నేను లేను. అందరి కన్నా ఎక్కువ నష్టపోయింది అయితే నేనే అని నా ఉద్దేశం. పరిస్థితులు మనిషికి ధైర్యాన్ని ఇస్తాయంటారు. నా పిల్లల మీద నాకు ఉన్న ప్రేమే నన్ను ఆ సమయంలో బ్రతుకు పోరాటంలో నిలదొక్కుకునే లాగా చేసింది. అత్తమ్మ మామయ్య వాళ్ళు నన్ను కూతురిలాగా చూసుకోవడానికి సిద్ధ పడ్డప్పటికీ, నేను ఒంటరిగా నా పిల్లల్ని చూసుకోవడానికే ఇష్టపడ్డా. కుమార్ పిల్లలతో కలిసి నా పిల్లలు పెరిగితే, వారి మధ్య పోలికలు, నిరుత్సాహాలు, అసూయ, వంటి భావాలు కలగడం మంచిది కాదు అనిపించింది. మనుషులు కొంత దూరంగా ఉన్నా, మనసులు దగ్గరగా ఉండేలాగా, అనుబంధాలు ఉండాలని తాపత్రయ పడ్డా. నన్ను కన్న తల్లితండ్రులు, నా శ్రేయోభిలాషులు నన్ను మళ్ళీ వివాహం చేసుకొమ్మని ఎంత ఒప్పించే ప్రయత్నం చేసినా, నాకు భర్తను తేగలరు కానీ, నా పిల్లలకు తండ్రి దొరకడం కష్టం అని వారించా. ఈ రెండు సంవత్సరాల జ్ఞాపకాలు, నాకు ఈ జీవితానికి సరిపడా ఉన్నాయని దృఢంగా చెప్పా. ఆర్థికంగా, అత్తమ్మ వాళ్ళు కొంత వరకు సహకరించారు. దానితో పిల్లల్ని మంచి స్కూల్ లో చదివించ గలిగాను. నా పిల్లలే నా జీవితంగా భావించి నా జీవిత పోరాటాన్ని మొదలు పెట్టిన నేను, ఉన్న డిగ్రీ తో ఒక స్కూల్ లో టీచర్ గా చేరి, డిస్టెన్స్ లో పీ.జీ పూర్తి చేసా. ఆ కష్ట సమయంలో మా అక్క, నాకు ప్రతి క్షణం అండగా ఉంటూ, నా కాళ్ళ మీద నేను నిలబడే ధైర్యాన్ని ఇచ్చింది. ఉన్నత విద్యతో, నా అనుభవం కలిసి, ఒక మంచి స్కూల్లో హై స్కూల్ టీచర్ గా గౌరవంగా బ్రతుకు సాగించా.

★ ★ ★

ఇన్ని సంవత్సరాలల్లో, భర్త లేని ఒక ఒంటరి ఆడదానిగా, ఎన్నో కష్టాలు అనుభవించా. నా పిల్లలకు మాత్రం 'తండ్రి లేదు' అనే లోటు తప్ప, ఏ లోటు లేకుండా పెంచా. వీణ ని ఇంజినీరింగ్ చదివించా. ఈ మధ్యే మంచి సాఫ్ట్ వేర్ కంపెనీలో ఉద్యోగం వచ్చింది. విహాన్ ఎం.బి.ఏ చదువుతున్నాడు. నాకు చేదోడుగా ఉంటూ, బాధ్యతలు, బంధాలు అన్ని అర్థం చేసుకుంటూ పెరిగారు ఇద్దరూ. ఇన్ని ఏళ్ల సంఘర్షణ తరవాత కూడా, ఈ రోజున, నా కూతురి పెళ్లి విషయంలో కూడా, అదే అడ్డంకి అవుతుంది అని నేను అనుకోలేదు.

★ ★ ★

నా జ్ఞాపకాల ప్రవాహం నుండి బయటకు వస్తున్న నేను, వీణ పెళ్లి సంబంధం వారిని ఎలా ఒప్పించాలా అని ఆలోచిస్తుండగా,

"నేను మా నాన్నకే కాదు, మా అమ్మకీ కూతురినే కదా..! రక్తం నాన్నది ఉన్నా, పెంపకం అంతా అమ్మదే కదా..! ఏ ధైర్యం లేక నాన్న మమ్మల్ని వదిలి వెళ్లారో, ఆ ధైర్యంతోనే కదా మా అమ్మ మమ్మల్ని ఇలా పెంచగలిగింది.! మా అమ్మ ఇచ్చిన మనోధైర్యమే మాకు బలం. వాళ్లకు అలాంటి అనవసరపు అనుమానాలు ఉంటే, ఇంకా ఎవరినైనా చూసుకోమనండి తాతయ్య.. నా పెళ్ళికి అప్పుడే ఏం తొందర లేదు.." అప్పుడే అక్కడికి వస్తున్న వీణ మాటలు విని ఆనందంతో నా కళ్ళు చెమ్మగిల్లాయి. "అబ్బాయి వాళ్ళు ఏం అనట్లేదు వీణ. వాళ్లందరికీ ఇష్టం ఉంది.. మధ్యలో వాళ్ళ మాటలు ఇవి. నాకు తెలుసు, వాళ్ళు నిన్ను వదులుకోరు. నిన్ను వాళ్ళ ఇంటికి తీసుకెళ్లడం వాళ్ళ అదృష్టం.. నేను మాట్లాడతా.." అన్నాడు బాబాయ్.

మనిషి బ్రతకడానికి చదువు, ఆస్తులు, ఆత్మీయుల కన్నా, మనోధైర్యం ఎంతో ముఖ్యం అనేదే నా జీవిత పాఠంగా నేర్చుకున్న నేను, నా కూతురి మాటలకు ఎంతో ఉప్పొంగి పోయా. తన జీవితం తను ధైర్యంగా బ్రతకగలదు అనే ఒక గట్టి నమ్మకంతో తృప్తి పడ్డా. నా పిల్లల్ని అలా పెంచగలిగినందుకు గర్వపడ్డా. జీవితంలో ఒడిదుడుకులు అందరికీ సహజం. వాటిని నెలదొక్కుకొని బ్రతకగలగడమే ముఖ్యం. ఒత్తిడిని తట్టుకోలేకపోతున్నట్టు అనిపించినపుడు ఇతరుల సహాయం తీసుకోవడం ఉత్తమం. తొందర పాటు చర్యలతో నమ్మిన వారిని ఒంటరిగా వదిలి వెళ్లడం అన్యాయం!! నా అనుభవాలు చూస్తూ పెరిగిన వీణ మరి కొందరి జీవితాలలో మనోధైర్యాన్ని నింపగలదని ఆశిస్తున్నా.

కథ

# పొరబాటు



డా. లక్ష్మీ రాఘవ
9440124700

“నీకు ఏనాడు నేనంటే ఇష్టం అని?” కోపంగా అంటూన్న కూతురు లత వైపు నిర్ఘాంతపోయి చూస్తూ.

“ఎందుకలా అనుకుంటావు?” అంది అమ్మపార్వతి

“ఎందుకేమిటి? స్పష్టంగా కనిపిస్తూ వుంటే... నీకు అక్క అంటేనే ఇష్టం”.

“ఇక ఆపుతావా? కన్నతల్లికి ఎప్పుడూ అలాటి భేదాలుండవు”.

“ఈ ఇంట్లో వుంటుంది. నేను చెబుతున్నాను” కరుకుగా అంది లత. పార్వతి వెంటనే “నీతో మాట్లాడి లాభం లేదు” అనగానే.

“మాట్లాడ్డానికి మిగిలిందేమిటి?”. మాటకు మాట జవాబు ఇస్తున్న చిన్న కూతురిని చూసి, మాటలు పెంచడం కంటే వూరుకోవడం మేలనిపించి అక్కడనుండి కదిలింది పార్వతి...

ఈ మధ్య లత తో ఇటువంటి మాటలు ఎక్కువై పోతున్నాయి. ప్రతిదానికీ గొడవ చేస్తూంది. అర్థం లేకుండా సాగ దీసి మనసు మీద విపరీతంగా దెబ్బ తీస్తుంది. ముఖ్యంగా పెద్దకూతురు మాలకు క్యాంపస్ సెలెక్షన్ రావటంతో.

మాల పుట్టాక నాలుగేళ్ళకు పుట్టింది లత.. చిన్నకూతురు అని గారాబంగా చూసుకునేది పార్వతి. చదువులో మాల కంటే వెనకే ఎప్పుడూ.. అదొక వర్రీ పార్వతికి. పెద్ద అయ్యాక లత బెహేవియర్ లో మార్పు వచ్చింది. ప్రతివిషయంలోనూ ఏదో మొండి వాదన, తన కేదో తక్కువ చేస్తున్న భావన, ఎందుకిలా తయారైందో అర్థం కాలేదు. చిన్న చిన్న విషయాలకు విపరీతమైన రియాక్షన్లు లత వింత మనస్తత్వాన్ని అర్థం చేసుకోవడం కష్టం అయ్యింది..

ఒక రోజు డైనింగు టేబుల్ మీద వున్నవి సర్దుతూ వుంటే వచ్చింది లోపలికి లత. పొద్దున్న కాలేజీకి వెడుతూ టిఫిన్ బాక్స్ తీసుకెళ్ళింది కదా బోంచేసి వుంటుందనిపించింది పార్వతికి. టైము కూడా రెండున్నర దాటింది.

“ఏమిటీ నేను తినకనే టేబులు క్లీన్ చేస్తూన్నావు?” అంది లత.

”నీవు తినలేదా?”. “తింటే ఇలా ఎందుకు అడుగుతాను?”.

“సరే రా.. తిందూ గానీ”

“ఇప్పుడన్నావు కానీ రాగానే ‘తిన్నావా.. లేదా’ అని అడిగావా? అంత వుంది, నా మీద అక్కర”. ఇక రెట్టిస్తే భోజనం మాని వాదనకు దిగుతుందనిపించి. నెమ్మదిగా అన్నీ సర్ది ‘రా బొంచేద్దూ’ అంది పార్వతి.

“అలా అడిగావు బాగుంది” అంది లత.

ఇలా ఎప్పుడు ఏ విషయమై పోట్లాడుతుందో తెలియక బాధపడుతుంది పార్వతి.

ఆఫీసు మేనేజర్ గ ఎంతో బిజీగా ఉండే భర్తతో ఇంటి విషయాలు చెప్పడం ఎందుకు అనుకుంది పార్వతి.

ఒక సారి ఇలాటి సంఘటనతో మనసు బెజారైపోతే, రాత్రి మాల దగ్గరకి వచ్చి కూర్చుంది పార్వతి.

“ఎందుకో ఈ మధ్య లత మరీ విపరీతంగా బిహేవ్ చేస్తూంది. మనకు నార్మల్ అనిపించినవి దానికెందుకు వేరుగా కనిపిస్తుంది?” అంది.

“ఏదో ఫ్రస్ట్రేషన్ లే అమ్మా” అంది మాల. మరి మాట్లాడలేక పోయింది పార్వతి.

మరుసటి వారంలో సడన్ గా షాకు ఇచ్చింది లత. “అమెరికా వెళ్లి చదువుకుంటా” అని.

"అమెరికా చదువులు ఖర్చుతో కూడిన పని... పైగా అడ్మిషన్ దొరకాలి కదా"

"చూదు, చూదు అడ్మిషన్ సంగతి కంటే ముందు ఖర్చులు గుర్తుకు వచ్చాయి నీకు. నా చదువంటే అంతే".

"అదికాదమ్మా అడ్మిషన్ ఎలా చెప్పు"

"అవన్నీ నా ఫ్రెండ్ చూసుకుంటుంది. అది కూడా అప్లయ్ చేస్తూంది. అందుకే నేనూ చేస్తాను."

"నాన్నతో ఒక సారి మాట్లాడాలి కదా"

"ఎలాగూ నీవూ, నాన్న వద్దనే చెబుతారు కదా... ఇంకా అడిగేదేముంది?"

"వద్దంటారని ఏమి చేస్తున్నవో చెప్పడం మానేస్తావా?" "చెబుతాను అడ్మిషన్ వచ్చాక.."

"ఈ లోపల తెలుస్తే నన్ను తిడతారు మీ నాన్న".

"ఎలా తెలుస్తుంది? నీవు చెబుతే తప్ప?" ఇక వాదించలేక పక్కకు తిరిగింది పార్వతి.

ఆరోజు రాత్రి భర్తతో ఒక మాట అంది. "లత చదువులకి ఎక్కువ ఖర్చు అయితే ఏం చేద్దాం?"

"ఎందుకు అవుతుంది? అంతా మన బడ్జెట్ బట్టే జరుగుతుంది. అంతే కదా. ఇంకా చాలా టైము వుంది. ఇంతలో మాల చదువు పూర్తయి ఉద్యోగంలో చేరుతుంది. ఇప్పటినుండీ వర్రీ కాకు" అని అక్కడతో సంభాషణ తుంచేసాడు. ఇక భర్తకు ఎలా చెప్పాలో చెబుతే ఏమి రాద్ధాంతం అవుతుందో తల్చుకోవడానికే భయమేసింది పార్వతికి. మరో రెండు నెలలు గడచినా అమెరికన్ అడ్మిషన్ ఏమైందో తెలియ లేదు అడుగుదామంటే ఏమంటుందో అని తపన పడింది పార్వతి.

ఒక రోజు లతనే అంది. "అమెరికా పంపలేనని ఏడ్చిపోయావుగా అడ్మిషన్ అంత ఈజీగా దొరకదట. నీవు కోరుకున్నట్టే.." తను ఏమీ కోరుకోలేదనీ అన్నా లత రియాక్షన్ తెలుసు అనుకుని వూరుకుంది.

మాలకి కంపెనీ జాబ్ వచ్చింది. మంచి జీతం. ఉద్యోగం అదే వూర్లోనే హాయిగా...

లతకు పరీక్షలు అయ్యి సెలవులు వచ్చిన రెండు రోజులకి "అమ్మ నేను ఉద్యోగం చేరుతా సమ్మర్ లో" అంది.

"ఎందుకే ఇప్పుడు ఉద్యోగం?"

"సమ్మర్ లో పార్ట్ టైం ఉద్యోగంలే అమ్మా, రెండు నెలలు సేల్స్ గర్ల్ గా పాకెట్ మనీ వస్తుంది..."

"సేల్స్ గర్ల్ గానా? పాకెట్ మనీ మేమివ్వమా?"

"నేను ఏం చేసినా నీకు తప్పుగా అనిపిస్తుంది ఎందుకో..? నేను ఒక్కత్తే చెయ్యటం లేదు. మా ఫ్రెండ్స్ నలుగురం కలిసి చేస్తాము. అక్క ఉద్యోగం చేసి సంపాదించవచ్చు. నేను ఉద్యోగం చెయ్య కూడదా?"

"మాల చదువు పూర్తీ చేసుకున్నాక ఉద్యోగం చేస్తూంది. నీకు చదువు పూర్తీ కాలేదు. పైగా రెండు నెలలు చెయ్యడం ఎందుకు?"

"అదీ సంగతీ! నేను సంపాదించడం నీకు ఇష్టం లేదు"

"అలా కాదే" చెప్పబోయింది. "ఇంకెలా కాదు? నేను ఉద్యోగం చేస్తున్నా అంతే"

అప్పుడు అనిపించింది ప్రతిదీ మాలకు పోటీగా చేస్తుందా? అని. అలాగే ఐతే ఇది ఎక్కడికి దారితీస్తుందో అని ఆలోచించడానికే భయం వేసింది పార్వతికి. ఆ పైన భర్తకు ఎలా చెప్పాలా అని మదనపడింది.

'ఏదో సరదా పడుతోంది. రెండు నేలలేగా పరవాలేదు' అని ఆయనకు నచ్చచెప్పచ్చు అనుకుంది.

లత ఇలా ఎందుకు తయారైంది అని వాళ్ళ నాన్న అడగవచ్చు. అందుకే లత విషయం ఎప్పటి కప్పుడు ఆయనతో డిస్కస్ చేసి వుంటే ఇంతవరకూ రాకపోయేదేమో అనిపించక మానలేదు.

రెండు నెలల్లోనే మాలకు పెళ్లి కుదిరింది. మంచి చదువు, మంచి ఉద్యోగం ఉన్నఅబ్బాయి.

హటాత్తుగా ఒక రోజు లత బాంబు పేల్చింది "రమేష్ అనే అతన్ని ప్రేమిస్తున్నా, పెళ్లి చేసుకుంటా" అని. ఉలిక్కి పడింది పార్వతి.

"ఇంకా డిగ్రీ పూర్తీ కాలేదు. ఇప్పుడు పెళ్లి మాట ఏమిటి?"

"అదే నీకు బాధ.. ఎవరు ఏమిటీ' అని అడిగేదైతే లేదు.. అతను నాతోనే సేల్స్ లో పని చేస్తాడు".

ఆ సమాధానంతో ఒక్కసారిగా భయమేసింది పార్వతికి.

"ఇంకా చిన్న పిల్లవమ్మా.. ప్రేమ, పెళ్ళీ అంటే ఎలా?" అని. తాను ఇక రెట్టించకూడదు అన్న అవగాహనతో లత దగ్గరగా వెళ్ళి భుజం మీద చెయ్యి వేసి "ముందు భోంచేసి పడుకో.." అని డైనింగ్ రూం లోకి తీసుకెళ్ళింది...

లత పడుకున్నాక భర్తకు ఫోను చేసి విషయం టూకీ గా చెప్పింది. బాగా కోపం వచ్చింది ఆయనకు.

ఇప్పుడు కోపతాపాలకు సమయం కాదు.. ఆలోచించింది, తన ఫ్రెండ్ సైకియాట్రిస్ట్ వాసవి గుర్తుకు వచ్చింది. తను స్టేట్స్ నుండీ వచ్చి రెండు నెలలయింది. ఫోను నెంబర్ వెదికి ఫోన్ చేసింది. సాయంకాలం కలుస్తానని చెప్పింది..

సాయంకాలం తన ఫ్రెండును కలవాలని తయారైంది లత.

పార్వతి "తొందరగా వచ్చేయ్యమ్మా" అని చెప్పి పంపింది.

ఒక అరగంటలో తన ఫ్రెండ్ వాసవి దగ్గర వుంది. క్షేమ సమాచారాలు అయ్యాక, వాసవి చెయ్యి పట్టుకుని కళ్ళ నీళ్ళు పెట్టుకుంది పార్వతి. కారణం అడిగే లోపలే లత గురించి, తను బిహేవ్ చేసే విదానం గురించి, ఇంకా.. లత ఎప్పుడూ వాళ్ళ నాన్నతో కాకుండా, తన తోనే అలా రూడ్ గా బిహేవ్ చెయ్యడం, ప్రతిసారీ ఆయనతో తను చెప్పలేక పోవడం, ఇప్పుడు వచ్చిపడ్డ విపత్తు. తను తల్లిగా పడుతున్న బాధని చెప్పింది.

అంతా విన్న వాసవి.."ఇది చిన్నప్పటినుండీ చక్క దిద్దాల్సిన వ పిల్లల బిహేవియర్ని మనం ఎక్కువ ఇంఫ్లుయన్స్ చేస్తాము పార్వతీ.. ముఖ్యంగా తల్లితో ఎక్కువ గడుపుతుంది ఆడపిల్ల. అందుకే ప్రేమ అయినా, పోట్లాటైనా తల్లి తోనే ఎక్కువ వుంటుంది. ఇది ప్రతి ఇంట్లో జరిగే సంగతే. నీవు చిన్నప్పుడు లతను మాల తో పోలుస్తూ ఎప్పుడైనా తిట్టావా? జ్ఞాపకం చేసుకో.."

ఒక క్షణం ఆలోచించింది పార్వతి. లత చిన్నప్పటి సంగతులు గుర్తు చేసుకుంటూ అంది "మాల ఎప్పుడూ ఫస్ట్ వచ్చేది. లత సరిగా చదవదని ఎప్పుడూ కంప్లైంట్స్ వచ్చేవి. అప్పుడు తిట్టేదాన్ని. అలాగే మాల అన్నిటిలో ఎంత బాగా బిహేవ్ చేస్తుంది, నీవు అలా ఎందుకు వుండవు " అన్న రెండు సందర్భాలను చెప్పింది వాసవితో.

"చూడు పార్వతి, లత కూడా మాల లాగా వుండాలనే తపన పడుతూ, లతను బాగు చెయ్యాలన్న ఉద్దేశంతో, మాల గురించి నెగటివ్ ఆలోచనలు పుట్టించావు. నీకు తెలియకుండానే.. ఇంకా ఎన్నో విషయాలు జరిగి వుంటాయి. ఫలితం లత మాల కంటే తనే గొప్పగా నీకు కనిపించాలని అనుకుంది. అంతే కాదు నిన్ను ఎదిరిస్తూ నీవు బాధపడేలా చేసి, ఆనందం పొందడం అలవాటు చేసుకుంది. ఎందుకంటే ? వాళ్ళ నాన్న కంటే తనలో ఈ ఫీలింగ్స్ రావడానికి ముఖ్య కారణం నీవు, అన్న ఉద్దేశ్యం తో కూడా నిన్ను హర్ట్ చేస్తే ఎక్కువ ఆనందం పొందేదేమో.. అదే మొదట్లోనే నీవు లతకు సపోర్ట్ ఇచ్చి, తనకు నీవున్నావనే ఫీలింగ్ కలిగించివుంటే, సీను మరోలా వుండేది. అందుకే పిల్లల విషయంలో చాలా సున్నితంగా ప్రవర్తించాలి. పిల్లలను కనగానే సరిపోదు పెంపకం ఎలా అన్నది కూడా తల్లిదండ్రులకి ఒక పరీక్ష.

సరే, ఇప్పుడు అవి మాట్లాడి ప్రయోజనం లేదు. ప్రస్తుత సమస్యలో లతను సరిచెయ్యాలి అంటే మాలతో పోటీగా కాదు, తనకు తానుగా ఒక గుర్తింపు పొందాలి. అన్న నమ్మకం కుదరాలి. ఇందులో నీవు తనకు మనసా వాచా తన మంచినే కోరుకుంటున్నట్టు గానే వుంటూ, ఎక్కడా మాల ప్రస్తావన రాకుండా తెలియ చెప్పాలి. పేరెంట్స్ గా మీరిద్దరూ లతకు దగ్గర అవ్వాలి. అది పైపైకి కనిపించేటట్టు కాకుండా తన మనసులో నాటుకు పోయేలా, లత బిహేవియర్ లో మార్పు వచ్చాక తనకి అన్నీ విధాలా సపోర్టు ఇస్తూ నెమ్మదిగా చక్క దిద్దాలి. కొద్దిగా టైము పట్టినా, అన్నీ సర్దుకుంటాయి. అలా సరిపోకపోతే కౌన్సెలింగ్ చెయ్యడానికి నేను ఉన్నాను" ఆపింది వాసవి.

లేచి వాసవి చేతులు రెండూ పట్టుకుంది పార్వతి, కన్నీళ్లు నిండిన కళ్ళతో..

వాసవి పార్వతి భుజం తట్టి "అల్ ది బెస్ట్" అంది.

తల్లి పిల్లల మంచి కోరి అనాలోచితంగా చేసే వ్యాఖలు, ఇంతటి ప్రభావం చూపుతాయా అని విస్తుపోయింది పార్వతి. తను చేసిన తప్పులు బూతద్దంలో కనబడ సాగాయి.

తను చేసిన పొరబాటుని దిద్దుకుని లత ఆలోచనా సరళిని చక్క దిద్దాలనే దృడ నిశ్చయంతో కదిలింది పార్వతి...

★ ★ ★

కవిత

# 'నానీలు'



- ఆచార్య సూర్యధనుంజయ్
మొబైల్: 9849104187

అరే! అమ్మతనం
ఓడిపోయిందా?
దారిద్ర్యానికి
ఏదైనా సాధ్యమే!

నోట్లో సారా చుక్కేసి
ఆడ శిశువును చంపేస్తారా?
తండాలకూ
గుండె లేదా!

ఆమె రికార్డు
సాధించక తప్పదు
ఆత్మవిశ్వాసమే
దానికి హద్దు

ఆమె జీవితంలో
చీకటి ముసురుకుంది
తొలిపొద్దు
పొడిచేదెప్పుడో!

గుడ్లనిండా కన్నీళ్ళతో
వీడుకోలు
ఆమె పయనం
పూనా, బొంబాయి వైపు

"ఆమె కదిలొచ్చే
కళాఖండం
ఆ డ్రస్సు కుట్టిన
యాడీని మొక్కాలి"

ఆ తండా నిండా
వితంతువులే.
మద్యం చెట్లకు వేళ్ళాడే
జీవచ్ఛవాలే!

★ ★ ★

కవిత

# జ్ఞానజ్యోతులు



మహతితేజశ్రీ
చరవాణి : 7661938945.

జగతియందున జన్మనెత్తియు
జ్ఞానజ్యోతిగ వెలుగుకొందరు
జన్మమర్మము తెలియజాలక
మూఢమతులుగ మూల్గుకొందరు!

శాస్త్రధర్మము తెలిసికొందరు
ధర్మశాస్త్రము తెలిపికొందరు
మర్మయోగిగ మారుచుందురు
జాతిప్రగతిని కోరుకొందురు!

కామితంబులు కర్మకొదిలియు
వాసిరాసుల వాంఛలొదిలియు
కావ్యరచనకు పూనుకొందురు
జ్ఞానభిక్షకు పాదులగుదురు!

ఆర్షవాఙ్మయ మనంతసిరిగ
యతులుజాతికి జాగృతంబయి
జ్ఞానమనెడు అఖండదీపము
చేత తిమిరము తరుముచుందురు!

జ్ఞానదీపము ప్రజ్వరిల్లగ
దీపకాంతులు జగతినిండగ
కాంతిబాటల నరులునడవగ
నడతనరులకు దైవమగును!

దీపకాంతుల కిరణధాటికి
అజ్ఞానతిమిరము లంతరించి
జ్ఞానబీజము లంకురించును
మనిషిఎదుగును మాన్యుడై!

వ్యాసం

# రేపటి శక్తివంతమైన సమాజం కోసం నేడు స్త్రీ పురుష సమానత్వం !



- ఝాన్సీ కె. వి. కుమారి
మొబైల్: 90108 23014.

ఈ 2022 వ సంవత్సరం అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఐక్యరాజ్యసమితి ఇచ్చిన సందేశమే నేటి మన వ్యాసం శీర్షిక !

మరోసారి ఈ శీర్షికను చదవండి, ఎంత సంతోషముతో గుండెల్లో ! వెంటనే ఓ క్వశ్చన్ మార్క్ నిటారుగా.. నింగిని తాకుతూ మనముందు నిలబడుతుంది, ఇది.. వడ్డించిన విస్తరి వారికి విందు భోజనం ! 200 సంవత్సరాలు వాళ్ళంతా జీవనపోరాటాలు చేసి, వండి, వార్చి, వడ్డించుకున్నారు. ఈరోజు వారికి పండుగే !

వాళ్ళు సమానత్వాన్ని అనుభవిస్తున్నారు ! మరి, మన పరిస్థితి ?

మనకు సైతం 200 సం.ల పోరాటం మన ముందుకొచ్చింది, రాజారామ్ మోహన్ రాయ్, నాటి గవర్నర్ జనరల్ విలియం బెంటింక్ సహకారంతో క్రైస్తవ మిషనరీల తోడ్పాటుతో స్థానిక సంస్కర్తల నడిపింపుతో మహిళాభ్యుదయానికి "మహా పోరాటం" ప్రారంభమైంది ! ఆవరించిన చీకట్లకు, అజ్ఞానం, నిరక్షరాస్యత కారణాలు గనుక– పాఠశాలలను స్థాపించి, విద్యాజ్యోతులు వెలిగించారు. కానీ, ఆనాటి వెలుగులకు మనం.. అంటే, మన పూర్వీకులైన అమ్మమ్మలు, నానమ్మలు సిద్ధపడలేదు!? స్వీకరించిన వాళ్ళు.. తమ జీవితాలనే కాదు, తర్వాతి తరాలను కూడా వెలుగులతో నింపుకున్నారు !

అంతెందుకు? నిన్నమొన్న స్వతంత్రభారతంలో, మన ప్రథమన్యాయశాఖామంత్రి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మన హక్కులకోసం ఎన్నో చట్టాలు అత్యవసరమని, ఆయా బిల్లులను పార్లమెంటులో ప్రవేశపెట్టే సందర్భంలో నాటి మన స్త్రీలు, స్వయంగా.. చేతులారా.. చీకట్లనే ఆహ్వానించారు. నల్లముసుగులతో, నల్ల జెండాలు పట్టుకుని, ఢిల్లీ వీధులను, తమ జీవితాలను చీకట్లమయం చేశారు !

ఫలితంగా.. నేటికీ, ధారకడుతున్న కన్నీళ్ళు.. ఇవిగో.. పట్టగలరా దోసిళ్ళు.. ?

★ ★ ★

అంతర్జాతీయ మహిళా దినోత్సవాలు, వారోత్సవాలు, వత్సరాలు, దశాబ్దాలు, సభలు సమావేశాలు, ఊరేగింపులు, ఊక దంపుళ్ళు, సివిల్ కోర్టులు, క్రిమినల్ కోర్టులు, హక్కులు, చట్టాలు, చర్చలు.. ఎన్నో ఎన్నెన్నో.. అన్నీ.. స్త్రీలకు రక్షణ కోసమే ! స్త్రీల అభివృద్ధి కోసమే ! స్త్రీల శారీరక మానసిక సాంఘిక ఆర్థిక రాజకీయ హక్కులనన్నింటినీ పరిరక్షించడానికే ! మరి ఇన్ని విధాల రక్షణ వలయాలు ఆమెను కాపాడుతుంటే, శిఖరాల నెక్కించడానికి మెట్లన్నీ.. "రా... రమ్మ"ని స్వాగతిస్తుంటే, ఇంకా, ఆమెకు ఏం కొదవ ?

ఇది సామాన్య సమాజపు ఆలోచన. మనది మానవ సమాజం. మనుషుల మధ్య తోటి మనుషులకు రక్షణ ఏమిటి ? మనుషులు అడవిలో తిరగాలంటే క్రూర మృగాలు ఉంటాయి వాటి నుంచి రక్షణ కావాలి కానీ, మనుషులు తిరిగే సమాజంలో మానవులకు జన్మనిచ్చే తల్లికి, ప్రేమను పంచే ఇల్లాలికి, ఆత్మీయతను అందించే ఆడపడుచులకు, అనురాగాన్ని ఇచ్చే స్నేహితులకు రక్షణ ఎందుకు ? ఆమె కోసం ఈ ప్రత్యేక చట్టాలు, ఉత్సవాలు ఎందుకు ?

మానవత్వపు విషాదమంతా అదే !

మాతృత్వం సృష్టిలో మహాద్భుతం ! పురుషుని సృష్టించిన దైవం, అతని పక్కటెముక నుండే స్త్రీని సృష్టించి, సాటి అయిన సహకారులుగా ఉండమని ఆశీర్వదించారు ! అందుకే ప్రపంచం భార్యను భర్తకు

" అర్ధాంగి " అన్నది !

అతని శరీరంలో ఆమె సగం !! అందుకే, ఆకాశంలో మేం సగం అంటున్నారు మహిళలు !

స్త్రీ గర్భం దాల్చడం, బిడ్డకు జన్మనివ్వడం అనే సృష్టి ప్రక్రియను పరమాద్భుతంగా పులకించిన మానవుడు, ఆదిలో ఆమెను దేవతగా 'మాతృదేవత' అని, గౌరవించాడు.. ఆమెకు ఉన్నత స్థానాన్నిచ్చాడు. అమ్మ చెప్పిన మాట ప్రకారమే రాజులైనా.. రమణప్పలైనా.. ! దాన్నే, 'మాతృస్వామ్య వ్యవస్థ'

అని పిలుచుకున్నారు. ఏదుష్ట హృదయంలోనో స్త్రీ పట్ల అసూయ జనించింది. అంతే, ఆమెను అణచివేయాలనే తలంపుకి బీజం పడింది, అది ఇంతింతై .. గగనమంతై .. విశ్వమంతా వ్యాపించింది.

★ ★ ★

మన కన్నీళ్ళకు అక్షరరూపం ఇవ్వాలంటే, ఇక్కడ ఓ మహా సాగరం ఉప్పొంగుతుంది ! ఆ వివరాలు వద్దు.

అమ్మ గర్భంలో ఉన్న ఆడపిల్ల, చావబోయే ముసలాయనకు ఐదో కళత్రం కావడం, తర్వాత వాడి వితంతుగా అధికారానికి అంకితమవడం మొదలుకొని, నేటి ఉద్యోగిని అయిన ఇల్లాలు కన్నీటి ప్రస్థానం వరకూ...

ఎన్ని దృశ్యాలు మన కళ్ళముందు ! ?

★ ★ ★

మీతో మౌఢ్యం, కుల జాడ్యం పెంచి పోషిస్తున్న పురుషాహంకారం మహిళల కన్నీటితో జలకాలాడుతున్నాయి. సహస్రాబ్దులు, మిలేనియములు మారినా, భారత స్త్రీల కన్నీటి ప్రవాహాలు ఆగిపోయే దాఖలాలు కనుచూపు మేరలో లేవు !

ఇప్పుడు, ప్రశ్నల చూపుదువేలు మహిళల కళ్ళల్లోకి గుచ్చి గుచ్చి అడుగు తోంది, ఐక్యరాజ్యసమితి

"మీరు శక్తిమంతులై, మీ చుట్టూ ఉన్న స్త్రీలను, శక్తి మంతులను చేయగలరా ? అక్షరమొక్కటే మీ ఆయుధం ! దానితో మీలోని చీకట్లతో యుద్ధం చేసి, విజయం సాధించగలరా ? మత మౌఢ్యానికి, కుల జాడ్యానికి, అమ్ముడుపోయిన గతకాలానికి, ఇక వీడ్కోలు పలుకుతారా..?

ఐతే, విజయం మీదే ! రేపటి శక్తివంతమైన సమాజం కోసం, అడుగులు కదపండి ! నేడు.. 2022లోనే స్త్రీ పురుష సమానత్వాన్ని సాధించండి!"

ఇది మనకు, భారతీయులకు సందేశం కాదు, ఆదేశం! !

ఈ అవకాశాన్ని ఇంటి నుండే మనం ప్రారంభించాలి. ఈ నెల వర్షం ప్రారంభంలోనే, మనకివ్వబడిన, ఈ సవాలును స్వీకరించకపోతే..

"ఏ మహిళ చరిత్ర చూసినా / ఏమున్నది గర్వకారణం / కన్నీటి కడలిలోనే / అనంత జీవనయానం / అవమానాల అగ్ని జ్వాలలలో / ఆశల మృత్యువు గానం / సంప్రదాయ సంకెళ్ళలో / కట్టుబానిసల పయనం .. ! / అప్పుడిక మిగిలేది, కన్నీళ్ళే.. పట్టలేవు.. ఎన్ని దోసిళ్ళైనా ..! !

కవిత

# నేనో చెదిరిన చిరునవ్వుని




యలమర్తి అనూరాధ
చరవాణి:9247260206


నది ప్రవహించడం ఆగిపోయింది

నా కన్నీళ్ళు తోడు కావాలనేమో

అవెక్కడున్నాయి?

కరిగి కరిగి శిలలైపోయాయి

అడుగడుగున ఆంక్షల గడపలు

దాటలేక నిలవలేక

నీ ఎదుట నిలువెత్తు అద్దానయ్యాను

చెప్పినమాట విని విని విసిగెత్తిపోయాను చెవులప్పగించటమే

తప్ప

మాట్లాడగలనని మరిచా

రాబోట్ కి నాకూ తేడాలేదు

కట్నమిచ్చి నేనొస్తే

డబ్బిస్తే అదొచ్చింది

మీట నొక్కితే దాని నడక

ఏ అవసరం లేకుండానే

పరుగు పరుగున నేను

నేను..నేను కాదు

ప్రాణమున్న జీవచ్ఛవాన్ని

అంతే!

కథ

# "నయని"



- జి. దివ్య కీర్తన

చాలా రోజుల తరువాత అత్తగారి ఇంటి నుంచి ఈ లాక్ డౌన్ లో మా పుట్టింటికి వచ్చి చాలా రిలాక్సేడ్ గా నిద్రపోతున్ననన్ను ఫోన్ రింగ్ లేపింది. నిద్ర కన్నులతో సెల్ ఫోన్ స్క్రీన్ పైన విజయ్ పేరు చూసి ఖంగారు పడ్డాను. ఎప్పుడూ ఇంత పొద్దున్నే ఫోన్ చేయని విజయ్ ఇవాళ ఎందుకు చేశాడు? భయం గానే ఫోన్ తీశాను. "హలో విజయ్!" "జానూ! నయని సూయిసైడ్ చేసుకుంది. నీ ఫ్రెండ్ ని నేను పట్టుకోలేకపోతున్నాను. చాలా ఏడుస్తుంది. తొందరగా రా". నయని నా ఫ్రెండ్ దర్శిని చెల్లెలు. విజయ్, దర్శిని ని పెళ్ళి చేసుకొని ఒక్క సంవత్సరం అయ్యింది. నయని వాళ్ళ దగ్గరే ఉంటుంది. నయని నన్ను కూడా అక్కలాగానే చూసేది.

కానీ నయనికి ఏమయ్యింది? నిన్నకూడా నాతో మాట్లాడింది. వారం రోజుల నుంచి రోజూ ఫోన్ చేస్తూ ఉంది. పది రోజుల ముందే దర్శిని, విజయ్ వాళ్ళ ఊరు వెళ్ళారు. నయనీ ని ఎంత పిలిచినా పోలేదు. "మీరు వెళ్ళండి. నేను ఉంటాను. పక్క ఫ్లాట్ అంకుల్ వాళ్ళు ఉన్నారు కదా! నాకు పరవాలేదు. నేను ఒక్కతే ఉండి చాలా రోజులు అయ్యింది."అని వాళ్ళని ఊరికి పంపింది.

వారం పది రోజులుగా ఏదోలా ఉంది. నాతో ప్రతీ విషయం చెప్పేది. కొన్ని వాళ్ళ అక్కకి చెప్పలేనివి కూడా నాకు చెప్పి సలహా అడిగేది. పది రోజుల ముందు ఫోన్ చేసినప్పుడు "అక్కా! నాకు ట్రిప్ పోవాలని ఉంది. బాగా ఎంజాయ్ చేయాలని ఉంది. ఇంట్లో చాలా బోర్ గా ఉంది. ఈ వర్క్ ఫ్రమ్ హోమ్, నైట్ షిఫ్టులూ నా వల్లకావట్లేదు". అని అంది. "నాకు కూడా ఎక్కడికైనా వెళ్ళాలని ఉంది నయని, కానీ ఏమి చేస్తాం? ఈ టైమ్ లో ఎక్కడికీ పోలేం. సిటీ బార్డర్ లో చాలా చెక్ చేస్తున్నారు. నువ్వే చూశావు కదా మీ అక్కా వాళ్ళు వెళ్ళడానికి ఎంత కష్టపడ్డారో. కొన్ని రోజులు చూద్దాం" అని అన్నాను. నేను ఊరు వెళ్ళాల్సి వచ్చి, 'ఒక సారి నయనీ ని కూడా అడుగుదాం, వస్తే ఇంటికి పిల్చుకొని పోదాం' అని ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. ఊరు వెళ్ళిన రెండు రోజుల తరువాత ఫోన్ చేసి "అక్కా! నేను చాలా హ్యాపీ గా ఉన్నాను. చాలా రోజుల తరువాత మా ఫ్రెండ్సుతో చిన్న ట్రిప్ వెళ్ళాను. అక్కకు చెప్పకు "అని అంది.

"ఏంటి! ట్రిప్ వేళ్ళావా? మీ అక్కకు కూడా చెప్పలేదా? ఎందుకు చెప్పలేదు? నువ్వు ఏమి చేయాలనుకున్నాచేయి మాకెవ్వరికీ అభ్యంతరం లేదు. ఆ ఫ్రీడం నీకు మేము అందరం ఇచ్చాము. ఎందుకంటే నువ్వేమి చిన్నపిల్లవి కాదు. ఆలోచించే శక్తి ఉంది. కానీ చెప్పకుండా పోవద్దు అని చెప్పాను కదా? మళ్ళీ ఇలానే చేస్తున్నావా? అందుకే మీ అక్కనీ, బావనీ మీరు వెళ్ళండి, నేను ఒక్కతే ఉంటాను అని చెప్పావా?" అని కోప్పడ్డాను. "సారీ అక్కా! ఇంకెప్పుడు ఇలా చేయను. మా అక్కకు నా ఫ్రెండ్సు అంటే ఇష్టం లేదు. ఎప్పుడూ వాళ్ళని ఏదో ఒకటి అంటుంది. అందుకే భయపడి చెప్పలేదు. " అని అంది. "సరే! నేను మీ అక్కకు నెమ్మదిగా చెప్తాలే. నువ్వు వెళ్ళినట్టు వేరే వాళ్ళ నుంచి తెలిస్తే తట్టుకోలేదు. నువ్వు భయపడకు". అని చెప్పి ఫోన్ పెట్టేశాను.

అదే రోజు నాకు దర్శిని ఫోన్ చేసి ఖంగారుగా "జానూ! నయని ఫోన్ రెండు రోజుల నుంచి స్విచ్ ఆఫ్ వస్తుంది. నీకేమైన ఫోన్ చేసిందా? వాళ్ళ ఫ్రెండ్సు అందరికీ ఫోన్ చేశాను. ఎవ్వరూ తెలీదు అంటున్నారు. నాకేమీ అర్థం కావటం లేదు". "దర్శినీ! నేను చెప్పేది నెమ్మదిగా విను. నయని చిన్న పిల్ల ఏమీ కాదు. నాకు కూడా రెండు రోజుల నుంచి ఫోన్ చేయలేదు. ఇప్పుడే చేసింది. తనకి నువ్వు అంటే కొంచం భయం. అందుకే వాళ్ళ ఫ్రెండ్సు తో ట్రిప్ వెళ్ళాలి అని అడిగితే నీకు కోపం వస్తుంది

అని ఎవ్వరికీ చెప్పకుండా వాళ్ళ ఫ్రెండ్స్ తో ఎక్కడికో వెళ్ళింది అంట. నేను కోప్పడ్డాను. నువ్వు ఇంకా ఏమీ అనకు. ఇంకెప్పుడూ చేయదులే. ఇంట్లోనే ఉండి తనకు బోర్ కొట్టింది అనుకుంటాను. ఎందుకైనా మంచిది తొందరగా ఇంటికి వెళ్ళండి. నాకెందుకో మనసు కుదుటగా లేదు. తను ఇప్పుడు ఉద్యోగం చేస్తుంది కదా. ఆఫీసు వాళ్ళు కూడా ఉంటారు. మనకు తెలియని వాళ్ళు ఎంత మందో ఉంటారు. తనని కట్టడి కూడా చేయలేము. నయని ఏమో అందరినీ తేలికగా నమ్మేస్తుంది." అని చెప్పాను.

ఆ రోజు నుంచి రోజు కి మూడు సార్లు మేము తనతో మాట్లాడేవాళ్ళం. దర్శిని వాళ్ళు కూడా ఇంకో రెండు రోజుల్లో వెనక్కి వచ్చేయాలని అనుకున్నారు. నేను ఎప్పుడు మాట్లాడినా బాగానే మాట్లాడింది. మూడు రోజుల ముందు నయని ఒక్కటే ఉన్నప్పుడు నయని ఆఫీసు ఫ్రెండ్ ఒకడు ఇంటికి వచ్చాడంట. పక్కింటి వాళ్ళు దర్శిని కి ఫోన్ చేసి చెప్పారు. దర్శిని ఏమీ ఆలోచించకుండా నయని కి ఫోన్ చేసి బాగా తిట్టేసింది. నయని నాకు ఫోన్ చేసి "అక్కా! ఏమీ తప్పు చేయలేదు. మన ఇంటికి తన పేరు మీద ఒక పార్శిల్ వచ్చింది. తాను వాళ్ళ వూరిలో ఉన్నాడు అని మన అడ్రెస్సు ఇచ్చాడు. తను వచ్చి పార్శిల్ తీసుకెళ్ళాడు. ఇది చెప్తుంటే కూడా నన్ను మా అక్క నమ్మటం లేదు. బాగా తిట్టింది." అని ఏడుస్తూ ఫోన్ పెట్టేసింది. దర్శిని కి ఫోన్ చేసి "తను చెప్పేది కూడా కొంచం వినచ్చు కదా! మనకు తెలీదు. పక్కింటి వాళ్ళు చెప్పేది కూడా మనం గుడ్డిగా నమ్మలేము. నువ్వు ఇంటికి వెళ్ళే వరకు తనతో మంచి గా మాట్లాడు. ఇంటికి వెళ్ళాక అన్నీ మాట్లాడుకోవచ్చు. ఇంట్లో తను ఒక్కటే ఉంది" అని చెప్పాను.

నయని నిన్న రాత్రి రెండు సార్లు ఫోన్ చేసింది. మొదట బాగానే మాట్లాడినా, రెండో సారి సరిగ్గా పదకొండు కు ఫోన్ చేసి అక్కా! ఐ లవ్ యు అక్కా. నువ్వు, మా అక్క అంటే నాకు చాలా ఇష్టం. అక్కా! నాకు మీతో ఇంకా ఎక్కువ రోజులు ఉండాలని ఉంది. ప్లీజ్ అక్కా. ఏమైనా తప్పు చేసి ఉంటే క్షమించండి అక్కా. మీరు చెప్పింది నిజమే. నేను అందరినీ గుడ్డిగా నమ్మేస్తాను. ఎవ్వరినీ నమ్మకూడదు. అందరూ వాళ్ళ పని కోసం మన దగ్గర ఉంటారు. పని అయిపోయాక ఫోన్ కూడా చేయరు. ఫ్రెండ్స్ అందరూ అంతే."అని అంది. "సరే నయనీ! ఇప్పటికైనా నువ్వు తెలుసుకున్నావు. ఇంకెప్పుడూ ఇలా చేయవులే. నువ్వు ఏమీ ఆలోచించవద్దు. నీకు మేమందరం ఉన్నాము. మేము అక్కడికి వచ్చాక మాట్లాడుకుందాం. ఏమీ పరవాలేదు. నువ్వు ఏమీ తప్పు చేయలేదు. అని చెప్తూ ఉండగా ఫోన్ కట్ చేసేసింది. మళ్ళీ ఫోన్ చేస్తే బిజీ వచ్చింది. వెంటనే తన దగ్గరి నుంచి దర్శిని అక్కతో మాట్లాడుతున్నాను అని మెసేజ్ వచ్చింది. విజయ్ కి ఫోన్ చేసి జరిగినది అంతా చెప్పాను. తను కూడా ఇద్దరూ మాట్లాడుకుంటున్నారు లే. ఏమీ కాదు" అని చెప్పాడు. కానీ ఇలా చేస్తుందని అస్సలు అనుకోలేదు.

ఏమీ కాదు, అన్నీ సర్దుమణిగి పోయాయి అనుకుంటూ నిద్రపోయాను. కానీ తెల్లవారు జామునే పిడుగులాంటి వార్త వచ్చింది. నాకు ఏమీ అర్థం కాలేదు. వెంటనే మా ఆయన గణేష్ కి చెప్పాను. "వెంటనే వెళ్లాలండీ. అక్కడ ఎవ్వరూ లేరు. పక్కింటి వాళ్ళు చూసి చెప్పారంట. దర్శిని వాళ్ళు రావడానికి ఎనిమిది గంటలు పడుతుంది. మనం మూడు గంటల్లో వెళ్ళిపోవచ్చు" అని చెప్పాను." పోయిన నయని ని ఇంత మంది ఉన్నా అనాధ గా వదలడం నచ్చలేదు. గణేష్ "వెంటనే బయలుదేరుదాం. రెఢీ అవ్వు జాను". అని చెప్పి మా అమ్మ వాళ్ళకి జరిగినది అంతా చెప్పాడు. మా ఇంట్లో వాళ్ళంతా చాలా భాధపడ్డారు.

మూడు గంటల్లో నయని ఇంటికి వెళ్ళాం. ఇంటి ముందు పోలీస్ జీప్ ఉంది. వెంటనే లోపలికి వెళ్ళి చూశాను. నయనీ ని ఎప్పుడూ అలా చూస్తాను అని అనుకోలేదు. కానీ ఏమి చేస్తాం. నయని చాలా తొందరపడింది. పోలీస్ "ఎవరు మీరు?" అని అడిగారు. నేను నయని అక్క దర్శిని ఫ్రెండ్. నయని కూడా నాకు క్లోస్"అని చెప్పాను. "అయితే నయని మీకు క్లోస్ అన్న మాట. ఏమి జరిగిందో చెప్పండి. ఎవరి మీదైన అనుమానం ఉంటే చెప్పండి మేము చూసుకుంటాము" అని అన్నారు. నేను జరిగిందంతా వివరించాను. 'ఎవ్వరూ తనని కొప్పడలేదు. తప్పు చస్తుందేమో అని హెచ్చరించాం' అని చెప్పాను.

సరిగ్గా అప్పుడే నయని రూమ్ నుంచి ఒక పోలీస్ ఒక డైరీ తెచ్చాడు. "జాను అంటే మీరే నా" అని అడిగారు. అవునన్నాను. ఇందులో ఒక లెటర్ రాసింది. మీ గురించి కూడా రాసి ఉంది చూడండి అని డైరీ నాకు ఇచ్చాడు. ఆ లెటర్ చదువుతున్న నాకు కళ్ళలో నీళ్ళు ఆగడం లేదు.

ప్రియమైన దర్శిని అక్కా,

నేను పుట్టిన రెండేండ్ళ కే అమ్మ చనిపోయింది. నాన్న

ఎక్కడున్నాడో తెలియదు. ఇద్దరు ఆడపిల్లలు ఎలా పెరుగుతారో అని పిన్ని, బాబాయిలు మనల్ని పెంచారు. కానీ నాకు చిన్నప్పటి నుంచి వాళ్ళ ఇంట్లో ఒక పని మనిషిగా ఉండటం నచ్చలేదు. అప్పుడే చనిపోవా లని అనుకున్నాను. కానీ నిన్ను చూసి ఆ పని చేయలేదు. స్కూల్ ఆయిపోతే కాలేజీ కి ఎలాగూ వేరే ఊరికి వెళ్ళాలి. అప్పుడు నన్నెవరు అడుగుతారు లే అని అనుకున్నాను. ఆ స్కూల్ చదివినంతకాలం రోజూ ఏడుస్తూ చదివాను. నేను ఏమి చేసినా తప్పు అని చెప్పే పిన్ని, ఎవరితో మాట్లాడినా అనుమానించే బాబాయి! అందరితో మాట్లాడటం మానేశాను. కానీ నిన్ను చూసి ఎలా మెలగాలో నేర్చుకున్నాను. కానీ అలానే ఉండలేకపోయాను. నేను ఫ్రీ గా లైఫ్ ఎంజాయ్ చేయాలి అని చిన్నప్పటి నుంచి అనుకునేదానిని. కానీ ఆ ఇంట్లో కట్టుదిట్టం గా పెరిగాను.

కాలేజీ కి పక్క ఊరి లోని హాస్టల్ లో జాయిన్ అయిన నాకు చాలా ఫ్రీడం వచ్చింది అని అనుకున్నాను. అవును అక్కా, నాకు నిజంగానే ఫ్రీడం వచ్చింది. అక్కడ నన్ను అడిగేవారు ఎవరున్నారు? నాకు దొరికిన రూమ్ మేట్సు కూడా అలానే ఉన్నారు. బాగా తిరిగడం మొదలుపెట్టాను. గర్ల్స్ కాలేజీ అవడం వలన మేము ఆదివారం వచ్చింది అంటే ఎక్కడ ఉండేవాళ్ళమో కూడా తెలీదు. హాస్టల్ కి ఎప్పుడయినా నువ్వు ఫోన్ చేసేదానివి. తరువాత నన్ను చూడటానికి కూడా బాబాయి వచ్చేవాడు కాదు. ఎందుకు? నేను అంటే ఇష్టం లేదు వాళ్ళకి. నాలో నేను చాలా కుమిలిపోయాను. ఉద్యోగం తొందరగా వస్తే నన్ను కూడా అందరూ ఇష్టపడతారు కదా? అందుకే డిగ్రీ తరువాత నువ్వు ఉన్న చోటనే ఉద్యోగం సంపాదించాను. అలా అయితే నీ దగ్గరే ఉండచ్చు కదా.

ఉద్యోగంలో చేరి నీ ఇంటికే వచ్చాను. అప్పుడు నీకు పెళ్ళి కాలేదు. ఒక్కదానివే ఉండేదానివి. నువ్వు నాలాగా తయారు అయిఉంటావు అనుకున్నాను. నీ దగ్గరికి వచ్చిన పది రోజుల్లోనే నాకు అర్థం అయ్యింది. నీ దగ్గర ఉంటే నాకు ఫ్రీడం ఉండదు. ఎందుకు అంటే నువ్వు అస్సలు మారలేదు. అదే అమాయకత్వం, అదే సున్నితత్వం. పిన్ని బాబాయి ఏమి అన్నా విని వదిలేసేదానివి. నేను వాళ్ళతో ఎప్పుడు మాట్లాడేదాన్ని కాదు. ఎప్పుడు మాట్లాడినా నీ జీతం ఏమైతుంది ? ఏం చేస్తున్నావ్ వచ్చిన డబ్బుతో? అని అడిగేవారు. నేను సంపాదించడం మొదలుపెట్టినా వీళ్ళకి ఎందుకు సమాధానం చెప్పాలి అని ఊరుకుండెదానిని. నా మూలాన నువ్వు ఎన్నో సార్లు వాళ్ళతో తిట్లు తిన్నావు. లోలోపల చాలా భాధపడ్డాను. కానీ ఎవ్వరికీ చెప్పుకోలేదు. చిన్నప్పటి నుంచి ఏం జరిగినా ఎవ్వరికీ చెప్పుకోవాలి అని అనిపించదు. నేను అక్కడికి వచ్చిన రెండు నెలలకి జాను అక్క మన ఇంటికి వచ్చింది. ఆ అక్కతో మాట్లాడుతుంటే ఏదో కొత్తగా అనిపించేది. మాటలతో మాయ చేస్తుంది. ఎప్పుడూ ఇంకా మాట్లాడాలి అని అనుకునేదానిని. ఎప్పుడు దగ్గరయ్యానో తెలీదు. అక్క మన ఇంటికి వస్తుంది అంటే నాలో ఏదో తెలియని ఆనందం. ఇంట్లో నా అనేవాళ్ళు ఉంటే ఇలానే ఉండేదేమో. ఆ ఆనందం ఎవరిని చూసినా వచ్చేది కాదు. నువ్వు జాను అక్కను 15 రోజులకీ, నెలకీ, ఇంటికి పిలిచేదానివి. మీరు ఇద్దరూ ఒకే ఆఫీసు కావడం వలన నాకు మేలు జరిగినది. జాను అక్కతో ఐదు నిమిషాలు మాట్లాడితే చాలు నీకు చెప్పలేనివి కూడా తనకి చెప్పేసేదానిని. నేను తనతో చాలా దగ్గరయ్యాను.

నీ పెళ్ళికి మనం చాలా పనులు కలిసి చేశాం. జాను అక్క మన ఇంట్లో నే ఉండిపోయింది ఆ పది రోజులు. నాకు జాను అక్కతో ఉంటే ఏదో తెలియని ధైర్యం. కలిసి బట్టలు తీసుకున్నాం , కలిసి పత్రికలు కొట్టించాము, ఇలా చెప్పుకుంటూ పోతే ఈ డైరీ సరిపోదు. మీరు నాతో ఎంత బాగా ఉన్నా, నేను మిమ్మల్ని అందరినీ మోసం చేశాను. కాదు నన్ను నేను చాలా మోసం చేసుకున్నాను. అన్నింటికీ ముందు ఫ్రెండ్సు ఉన్నారు అని అనుకున్నాను. ఆ మాయలోనే నన్ను పెంచిన పిన్ని, బాబాయిలు ఉన్నారు అనే విషయం కూడా మరచిపోయాను. చిన్నప్పటి నుంచి వాళ్ళిద్దరూ అంటే నేను ఇష్టపడే దానిని కాను. ఎందుకంటే నేను వాళ్ళిద్దర్నీ అర్థం చేసుకోలేదు. పిన్ని నన్ను వంట చేయి, ఇల్లు దుమ్ము దులుపు, బట్టలు ఉతుకు, పొలముకి నీళ్ళు పెట్టు అని అంటే వీళ్ళకి నేను ఒక పనిమనిషి అని అనుకున్నాను. కానీ ఇల్లు వదిలి వేరే ఊరికి వెళ్ళి స్థిరపడితే ఎవరి మీదా ఆధార పడకుండా అన్నీ నేర్చుకోవాలి అని పిన్ని ముందే అనుకొని నాకు నేర్పిస్తుంది అని అనుకోలేదు. అబ్బాయిల తో మాట్లాడితే బాబాయి ఎవరు, ఎందుకు అని అడుగుతుంటే నా మీద అనుమానం తో నన్ను ఇలా అడుగుతున్నాడేమో అని అనుకునేదానిని. కానీ నేను మాట్లాడే అబ్బాయిలు ఎలాంటి వారో తెలుసుకునే దానికి అడుగుతున్నాడని ఎప్పుడూ అనుకోలేదు. ఉద్యోగం లో చేరిన తరువాత డబ్బులు ఏమౌతున్నాయి అని

అడిగితే నా డబ్బులు ఏమైతే ఏంటి వీళ్ళకి అని అనుకున్నాను. కానీ డబ్బులు మన దగ్గర ఉంటే ఎక్కడ చెడిపోతామో అని ఇలా అడిగేవారు అని తెలియలేదు. నాకు అమ్మా, నాన్నా ఉంటే కూడా ఇలానే అడుగుతారు కదా! ఎందుకు అపార్థం చేసుకున్నాను? చిన్నప్పటి నుంచి వీళ్ళు చెప్పినవి వినలేదు. వాళ్ళకు నచ్చని పనులే చేశాను. ఎందుకంటే నేను ఫ్రీడం కోసం ఏమయినా చేయాలి అని అనుకునే దానిని కదా.

బాబాయి చెప్పినట్టు నేను మాట్లాడే వాళ్ళు ఎలాంటి వారో తెలుసుకుని మాట్లాడి, వాళ్ళతోనే స్నేహం చేసి ఉంటే ఇప్పుడు నేను మీ ముందు ఉండే దాననిని ఏమో. అందరినీ గుడ్డిగా నమ్మాను. నా మీద ఎవరు జాలి చూపించి కొంచం ఎక్కువ మాట్లాడినా వాళ్ళు మంచివాళ్ళు అని అనుకున్నాను. నా విషయాలు అన్నీ చెప్పుకున్నాను. వాళ్ళు నీకు నేనున్నాను, నేను నీకు చాలా ప్లేస్ లు చూపిస్తాను అని ఎక్కడికి పిలుచుకు పోయినా గుడ్డిగా ఒక నమ్మకం తో వెళ్ళిపోయే దానిని. అదే నా జీవితం లో నేను చేసిన పెద్ద తప్పు.నాకు ఫోటోలు తీయడం చాలా ఇష్టం. ఒక పెళ్ళిలో అలానే ఒక ఫొటోగ్రాఫర్ ని కలిశాను. తనతోనే నా లైఫ్ మారిపోతుంది అని ఎప్పుడూ అనుకోలేదు. ఫోటోస్ ఇలా తీయాలి , అలా తీయాలి అని చాలా టెక్నిక్ లు చూపించాడు. తనతో మాట్లాడినంతసేపు నాలో కొత్త నయని బయట వచ్చేది. కొద్ది రోజులకి తాను చెప్పిందే నాకు కరెక్టు అని అనిపించింది. సారీ అక్కా, బావా మీకు నేను నా ఫ్రెండ్స్ తో బయట వెళ్తున్నాను అని చెప్పి వాడి టీం తో ఎక్కడెక్కడికో ఫోటో షూట్ కోసం వెళ్ళేదానిని. మీరు ఊరికి వెళ్ళాక చాలా జరిగాయి. నేను ఎవరెవరితో బయట వెళ్ళానో వాళ్ళు అందరూ నా ఫోటోస్ తీశారు. వాటిని ఫోటో మార్ఫింగ్ తో చాలా అసభ్యం గా మార్చారు. చివరికి అమ్మాయిలు కూడా ఇలానే చేశారు. మీరు ఊరు వెళ్ళాక ఒక్కొక్కరు ఒక్కో రకం గా నన్ను బ్లాక్ మెయిల్ చేయడం మొదలు పెట్టారు.

కొంత మంది మీ పిన్ని, బాబాయి కి ఈ ఫోటోస్ పంపుతా అని, కొందరు మీ అక్కా, బావకి పంపుతా అని, కొందరు నేను చెప్పింది చేయకపోతే నీ ఫోటోలు ఇంటర్నెట్ లో పెడుతా అని రకరకాలు గా బ్లాక్ మెయిల్ చేశారు. మీకు ఎన్నో సార్లు చెప్దామని అనుకున్నాను. కానీ ఎప్పుడూ మీకు ఏమీ చెప్పని నేను మీకు చెప్పాలి అంటే ఎక్కడో భయం. జంకు. పోనీ ఫ్రెండ్స్ కి చెప్దామని అనుకుంటే అందరూ నన్ను వాడుకునేవారే. ఇప్పుడు నాకు ఏ ఫ్రెండ్స్ లేరు. ముందుటి నుంచి ఇంట్లో వాళ్ళ కన్నా ఫ్రెండ్స్ ని ఎక్కువ నమ్మాను. కానీ మంచి ఫ్రెండ్స్ నాకు లేరు అని ఇప్పుడే తెలిసింది. అందరి బ్లాక్ మెయిల్ లు తట్టుకోలేక డిప్రెషన్ లోకి వెళ్ళిపోయాను. కానీ ఎలాగైనా డిప్రెషన్ నుంచి బయటకు రావాలని ఆన్లైన్ లో డాక్టర్ ని కలిసి డిప్రెషన్ టాబ్లెట్స్ తీసుకున్నాను. ఒకడు నా ఫోటోస్ సోషల్ మీడియాలో పెట్టేశాడు. ఎంత బ్రతిమలాడినా తీయలేదు. అది పిన్ని, బాబాయి, మీరు చూసే లోగా నేను ఉండకూడదు. ఎవరి నుంచి నో ఇవన్నీ వినటం కన్నా నేనే మీకు ఇలా చెప్పాలని ఈ ఉత్తరం రాస్తున్నాను. నేను చేసిన తప్పులు ఇంక ఎవ్వరూ చేయకూడదు. ఫ్రెండ్స్ ఉండాలి కానీ వాళ్ళు మంచి వాళ్ళు అయి ఉండాలి. ఏమయినా జరిగితే మొదట ఇంట్లో వాళ్ళకి చెప్పాలి. మనకు దగ్గరైన వాళ్ళకి చెప్పాలి. ఇది తెలిసే లోగా జరగాల్సినవి అన్నీ జరిగిపోయాయి. ఎవరి పేరూ బయట పెట్టి వాళ్ళను కష్టాలలోకి నెట్టడం నాకు ఇష్టం లేదు. అందుకే నాకు మోసం చేసిన వాళ్ళ పేర్లు ఎవ్వరివీ బయట పెట్టలేదు. నా చావుతోనైనా వాళ్ళు మారి ఎవ్వరికీ ఇలా చేయకుండా ఉంటే చాలు. దేవుడే అన్నీ చూసుకుంటాడు. వాళ్ళ వలనే నేను చనిపోయాను అనే భావన వాళ్ళలో అలానే వాళ్ళు చచ్చే వరకు ఉండిపోవాలి.

మిమ్మల్ని బాధ పెట్టినందుకు అందరూ నన్ను క్షమించండి. ఇంకా నా గురించి ఎవ్వరూ భాధ పడకండి. పిన్ని, బాబాయి మిమ్మల్ని చాలా తప్పుగా అర్థం చేసుకున్నాను. దర్శిని అక్కా,బావా మీరు నన్ను చాలా బాగా చూసుకున్నారు. మీ దగ్గర కూడా నేను చాలా విషయాలు దాచాను. జాను అక్కా! నువ్వు ఇంటికి వచ్చినప్పుడు అంతా చాలా ఆనందం గా ఉండేదానిని. నీతో చాలా విషయాలు చెప్పుకున్నాను. కానీ ఈ విషయాలు చెప్పకుండా నిన్ను కూడా మోసం చేశాను. మీరు అందరూ నన్ను క్షమించండి.

వెళ్ళి పోతున్నా,

మీ,

నయని.

ఇక్కడ ఎవరిది తప్పు? అందరినీ నమ్మిన నయనిది తప్పా ? లేక నమ్మిన వాళ్ళను మోసం చేసిన వాళ్ళది తప్పా? అనుకుంటూ నేను నయని మొహం చూస్తూ అలానే ఏడుస్తూ ఉండిపోయాను.

# సత్పురుషా ...!?



యడవల్లి శైలజ ప్రేమ్
చరవాణి : 9394171299

(1)

అబ్బబబ్బా ....

ఏమయ్యా ! ‘ సచ్చానందం’ ఈ ఆడవాళ్ళకు అంతగనం ఏం ముచ్చట్లు ఉంటాయి చెప్పు ? కాస్త గ్యాప్ దొరికితే చాలు

గుంపుకూడి మాట్లాడుతూనే ఉంటారు . మన ఆఫీస్ అనే కాదు ఏ ఆఫీస్ అయినా ఇంతే మొన్న పనిమీద నా ఫ్రెండ్

‘ మహేష్ ‘ ఆఫీస్ కి వెళ్ళాను కదా అక్కడా ఇంతే .

అక్కడా ..... ఇక్కడా అని కాదు అస్సలు ఎక్కడైనా అంతే.

ఆడవాళ్ళని పనిలో పెట్టుకోవడం ఈ ప్రభుత్వం , ప్రైవేటు సంస్థలు చేస్తున్న పెద్ద తప్పు . ఆడవారి బయోగ్రఫీ రాసినట్టు నాన్ స్టాప్ గా ఆగకుండా చిన్నపాటి ఊకదంపుడు ఉపన్యాసం ఇచ్చి ఏమంటావ్ ? అని అతని సమాధానం కోసం ఆగాడు.

సచ్చానందం సమాధానం చెప్పడానికి ముందే ఏంటి? మన్మథుడు సినిమాలో హీరో నాగార్జున అన్నట్లు అంటున్నాడని

మనసులో అనుకుంటున్నావా ? పళ్లని కనబడేలా ఇకిలించాడు.

‘ సత్యానందం ‘ అనే తన పేరును ‘ సచ్చానందం ‘ అని ఎగతాళిగా పలుకుతూ అధికార దర్పం చూపించే ఈయనకి తను సమాధానం ఏమని చెప్పగలడు ?.

తన కొడుకు వయసు వాడు ఆ చనువుతో కూడా చెప్పే అధికారం తనకు లేదు ఎందుకంటే అతను తన పై అధికారి కనుక అరవై యేండ్ల తన జీవితంలో ఎన్నో అనుభవాలు ఎదురయ్యాయి కూడా ఇటువంటి వాళ్ళతో వాదనకు దిగకూడదు.

దిగితే తన ఉద్యోగం ఊడిపోతుంది.

ఇంకా ఆడవారి గురించి చెప్పాలంటే తన బిడ్డ ‘సత్యవతి ‘ కూడా ఒక జిమ్ సెంటర్లో స్వీపర్ గా పనిచేస్తుంది . ఆ సెంటర్లో రకరకాల ఆలోచనలు ఉన్న మనుషుల్ని చూసి వస్తుంది . ఏ విషయమైనా తనతో చెప్పుకుంటుంది.

కన్నకూతుర్ని అక్కున చేర్చుకుని తను ఓదార్చుతాడు.

ఈ అమ్మలకు కూడా ఎన్ని కష్టాలున్నాయో పాపం కాసేపు ఒకరినొకరు ఓదార్చుకుంటారు , నవ్వుకుంటారు , కౌగిలించుకుంటారు.

అని మనసులో అనుకున్నాడు.

సరేనోయ్! సచ్చానందం ఆ పార్వతి మేడం ఇంకా రాలేదా? వచ్చిన తర్వాత నా క్యాబిన్ లోకి నేను రమ్మన్నానని పంపించు .

అదిగాదయ్యా ఇదేమన్నా వాళ్ళ అత్తగారి ఆఫీస్ అనుకుంటుందా ? ఎప్పుడు ఆలస్యంగా రావడం తొందరగా పర్మిషన్ తీసుకుని ఇంటికి పోవడం జీతం డబ్బులు కట్ చేసి ఇస్తే ఆమె తిక్కకుదురుతుంది కసిగా అన్నాడు బాస్ అనబడే ‘ కార్తీక్ ‘.

‘ సత్యానందం ‘ ఆ పార్వతిని బాస్ వెకిలి చేష్టలు చేస్తూ ఇబ్బంది పెట్టబోవడం ఆ మేడమ్ తన తెలివితేటలతో తప్పించుకొని తిరగడం గమనిస్తూనే ఉన్నాడు .

ఆఫీస్ టైం కన్నా ఐదు పది నిమిషాలు ఆలస్యంగా ఏ ఉద్యోగిని వచ్చినా ఆమెను మాటలతో హింసిస్తూనే ఉంటాడతను

కంప్లైంట్ చేయాలని ఉన్నా చేయలేరు ఎందుకంటే అది ఒక ప్రైవేటు సంస్థ తమ ఇష్టప్రకారం అగ్రిమెంట్ పత్రాలు ముందుగానే వాళ్ళకు రాసిస్తారు చిన్న ఉద్యోగి దగ్గర్నుంచి పెద్ద ఉద్యోగి వరకు ఈ సంస్థ పై ఎవరికి ఎటువంటి ఫిర్యాదు చేయబోమని అందుకే యాజమాన్యం సిబ్బందిని చిన్న చిన్న ఇబ్బందులకు గురిచేస్తుంటారు .

యాజమాన్యం మహిళలను పెట్టే ఇబ్బందులు బయటికి వచ్చి చెప్పుకునేటంత పెద్దవి కావు కానీ మానసిక ఇబ్బందికి మాత్రం గురిచేస్తుంది.

కాలింగ్ బెల్ మోగింది .

సత్యానందం కార్తీక్ కి ' టీ ' ఇచ్చే టైం అయ్యింది .

సత్యానందం మన ఆఫీస్ లో అందరికి ఈ స్వీట్స్ పంచిపెట్టు .

ఎందుకు సర్ ? అని అడిగాడు అతను.

ఈ సిటీ లో బెస్ట్ గా ఉన్న సంస్థల్లో మన సంస్థ కూడా నెంబర్ వన్ పొజిషన్లో ఉంది . అవార్డు కూడా గెలుచుకున్నాం అందుకే అని చెప్పాడు కార్తీక్ .

(2)

రాణి , సుధ , సుజాత , నస్రీన్ , శివప్రియ ట్యాప్ దగ్గర హ్యాండ్స్ వాష్ చేసుకుని వచ్చి లంచ్ బాక్స్ ఓపెన్ చేసారు .

ఏంటి ఈరోజు పార్వతి మేడం రాలేదు అనుకున్నారు .

శ్రావణి లంచ్ బాక్స్ చేతులో పట్టుకుని అప్పుడే వస్తు సుధా మేడం మీకేమైనా తెలుసా అని అడిగింది.

తెలియదు శ్రావణి మేడం పార్వతి నాకు కూడా ఏమీ చెప్పలేదు అన్నది సుధ.

శ్రావణి మేడం మీరేంటి లంచ్ చేయడానికి ఇంత ఆలస్యంగా వచ్చారు?.

లంచ్ బాక్స్ తీసుకుని వద్దామనుకునేలోపే ఆ డబుల్ మీనింగ్ గాడు పిలిచాడు. లంచ్ చేసాక వస్తానని చెబుదామంటే వాడు చెప్పింది మనం వినాలి కాని మనం చెప్పేది ఆయనగారు వినరు కదా మరి అన్నదామె .

అవునవును అదీ నిజమే అన్నారందరు.

మేడమ్ అని గౌరవించుకుంటూనే ఒకరినొకరు అప్పుడప్పుడు పేరు పెట్టి పిలుచుకుంటారు . వాళ్ళ కష్టసుఖాలను పంచుకుంటారు.

శివప్రియ పెరుగన్నం మాత్రమే తెచ్చుకుని తినబోతుంటే రాణి బాక్స్ మూతలో ఆలుగడ్డ వేపుడు కొంచెం అన్నం పెట్టి ఇచ్చింది.

వద్దు రాణి నాకు ఈ పెరుగన్నం సరిపోతుంది అన్నది . పర్వాలేదు తిను శివా నేను రోజు అన్నం కొంచెం ఎక్కువగానే తీసుకుని వస్తాను అయినా మనలో మనకు ఈ మొహమాటం అవసరమా అంది.

మరుసటిరోజు ఉదయం పార్వతి తొందరగానే వచ్చింది. నిన్న ఎందుకు రాలేదు అని అడిగారు .

ఆఫీస్ కి వద్దామని బయలుదేరాను సరిగ్గా అప్పుడే పీరియడ్స్ వచ్చాయి . ప్యాడ్స్ కూడా సమయానికి ఇంట్లో లేవు .

మావారికి చెబుదామనుకున్నాను నేనా ? ప్యాడ్సా? అని నోరెళ్ళబెట్టి అదేదో యాడ్ టైపు చూస్తారు. నేను షాపు దగ్గరకు వెళ్ళి తీసుకుని వచ్చేటప్పటికి ఆలస్యం అయ్యింది . ఆలస్యంగా వచ్చామో బాస్ అనబడే ఆ మహానుభావుడు వదిలిపెట్టడు అందుకే ఒక మేసేజ్ చేసాను. చూద్దాం ఏం జరుగుతుందో అన్నది పార్వతి .

అవునా ?

మనం షాపింగ్ కి బయలుదేరామో మగవాళ్ళు వాడే షేవింగ్ క్రీమ్, రేజర్, అండర్ వేర్ తో సహా అన్ని తీసుకుని వెళ్లి వారికి ఇస్తాం అప్పుడు మనకు సిగ్గు ఉండదా? .

ఆడవాళ్ళు ఆ రోజుల్లో కూడా ఎప్పుడూ పనిచేయాలి. శారీరకంగా, మానసికంగానూ విశ్రాంతి దొరకదు అని అన్నామనుకో నీ ఉద్యోగం మానేసి ఇంట్లో ఉండమని

అంటారు.నీకోసం నువ్వు కష్టపడుతూ నన్ను అంటావా అని గొడవ . మూడు ముళ్లు వేసాక నువ్వు నేను అని వేరు బంధాలు ఎందుకో ! ? పిల్లలను కంటే నా పిల్లలు అని ముద్దుగా అంటారు జన్మనిచ్చిన ఆడవాళ్ళని గురించి పట్టించుకునే నాథుడే ఉండడు.

మా ఆయన నేను నోరు తెరిచి ఇది కావాలని అడగకముందే నాకు అన్ని తీసుకుని వచ్చి పెడతారు అందులో అనుమాన పడాల్సిందే లేదు . పొద్దున్నే లేవడం ఆయనకు టీ పెట్టి ఇవ్వగానే టీ తాగుతూ పేపరు చదువుతారు .

టీ తాగుతారా ! ఆ గ్లాసు కూడా తీయకుండా అక్కడ నుంచి లేచి బాత్రూమ్ లో దూరతారు . బ్రష్ చేసుకుని వచ్చి టిఫిన్ తిని లంచ్ బాక్స్ తీసుకుని వెళ్ళిపోతారు . నేను ఇంట్లో వస్తువులు అన్ని సర్ది ఆఫీస్ కి హడావిడిగా రావాలి అన్నది ' నస్రీన్ '.

పోనీ నన్ను రమ్మంటావా తోడు మీ ఆయనకు సర్వీసు చేయడానికి వాతావరణాన్ని తేలిక పరచడానికి నవ్వుతూ అంది శివప్రియ .

అందరూ పకపకా నవ్వారు .

లంచ్ బాక్స్ సర్దుకుని వాళ్ళ పనుల్లో బిజీ అయిపోయారు.

పార్వతి పూర్తి చేసిన ఫైల్ తీసుకుని మేనేజర్ ఛాంబర్ లోకి వెళ్ళింది .

ఏం పార్వతి మేడం నిన్న ఆఫీస్ కి రాలేదు . నిన్నంతా ఇంట్లో ఉన్నారు కదా బాగా ఎంజాయ్ చేసుంటారు. ఎలా ఎంజాయ్ చేసారు ..... ఆ సినిమాలో వాళ్ళలాగా నా ..... ఆ చూపులు కంపరం పుట్టినా ఫైల్ అక్కడ పెట్టి వెనక్కి తిరిగింది ఆమె.

అతను ఆమె వెనుకనే నిల్చున్నాడని పార్వతి మెడపై వెచ్చగా తగులుతున్న ఊపిరిని బట్టి గ్రహించింది . డోర్ తీసుకుని బయటికి రాబోయిందల్లా గభాలున ఏదో పనిమీద తిరిగినట్టు ఫైల్ లో పెన్ను ఉంచి అతను తనను తాకినా పర్వాలేదని గబుక్కున తిరిగింది అంతే ఆ పెన్ను కాస్తా తగలకూడని చోటులో గుచ్చుకుంది.

బాస్ మహానుభావుడు బయటికి కుయ్యో....మొర్రో అని అరవలేక అలాగే బిగుసుకుని పార్వతికి అడ్డుతొలిగాడు.

(3)

" ఎగతాళి, కుళ్ళు జోకులు భరిస్తూ ముఖం మీద ప్లాస్టిక్ బొమ్మ లాగా చిరునవ్వు అతికించుకుని సాయంత్రం వరకు పనిచేసి ఇంటికి వచ్చిన తర్వాత హమ్మయ్య అనుకుని కాసేపు ప్రశాంతంగా పడుకుని సేద తీరాలని ప్రతిరోజూ అనుకుంటుంది ' శ్వేత ' ".

ఇంటికి రాగానే పెద్దవాళ్ళు అయిన అత్త మామలు చాయ్ కోసం ఎదురు చూస్తూ కూచున్నారు. వాళ్ళకు టీ పెట్టి ఇవ్వగానే బడికి పోయిన పిల్లలు వచ్చారు, వాళ్ళకు తినడానికి స్నాక్స్ ఇచ్చేటప్పటికి సాయంత్రం ఐదున్నర అయింది.

హూ..!

ఇప్పుడేం పడుకుంటాను .

రాత్రికి తొందరగా పడుకుందాంలే అనుకుంది.

సింక్ పనిచేయడం లేదు సింకులో ఉన్న గిన్నెలన్ని బయటేసుకుని తోమి కడిగిన తర్వాత పొద్దున్నే ఉతికేసిన బట్టలు తీసుకుని వాటిని మడతలు పెట్టి కుర్చీలో ఉన్న రెండు జతల బట్టలు ఉతికేసింది.

బియ్యం కడిగి పెట్టి పొద్దున్నే వండిన కూరకు జతగా నాలుగు ఆలుగడ్డలు, టమాటాలు కోసి పెట్టుకుని స్టౌ వెలిగించి అన్నం వండింది అందరికీ వడ్డించి సర్ది టైం చూసింది తొమ్మిదిన్నర అయ్యింది .

శ్వేతా!..... శ్వేతా ... ఇంకెంత సేపు పడకగదిలో నుంచి శ్రీధర్ పిలుపు .

వళ్ళంతా బరువుగా ఉంది కాసేపు ప్రశాంతంగా తనతో మాట్లాడితే బాగుంటుందని అనుకుంది . శ్రీధర్ లోపలికి వెళ్ళి వెళ్ళగానే ముఖం వైపు కూడా చూడకుండా తన పని కానిచ్చుకొని అటు తిరిగి పడుకున్నాడు .

శ్వేతకు అవమానంగా అనిపించింది . మనసు ఉలిక్కిపడేలా, గది కూడా కంపించేలా అర్వాలనిపించింది .

కానీ.....

పక్క గదిలో నిద్రపోతున్న పిల్లలు భయపడతారేమోనని , అత్త మామలు ఏమనుకుంటారోనని ఆగిపోయింది.

రెండు కన్నీటి చుక్కలు వృథా అయిపోతాయేమో ఎందుకు ఏడ్వాలి అనుకుని స్నేహితురాలు పంపిన వీడియో ఓపెన్ చేసి చూస్తుంది.

ఎవరో అమ్మాయి టవర్ పైకి ఎక్కి నిల్చుంది . ట్రాఫిక్ సిగ్నల్ అక్కడ ఉండటం వల్ల వచ్చే పోయే వాళ్ళు వినోదంగా చూస్తూ పిచ్చి పిచ్చిగా కామెంట్స్ విసురుతున్నారు.

ఎవరినైనా ప్రేమించి కాలుజారి కడుపు తెచ్చుకుందేమో !? అని ఒకబ్బాయి అంటున్నాడు .

ఛీ.... ఛీ.... ఈ కాలం ఆడపిల్లలను అస్సలు నమ్మకూడదు కాలేజీకి వెళుతున్నాను అంటారు ఎవరితో ఏడకి పోతుందో ఎవరికి ఎరుక ఆటో డ్రైవర్ అంటున్నాడు .

ఇద్దరబ్బాయిలు ఫోన్ లో షూట్ చేస్తున్నారు .

ఎన్నో నెల ? ...... ముందు ఎన్నో నెలనో చెప్పి అక్కడ నుంచి కిందకి దూకి చచ్చిపో అంటున్నారు.

పోలీసులు వచ్చి ఆ అమ్మాయి ని కిందికి తీసుకొచ్చి ఎందుకు చావాలనుకుందో వివరాలు అడిగి తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు .

ఆ అమ్మాయి ని కిందికి దింపగానే పోలీసులు అడిగిన ప్రశ్నకు దెబ్బతిన్న ఆడపులిలా ఉరిమి చూసింది.

ఎందుకు సర్ ?

ఆడపిల్ల చావలనుకుంటే తప్పు చేసిందేమో అందుకే ముఖం చూపించలేక చస్తుంది అంటారు.

మేమెందుకు చావాలి ? సర్ .

ప్రేమ పేరుతో అమ్మాయిలను బుట్టలో వేసుకుని లొంగ తీసుకుని కడుపు చేసి కానరాకుండా పోయి వాడు దర్జాగా ఎక్కడో బతుకుతుంటే ఇక్కడ మేం ఎందుకు చావాలి .

అమ్మాయిలు సున్నితమైన మనసు సర్ . ఒక్కసారి నమ్మితే అంతే చివరి వరకు కట్టుబడి ఉంటాం .

ఆడవాళ్ళకేనా శీలం ? మగవాళ్ళకు ఉండదా? మగవాడు తిరిగితే వాడు మగాడు . ఆడవాళ్ళు తిరిగితే వాళ్ళు బజారుది ,లం.... , కులట, పతిత .... ఇంకా ఎన్నో కొత్త కొత్త పేర్లు పెడతారు .

ఎందుకని సర్? ఎందుకని? పూనకం వచ్చినట్టు ఊగిపోతుంది .

అయినా నేనేందుకు నా ప్రాణం తీసుకోవాలనుకున్నానో తెలుసా ?

నా తల్లిదండ్రులకు భారంకాకుడదని నా పెళ్లిచేయాలనుకుంటే కట్నం ఇవ్వలేక వయస్సు ముదిరితే పెళ్లి కాదేమో అని బెంగతో కొంత వాళ్ళు ప్రతిరోజు బతికిచస్తుంటే చూడలేకపోయాను . చదివిన చదువులకు ఉద్యోగం రాక , ఖాళీలు లేక పోతే నేనేం చేయాలి? నాలాంటి ఆడపిల్లలు ఎందరో ఉన్నారు.

వీలైతే మీరు వాళ్ళని అర్థం చేసుకోండి లేకపోతే అలా బతకనీయండి అంతేకానీ నోటికి వచ్చిన కూతలు కూస్తూ, రాస్తూ పరువు తీయకండి .

భూమాతకు కోపం వచ్చిందా అన్నట్లు ఉన్నాయి ఆమె మాటలు .

ఆ మాటలు విన్న ప్రతి ఒక్కరూ తలదించుకుని చల్లగా జారుకున్నారు .

సమాజంలో ఏ ఒక్కరైనా ఆమె ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి సాహసిస్తారా?

వీడియో ఆఫ్ చేసి పడుకుంటున్న శ్వేత భర్తను చూస్తూ ఇలా అనుకుంది.

సమాజంలో చూడటానికి ఒకలాగా ఇంట్లో ఒకలాగా కనబడుతుండే మగవారిని ఏమనాలో!? మరి!?

" మేడిపండు లాంటి మగవారిని ఈ సమాజం సత్పురుషా ..... జిందాబాద్ అనకుండా ఉండలేరు కదా అనుకుంటూ పడుకుంది".

కవిత

# పూల రెక్కలు



శాంతి కృష్ణ
7416219305

ఇప్పుడో కొత్త లాకర్ కావాలి
బ్యాంకు లాకర్ కన్నా
ఇంకా గట్టిగా ఉండాలి
ఏ తాళానికి తెరువని విధంగా
ఏ డైనమైట్ పేల్చని విధంగా...

పుట్టిన మరుక్షణమే
ఇప్పుడు పాపాయిలను
అందులో దాచుకోవాలి మరి...

వారి నవ్వులు కనిపించని విధంగా
వారి ఏడుపులు వినిపించని విధంగా...

ఎందుకో తెలియదు
మొగ్గలనిప్పుడు విచ్చుకోనివ్వడం లేదు
పూల వనం వెక్కి వెక్కి ఏడుస్తోంది
రక్తసిక్తమై రాలిపోతున్న పూల రెక్కలను చూసి...

ఏ దీపంలో వెతకాలో
కనిపించని మానవత్వాన్నిపుడు
మాయమవుతున్న దాని ఆనవాళ్ళను
రేపటితరం మ్యూజియంలో చూసుకోవాలేమో...!

గర్భ గుడిలాంటి
అమ్మ గర్భం శోకిస్తోంది
మొగ్గలను చిదిమేస్తున్న
పాపపు పంకిలాలను తొమ్మిది నెలలు
మోసిన పాపానికి...

ఇప్పుడు తల్లులు కొందరు
ప్రాయశ్చిత్తం చేసుకునే
కాలమాసన్నమైంది...

వేయండి మీ అడుగులు
ఇకనైనా ముందుకు...

నిశ్శబ్దంగా జరుగుతున్న
అకృత్యాలను ఆపేందుకు
మీ స్వర సవ్వడితో శబ్ధించండి...
మీరు మోసిన పాపం
మరెన్నో పాపాలు చేయకుండా....!!

కవిత

# నీవే ఈ జగత్తు ప్రదాతవు



సిస్టర్ అనసూయ
8074573716

నిలువెల్ల గాయాలైన
నీడనిచ్చే వృక్షానివి
తనువంతా కరిగించి
వెలుగునిచ్చే దీపాన్ని వి

నీవే ఈ జగత్తు ప్రదాత వు
సహనానికి త్యాగానికి
నిలువెత్తు రూపానివి

అయినా...
యుగాలు మారిన
తరాలు మారినా
నిత్యం చేస్తున్నరు
నీ పై దాడులు

వాటిని లెక్క చేయకుండా
రాళ్లను, ముళ్ళను....
దాటుకుని,
ఆకాశాన్ని అధిరోహించి
సమాజములో సగమైతివి
అయినా.....
మందు, మాఫియా దేశంలో
ఇరువురికి విందవుతున్నవు.

సంస్కృతి సాంప్రదాయాల
పేరుతో ....
నిన్ను బంధించి,
నీ బతుకుకు బంధాలు వేస్తున్నది.

ఈ సమాజం ఇంతే ఇది మారదు
నీవే మారాలి
నీలో మార్పు రావాలి

ఈ రాజ్యానికి నీవే
రాజువు కావాలి
ఈ రాజ్యాన్ని నీవే ఏలాలి

ఈ సమాజానికి పట్టిన
చీడ పీడ పురుగులను
ఏరీ కాల్చి వేసీ
సమ సమాజాన్ని నిర్మించాలి.

వ్యాసం

# మహిళా సాధికారత సవాళ్లు, సమస్యలు



అల్లూరి గౌరీలక్ష్మి
+91 99483 92357

ఆధునిక సమాజంలో స్త్రీలు పురుషులతో సమానమైన హక్కులనూ, హోదానూ, అవకాశాలనూ అనుభవిస్తూనిర్ణయాత్మక స్థితిలో ఉండడంమహిళా సాధికారత.

మహిళా సాధికారత అనే పదం చాలా విస్తృతమైన అర్థంలో ఉన్నవిషయం. మహిళలు తాము చేయదలుచుకున్న లేదా సాధించదలుచుకున్న పనులు చెయ్యడానికి వారికి పురుషులతో సమానమైన అవకాశాలుండాలి.

స్త్రీలకు వనరులపై,సంపదపై యాజమాన్యం ఉండడం, ఆదాయంపై, తన సమయంపై నిర్ణయాధికారం ఉండడం సాధికారత.స్త్రీ తన ఆర్థిక స్థితిని మెరుగుపరచుకోవడం పై హక్కు ఉండడంసాధికారత.తన భావాలు వ్యక్తీకరించుకునే స్వేచ్ఛ ఉండడం. శారీరకంగా,మానసికంగా బలంగా ఉండడం,తనకు నచ్చిన చదువు చదువుకోవడం ఒకటేమిటి మరొకరి ప్రమేయం లేకుండా స్త్రీ తన జీవితాన్ని తాను తీర్చి దిద్దుకోవడం సాధికారత. స్త్రీల హక్కులను గుర్తించి వారిని మగవారితో సమానంగా చూసే వాతావరణాన్ని కల్పించడమేఇప్పటి అవసరం. అటువంటి వీలు కలిగించే సామాజికపరిస్థితులు ఉన్నప్పుడే మహిళలు త్వరితగతిన సాధికారులు కావడానికిఅవకాశం ఉంటుంది.

స్త్రీలకు శతాబ్దాలుగా జరుగుతున్న అన్యాయం సరిదిద్దుతూ వారిని పూర్తిగా సాధికారతవైపు తీసుకురావాల్సిన అత్యవసర సందర్భం ఇది.

రాజకీయ పార్టీలు: ఇంటింటికీ వచ్చి ఆడవాళ్లకు అమ్మా అంటూ దండాలు పెట్టి ఓట్లు వేయించుకున్న రాజకీయ నాయకులు వితంతు పెన్షన్,బాలింత కిట్,వృద్ధాప్య పెన్షన్ లాంటి తాయిలాలిచ్చిఎంతో చేశామని చెప్పుకుంటారు.స్త్రీల సర్వతోముఖాభివృద్ధికి చెయ్యవలసిన కృషి చెయ్యరు.ఎన్నికల్లో గెలిచాక వాళ్ళకి ఆసక్తి ఉండదు. సమయం అసలే ఉండదు.

–2–

మహిళా బిల్ : చట్ట సభల్లో స్త్రీలకి 33 % సీట్ల ఇవ్వాలన్న సదుద్దేశంతో మహిళా బిల్ తయారు చెయ్యబడింది. పార్లమెంట్లో ఈ మహిళా బిల్ పాతికేళ్లుగా మోక్షం లేక పడి ఉంది. అనేక సార్లు చర్చకు వచ్చింది. కానీ పాస్ కాలేదు. ఆ విషయంలో మగవారంతా సంఘటితంగా ఉంటారు. ఆడవారికి అవకాశం ఇచ్చినంత మేరా వాళ్ళ అవకాశాలు తగ్గుతాయని వారి భయం. లోక్ సభలో అధిక మెజారిటీ సాధించి అధికారం పొందిన పార్టీలకు స్త్రీల అభివృద్ధి పై చిత్తశుద్ధి లేదు.

ఆడవాళ్ళకి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో టికెట్ లివ్వరు. ఇచ్చాక వారు గెలిచినా వారికి మంత్రి పదవులివ్వరు. ఇచ్చినా స్త్రీ శిశు సంక్షేమం తప్ప వారికేదీ రాదనుకుంటారు. ఒక వేళ ముఖ్య శాఖలిచ్చినా పూర్తి అధికారం ముఖ్యమంత్రులే పెట్టుకుని వారిని డమ్మీలుగా ఉంచుతారు.

రాజకీయంగా స్థానిక సంస్థల్లో రేజర్వేషన్లు అమలు అవుతున్నా మహిళా సర్పంచులు ఉన్న చోట వారి ఇంటి మగవారే పెత్తనం చేస్తుంటారు. మగవారి అభిప్రాయాలకనుగుణంగా స్త్రీలని నడిపించడం వల్ల మహిళలకి ప్రయోజనం ఉండదు.

స్త్రీల పరిస్థితి: జనాభాలో సగం ఉన్న స్త్రీలకి సరైన విద్య,వైద్యం మొదలైన ప్రాథమిక వసతుల్లేవు. మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా,సాంస్కృతికంగా, సామాజికంగా సమగ్ర పురోగతి సాధించినప్పుడే మహిళలు సాధికారత సాధించినట్టు.మహిళా సాధికారత అంటూ స్త్రీలు ఉద్యోగాలు,

వ్యాపారాలు చేస్తూ గడిస్తున్న సంపాదనను సమాజం కొంత వరకూ అంగీకరించినప్పటికీ వారికి అధికారాల్లో స్థానం ఇవ్వడం లేదు. చట్టాలు చేయడంలో ఇతర విధాన నిర్ణయాల్లో వారికి భాగస్వామ్యం లేదు. చట్టసభల్లో అసెంబ్లీలో,పార్లమెంట్లో స్త్రీలకి ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉంది.

మహిళలు అర్ధరాత్రి స్వేచ్ఛగా తిరుగాడిన రోజే నిజమైన ప్రజాస్వామ్యం అన్నారు మహాత్మా గాంధీ. కానీ ఏడు దశాబ్దాలు దాటిన స్వతంత్ర భారతంలో మహిళల పరిస్థితి చూస్తే ఎన్నో చట్టాలూ, సంక్షేమ పథకాలూ అమలులో ఉన్నప్పటికీ మహిళల పట్ల వివక్ష, గృహహింస పెరిగిపోతూనే ఉన్నాయి. స్త్రీలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయి. అదే సమయంలో అన్ని అవరోధాలనునూ అధిగమించి, మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. ఆకాశంలో సగం కాదు ,ఆకాశమంతా మాదే అనేంతగా తమ

–3–

శక్తిని చాటుకుంటున్నారు. దేశ ప్రగతికి మహిళలే కీలకమని భావించిన కేంద్రం వారి రక్షణ కోసం, మహిళా సాధికారత కోసం అనేక చట్టాలు చే సింది. అవి... సతీ సహగమన నిషేధ చట్టం (1829 ) వితంతు పునర్వివాహ చట్టం ( 1856 ), బాల్య వివాహాల నిరోధక చట్టం (1952 ), హిందూ వివాహ చట్టం ( 1955 ), హిందూ వారసత్వ చట్టం ( 1956 ), అశ్లీల, అవినీతి వ్యాపార నిరోధక చట్టం ( 1956 ), వరకట్న నిషేధ చట్టం ( 1961 ), మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నన్సీ యాక్ట్ ( 1971 ), మెటర్నిటీ రిలీఫ్ యాక్ట్ (1976 ), జాతీయ మహిళా కమిషన్ యాక్ట్ ( 1991 ), గృహహింస నిరోధ చట్టం ( 2005 ), పని ప్రదేశాల్లో వేధింపులకు వ్యతిరేకంగా రక్షణ చట్టం ( 2013 ), నిర్భయ చట్టం (2013 ) మొదలైనవి.

ఇరవై ఒకటవ శతాబ్దం మొదటి రెండు దశకాల్లో ప్రభుత్వం మహిళా శక్తి బలోపేతం కావడానికి అనేక పోలసీలు చేసింది.IPC లో స్త్రీలకు రక్షణ ఉంది. ఆస్తి హక్కు తో సహా చట్ట రీత్యా అనేక వెసులుబాట్లు ఉన్నా అవన్నీ ఆచరణలో అమలు కావడం లేదు. తల్లి తండ్రులు వివిధ కారణాల వల్ల ఆస్తి లో ఆడపిల్లలకి వాటా ఇవ్వడం లేదు. చట్టాలు ఉన్నా మహిళలకు సమాజంలో పూర్తి రక్షణ కరువైందనే చెప్పాలి. భ్రూణహత్యలు, వరకట్న హత్యలు, అత్యాచారాలు,బాలికల అక్రమ రవాణా జరుగుతూనే ఉన్నాయి. ప్రభుత్వం ఉన్న చట్టాల్ని చక్కగా అమలు చేస్తే చాలు. కొత్తగా మహిళలని బలోపేతం చెయ్యవలసిన అవసరం లేదు.

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడే ప్రజాస్వామ్యం పరమార్థం నెరవేరుతుంది. అందుకే మహిళల సాధికారిత కోసం స్వాతంత్రానంతరం అనేక స్త్రీ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారు. ఇందిరా మహిళా యోజన, సమగ్ర శిశు అభివృధి సేవా పథకం, గ్రామీణ ప్రాంత మహిళా శిశు అబివృద్ధి పథకం, మహిళా సమృద్ధి యోజన, బాలిక సమృద్ధి యోజన, స్వశక్తి, కిశోర శక్తీ యోజన, పావలా వడ్డీ, జననీ సురక్ష యోజన, మాత ఆరోగ్య రక్షణ సేవలు, ఇందిరా గాంధీ మాతృత్వ సహయోగ్ యోజన, స్త్రీనిధి పథకం, మహిళల కోసం ప్రత్యేకంగా భారతీయ మహిళా బ్యాంకు ఇలా చాలా పథకాలు అమలులో ఉన్నాయి . అయితే దేశంలో చాలా మంది మహిళలకు ఇలాంటి పథకాలు ఉన్నాయన్న సంగతి తెలియక పోవడానికి కారణం వారికి విద్య లేకపోవడమే.

–4–

లింగ వివక్ష ప్రపంచ వ్యాప్తంగా కొనసాగుతోంది. పురుషుల కంటే స్త్రీలే అధికముగా శ్రమ దోపిడీకి గురవుతున్నారు. సంఘటిత రంగంలో మహిళా ఉద్యోగుల శాతం ఎనిమిదికి మించలేదు. మహిళా అక్షరాస్యత 58 శాతం. దేశంలోని 87 శాతం మహిళలు రక్తహీనతతో బాధపడుతున్నారు. మహిళల పట్ల కొనసాగుతున్న నిర్లక్ష్యం గురించి ఏనా డూ చట్టసభల్లో ప్రస్తావనకు రాదు. కారణం వారికి సరైన ప్రాతినిధ్యం లేకపోవడ మే.

స్త్రీలపై వేధింపులు : సాఫ్ట్ వేర్ మొదలుకొని అన్ని రంగాల్లో ఆడపిల్లలు మగపిల్లలతో పోటీగా అద్భుతమైన విజయాలు సాధించి తమని తాము నిరూపించుకుంటున్నారు. అయితే వారిపై ముష్కర మూకల దాడులు పెరగడం ఎంతో బాధ కలిగిస్తున్నది. వారిలో అభద్రతా భావం పెరగకుండా ఉండడానికి వాటిని అరికట్టాల్సి ఉంది. అందుకు కఠినమైన చట్టాలుండాలి.

పని చేసే స్థలంలో స్త్రీలపై వేధింపుల గురించిఒక సెల్

ని అన్ని ఆఫీసుల్లో ఏర్పాటు చెయ్యాలని ప్రభుత్వం సంకల్పించింది. ఆ సెల్ లో ఉన్నతాధికారులు సభ్యులుగా ఉంటారు. మహిళా ఉద్యోగులు, పురుష ఉద్యోగులు తమని ఏ విధంగానైనా ఇబ్బందికి గురి చేస్తే అక్కడ ఫిర్యాదు చేస్తారు. కానీ దాదాపు ఎనభై శాతం ఆఫీసుల్లో ఈ సెల్ ఏర్పడ లేదు. చాలామందికి తెలీదు కూడా. ఆ సెల్లోని సభ్యులు తమకందిన ఫిర్యాదుపై తక్షణమే చర్య తీసుకుంటారు. ఇది బాధితులకు ఎంతో ధైర్యాన్నిస్తుంది.

పోలీస్ డిపార్టుమెంటు: స్త్రీల కోసం షీ టీమ్స్ ని ఏర్పాటుచేశారు.దానివల్ల కొంతవరకూ మహిళలకు రక్షణ దొరుకుతోంది.ఇటీవల లేడీ కానిస్టేబుల్స్ ని రాత్రిపూట గస్తీ తిరగడానికి నియమిస్తున్నారు. దీనివల్ల కూడా మహిళలకు మరికొంత భద్రత ఆశించవచ్చు .మహిళా పోలీస్ స్టేషన్లో మహిళా సిబ్బంది అని స్థాయిల్లో ఉండాలి. అప్పుడే బాధిత స్త్రీలకి న్యాయం జరిగే అవకాశం ఉంది.

–5–

మీడియా : ఎలక్ట్రానిక్ మీడియా స్త్రీలకు బాసటగా నిలబడుతోంది. అందుకు వారిని అభినందించాలి. ధైర్యంగా ముందుకొచ్చిన వారిని చూసి మిగిలిన వారికి కూడా ఆత్మ విశ్వాసం కలుగుతుంది.వాళ్ళు కూడా ఫిర్యాదు చేయగలుగుతారు. గ్లామర్ వరల్డ్, స్పోర్ట్స్,సర్వీస్ సెక్టార్స్, గవర్నమెంట్ సెక్టార్స్లో ఉండే స్త్రీలు తమపై జరుగుతున్న పీడనలను మీడియా ముందు చెప్పుకోగలుగుతున్నారు. అయితే ఆర్ధికంగా ఉన్నత తరగతిలో ఉన్నవారే ధైర్యంగా కంప్లైంట్ చెయ్యగలరుకానీ మధ్య తరగతి దిగువ తరగతి మహిళలు చెయ్యలేరు.

కొన్ని ప్రత్యేక రంగాల్లో, ఉన్నత స్థానాల్లో ఉండే స్త్రీలపై వేధింపులు జరిపే వారిని శిక్షించే విధంగా ప్రజల దృష్టికి లోకి ఈ విషయం తీసుకు రావడంలో మీడియా ఎంతో సహకరిస్తోంది. అయితే అందరి కీ అవగాహన కల్పిస్తే మరి కొంత మంది ముందుకు రాగలుగుతారు. ఇంకా అనేక రంగాల్లో మహిళలు తమ బాధను చెప్పుకునే వేదికలు లేవు. అవి సత్వరం రావాలి.

ఎలక్ట్రానిక్ మీడియా మరికొంత సమయాన్ని కేటాయిస్తే ఆడవారికి మరింత న్యాయం జరుగుతుంది. రేటింగ్ కోసం కాకుండా ఒక సామజిక బాధ్యతగా ఛానెల్స్ పని చెయ్యాలి. సోషల్ మీడియా కూడా ప్రజల్లో కొంత సద్భావనలు కలగడానికి కృషి చేస్తోంది. అది శుభ పరిణామం.

న్యాయస్థానాలు: ఇక్కడ కేసులు ఏళ్లకు ఏళ్ళు నడుస్తూ ఉంటాయి. అలా కాకుండా ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఉండాలి. మహిళపై జరిగే వేధింపుల్నీ, దాడులనీ, హింసనీ వెంటనే విచారించి నేరస్తులను శిక్షించే వీలుంటే బాధితులకు తక్షణ ఉపశమనం కలుగుతుంది. ఇతరులకు కూడా ఫిర్యాదు చెయ్యడం పై ఆసక్తీ, గౌరవం కలుగుతుంది. నేరగాళ్లకు భయం కూడా ఉంటుంది.

ప్రభుత్వాల పాత్ర : మహిళా సాధికారతకు ముఖ్యంగా ప్రభుత్వ పరంగా ఎంతో సహాయం అవసరం. స్త్రీల ఎదుగుదలకి ప్రత్యేకమైన పొలిటికల్ స్పేస్ ఇవ్వాలి. గ్రామ పంచాయితీ లాంటి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్స్ అమలవుతున్నాయి కానీ, పార్లమెంట్ లో అసెంబ్లీ లో కూడా అమలయితేనే స్త్రీల పరిస్థితి మెరుగవ్వడానికి వీలవుతుంది. మహిళా రిజర్వేషన్ బిల్ పాస్ కావడానికి రాజకీయ నాయకులే కృషి చెయ్యాలి. సంక్షేమ పథకాల ఆచరణలో ప్రభుత్వానికి చిత్త శుద్ధి అవసరం.

–6–

ఇప్పటి వరకూ నేషనల్ కమిషన్ ఫర్ విమెన్, స్టేట్ కమిష ఫర్ విమెన్ ఉన్నాయి. స్త్రీలకు శతాబ్దాలుగా జరుగుతున్న అన్యాయం సరిదిద్దుతూ వారిని సాధికారతవైపు తీసుకు వెళ్ళడానికి ప్రభుత్వ ప్రోత్సాహం అవసరం. జెండర్ పరంగా బడ్జెటింగ్ జరగాలి. బడ్జెట్ లో స్త్రీలకు సమాన కేటాయింపు జరుగుతోందో లేదో ఆ లెక్కలు చూపాలి.

రాజకీయ సంస్థలు: సామాజికంగా స్త్రీలు బలోపేతం కావడానికి మరి కొన్ని సంస్థలు ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకు వస్తే బావుంటుంది. స్త్రీలకు ఆస్తి హక్కుతో సహా అనేక హక్కుల పరిరక్షణకు ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖని ఏర్పాటు చేస్తే బావుంటుంది. ఆడవారికి ఒక మహిళా ఫైనాన్స్ కార్పొరేషన్ ఉంటే బావుంటుంది. వారు స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ పెట్టి మహిళలకి శిక్షణ ఇచ్చి రుణాలు ఇచ్చేటట్టుగా ఉండాలి. అప్పుడు మహిళలు చిన్న చిన్న పరిశ్రమలు పెట్టుకుని స్వయం ఉపాధి చేసుకోగలుగుతారు.

అవగాహన:స్త్రీలు తామున్న స్థితిని వారు తెలుసుకున్నప్పుడే వారు ఎదగ గలుగుతారు. ముందుగా స్త్రీలందరికీ తమ హక్కులపై అవగాహన ఉండాలి. అందుకు స్త్రీలలో అక్షరాస్యత పెంచాలి. అమ్మాయిల్నీ అబ్బాయిల్నీ ఒకే స్థాయిలోపెరిగేటట్లు చూడాలి. ఇందుకు తల్లులు విద్యావంతులై ఉండాలి.ఆడవారికి తాము అబలలము అనే భావన సమూలంగా పోవాలి. స్త్రీలు తోటి అణగారిన స్త్రీలపై సానుభూతిని, సహానుభూతిని కలిగి ఉండి తగిన సహాయం చెయ్యాలి.

స్త్రీల పాత్ర: సాధికారత ఎవరో దయా ధర్మంగా ఇస్తే స్త్రీలు అందుకునే విషయం కానే కాదు. అది వారు శ్రమ పడి సాధించవలసిన విజయం. అందుకు స్త్రీలు చెయ్యవలసిన కృషి ఎంతో ఉంది.ప్రతి స్త్రీ క్రమశిక్షణ, కష్టపడి పనిచేసే తత్త్వం అలవరచుకోవాలి. మారుతున్న రాజకీయ, సామజిక అవగాహన పెంపొందించుకోవాలి. ప్రతి స్త్రీకీ జీవితంలో ఏదైనా సాధించాలన్న పట్టుదల ఉండాలి. పిరికితనాన్ని వదిలెయ్యాలి. ఆత్మ విశ్వాసం పెంచుకోవాలి. ఇందుకు విద్య ముఖ్య అవసరం.

–7–

వివిధ రంగాల్లో స్త్రీ ఉద్యోగుల చేత పని చేయించుకుంటారు.కానీ గుర్తింపు విషయంలో వారిని వెనక్కి తోసి పురుషులే ముందు నిలబడి సత్కారాలు పొందుతారు. కారణం అక్కడ పురుష ఉద్యోగుల శాతం స్త్రీ ఉద్యోగుల కన్నా ఎక్కువ శాతం ఉండడం. అయినప్పటికీ స్త్రీ ఉద్యోగులు నిరాశ పడకుండా తమ కృషిని కొనసాగిస్తూ తమని తాము నిరూపించుకుంటూ సాగిపోవాలి.

మొదటి తరం ఉద్యోగస్తులైన స్త్రీలంతా ఒక స్వచ్ఛంద సంస్థని పెట్టి స్త్రీలకోసం అవగాహనా కార్యక్రమాలు చేపడితే బావుంటుంది. " మీకు అన్యాయం జరిగినప్పుడు గట్టిగా అరవండి. గోల చెయ్యండి. మౌనంగా ఉండకండి.బాధను భరించడం అలవాటు చేసుకోకండి" అని వారికి ధైర్యం చెప్పాలి.బాసటగా నిలవాలి.చట్టం తోడున్నా తోటి మహిళలు కూడా వారికి అండగా నిలవాలి.తాము నిత్యం ఎదుర్కొనే అనేక సవాళ్లను వాళ్ళు అధిగమించేలా వారిని ప్రోత్సాహపరచాలి. మహిళలంతా తోటి స్త్రీలకు ఆపన్న హస్తం గా ఉండి ఈ విషయమై కలిసి కృషి చేస్తేనే పురోగతి ఉంటుంది.

రచయితల పాత్ర: రచయితలు తమ రచనల్లో స్త్రీల సమస్యలను చర్చిస్తూ వారిలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించే దిశలో పరిష్కారాలు సూచించాలి.ఈ దిశగా కవులు కళాకారులు సమాజాన్ని ప్రభావితం చెయ్యాలి.ప్రగతి శీల ఉద్యమాలకు అందరూ చేయూతనివ్వాలి.ప్రగతి శీల దృక్పథాన్ని ప్రచారం చెయ్యాలి.అప్పుడే మహిళా సాధికారత కోసం అందరూ చేస్తున్న కృషి అద్భుత ఫలితాన్నిస్తుంది.స్త్రీ సాధికారత అనేది స్త్రీలకూ మాత్రమే సంబంధించిన విషయం ఎంత మాత్రమూ కాదు. అది సమాజానికి సంబంధించినది. స్త్రీలు సంపూర్ణ సాధికారత సాధించి పురుషులతో సమానంగా అన్ని హక్కులూ పొందిన నాడే సమాజం సర్వతోముఖాభివృద్ధి చెందుతుంది. అది సమాజం యొక్క బాధ్యత కూడా.

–8–

సమాజం యొక్క కర్తవ్యం: సమాజం యొక్క ఆలోచనా విధానం విధానంలో మార్పు రావాలి. పితృస్వామ్య భావ జాలం నుంచి బైటకురావాలి. ప్రజల్లో ఒక భావ విప్లవం రావాలి. స్త్రీ పురుషులు సమానం అన్న బలమైన భావాన్ని ప్రతివారికీ అర్థం అయ్యేటట్టుగా చెప్పడం అందరి కర్తవ్యం.

ముఖ్యంగా మహిళాసాధికారతకు స్త్రీలు విద్యావంతులవడం తొలి మెట్టు. వారంతా విద్యావంతులయ్యి తమ పిల్లల్ని లింగవివక్ష లేకుండా పెంచినప్పుడే అది సమానత్వానికి దారి తీస్తుంది.

గతంలో కంటే ఇప్పటి స్త్రీల పరిస్థితి మెరుగుపడిన మాట వాస్తవం. అయినప్పటికీ అనేక సవాళ్ళను,సమస్యలను ఈ నాటి స్త్రీ ఎదుర్కోవలసి వస్తున్నది. మొక్కవోని ధైర్యంతో, అలుపెరుగని పోరాటం చేస్తున్న స్త్రీ సమూహం యొక్క అభ్యున్నతికి సమాజం హృదయపూర్వకంగా సహకరించాలి.

స్త్రీలు సంపూర్ణ సాధికారత సాధించిన నాడే, స్త్రీ పురుషులిద్దరూ కలిసి ఒక ఉన్నతమైన సంస్కారవంతమైన సమాజాన్ని నిర్మించగలుగుతారు. అప్పుడే మానవ జాతి ఆరోగ్యకరమైన బాటలో నడుస్తూ ముందు తరాల వారి సుఖవంతమైన జీవితానికి రాజమార్గాన్ని ఏర్పరచగలుగుతుంది.

కథ

# కలనైనా .. కథనైనా...




స్వాతి శ్రీపాద

8297248988


ఇద్దరిదీ మంచి స్నేహం. ఒక్కరోజూ రెండు రోజులది కాదు. దాదాపు యాభై ఏళ్ళుగా కొనసాగుతున్న స్నేహం. అవును చిన్నప్పుడు పక్కపక్క ఇళ్ళలో ఉన్నప్పటి స్నేహం. ఇద్దరిదీ ఆర్నెల్లు అటూ ఇటూ గా ఒకే వయసు.

పెళ్ళి పేరంటాలు, పిల్లలూ చదువులూ సమస్యల మధ్య అప్పుడప్పుడూ కలుసుకోడం ఇద్దరికీ అలవాటే.

శంకరం బాంక్ లో ఉద్యోగం. శాంతి స్వయంగా బిజినెస్ రన్ చేస్తుంది. ఆమె భర్త సుధాకర్ గవర్నమెంట్ కాలేజిలో లెక్చరర్.

పెళ్ళిళ్ళయిరోజులు సవ్యంగా గడిచిపోతున్నాయి అనుకునే రోజుల్లోనే అనుకోని దురదృష్టం యాక్సిడెంట్ రూపంలో సుధాకర్ ని వెంటపెట్టుకు పోయింది.

అప్పటికే పిల్లలు పెళ్ళిళ్ళయి పిల్లాపాపలతో సెటిల్ అయి ఎవరి కుటుంబాలతో వారు ఉన్నారు. శాంతికి బిజినెస్ వదిలేసి పిల్లలతో వెళ్ళే ఉద్దేశ్యం లేదు.

ఇద్దరు పనివాళ్ళు ఆమె మీదే ఆధారపడి బతుకుతున్నారు.

అడపాదడపా శంకరం వచ్చి పరామర్శించే వాడు. అలాగే నిన్న సాయంత్రం అతను వచ్చి చాలా సేపు కూచున్నాడు.

అప్పటికే తొమ్మిది దాటింది. పనివాళ్ళు పనులు ముగించి వెళ్ళిపోయారు.

వంటమనిషి సాయంత్రమే వచ్చి చపాతీలు కూర చేసి వెళ్ళింది.

"రా డిన్నర్ చేద్దాం" అయిష్టంగానే పిలిచింది.

చిన్నప్పటినుంది నువ్వనడమే అలవాటు. లేచి వాష్ బేసిన్ దగ్గరకు వెళ్ళాడు. అతను వచ్చేలోగా టేబుల్ సెట్ చేసి మైక్రో వేవ్ లో కూరలు, చపాతీలు మధ్యాన్నం మిగిలిన అన్నం పప్పు వేడి చేసింది. పళ్ళాలు పెట్టి జగ్ లో నీళ్ళు గ్లాస్ లూ తెచ్చేసరికి వచ్చి కూచున్నాడు. ఎప్పటిలానే భార్య తో బాధలు ఇబ్బందులూ చెప్పుకున్నాడు.

" ఒకనిమిషం కూచో టేబుల్ సర్దేసి వస్తాను."

" నేనూ హెల్ప్ చేస్తాను" అంటూ ఫ్రిజ్ లో పెట్టాల్సినవి అతను సర్దే లోగా టేబుల్ క్లీన్ చేసి తుడిచి ఎక్కడివక్కడ సర్ది వచ్చింది.

అతని పిల్లలిద్దరూ ఎక్కడెక్కడో సెటిల్ అయ్యారు.

పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ అయిస్ క్రీం తిన్నారు.

పొద్దున్నే నిద్రలేస్తుందేమో ఆవులింతలు వస్తున్నాయి.

" నిద్ర వస్తున్నట్టుంది. ఒక్క మాట చెప్పాలని ఎప్పటినుండో అనుకుంటున్నాను శాంతీ, కోపం తెచ్చుకోకు... "

అంటూ కళ్ళు వాల్చి చేతి వేళ్లనో మారు చూసుకుని, స్వరం చాలా తగ్గించి అడిగాడు,

" మనం సహజీవనం ఎందుకు చెయ్యగూడదు?"

సరిగ్గానే విన్నానా? ఒక్క క్షణం అర్థం కాలేదు శాంతికి. ఏమిటి అతని ఉద్దేశ్యం? అయోమయంగా అనిపించింది.

అంతలోనే కొంచం సర్దుకుని–

" నువ్విలా ఒంటరిగా ఉండటం నాకు బాధగా ఉందిరా. ఇప్పటిలాగే ఎవరింట్లో వాళ్ళం ఉందాం. ఎవరికి ఎవరిపట్లా ఎలాటి కమిట్మెంట్ వద్దు. ఎలాటి బాధ్యతలూ వద్దు.

అప్పుడప్పుడు ఇలాగే వస్తాను. లెటజ్ షేర్ లైఫ్. ఆలోచించు " అంటూ లేచాడు.

కూర్చున్న చోటినుండి కదల్లేదు శాంతి.

"వస్తాను మరి" అప్పటికీ లేవలేదు. డోర్ దగ్గరకు వేసి వెళ్ళిపోయాడు.

ముంచుకు వచ్చిన నిద్ర లేతమబ్బు లా ఎగిరిపోయింది.

సహజీవనమా? ఎందుకు?

సుధాకర్ పోయిన కొత్తలో పిల్లలు ఎక్కడో ఉండి, ఒక తోడూ కావాలని మనసు పరితపించిన మాట వాస్తవమే. కాని, ఆర్థిక అవసరాలకో, ఇంటిపనులకో మరింకేదో ఉద్దేశ్యంతో తోడు వెదుక్కునే వాళ్ళే తప్ప మనసున మనసై బ్రతుకుకో నీడ కావాలనుకునే మనస్తత్వం ఎక్కడా కనిపించలేదు.

సుధాకర్ తో పంచుకున్న ముప్పై యేళ్ళ స్మృతులు ప్రతి నిమిషం సజీవమవుతూ అతను లేని లోటు తెలియదు. కాదంటే పనులు ముగించుకు పడుకోబోయే ముందు పక్కన ఖాళీ అతని జ్ఞాపకాన్ని తట్టిలేపి కళ్ళలో చెమ్మగా మారడం రోజువారీ అలవాటే. అసలు అతని జ్ఞాపకం లేని ఘడియ ఉంటుందా? ప్రతి నిముసం ఆ ముప్పైయేళ్ళు మళ్ళీ బ్రతకడమేగా?

ఏ ధైర్యంతో అడిగాడు? తనప్రవర్తన అతన్నలా అడిగేలా చేసిందా?

అయిదారుగంటలు ఆలోచించి స్థిర చిత్తంతో నిద్రలోకి జారుకుంది శాంతి.

★ ★ ★

రెండు రోజుల తరువాత తన హోమ్ కమ్ షో రూమ్ లో బిజీ గా ఉన్నప్పుడు వచ్చాడు శంకరం.

" లోనికి వెళ్ళి కూర్చో . ఒక్క పది నిమిషాలు" ఎప్పటిలానే నవ్వుతూ చెప్పింది శాంతి. అన్నట్టుగానే పని ముగించుకుని షోరూమ్ లో అమ్మాయికి జాగ్రత్తలు చెప్పి వచ్చింది శాంతి.

లోనికి వెళ్ళి రెండు మినీ గ్లాస్ లలో లెమన్ జ్యూస్ పట్టుకు వచ్చి కూచుంది. అతను పెదవి విప్పకముందే తనే మాట్లాడటం మొదలెట్టింది.

" శంకరం మొన్న నువ్వు అడిగిన దానికి నాకు కోపం రాలేదు. అలాగని ఇష్టమూ లేదు. నువ్వెందుకు అలా అడిగావో కాని, చూడు, ... ఇద్దరికిద్దరమూ అరవైలకు కొంచం దూరంలో ఉన్నాము. ఈ వయసులో ఇలాటివి అవసరమా? శారీరిక సుఖాల కో మరో ప్రలోభత్వానికో లొంగిపోయే వయసు కాదు. కాని నిజానికి సహజీవనం ఇప్పుడెందుకు ? నీపిల్లలు, భార్య బంధువర్గం నీకున్నారు. నా వాళ్ళు నాకున్నారు. నిజమే. సహచరుడి లోటు వీరెవ్వరూ తీర్చలేనిదే. కాని మంచీచెడు మనసున ఉన్న సర్వస్వం పంచుకుందుకు ఒక మనిషి కావాలి. ఈ కుహనా లోకం చూసే చిన్న చూపు తప్పించుకుందుకు నాకూ ఒకరున్నారనే ధీమా కావాలి. అఫ్ కోర్స్ నా అభ్యుదయం నన్ను బొట్టు పెట్టుకుందుకో మట్టెలు ధరించడానికో మంగళ సూత్రాలు వేసుకుందుకో అడ్డురాదు. కాని ఎదుటి వాళ్ళ కు అభ్యంతరాలు ఉండకుండా నా అనే మనిషి కావాలి. ఏ అర్ధరాత్రో మెలకువ వస్తే నిద్రపట్టనప్పుడు లేపి కూచోబెట్టి మాటకచేరీలకో పాట కచేరీలకో ఒక తోడు కావాలి.

మనసు దుఃఖపడితే చెప్పకుండానే గుండెలకు హత్తుకుని ఓదార్చే ఒక నీడ కావాలి.

అంతెందుకు నన్నో పసిపాపలా ప్రతినిమిషం అరచేతుల్లో పెట్టుకు చూసుకునే ఒక అభయ హస్తం కావాలి. గుడికి వెళ్తే నాతో పాటు వచ్చే మనిషి కావాలి. ఏ అర్ధరాత్రో వెన్నెట్లో లాంగ్ డ్రైవ్ తీసుకెళ్ళే తోడు కావాలి. కాని ఇలా దొంగ చాటుగా వెతుక్కునే అనుబంధం కాదు.

నీకు నీ ఇల్లు వాకిలీ సంఘంలో నీ గౌరవం నీకు కావాలి. ఎవరికీ చెప్పుకోలేని ఈ సహజీవనం ఎందుకు శంకరం. ఒంటరిగా ఉన్నవాళ్ళను చూశ్తే మీ మగవాళ్ళకు ఇలాటి ఆలోచనలే వస్తాయా? నన్నిలానే ఉండనీ. తక్కువ మాటలు మాట్లాడి ఇద్దరమూ పలచన అయిపోవద్దు.

పైన చెప్పిన వన్నీ కాకున్నా చాలా మటుకు ఊహగానో, నీడగానో నన్ను వెన్నంటి నాతో ఉన్న నా సుధాకర్ ఉనికి తీరుస్తుంది. మరొకరి ఊహే నాకు దుర్భరంగా ఉంది. కలలోనైనా, కథనైనా అతనే నా తోడూ నీడా. మరో సారి ఇలాటి ప్రసక్తి తేవద్దు. సారీ . అలాగని మన బాల్య స్నేహం వీగిపోదు. ఎప్పటికీ బాల్య మిత్రులమే."

అంటూ లేచి గ్లాస్ లు లోపల పెట్టే మిషతో లోనికి వెళ్ళి కళ్ళు తుడుచుకుంది శాంతి.

★ ★ ★

# ధైర్యం



**విజయ గోలి**
**9704078022**

నా పేరు స్వప్నిక అందమైన పేరు అంటూ ఉంటారు అందరూ. నిజంగా కలల ప్రపంచం ఎపుడు ఏడు రంగుల ఇంద్రధనస్సు లాగా అందంగా ఆహ్లాదంగా బాగుంటుంది . అందులో అన్ని మనమే మనకిష్టమైన రీతిలో కనురెప్పల వెనుక కదలాడే కలలతో అలౌకికమైన ఆనందావస్థ అందుకే ఆ పేరు పెట్టారేమో మా అమ్మ నాన్న .

సరే అసలు విషయానికి వస్తే చందమామ కథలోలా రాక్షసుడు రాజకుమారిని దాచి పెట్టే ఒంటిస్తంభం మేడలాంటి.. అద్భుతమైన బంగారు భవంతిలో బందీ ఐన మహారాణి ని. మహారాణిని అని ఎందుకన్నానంటే నేను శ్రీమతిని కాకపోతే నా జీవితంలో రాక్షసులు ఎవరూలేరు.

సంతృప్తి ,సర్దుకు పోలేని నా మనసే నా పాలిటి రాక్షసి ఇప్పటికే నా గురించి మీకు అర్ధమై ఉంటుంది అందమైన ,పేరు,ప్రఖ్యాతులున్న వ్యాపారవేత్త నా భర్త ఎపుడు ఏ దేశంలో ఉంటారో తెలియదు. అందమైన పాలరాతి బొమ్మలాంటి పదహారేళ్ళ కూతురు అందరి శ్రీమంతుల పిల్లల లానే విదేశాలలో విద్యా విహారం చేస్తుంది .రోజు మొత్తంలో ఎపుడో ఒకసారి హాయ్ మామ్ అంటూనే అది పూర్తయ్యే లోపు బాయ్ మామ్ అంటుంది. అందరి శ్రీమంతుల భార్యల లాగే ఉన్నతమైన క్లబ్బుల్లో పెద్ద పెద్ద సభ్యత్వాలున్నాయి కానీ ఈ పరదాల వెనుక అతిసామాన్యమైన ఒక ఆడపిల్ల మనసుంది అదే నా అసంతృప్తికి కారణమేమో నియాన్ లైట్లమెరుపులకంటె చల్లని వెన్నెల ప్రశాంతత కావాలనే మనసు నాది ...

ఉరుములు మెరుపులతో పెద్దవర్షం ఎక్కడో పిడుగు పడిన శబ్దం మేడ మీద మా గదిలో నుండి మూడు నిమిషాల నడకతో వరండాలోకి వచ్చాను చాలా పెద్ద పాటియో ఒక కుర్చీ లాగి రోడ్డు కనపడేలా కూర్చున్నాను. తడిచిన మొక్కలు బరువుగా తలలూపుతూ రాలిన పూలనుండి వాసనలు అంతటా పరుచుకుంటూ మధ్యాహ్నం రెండు గంటలైనా వాతావరణం చాలా ఆహ్లాదంగా వుంది .మావారు ఇంకా భోజనానికి రాలేదు వస్తారో రారో తెలియదు నేనిలా కూర్చున్నందుకు మా వారు చూస్తే చాలా నొచ్చుకుంటారు. స్టేటస్ మైంటైన్ చేయటం లేదని. ప్రక్కనే వున్న ఫోన్ మ్రోగుతుంది ఫోన్ చూసినపుడు గూగుల్ మ్యాప్ లో అది కొన్న లొకేషన్ దాని ప్రైస్ టాగ్ కనిపిస్తాయి... ఇంట్లో ఏ వస్తువు చూసినా నాకు అలాగే అనిపిస్తుంది. ఈమధ్య నాకు కాస్త ఒంట్లో (మనసు)బాగాలేదని ఏ వ్యాపకాలు పెట్టుకోకుండా ఇంట్లోనే ఉంటున్నాను. ఎలా ఉన్నానో కనుక్కుంటూ భోజనానికి రావటం లేదని సాయంకాలం పెద్ద పార్టీ ఉందని రెడీగా ఉండమని ఆ ఫోన్ సారాంశం.

ఈ మధ్య ఇలా కూర్చొని మాప్రహరీ ప్రక్కనే ఉన్నకుటుంబాన్ని చూడటం అలవాటైంది. నిజానికి నేను ఈఇంటికి రావటానికి ముందు నుండే ఆ కుటుంబం అక్కడ ఉంటుంది. మా ఇంటికి తూర్పు వైపున వున్నందు వలన మా స్థలంలో కలుపుకోవటానికి మా వారు చాలా ప్రయత్నాలు చేసారు.ఐనా రాజమ్మ ససేమిరా ఇవ్వనంది. పెద్దలు ఇచ్చింది నా బిడ్డకి అమర్చుకునే తెలివిలేదు తిన్నా తినకున్న గూట్లో పడివుంటారు .నా ప్రాణం వున్నంతవరకు అమ్మనంది చేసేది లేక..మిన్నకున్నారు. మా వారికి ఉన్న అసంతృప్తి పక్కన ఉన్న రాజమ్మ ఇల్లు.

ఎప్పటికైనా దానిని స్వాధీనం చేసుకోవాలనే ఆశ.

ఆ కుటుంబం సాధు బాబుది సాధు బాబు పేరుకు తగ్గట్లు చాల సాధువు. సొంత ఆటో నడుపుకుంటూ ఉంటాడు. అతని తో

తల్లి రాజమ్మ ,భార్య నాగి ,అతని కూతుళ్లు ముగ్గురు ఆడపిల్లలు పెద్దపిల్ల పేరు రాజకుమారి చిన్న రాజమ్మ అనిపిలుచుకుంటారు . ఆపిల్లకి 10 సంవత్సరాలు దగ్గర్లో ఉన్న గవర్నమెంట్ స్కూల్లో ఆరవ తరగతి చదువుతుంది . రెండవది సీతాకుమారి ఎనిమిది సంవత్సరాలు సీతయ్య సాధు బాబు నాన్నపేరు.. మొగపిల్లోడని ఆ పేరు పెట్టాలనుకున్నాడు ఆడపిల్ల పుట్టేసరికి సీతాకుమారిగాపెట్టేసాడు. ఆపిల్లని సీతయ్యనే పిలుస్తారు ముచ్చటగా మూడవసారి కూడా ఆడపిల్లే పుట్టింది. ఇంకా ఆలోచించకుండా నాగికి ఆపరేషన్ చేయించేసాడు. చిన్నదానికి ఆరేళ్ళు దాన్ని మాలక్ష్మిఅనిపిలుస్తారు. అది నాగి అమ్మపేరు ఇలా పోయినోళ్లందరిని ఇంట్లోనేపెట్టేసుకున్నాడు. సాధుబాబు తండ్రి కూలిపని చేసేవాడు . తల్లి కూడా చుట్టుపక్కల ఇళ్లల్లో పనులు చేసేది .పెళ్ళైన చాలా రోజులకి ఒక సాధువు దయవల్ల పుట్టాడని సాధుబాబు అని పేరు పెట్టుకున్నారు .అపురూపంగా పెంచుకునేవాళ్ళు ఒక యాక్సిడెంట్లో సీతయ్య చనిపోయాడు రాజమ్మ కుప్పకూలి పోయింది సాధు బాబుకి అపుడు పదేళ్ళు చదువు అబ్బలేదు .రాజమ్మే కష్టపడేది వాడికి పదిహేనేళ్ళు వచ్చే వరకు స్కూలుకి పంపుతూ చదువుకుంటాడని ఎదురు చూసింది అప్పటికి వాడు ఏడవ తరగతిలోకి వచ్చాడు. ఇంక కుదరదని ఒక షావుకారుని బ్రతిమాలి రోజు కూలికి ఆటో షెడ్ లో పెట్టించింది .అందులోబాగానే స్థిరపడ్డాడు చదువు రాలేదనే కానీ అల్లరి చిల్లరివాడు కాదు. షావుకారు కూడా బాగా చూసుకునేవాడు అక్కడే ఆటో నడపటం నేర్చుకున్నాడు. వాయిదా పద్ధతి మీద ఆటోఇప్పించాడు వాడికి ఇరవై వచ్చేసరికి నాగితో పెళ్లి చేసింది..

ఈ విషయాలన్నీ నాకు మా ఇంట్లో వంట చేసే నందమ్మ చెప్పింది నందమ్మ నాగికి ఎక్కడో దూరపు చుట్టం అందుకే నా ఆసక్తిని గమనించి అపుడపుడు వాళ్ళ విషయాలను చెప్తూ ఉంటుంది.ఈ మధ్య ఇంట్లోనే వుంటున్నానేమో వారిని గమనించటం ఒక దినచర్యగామారింది సాధుబాబు పెళ్లి టైం లోనే మేము అక్కడ ఇల్లు కట్టించుకుని వచ్చాము . పెద్దగాఆకుటుంబంగురించి పట్టించుకోపోయినా అపుడపుడు నాగిని చూస్తుండేదాన్ని ...కడిగిన ముత్యంలా చక్కగా ఉండేది .రాజమ్మ కోడలిని పనికి పంపేది కాదు . రాజమ్మే పనిచేసుకొచ్చేది సాధుబాబు ఆటోవేసేవాడు పెద్దలనుండి వచ్చిన పెద్దలనాటి చిన్న మిద్దె లాంటి గది వుంది వచ్చిన దాంతో బాగానే వుండేవాళ్ళు సాధు బాబుకి అమ్మ అంటే ప్రాణం .అలాగే పెళ్ళాం నాగి అన్నా...

మెల్లిగా ఒకళ్ళ తర్వాత ఒకళ్ళు పిల్లలు పుట్టారు. ఖర్చులు పెరిగినాయి ఇదే వరసలో రెండేళ్ల క్రితం రాజమ్మకు పక్షవాతం వచ్చింది ఆ సమయంలో సాధుబాబు అల్లాడిపోయాడు ...

ఎలాగో కోలుకుంది కానీ పని చేయలేని పరిస్థితి. మాట స్పష్టత పోయింది కర్ర వూతమైంది. చాలా డబ్బు ఖర్చయింది సాధుబాబు డీలా పడిపోయాడు అత్త చేసే ఇళ్ల పని నాగి చెయ్యటంమొదలెట్టింది ...అత్తను,పిల్లల్ని ,ఇంటి పని చూసుకుంటూ చాలా కష్టపడుతుంది . ఇపుడుపెద్దపిల్ల స్కూల్ నుండి వచ్చి నాయనమ్మను ,చెల్లెళ్లను చూసుకుంటది చెల్లెళ్లను చదివిస్తూ...తాను చదువుకుంటూ చాలా చేదోడుగా ఉంటది . ఆ పిల్లలను చూసినపుడు చాలా ముచ్చటగా ఉంటుంది . ఆ వయసుకి ఎంత బాధ్యతగా ఉంటుందో నాగి పని నుండి వచ్చి వంట చేస్తది ఎనిమిది గంటలకల్లా సాధుబాబు ఆటో దిగుతాడు నాగి వేడినీళ్లు పెడుతుంది స్నానం చేసి వస్తాడు తల్లిని నడిపించుకుంటూ తీసుకొచ్చి మంచం మీద కూర్చోపెట్టి తానుకూడా తల్లి పక్కనే కూర్చుంటాడు . ఈ లోపు నాగి పెద్దకూతురు వండిన గిన్నెలు కంచాలు అన్ని తెచ్చి పెడుతుంది. నాగి కంచాల్లో వడ్డిస్తుంది అందరు కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ భోంచేస్తారు. అది చూసినపుడు చాలా ఆనందంగా ఉంటది. మనసులో ఎక్కడో అసూయగా కూడా అనిపిస్తుంది. భోజనాలు కానిస్తారు తర్వాత పిల్లలు, రాజమ్మ లోపలికి వెళతారు. అక్కడేఆమంచం మీదే సాధుబాబు పడుకుంటాడు .ప్రక్కనే నాగి కూర్చుంటుంది...ఇంటి సంగతులు,కష్టాలు మాట్లాడుకుంటారు. ప్రస్తుతం రాజమ్మ ఆరోగ్యం పెద్ద సమస్యగా మారిందిసాధుబాబుకి. నందమ్మ చెప్పింది....పెద్ద డాక్టర్ల దగ్గరే చూపించాడని .స్థాయికి మించి ఖర్చుపెట్టాడని. ఏమి పాలుపోని పరిస్థితి .ఇప్పటికే యాభైవేల వరకు అప్పులు చేసాడు ఇల్లు అమ్మక తప్పదేమో అనిపిస్తుంది.

కానీ తల్లి ఒప్పుకోదు చచ్చి పోవటానికైనా సిద్ధపడుతుంది .అమ్మటానికి ఒప్పుకోదు...

ఇప్పటికి చేసిన అప్పు తల్లికి తెలియకుండా చేసాడు ఇది తల్లికి తెలియకుండా చెయ్యటానికి వీలుపడదు అందులో తల్లి సంతకం కావాలి దాని గురించే మొగుడు పెళ్ళాలు తర్జన

పడుతున్నారు . తెల్లవారి నందమ్మ ద్వారా తెలిసిన సంగతి ఖర్చు పెట్టి వైద్యం చేయించినా పూర్తిగా నమ్మకం చెప్పలేమన్నారంట డాక్టర్లు. సాధుబాబు బాగా డీలా పడిపోయాడంట రెండు రోజులుగా ఆటో కూడా వెయ్యకుండా వాళ్ళ అమ్మ దగ్గరే ఉన్నాడని అప్పు కోసం అందరిని అడిగాడని ఎక్కడ అప్పు పుట్టలేదని ఇంకా నాగి ,సాధు బాబు కలిసి మా వారిదగ్గరికి వద్దామనుకుంటున్నారని చెప్పింది.నేను ఎందుకు అని అడిగితే చెప్పుకొచ్చింది....

కొంత డబ్బు స్థలం మీద అప్పు ఇస్తే తర్వాత ఆ స్థలం మాకే అమ్ముతారని ఆవిధంగా కాగితాలు వ్రాసి ఇస్తారని అడగటానికి వస్తామన్నారు అని చెప్పింది. ఆ సలహా తానే ఇచ్చానని చెప్పింది.

ఎందుకో మనసులో చాలా బాధగా వుంది. ఆ కారణంగా వాళ్ళు వస్తే మా వారు చాలా ఆనందంగా డబ్బు ఇస్తారు ఆ తర్వాత వాళ్ళని ఎంత త్వరగా అక్కడి నుండి పంపటానికి రెడీ ఐపోతారు అదే నా బాధ ఎన్నో సంస్థలకి గొప్పకోసం వ్యాపారంకోసం ,రాజకీయంగా లక్షలు లక్షలు ఖర్చు చేస్తారు కానీ మానవతా దృష్టితో ఒక పైసా ఇవ్వరు అంతా వ్యాపారమే నందమ్మ ఆ విషయం చెప్పిన దగ్గర నుండి గుండెలో బాధంతా గొంతులో గూడు కట్టుకున్నట్లుగా వుంది. ఆయన రెండు రోజుల కోసం ఆస్ట్రేలియా వెళ్లారు. రేపు రాత్రికి కానీ రారు ఆలా ఆలోచిస్తూ కూర్చున్న నాకు ఎంత సమయం గడిచిందో తెలియలేదు. ధైర్యంగా ఒక నిర్ణయానికి వచ్చాను ధైర్యం అని ఎందుకు అన్నానంటే ఇక్కడ నన్ను అధిక్షేపించే వాళ్ళు ఎవరు లేరు కొంతకాలంగా నన్ను నేను మర్చిపోయాను ఒక గొప్ప వ్యాపారవేత్తకు భార్యగా...

ఒక ఉన్నత కుటుంబానికి కోడలుగా ఒక స్టేటస్ సింబల్ గా మాత్రమే నా ఉనికి. అందులో నుండి ఒకసారైనా బయట పడాలనేది నా కోరిక. అతి సామాన్యంగా ఆలోచించటమే నేరం అన్నట్లుగా మా ఇంట్లో వారి పద్ధతి చిన్నప్పటి నుండి అంతే... పుట్టింటి నుండి అత్తింటికి వచ్చాను అంతే అక్కడ ఇవే పరిస్థితులు...

నేను తీసుకున్న నా నిర్ణయం నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది మనసంతా చాలా తేలికగా అనిపించింది అలా చిన్న కునుకు కూడా పట్టింది. నందమ్మ పిలుపుతో లేచి టైం చూస్తే సాయంకాలం ఐదు గంటలైంది. మళ్ళీ ఎదో అలజడి ఒక స్థిరమైన నిర్ణయానికి వచ్చాను. ఎక్కడో దాన్ని కప్పి పుచ్చుకునేందుకు చాలా కష్టపడుతున్నాను. బీరువా దగ్గరికి వెళ్లి తలుపుతీసి కొన్నినోట్ల కట్టలు తీసి ఒక కవర్లోకు సర్దాను ఆ డబ్బు సాధుబాబుకు ఇవ్వాలని నిజమైన మానవత్వంతో సహాయం చెయ్యాలనే నా తాపత్రయం. అవసరం లేకపోయినా గొప్పకోసం చేసే దానాలు నాకెపుడు తృప్తిని ఇవ్వలేదు పైగా నన్ను నేను మోసగించుకున్న భావన కలిగేది. ఇంత చిన్న విషయానికి ఎందుకు అంత ఎక్కువ ఆలోచిస్తున్నాను . నేను ఇచ్చే డబ్బుకు నేనెవరికీ లెక్కలు చెప్పక్కర లేదు. ఇంత వరకు ఎపుడు ఎవరికీ నా మనసుకు నచ్చినట్లుగా ఏ సహాయము చెయ్యలేదు నేను.

ఖర్చు పెట్టే దానికి లెక్కలు అడుగకపోయిన ఇలా నేను చేసే సహాయాన్ని మాత్రం ఉపేక్షించరు . నా మనసుకు నచ్చినట్లు గా చెయ్యాలనేది నాస్వాభిమానాన్ని చల్లపరచాలనేది నా ఆంతర్యం.

ఆ కుటుంబంలో నాకు నచ్చింది పెద్దవాళ్ళ దగ్గర నుండి చిన్నవాళ్ల వరకు ఒకరి మీద ఒకరికి అంతు లేని ప్రేమ బాధ్యత బంధం. ఒక కుటుంబం అరమరికలు లేకుండా ఆనందంగా వుండవలసినవన్నీ ఆ కుటుంబంలో అల్లుకు పోయి వున్నాయి.

పైన చెప్పిన వన్నీ నాకు కొరత. నా కొరతలన్నీ డబ్బు మేకప్ తో కొట్టుకు పోతుంది.

డబ్బు లేమివల్ల ఆకుటుంబంలో ఆనందం అడుగంటుతందంటే మింగుడు పడని బాధగా వుంది. నాకు మనశ్శాంతినివ్వని డబ్బు ఒక కుటుంబాన్ని నిలబెడుతుందంటే కొంత ఊరటగా వుంది. మనసుకు సర్ది చెప్పుకుని హ్యాండ్బ్యాగ్ లో డబ్బు కవరు పెట్టుకుని మెట్లు దిగి క్రిందికి వచ్చాను. ఒక నిమిషం నందమ్మ కోసం చూసాను ఎక్కడో వంటగదిలో వుంది...పిలవాలనుకున్నాను కానీ అవసరం లేదనిపించింది. మెయిన్ డోర్ తీసుకుని బయటకు వచ్చాను. వెంటనే డ్రైవర్ పరుగెత్తుకొచ్చాడు కారు తీయమంటారా అంటూ...వద్దంటూ చేతితోనే సైగ చేస్తూ వడివడిగా గేటువైపు నడిచాను. నా వెనుక డ్రైవర్ఆశ్చర్యకరమైన చూపులు నన్ను తాకుతున్నాయి అది నాకు తెలుస్తూనేవుంది.

వడివడిగా పక్క ఇంటి వాకిట్లో నిలిచాను...

అక్కడే చెట్టు క్రింద దిగాలుగ కూర్చుని వున్న నాగి సాధుబాబు ఒక్క సారిగ నిలబడి పోయారు. వారి కన్నుల్లో భయము దిగ్భ్రాంతి పోటీ పడుతున్నాయి నన్ను చూసి తడబడుతూ నిల్చున్నారు. మొదటగా నాగి తేరుకుని అమ్మగారు అంటూ ఎదురు పరుగెత్తుకు వచ్చింది. అయ్యో పిలిస్తే నేనే వచ్చేదాన్ని కదమ్మా ఇలా వచ్చారు అంటూ కంగారు పడి పోయింది. ఆ వెనుకే సాధుబాబు వచ్చాడు చేతులు కట్టుకుంటూ అర్థంకాని ఉద్విగ్నత వారి ముఖాల్లో కనిపిస్తుంది. నాకు మాట రాని పరిస్థితి బాగ్ లోనుండి కవరు తీసి నాగి చేతిలో పెట్టబోయాను చెయ్యి వెనుకకు తీసుకుంది. ఆశ్చర్యంగా చూస్తూ నా గొంతు సర్దుకుంటూ ఈ డబ్బుతో రాజమ్మకి వైద్యం చేయించండి . మీ స్థలంతో ఈ డబ్బుకు ఎలాంటి సంబంధంలేదు తీసుకోండి అంటూ సాధుబాబు వైపు చేయి చాపాను అడుగు వెనుకకు వేశాడు సాధుబాబు భయంగా ...వారి తడబాటు చూసాక వాళ్ళు డబ్బులు ఊరికే తీసుకోరని అర్థమైంది.

మీ దగ్గర వున్నపుడు తిరిగి ఇవ్వండి ముందు అవసరం గడపండి అంటూ వివరించాక వారి ముఖంలో ఒకింత సర్దుబాటు కనిపించింది. నాగి చేతిలో కవరు పెట్టాను అస్పష్టంగానే అందుకుంది. ఇద్దరి కళ్ళల్లో నీళ్ళు నిండుకున్నాయి దణ్ణం పెడుతూ కాళ్ళ మీదకు వంగారు. తప్పుకుంటూ వెనుకకు తిరిగాను ఈ విషయమంతా ఐదు నిమిషాల కాలంలో జరిగిపోయింది. మనసు చాలా తేలికగా అనిపించింది. నేను మోయ లేని భారాన్ని దించుకున్న విశ్రాంతత. గేటు దగ్గర సెక్యూరిటీని డ్రైవర్ని చిరునవ్వుతో పలుకరించాను. వాళ్ల ముఖాల్లో కనబడుతున్న ఆశ్చర్యాన్ని తగ్గిస్తూ మనసు దూదిపింజలా వుంది. ఇలాంటి సంతోషం ఈమధ్య కాలంలో పొందలేదు. సరాసరి గదిలోకి వెళ్ళి అద్దం ముందు నిలబడ్డాను నవ్వుతున్న ప్రశాంతమైన నామనసును అద్దంలో ధైర్యంగా చూసుకున్నాను.

కవిత

# హుస్న్- ఏ- మత్లా




- గీతారాణి అవధానుల

9491475210


అమ్మ ప్రేమ మాధుర్యము చూపినదీ మగువేగా..
చిన్ననాడు లాలిపాట పాడినదీ మగువేగా..

పసితనమున నీ అల్లరి తనకెంతో మురిపెములే..
మమకారపు వల్లరిగా అల్లినదీ మగువేగా..

తోబుట్టువు ప్రేమనంత కన్నులలో చూపుతుంది..
అనంతమగు బంధముగా కలిసినదీ మగువేగా..

ప్రేయసిగా సతీమణిగ నీ ఒడిలో చేరుతుంది..
అందంగా నీ బతుకును తీర్చినదీ మగువేగా..

నీ అడుగులో అడుగువేసి నీ నీడన ఎదుగుతుంది..
పసిపాపై చిరునవ్వులు రువ్వినదీ మగువేగా..

కష్టమెంత కలిగిననూ చిరునవ్వును చెదరనీదు..
గృహమే ఒక స్వర్గముగా మార్చినదీ మగువేగా..

మగవాడికి బ్రతుకంతా మధురగీత మవుతుందీ..
హృదయమంత ఆప్యాయత పేర్చినదీ మగువేగా..

కథ

# ఆత్మవిశ్వాసం



**వేముల ప్రేమలత**

హిమజ పేరుకు తగ్గట్టే అందమైన, తెలివి గల అమ్మాయి, ఐదోయేట పోలియో వచ్చి ఒక కాలు చచ్చు బడిపోయింది. తల్లి లేని అమ్మాయి కోసం మాధవిని పెళ్లి చేసుకున్నాడు తండ్రి.

తనకు ఇద్దరు పిల్లలు పుట్టాక, హిమజని సరిగ్గా చూసుకోక, ఇంట్లో పనులన్నీ తన చేత చేయించేది సవతి తల్లి. భార్య గయ్యాళి తనానికి తండ్రి ఏమి అనేవాడు కాదు.

టెన్త్ దాకా ఎలానో కాలం గడిచింది. స్కూల్లో వికలాంగుల స్కాలర్షిప్ అందేది . టెన్త్ లో డిస్ట్రిక్ట్ ఫస్ట్ వచ్చింది.

కాలేజీ వాళ్ళు ఫ్రీ సీటు ఇచ్చారు వికలాంగుల హాస్టల్లో కూడా ఫ్రీ సీటు ఇచ్చారు.

ఇంట్లో నీ బాధలు చూడలేక పోతున్నాను తల్లి అని తండ్రి హాస్టల్ కు పంపాడు.. పూర్తి సమయం చదువుకే కేటాయించింది.

ఆటపాటల్లో కూడా పాల్గొనేది. ఆ సంవత్సరం ఒక సేవా సంస్థ వారు వికలాంగులకు ఆటల పోటీలు పెట్టి గెలిచిన వాటికి పర్వతారోహణకు శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు

హిమజ అన్నిటిలోనూ ప్రధమంగా నిలిచింది

పర్వతారోహణ శిక్షణా పరీక్షలో కూడా ఎంతో ఆత్మవిశ్వాసం తో నేర్చుకుని ప్రధమంగా నిలిచింది శిక్షణలో ఉత్తమంగా నిలిచిన వాళ్ళను ఎవరెస్ట్ అధిరోహణకు అవకాశం ఇచ్చారు.

ఒక కాలుతో ఎవరెస్ట్ శిఖరం ఎక్కిన వికలాంగ వనితగా పత్రికల్లో హిమజ పేరు మారుమోగింది.

గవర్నమెంటు వారు ఆమె ధైర్యానికి, ఆత్మ విశ్వాసానికి మెచ్చి పర్వతారోహణ విద్యార్థులకు శిక్షకురాలిగా ఆమెకు జాబ్ ఇచ్చారు

★ ★ ★

పంటలు పండక .. ఉన్న ఇల్లు కూడా అమ్ముకుని .. పట్నం లోనే తల్లిదండ్రులు చిన్న కంపెనీలో పని చేస్తున్నారు అని తెలిసిన హిమజ వాళ్ళ అప్పులన్నీ తీర్చేసి, అమ్మిన పొలాన్ని వాళ్లకు కొనిచ్చింది.

“ నిన్ను పట్టించుకోకుండా ఎన్ని బాధలు పెట్టినా, అవన్నీ పట్టించుకోకుండా నా పిల్లలను సొంత తమ్ముళ్ళలా చదివిస్తున్నావు. ఆత్మ విశ్వాసంతో ఎవరెస్ట్ ఎక్కి ‘ఎవరెస్ట్ అంత ఎదిగావు, అవయవ లోపం ఉన్నవాళ్లు కాదు మనసులో కల్మషం కలిగిన వాళ్ళే నిజమైన అంగ వైకల్యం కలవాళ్ళు’ అని నిరూపించావు. నన్ను క్షమించు తల్లీ” అని కన్నీళ్ళతో వేడుకుంది సవతి తల్లి.

“నేనెప్పటికీ మీ కూతుర్నే అమ్మా !”అంటూ దగ్గరకు తీసుకుని కన్నీళ్లు తుడిచింది హిమజ.

వ్యాసం

# మారిన మనిషి



- పెద్దపల్లితేజస్వి
సెల్:9603329474

ఉదయమే పనికి బయలుదేరిన లింగయ్యకు ఎప్పుడూ ఎదురొచ్చే తన భార్య కనకమ్మ ఎదురు రాలేదు.తన తప్పు తెలుసుకొని భార్య పాదాలపై పడుదామన్నా ఆమె లేదు.ఆమె విలువ అర్థం అయ్యే సమయానికి ఎక్కడికి వెళ్ళిందని రాత్రంతా వెతికినా కనిపించలేదు.పనికి ఏలవుతాంది ఎట్లా? ఏడికి పోయింది?నా బాధ భరించలేక పుట్టింటికి వెళ్లిందా?అసలే అర్థరాత్రి నుండి కనబడట్లే.ఇంటికి ఫోన్ చేస్తే?చేద్దాం.

దేవుడా గీ గిప్పుడే ఫోనుల పైసలు లేకుండా జేస్తివా.హా డబ్బాల పైసలు దాసిపెట్టిన కదా.వాటితో బస్సెక్కి వాళ్ళ అమ్మోల్లింటికి పోతా.ఛా.. అందులో కూడా ఒక్క పైసాలేదు. ఏడికి బోయినా సెప్పకుండా అయితే బోదు. ఎక్కడికి వెళ్లినట్లు?. ఒకసారి ఆవేశంలో కొడితే ఇలానే వాళ్ళ అక్కోళ్ళింటికి వెళ్ళింది. మళ్ళీ నేను కంగారుపడుతానని నాకెవరు బువ్వండి పెడతారని వాళ్ళ అక్కోళ్ళు నీ భర్తకి బుద్ధి రావాల్నంటే నువ్వు వెళ్లకుండా ఉండాలని చెప్పినా వినకుండా నా మీద పిచ్చి ప్రేమతో తిరిగొచ్చింది.అయినా చీర ఎవరికి తెచ్చానో అర్థమై బాధ పడి వెళ్లుంటుందా?"

పనికి పోయే సమయం దగ్గర పడుతాంది.ఎలా,ఏం చేయాలి.వాళ్ళ ఊరు బోవాలంటే పైసలు కావాలి,ఇప్పుడెలా అని మదన పడుతున్న సమయంలో లింగయ్య స్నేహితుడు రంగడు వచ్చి

"ఓ లింగా!ఏంది గింత ఆలస్యం అయితే ఎట్ల జెప్పు. మనతోటి పనోళ్లందరు నీకోసం ఎదురు జూస్తున్నరు.ఆటో బయలుదేరుతాంది జల్దీ రా!"

అంటూ పిలుస్తుండు.ఒకరి తర్వాత ఒకరు ఆటో ఎక్కుతున్నరు.కూలీ డబ్బుల గురించి ఒకరికొకరు చర్చించుకుంటున్నరు. అందులో ఒకరు

"ఎంత కష్టం జేసినా నూరు పైసలే ఇస్తుండ్రు.గిట్టయితే మనలాంటి పేదోళ్ళు ఎట్ల బ్రతకాలె"

అంటూ కష్టసుఖాల గురించి మాట్లాడుకుంటున్నరు. లింగయ్య ఏదో ఆలోచనలో ఉన్నట్టు తన మిత్రుడైన రంగడు పసిగట్టిండు.

"ఓ లింగా..! ఓ లింగా!.ఏంది ఎప్పుడూ లేంది గియ్యాల గట్లున్నవ్"

అంటూ పక్కనున్న రంగడు పిలువబట్టిండు.ఆలోచనల నుండి తేరుకున్న లింగడు

"నా మనస్సు గియ్యాల పైలం గాలేదు"

దీంతో రంగడు

"ఏమైందో నాకు దెలుసులే.ఊర్ల అందరూ అనుకుంటున్నరు గదా"

"దేనిగురించి"

లింగయ్య ప్రశ్న ?

"అదే,ఆ సరోజా నువ్వా.నిజమేనా"

అన్నాడు రంగడు.వారు మాట్లాడుకుంటుండగానే మిరప తోట వొచ్చేసింది.ఒక్కొక్కరు ఆటో దిగి ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు.

స్నేహితులిద్దరూ ఎప్పటిలాగానే పక్కపక్కనే మిరప తోటలోని మిరప కాయాలను ఏరుతున్నారు.అప్పటికే మధ్యాహ్నం అయిపోయింది. రంగడు గట్టు పక్కనే ఉన్న బోరింగ్ దగ్గరకు వెళ్లి చేతులను శుభ్రంగా కడుక్కొని

"ఓ లింగా ! నువ్ ఈ దినం బువ్వ దెచ్చుకోలేదని దెలుసు ఇద్దరం గలిసి తిందాం"

అంటూ స్నేహితుణ్ణి పిలిచి ఇద్దరూ తినడం ప్రారంభించారు.

ఒక్క ముద్ద నోట్లో పెట్టుకోగానే లింగడికి కళ్ల నుండి దుఃఖం పొంగుకొచ్చింది.ఎంతైనా స్నేహితుడు ఏడుస్తుంటే

చూడలేని రంగడు తన భుజం మీద ఉన్న కండువాను తీసి తుడుచుకో అంటూ ఇచ్చాడు.ఏడువకుండా ముందు ఏం జరిగిందో జెప్పు మనసు పైలమైతది అన్న రంగడితో తన బాధను చెప్పుకోవడం ప్రారంభించాడు లింగయ్య.

"నేనంటే నా భార్యకు అమితమైన ప్రేమ.తాగి కిందపడిపోతే ఇంట్లోకి తీసుకెళ్లి నాకు బువ్వ పెట్టిన తర్వాతనే తానూ తినేది.నేనెంత దారుణమైన తిట్లు తిట్టినా తన మనసులోనే లోలోపల కృంగిపోయేది.వాళ్ళ అవ్వయ్యతో కూడా తన బాధను సెప్పేది కాదు.దేవతలాంటి భార్యను పక్కన పెట్టుకొని గా సరోజిని ఉచ్చులో చిక్కుకున్నానని దెల్సినా నన్ను ఒక్క మాట కూడా అడగలేదు.పిచ్చిది కాలం సమాధానం జెప్పినప్పుడు మారుతాడనుకుందేమో కాబోలు.ఒకరోజు నేను జేసిన కట్టానికి పైసలెక్కువొస్తే ఒక పట్టుచీర తీసుకెళ్లిన"

"ఎవరికీ నీ భార్యకా?"

రంగడి ప్రశ్న

"కాదు!కాదు!ఆ దిక్కుమాలిన సరోజినికి"

లింగయ్య సమాధానం

"తెల్లరితే దసరా పండుగ.పడుగంటే ముందుగాల యాదికొచ్చేది కొత్త బట్టలు.ప్రతిసారి నా కోసం డబ్బులు దాచి ఏదో ఒక పండుగకు ప్యాంటు, షర్టు తెచ్చి.ఎనక నుండి వచ్చి కళ్ళు మూసుకోమని కొత్త బట్టలు నాకిచ్చి ఏసుకోంగనే.ఎంత సక్కగున్నవు మావా, నా దిష్టి నీకు తగిలేలా ఉందని చేతులతో ఉప్పు, మిరపకాయ, బొగ్గు కలిపిన వాటితో దిష్టి తీసేది. ఒక్కనాడైనా చీర కొననైతిని.ఉన్నవాటితోనే సర్దుకునేది.ప్రేమతో కొత్త చీర తెస్తుండని మొత్తళ్ల నిలబడి ఆశగా ఎదురుజూస్తుండే. చేతులకి కవరియ్యగానే చీర జూసి అద్దం కాడికి పోయి మస్తుగున్నది నా మావ ఎంత మంచోడో మా ఆయన నా కోసమే చీర తెచ్చిండు అనుకుంది కాబోలు.

"నీ మొహానికి అంత సీను లేదు గాని కవరులో పెట్టు చీర అని కనికరం లేకుండా తిట్టా.నీ అందానికి చీర కావాలిసొచ్చిందా నీ దిక్కుమాలిన మొహాన్ని అద్దంలో జూసుకోపో అంటూ చివాట్లు పెట్టిన.ఆ రోజు బువ్వ తినకుండానే పడుకుంది.నేను మాత్రం ఆకలికి ఆగలేనని తెల్సి ఒక పళ్ళెంలో నాకు బువ్వ బెట్టింది. మద్యం మత్తుల తినలేని పరిస్థితిల ఉంటే బువ్వ కలుపుకొచ్చి ఒక తల్లి బిడ్డకు ఎట్లా తినిపిస్తదో అట్ల తినిపించేది. ఒక్క రోజు కూడా తిన్నవానే ?అని అడుగలే.అదే రోజు రాత్రి నా భార్య పడుకున్నాక.నేను కొన్న చీరను సరోజినికి ఇవ్వడానికని బయలుదేరిన.అప్పుడే అర్ధమైంది.దాని యవ్వారమేందో

నన్ను పట్టినట్టే ఇంకొకన్ని పట్టిందని నాకు కోపం రాబట్టే.గొడ్డలితో దాన్ని నరికి సంపుదామనుకున్న.గుసగుసలు ఏవేవో వినిపిస్తున్నయ్. నా చెవిని తలుపుకు దగ్గరగా పెట్టి చాటుకు ఉండి వింటున్న.

"చాలా బాగున్నావ్..నువ్ లేకుండా నేను ఉండలేను. వాడి తల మీద నిమురుతూ.ఈ మధ్య ఇంట్లో బియ్యం లేవు. వరుసగా నువ్వు కూలికి పోవంగా వొచ్చిన డబ్బులు మొత్తం నీ భార్యకే ఇస్తే ఎలా ..?నేనొకదాన్ని ఉన్నా అన్న సంగతి రోజు రోజుకి మర్చిపోవుతున్నావ్.నువ్వు చూసుకోకపోతే నన్ను ఎవరు చూసుకుంటారు?"ఉంటున్న ఇల్లు సొంతమేనా?"మాటల్లో దింపి మైమరపించేలా చేయడం.దాని మాటలకు ఉచ్చుల్లో చిక్కుకొని నాలాగా బలైపోయిన వారు ఉన్నారని.డబ్బు లాగడమే దాని నైజమని అర్థం అయింది.దాని గురించి నలుగురూ మంచిది కాదని చెప్పినా వినక నా భార్యకు విలువ ఇవ్వకుండా తాపత్రయ పడితే నా కొంప ముంచుతుందని అనుకోలేదు. ఇంకా అది మాట్లాడే మాటలకు ఆక్రోశం పెరిగిపోయింది. నా జీవితంలో లాగే ఇతరుల జీవితాల్లోకి వెళ్లి నిప్పులు పోసే మనస్తత్వమని తెలిసింది. రోజూ కూలి పనులతో జీవనం చేసే వారికి ఎర వేసి వారిని మాయ మాటలతో మభ్యపెట్టి ఇలా జీవించడం ఎందుకు?భగవంతుడు దీనికి కాళ్ళు చేతులు కూడా సక్కరంగనే ఇచ్చిండు.కట్ట పడి పనిచేసుకుంటే కడుపు నిండదా.." హ అయినా ఈ నీతులు నేను సక్కరంగా ఉండి దాన్ని అంటే బాగుండేదేమో.అయినా నేను దాని మైకంలో చిక్కుకోవడం లో నా తప్పు కూడా ఉంది.నా కుటుంబం కోసం ముందే ఆలోచిస్తే బాగుండేది.ఇప్పుడనుకొని ఏం లాభమంటూ వెనక్కి తిరిగా. నా జీవితం మీద నాకు కంపరమనిపించింది. ఇప్పటికైనా జ్ఞానోదయం కలిగించిన ఆ దేవుడికి చేతులు జోడించి కృతజ్ఞతలు చెప్పాను.

నా దేవత దగ్గరికెళ్లి క్షమించమని వేడుకుందామని హుటాహుటిన కనకమ్మా తప్పు చేసిన నన్ను క్షమించు అంటూ నా మనసుతో నేను సంభాషించడం మొదలుపెట్టాను

"ఛీ!దుర్మార్గుడా ఈ బుద్ధి ముందే ఏమైందిరా!

నీ భార్యను రాచి రంపాలు పెట్టావ్.సీతాదేవికున్నంత ఓర్పు ఆమెలో చూసి కూడా నీకు ఆ సరోజ వెంట ఎట్లా పడాలనిపించింది?పెళ్లైతే ఆడది నీవే సర్వస్వం అని నిన్నే నమ్ముకొని వొస్తే నీవెలా చూసుకోవాలి.నీలాంటి వాడ్ని కనకమ్మలాంటి వాళ్ళు క్షమించుకుంటూపోతే మరో సరోజలాంటి వాళ్ళు తారసపడుతున్నా కొద్దీ సొల్లు కార్చుకుంటూ.కట్టుకున్న భార్యకు బ్రతికుండగానే నరకం

చూపిస్తారు.

నీ మనసులోని అంతరాత్మనైన నేను మంచి చెడు గురించి ఆలోచిస్తుంటే.నువ్వేంటిరా ఇన్నాళ్ళు నీ భార్యతో పశువులా ప్రవర్తించావ్!ఆత్మ ఘోష నన్ను నిప్పులు చేరిగేలా ప్రశ్నిస్తోంది.ఈలోపు ఇల్లొచ్చింది. కనకమ్మా.అంటూ ఇల్లంతా వెతికా ఎక్కడా లేదు.వాళ్ళ ఊరు పోదాం అనుకున్నా చేతుల ఒక్క పైసలేదు.గియ్యాల పనికొస్తే వొచ్చిన పైసలతో వాళ్ళ ఊరు బోవచ్చని పనికచ్చిన.కనకమ్మ లేకపోతే నీనేందుకురా బ్రతికి. చచ్చిపోతా అనుకుంటూ ఫోన్ చేసేలోపే.

ఈలోపు ఓ స్వరం మావా!మావా!అంటూ వినిపించింది. లింగడు ఎవరా? అని తదేకంగా చూడసాగాడు.దూరం నుండి సరిగా కనిపించలేదు.ఆమె ఎవరో కాదు కనకమ్మ.కంగారు కంగారుగా కనకమ్మ మాట్లాడసాగింది

"నువ్వు ఇంటికి రాకపోయేసరికి నా మనసు మనసుల లేదు.నిన్న నువ్వు అర్ధరాత్రి ఇంకా ఇంటికి రాలేదని నీ కోసం వెతుకుతూ బయలుదేరిన మావా. ఎక్కడైనా తాగి పడిబోయినవేమో అని భయమేసింది.రాత్రంతా నీ కోసం వెతికి ఉదయం ఇంటికి జేరుకున్న. ఈ లోగా రంగన్న భార్య సైదమ్మ పనికీబోయినవ్ అని సెప్పంగనే.అప్పుడు నా ప్రాణం తేలికబడింది.నువ్ సద్ది తీసుకపోలేదని నీకోసం బువ్వ తీసుకొచ్చిన తిను మావా"

అంటూ ప్రేమతో తినిపించబోయింది.లింగడు ఒక్కసారిగా తన భార్య కాళ్ళమీద పడి వెక్కి వెక్కి ఏడ్వసాగాడు.

"మావా నువ్వు ఏడిస్తే నా కళ్లనుండి నీళ్లత్తన్నయి"

చీర కొంగుతో కన్నీరు తుడిచింది.అసలు ఏం జరిగిందో ఎందుకు ఎడుస్తున్నాడో ఏమి అర్థం కావట్లేదు కనకమ్మకి.

"వంట నేను సరిగ్గా చేసిపెట్టట్లేదా?కారం ఎక్కువ వేశానా?అందుకే ఏడుస్తున్నావా మావా నేను నీకు ఇష్టమైన కూరలే వండుకొని తెచ్చినా సరిగ్గా లేపోతే ఏడవాలా. కారం తక్కువ వేస్తా ఇకనుండని భర్త కళ్ళలోకి చూసింది.ఇంత అమాయకమైన పిచ్చి ప్రేమ ఉన్న నా కనకవ్వను మోసం చేసినందుకు నన్ను నేను ఎంత తిట్టుకున్నా తక్కువే.నిన్నెప్పుడూ మోసం జేయనే ఎప్పుడు తాగను గా మహమ్మారె నన్ను చెత్త అలవాట్లకు బానిస చేసింది.నిన్ను బాగా చూసుకుంటా ఇకనుండి నన్ను క్షమిస్తావా కనకమ్మ అంటూ భార్య కళ్ళలోకి చూసాడు.. వివాహ బంధం లోని మాధుర్యం తొణికిసలాడుతున్నది.

**కవిత**

# విడి ఆకులు


సిద్ధగాని భాగ్యలక్ష్మి
చరవాణి: 9059798883


అనుబంధాల పొదరిల్లులా ఒక్కటై...
ఆకులో అకుగా అల్లుకున్న అందమైన ఆకుల జంట
ముద్దు ముద్దుగా ముచ్చటగొలిపే పచ్చని జంట
ఏ అలజడి రగిలిందో ఎద లోపల....
అల్ల కల్లోలమై కొమ్మ నుండి విడిపోయాయి...
విడి విడిగా వేరుపడి నడక సాగించాయి...
పట్టు దొరకని బంధాన్ని పట్టుకోవాలని
ప్రయత్నించి ప్రయత్నించి ఓడిపోయింది ఆడ ఆకు
జారే పోయే బంధాన్ని ఎంతని పట్టగలం...
చితికిన మనసును ఎలా అతికించగలం
యుద్ధం ముగిసింది....
నిశ్శబ్దం అంతర్యుద్ధమై అలజడి చేస్తుంది...
కలసి బ్రతకలేనప్పుడు, కట్లు తెంచుకున్నప్పుడు
తెగిపడిన మాటల తూటాలు గుచ్చుకుంటుంటే
మానని గాయలతో మౌనంగా ముందుకు నడుస్తుంది...
బంధం బారమైనప్పుడు...
బరువు మోయలేనప్పుడు...
మది లోతులు తెలియని మనుషులతో ....
మనసు నొచ్చుకొను మాటలతో ఆగిపోకు....
బయటపడే దారి కోసం ప్రయత్నిస్తే తప్పు లేదు...
ముళ్ళ భాటను మళ్ళీ మల్లెతోటగా మార్చుకోరాదు...
కదులుతున్న కాలంతో సాగిపోరాదు....

కవిత

# విజయ గీతిక




**కళ తాటికొండ**

**9989891558**


వర్ణ వర్గ కుల మత వివక్షలు
చరిత్ర కి అంటిన మలినాలు
కాలానికి చేసిన గాయాలు

ప్రపంచీకరణ తో
చదువుల్లో కొలువుల్లో  ప్రభంజనం లా పెను మార్పులు
మెరుగైన జీవన ప్రమాణాలు

కానీ
కాలం తరాలుగా మారినా
ఘడియలు యుగాలు  గా గడిచినా
మారని ఒకే ఒక వివక్ష
పితృ స్వామ్యం ఆమె నుదిటిన చెక్కిన శిలాక్షరపు లింగ
వివక్ష

భరించే భూమాత  ఆమె
ప్రవహించే నదులు ఆమె
అవని పైన అన్ని రంగాల్లో ఆమె
ఆకాశం అంచులు దాటి అంతరిక్షంలో అడుగుడింది ఆమె

కదనరంగంలో కాలు మోపి విజయకేతనం ఎగురవేసింది
ఆమె

రాజకీయ పరమపద సోపానం లో అలీన దేశ శిఖరాగ్రపు
పీఠమెక్కింది ఆమె

అయినా
ద్వితీయ శ్రేణి
పౌరసత్వం ఆమె అసలు చిరునామా

నిత్య అవహేళన లని వేదమంత్రాలు గా
అత్తింటి ఆంక్షల పందిరికి అందమైన లతలా అల్లుకొని
అనుబంధాల  పూలు పూయిస్తూ

ముళ్ళ దారుల్ని
రాజ మార్గపు రహదారులుగా మార్చి
శిథిలాలను సౌధాలు గా పేర్చే ధీర ఆమె

అయినా ఆమె
స్వేచ్ఛ సమానత్వం రాతల్లో కనిపిస్తూ ఆచరణలో అట్టడుగు
వరకు అణగదొక్కబడుతున్న

వివక్షలేని వికాసవంతమైన
సమ సమాజం కోసం పోరాడుతూ

అసమానతల అపశృతుల వివక్షల విషాద గేయాన్ని
తిరగరాస్తూ
ఆమె రచిస్తుంది
ఓ కొత్త రణతంత్రపు  విజయ గీతిక

వ్యాసం

# మలుపు తిరిగిన రథచక్రాలు



- డా|| వి. త్రివేణి
ఫోన్ : 9951444803

భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి నిర్మూలన కోసం, ఫ్యూడల్ బానిసత్వ విముక్తి కోసం తెలంగాణలో సాగిన ప్రజాందోళన చివరకు సాయుధ పోరాట స్వరూపాన్ని సంతరించుకొన్నది. సాయుధ పోరాట స్ఫూర్తితో ఆళ్వారుస్వామి, దాశరథి రంగాచార్యులు, అల్లం రాజయ్య, సాహు మొదలైన తెలంగాణ రచయితలు దాదాపు ముప్పైకి పైగా నవలలు రాశారు. కాని రచయిత్రులలో మొదటగా ముదిగంటి సుజాతారెడ్డి తెలంగాణ అస్తిత్వ చైతన్య పోరాటాలకు అనువుగా 'మలుపు తిరిగిన రథచక్రాలు' అనే నవలను రచించారు. ఈ నవలలో పూర్తిగా తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి బహిర్గతం అవుతుంది. 1946-86 మధ్యకాలపు రాజకీయ, సామాజిక, చారిత్రక, జీవన స్థితిగతులు ఈ నవలలో ప్రతిబింబింపబడ్డాయి.

1947 ఆగస్టు 15 వ తేదీన బ్రిటీష్ సామ్రాజ్య పతనానంతరం భారత యూనియన్లో చేరబోనని, 'ఆజాద్ హైదరాబాద్' గా ఉండిపోతానని నిజాం ప్రభువు ప్రకటించాడు. దీనిని హిందువులందరూ ప్రతిఘటించారు. హిందువులకు వ్యతిరేకంగా కాశీం రజ్వీ నాయకత్వంలో "రజాకార్ సైన్యం" ఏర్పడింది. ఈ రజాకార్లు నగరాల్లోను, పట్టణాల్లోను తమ స్థావరాలు ఏర్పరచుకొని గ్రామాలపై దాడులు సాగిస్తూ ప్రజల ఆస్తి పాస్తులను కొల్లగొట్టేవారు. వారికి మద్దతుగా దొరలు, దేశ్ ముఖులు, జమీందార్లు, మిగతా భూస్వాములందరూ నిరంకుశ అధికారాన్ని చెలాయించేవారు. ఇటువంటి నేపథ్యాన్ని అనుసరించి రచించిన ఈ నవలలో కూడా దొరల గడీలలో జరిగే అన్యాయాలను, అకృత్యాలను రచయిత్రి తెలియజేశారు. ఫ్యూడల్ దోపిడీలలో కెల్లా అతి దారుణమైనది దొరల ఇళ్ళలో బానిసలుగా ఉండే 'ఆడబాపల' జీవనాన్ని చిత్రించారు. ఆడబాపలు దొరల గడీలలో మానసిక, శారీరక దోపిడీలకు గురవుతుండేవారు. వెట్టి చాకిరి భరించలేని యువకులు గాని, వ్యక్తులు గాని దొరకు ఎదురు మాట్లాడితే వారిని అమానుషంగా కొట్టడం, కాల్చివేయడం లాంటి అకృత్యాలకు పాల్పడేవారు. ఈ నవలలో కథానాయకుడు రమేశ్. రమేశ్ నాయకత్వంలో గ్రామ యువకులందరూ కలిసి రహస్య దళాలను ఏర్పరచుకొని దొర గడీలను అంతమొందించడం ద్వారా ఈ నవల పతాక స్థాయిని అందుకున్నది. ఉత్కంఠ భరితంగా సాగే నవల పాఠకులకు ఒక్కింత గగుర్పాటును కలిగించక మానదు.

**వస్తు శిల్పం :**

సుజాతారెడ్డి చిన్నప్పటి అనుభవాల స్మృతి చిహ్నాలు ఆమె మనసులో నిలిచిపోయాయి. 1959 లో ఆమెకు వివాహం జరిగిన తర్వాత కూడా ఇంకా కరీంనగర్ ఉత్తర ప్రాంతాల్లో భూస్వామ్య విధానం, ఆడబాపల వ్యవస్థ కొనసాగడం ఆమె చూశారు. వీటన్నిటిని నవలగా వ్రాయాలని ఆమె సంకల్పించుకున్నారు. ఎప్పుడైతే 1968 ప్రాంతంలో డా. జివాగో చూసినప్పుడు (ఆమె ఈ సినిమాను లండన్ లో చూసారు) ఆమెలో అణిగివున్న వస్తువును నవలా రూపంలో ఎట్లా పెట్టాలో ఒక వ్యూహం ఏర్పడింది. 1986 ప్రాంతంలోనే సుజాతారెడ్డి తెలంగాణ సాయుధ పోరాటం ఇతివృత్తంగా గల "మలుపు తిరిగిన రథ కాలు" నవలను వ్రాశారు. ఒకటి రెండు పత్రికలకు ఇచ్చారు.

కాని ఎవరూ వేయలేదు. అప్పుడు 1994లో డైరెక్టుగా ఈ నవలను ముద్రించారు. తెలంగాణ సాయుధ పోరాటం అవసరమున్న కాలంలో ప్రజలు ఏకమై వీరోచితంగా ఒక

సిద్ధాంత అవగాహనతో పోరాడారు. తర్వాత ఉద్యమం విరమింపబడింది. అయినా కాని కొందరు ఆ ఉద్యమం కొనసాగాలని అరణ్యాల్లో చేరారు. పోరాడుతూనే వున్నారు. దేశంలో ప్రజాస్వామ్యం వచ్చింది. అయితే నిజంగా ప్రజా సంక్షేమం, సమానత్వం, న్యాయం అభివృద్ధి కోరేవారు వుండవలసింది అడవుల్లో కాదు, అసెంబ్లీలో అన్న అభిప్రాయాన్ని చెప్తూ రచయిత్రి ఈ నవలను ముగించారు. ఈ నవలలో 'డా. జివాగో రెండు మహానగరాలు నవలల్లో వలెనే ప్రేమ వృత్తాంతం వుంది. ఈ నవల ఇతివృత్తం 1946 నుంచి 1986 వరకు నలభై యేండ్ల ఇతివృత్తంగా సాగింది. సాయుధ పోరాటాన్ని బాల్యావస్థలో చూసినవారు ఆనాటి పరిస్థితుల అనుభూతుల ఆధారంగా 1986లో వ్రాసారు. అప్పుడే అంపశయ్య నవీన్ కూడా తెలంగాణ సాయుధ పోరాటాన్ని చిత్రిస్తూ "కాలరేఖలు" నవల వ్రాశారు. 1996లో కందిమళ్ల ప్రతాపరెడ్డి "బందూక్" నవల వచ్చింది. తెలంగాణ సాయుధ పోరాటాన్ని చిత్రిస్తూ నవలలు ఇరవై వరకు వచ్చాయి.

జాతీయోద్యమాన్ని చిత్రిస్తూ కూడా ఇన్ని నవలలు రాలేదు. అందులో తెలంగాణ సాయుధ పోరాట చిత్రణ గల ఇరవై నవలల్లో మహిళ వ్రాసింది సుజాతారెడ్డి "మలుపు తిరిగిన రథచక్రాలు" నవల ఒక్కటే! అసలు ఉద్యమాలను కూడా చిత్రిస్తూ మహిళలు నవలలు వ్రాయలేదు. అందులో తెలంగాణ సాయుధ పోరాటాన్ని, అందులోను నిజంగా జరిగిన పోరాట స్వరూపాన్ని చిత్రిస్తూ సుజాతారెడ్డి ఒక్కరే నవల వ్రాశారు. అదేవిధంగా మహిళలెవరూ "తెలుగు సాహిత్య చరిత్ర" రాయలేదు. ఆమె ఒక్కరే "సామాజిక సాంస్కృతిక నేపథ్యంలో తెలుగు సాహిత్య చరిత్ర" పూర్తిగా వ్రాశారు. ఆ స్థానం కూడా సుజాతారెడ్డికే దక్కింది. ఈ సుజాతారెడ్డి తెలంగాణ ప్రాంతీయులు. ఆమెది నల్లగొండ జిల్లా, ఆకారం గ్రామం. నల్లగొండ జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమం 1950–51 వరకు సాగుతూనే ఉంది. అప్పటికి ఆమె వయస్సు ఎనిమిది – పదేళ్ళు. బాల్యంలో ఆమె చూసిన సామాన్య ప్రజల జీవన స్థితిగతులు ఆమె మనస్సులో చెరగని ముద్ర వేశాయి. గ్రామాలు, గ్రామ ప్రజలు, వాళ్ళ జీవితాలు, దొరలు, దేశముఖులు, వాళ్ళ మేడల్లోని, గడీల్లోని జీవిత విధానాలు, వాళ్ళు ప్రజల మీద చేసే దోపిడీ దౌర్జన్యాలు మొదలగునవెన్నో ఆమె లేత వయస్సులోని మనస్సు మీద ముద్రించబడ్డాయి. ఆ జ్ఞాపకాలు, అనుభవాలు ఆమెలో మిగిలి పోయాయి. అందుకే ఆనాటి తెలంగాణ పోరాట ఇతివృత్తంతో 'మలుపు తిరిగిన రథ చక్రాలు' అనే నవలను రచించారు. దేవులపల్లి వేంకటేశ్వర రావు గారి 'తెలంగాణా ప్రజల సాయుధ పోరాట చరిత్ర' తన నవలలో పోరాటాన్ని చిత్రించడానికి అవగాహన కల్పించిందని ఆమె తెలిపారు. నిజాం అండతో దొరలు, దేశముఖులు గ్రామాల్లో క్రూరమైన పాలన నిర్వహించేవారు.

దొరల గడీలలోని జీవిత విధానాలు వాళ్లు ప్రజలపై చేసే దోపిడి దౌర్జన్యాలు ఇలా ఎన్నో సంఘటనలు రచయిత్రి లేత మనస్సులో ముద్రలు వేశాయి. "నాలో తిష్ట వేసుకున్న అనుభూతులు, జ్ఞాపకాలు ఈ నవల కల్పనకు ఇతివృత్తం అయ్యాయి" అని ఆమె 'నా మాట' లో తెలియజేశారు.

ఈ నవలలో ఇందూరు, అన్నారం దొరల, దేశముఖుల అన్యాయాలకు బలి అయిన గ్రామ ప్రజల్లో ప్రతీకారంగా ఒక అలజడి మొదలవుతుంది. అప్పటికే సాయుధ పోరాటం ఆరంభమైంది. ప్రజలందరిలో కమ్యూనిస్టు భావాలు చోటుచేసుకున్నాయి. నవలలో కథా నాయకుడు రమేశ్ తెలంగాణ సాయుధ పోరాట నాయకుడు. రాజ్యంలో కొందరికే ఆస్తులు, అవకాశాలు దొరికే వ్యవస్థను మార్చడం, అట్టడుగు ప్రజలకు న్యాయాన్ని పంచడం, వారిలో సమతను పెంచడం, దొరల, దేశముఖుల, జమీందార్ల క్రూర నియంతృత్వ పాలనను అంతమొందించడం, "దున్నే వాడిదే భూమి" అన్న న్యాయాన్ని, సమ సమాజాన్ని స్థాపించడం సాయుధ పోరాట నాయకుడైన రమేశ్ ఆశయం. దొరల పాలనలో వెట్టి చాకిరి భరించలేని, భూస్వాముల ఆగడాలతో అణగారిన జీవితం గడుపుతున్న గ్రామ ప్రజలు ఏకమై రహస్య గ్రామ దళాలను ఏర్పరచుకొని దొరలను, దేశముఖులను ప్రతిఘటించేవారు. అందులో భాగంగానే ఇందూరు దొరను, అన్నారం దేశముఖును హత్య గావించడం, దొరల వద్ద గల భూమి పత్రాలను కాల్చి వేయడం, అధికార దర్పానికి నిలయాలైన గడీలను నామరూపాలు లేకుండా కూల్చడం మొదలగు కార్యాలలో బడుగు, పేద ప్రజలు ప్రదర్శించిన ఐక్యత, సాహసాలు అద్భుతంగా వర్ణింపబడ్డాయి. స్వాతంత్ర్యానంతరం రాజకీయస్థితి ఎట్లా వుందో ఈ నవలలో చిత్రింపబడింది. అవినీతి, స్వార్థపరులైన నాయకుల మూలంగా

రాజకీయ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతుంది. ప్రజాసంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరకపోవడం, పేదరికం, నిరుద్యోగం, జనాభా పెరుగుదల మొదలగు సమస్యలు దేశంలో ఏవిధంగా చోటు చేసుకున్నాయో రచయిత్రి చిత్రించారు.

స్వాతంత్ర్యానికి ముందు సాగినటువంటి సాయుధ పోరాటం స్వాతంత్ర్యానంతరం కూడా కొనసాగుతూనే వచ్చింది. పోరాట నాయకుడు రమేశ్ తన జీవితాన్ని ఉద్యమానికే అర్పితం చేశాడు. ఒక సంఘటనలో దొర కూతురు సరళ పరిచయం అయినా, ప్రేమ అనే బీజం వారివురి మనసులో నాటుకున్నా ఉద్యమ బాటలో ఉన్న రమేశ్ ఆ ప్రేమను తిరస్కరిస్తాడు. సరళ మాత్రం దురదృష్టం వెంట పరుగెడుతూ అవినీతి, స్వార్థపరుడైన దాసుని వివాహం చేసుకొని ఎన్నో బాధలు పడుతుంది. తత్ఫలితంగా ఆమెకు ఒక కూతురు పుడుతుంది. కూతురు ఉన్నత విద్యలు చదివి వివాహం చేసుకొని విదేశాలకు వెళ్ళిపోతుంది. సరళకు ఒక మనుమరాలు. ఆ పాపను సరళ వద్దే ఉంచి కూతురు అల్లుడు విదేశాలకు వెళ్ళేటప్పుడు విమాన ప్రమాదంలో మరణిస్తారు. అనారోగ్యంతో ఉన్న సరళ మంచం పడుతుంది. అలాంటి స్థితిలో తన మనుమరాలిని సంరక్షించవలసిన బాధ్యతను తీసుకోవలసిందిగా రమేశ్ ను కోరుతుంది. అంత వరకు ఉద్యమ మార్గంలో ఉండి, అజ్ఞాతంగా ఉన్న రమేశ్ సరళ ఆహ్వానాన్ని అందుకొని వస్తాడు. సరళ అభ్యర్థనను అంగీకరించి పాప బాధ్యత స్వీకరిస్తాడు. ఇదే ఉద్యమ రథచక్రాలు మలుపు తిరగడం. రమేశ్ ఉద్యమాన్ని విడిచి, జన జీవితంలోకి రావడమే ఈ నవలకు ముగింపు.

**రూప శిల్పం :**

ప్రారంభం : సుజాతారెడ్డి 'మలుపు తిరిగిన రథచక్రాలు' అనే నవలను బతుకమ్మ పండుగ వర్ణనతో ప్రారంభించారు. అది ఆశ్వయుజ మాసం, శుక్లపక్షం, అష్టమి రోజున తెలంగాణ ప్రజలు బతుకమ్మ పండుగను జరుపుకుంటారు. మహాలయ అమావాస్య నాడు మొదలైన ఆట దుర్గాష్టమి రోజు బతుకమ్మ పండుగతో పూర్తవుతుంది. తొమ్మిది రోజులు తెలంగాణ ప్రాంత స్త్రీలు రకరకాల పువ్వులతో బతుకమ్మలు చేసి, లయబద్ధమైన చప్పట్లతో, బతుకమ్మల చుట్టూ సమూహంగా తిరుగుతూ పాటలు పాడుతారు. అద్భుత కథలతో, సాహస కథలతో, రాజుల రాణుల ఇతివృత్తాలు గల కథలతో, భక్తి కథలతో, వీటన్నింటితో పాటు సాంఘిక కథలతో కూడిన బతుకమ్మ పాటలు పిన్నలను పెద్దలను ఆకట్టుకొంటాయి.

ఈ నవలలో ఇందూరు గ్రామ ప్రజలు బతుకమ్మలు చేసి వాటిని గుడి దగ్గర ఆడటానికి బయలుదేరుతారు. అన్ని కులాల వాళ్ళు గోపురాలుగా పేర్చిన బతుకమ్మలను ఎత్తుకొని బాజా భజంత్రీలతో, డప్పులతో వేణుగోపాల స్వామి గుడి ఆవరణానికి చేరుకుంటారు. ఆడవాళ్ళు రకరకాల పట్టు చీరెలు కట్టుకొని దాచుకున్న నగలన్నీ బయటికి తీసి అలంకరించుకుంటారు. కొత్తగా చేయించుకున్న నగలను కూడా ధరించుకొని నలుగురిలో ప్రదర్శిస్తుంటారు. దొర కూతురు సరళ ఆ రోజు తన తల్లి భువనేశ్వరి ఊళ్ళో లేకపోవడం వల్ల బతుకమ్మ చేసే పని ఆమె బాధ్యత అయింది. జీతగాళ్ళతో కంచెనుండి గునుగుపూలు, గంపలకొద్దీ తంగేడుపూలను తెప్పించింది. తోటలోని బంతి, గోరింటాకు, గుల్మాల, బీర, గుమ్మడి పూలను ఆడబాపలతో కోయించింది. ఆడబాపలు గునుగుపూలను కట్టలుగా కట్టి రంగులు అద్ది ఎండబెట్టారు.

"బతుకమ్మలను రంగురంగు పూలతో ఎత్తుగా గోపురంగా పేర్చడం ఒక కళ" అని సుజాతారెడ్డి అంటారు. పెళ్ళి కాని పిల్లలు, పెళ్ళయి పండుగకు తల్లిగారింటికి వచ్చిన ఆడపిల్లలు బతుకమ్మ తయారు చేసి వారి కళాత్మకతను ప్రదర్శించుకుంటారు. సరళ కూడా బతుకమ్మ చేయడంలో కళాత్మకమైన ప్రతిభను కనబరిచింది. ఇందూరు దొర కూతురు సరళ బతుకమ్మనే గోపురంగా చాలా ఎత్తుగా ఉంది.

ముగింపు : 'మలుపు తిరిగిన రథచక్రాలు'లో రమేశ్ ఉద్యమ నాయకుడు. రాజ్యంలో కొందరికే ఆధీనంగా ఉన్న ఆస్తులు, కొందరికే అవకాశాలు దొరికే వ్యవస్థను మార్చడం, అట్టడుగు ప్రజలకు న్యాయాన్ని పంచడం, వారిలో సమతను పెంచడం, దొరల, దేశముఖుల, జమీందార్ల క్రూర నియంతృత్వ పాలనను అంతమొందించడం, "దున్నే వాడిదే భూమి" అన్న న్యాయాన్ని, సమసమాజాన్ని స్థాపించడం కోసం ఆయన సుదీర్ఘ పోరాటం చేస్తాడు. కథానాయిక సరళ ఎన్నో సార్లు స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు లేని, రక్షణ లేని ఉద్యమం నుండి తప్పించాలని అనుకుంటుంది. హింసామార్గం వదిలి ప్రజాస్వామ్యంలోకి రప్పించాలని ఆశిస్తుంది. చివరికి సరళ మనుమరాలు బేబిని రమేశ్ చేతుల్లో పెట్టి, ఆ పాప సంరక్షణ బాధ్యతను అప్పగించడం

వల్ల ఆయన జనజీవితంలో కలిసినట్లుగా ప్రతీకాత్మకంగా ఈ నవల ముగుస్తుంది. అదే ఉద్యమ రథ చక్రాలు మలుపు తిరగడం.

**పాత్రచిత్రణ :**

దాశరథి రంగాచార్యులు పీఠిక రాస్తూ ఇతర తెలంగాణ నవలలతో ఈ నవలకు సారూప్యతలు కన్పిస్తున్నాయని అన్నారు. 'ప్రజలమనిషి'లో కొమరయ్య, 'గంగు'లో దొరకూతురు, 'చిల్లర దేవుళ్ళు'లో బతుకమ్మ పండుగ, 'జనపదం'లో అమృతవాణి, ఆడబాపకొడుకు రామయ్య వంటి పాత్రలు, భావనలు, సన్నివేశాలు ఈ నవలలో కూడా ఉన్నాయని వివరించారు. "మలుపు తిరిగిన రథచక్రాలు" లో ప్రధాన పాత్రలు గమనిద్దాం.

రమేశ్ : 'మలుపు తిరిగిన రథచక్రాలు' నవలలో కథా నాయకుడు రమేశ్. రమేశ్ ప్రజల మనిషి. ప్రజల ఆశయాలకు అతడొక ప్రతినిధి. అందరి ఆవేశం మూర్తీభవిస్తే ఒక వీరుడు తయారవుతాడనడానికి రమేశ్ ఒక ఉదాహరణ. అతడొక ఆదర్శ విప్లవవాది. నిరంకుశ నిజాం పాలన అంతమొందించడానికి సాయుధ పోరాటమే మార్గమని నమ్మిన సైద్ధాంతిక వ్యక్తి. తాను నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి, తన ప్రాణాన్ని ప్రజల కోసం పణంగా పెట్టాడు. అతడు ప్రదర్శించిన ధైర్య సాహసాలు పాఠకులకు గగుర్పాటు కలిగించక మానవు. రాజ్యంలో కొందరికే ఆస్తులు, అవకాశాలు దొరికే వ్యవస్థను మార్చడం, అట్టడుగు ప్రజలకు న్యాయాన్ని పంచడం, వారిలో సమతను పెంచడం, దొరల, దేశముఖుల, జమీందార్ల క్రూర నియంతృత్వ పాలనను అంతమొందించడం, "దున్నేవాడిదే భూమి" అన్న న్యాయాన్ని, సమసమాజాన్ని స్థాపించడం కథానాయకుడు రమేశ్ ఆశయం. అలాంటి ఉద్యమ స్వరూపానికి తగిన ధ్యేయాన్ని కలిగిన పాత్రగా సుజాతారెడ్డి రమేశ్ ను తీర్చిదిద్దారు.

గ్రామాలలో అమాయకులైన పేద ప్రజలను దోపిడీ, దౌర్జన్యాలతో దోచుకొనే దొరల, రజాకార్ల చర్యలను ముందుగానే తెలుసుకొని వాటిని చెడగొట్టడం, అన్నారం, ఇందూరు దొరల నియంతృత్వ పాలనను వ్యతిరేకించడం, గ్రామాల్లో సామాన్య ప్రజానీకానికి అండగా ఉండడం లాంటివి ఉద్యమ నాయకుడైన రమేశ్ చేసే పనులు. దొరల అవినీతి పాలనను ఎదిరిస్తూ గ్రామాల్లో రహస్య పోరాట దళాలను ఏర్పాటు చేయడం వంటి ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలను రమేశ్ నిర్వహించేవాడు. ఒక సందర్భంలో రమేశ్ ప్రాణాలను ఇందూరు దొర కూతురు సరళ కాపాడుతుంది. అలా ఆమెతో పరిచయం కలిగి స్నేహంగా మారుతుంది. వారిద్దరిలో ప్రేమ అంకురిస్తుంది. రమేశ్ మాత్రం రచయిత్రి ఉద్యమబాటకే అంకితమైనవాడిగా చిత్రించింది. సరళ రమేశ్ ను జనజీవనంలో కలవమని ఆహ్వానించినప్పుడు కొందరి చేతుల్లో మాత్రమే ఆస్తులు, అధికారాలున్నంత వరకు నా ఉద్యమం ఆగదు! ప్రజానీకం మీద దౌర్జన్యాలు ఆగిపోయిననాడే నా పోరాటం ఆగిపోతుంది! వర్గ భేదం సమాజంలో నశించిన్నాడే నా దీక్ష పూర్తి అవుతుంది!" అంటూ రమేశ్ తన ఆలోచనలను మార్గాలను సరళకు విన్నవిస్తాడు.

రమేశ్ కాలేజీలో చదువుకుంటున్నప్పటి నుంచి ఉద్యమాన్ని సాగించాడు. అప్పుడు స్వాతంత్రోద్యమ ప్రభావం వల్ల విద్యార్థి అయిన రమేశ్ ఆ బాటలో పయనించాడు. నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'వందేమాతరం' గేయాన్ని విద్యార్థులందరిచేత పాడించాడు. తత్ఫలితంగా కాలేజీ మూతపడింది. ఆ తరువాత అతడు ఊరికి పోకుండా మహాసభ కార్యకర్తగా పనిచేశాడు. వీటితో సంతృప్తి పొందక కామ్రేడ్ అసోసియేషన్లో చేరాడు. అసోసియేషన్ ఆశయాలు రమేశ్ ను ఉత్సాహపరిచాయి. నిజాంను, అతని రాచరికాన్ని సమర్థిస్తూ దొరలు, దేశముఖులు, జమీందార్లు చేసే రాక్షస కృత్యాలు మితిమీరిపోవడం గమనించాడు. వారి అధికారాలను అణచివేయడానికి సాయుధ పోరాటంతోనే విముక్తి సంభవమని రమేశ్ విశ్వసించాడు. యువకులందరూ విప్లవవీరులుగా గెరిల్లా పోరాటానికి దిగాలని సంకల్పించాడు. రమేశ్ గ్రామ ప్రజలందరిని కూడగట్టుకొని దొరల గడీలను అంతమొందించడంలోనూ, దొరల వద్దగల భూమి పత్రాలను కాల్చివేయడంలోనూ, అధికార దర్పానికి నిలయాలైన దివానాఖానాలను నామరూపాలు లేకుండా కూల్చడంలోనూ అతడు ప్రదర్శించిన ధైర్యసాహసాలను రచయిత్రి అద్భుతంగా చిత్రించారు.

సరళ : ఈ నవలలో కథానాయిక సరళ. ఆమె ఇందూరు దొర రామచంద్రరావు కూతురు. ఆమె క్రూరుడైన దొర రామచంద్రారావు కూతురే అయినా దొర లక్షణాలేవీ ఆమెలో మచ్చుకైనా కన్పించవు. ఒక విలక్షణమైన వ్యక్తిత్వం గలదిగా సరళ పాత్రను సుజాతారెడ్డి తీర్చిదిద్దారు. సరళ అందగత్తె.

సుకుమారవతి. అమాయక ప్రజలపైన ఆప్యాయతలు కురిపించేది. ఇంటిలో ఉన్న ఆడబాపలపై దయ, కరుణను చూపేది. ఈ నవలలో సరళకు తోడుగా ఆద్యంతం కస్తూరి అనే ఆడబాపను సుజాతారెడ్డి ప్రవేశపెట్టారు. ఇందూరులో గ్రామ గ్రంథాలయానికి వచ్చే పత్రికలు, పుస్తకాలు తెప్పించుకొని చదివి, నాటి దేశకాల పరిస్థితులను సరళ తెలుసుకుంటూ ఉండేది. సరళ పుట్టుకతోనే అభ్యుదయ భావాలు కలిగినది. ప్రత్యక్షంగా ఉద్యమ బాటలో నడవకపోయినా, పరోక్షంగా ఉద్యమాన్ని సమర్థిస్తుంది. బతుకమ్మ పండుగరోజు రజాకార్లు పన్నిన పథకాన్ని చెడగొట్టడానికి వచ్చి ఆ సంఘటనలో గాయపడిన రమేశ్ ను తన గడీలోకి తీసుకొచ్చి ప్రాణాలు కాపాడుతుంది. మొదటి చూపులోనే ఆమె అతనిచేత ఆకర్షింపబడింది. కాని రమేశ్ తన ఆశయాలకు, దీక్షకు, ఉద్యమ బాటకు కట్టుబడివున్నాడు. అప్పుడు సరళ తన ప్రేమను త్యాగం చేసింది. ఒక విధంగా సరళ దురదృష్టవంతురాలు. అదే విషయాన్ని దాశరథి రంగాచార్యులు "సరళకథ మాత్రం పోరాటానికి కాక అదృష్టానికి లంకె పడి ఉంది. ఆమె అనంత దురదృష్టవంతురాలు. పట్టిన బంగారం సొంతం మట్టి అయింది! దురదృష్టం నెట్టిన వైపు కల్లా ఉరికి–విసిగి–ఆనేపథ్యంలోనే కన్నుమూసింది" అని ముందు మాటలో అన్నారు. సరళ పాత్రను ప్రజాస్వామిక విలువలకు ప్రతీకగా రచయిత్రి చిత్రించారు. దోపిడీ దౌర్జన్యపరుడైన, విలాస పురుషుడైన దేశముఖు రంగారావుకు సరళను కట్టబెట్టాలని నిర్ణయించడం, తర్వాత ఆమెకు అవినీతిపరుడైన దాసుతో పెళ్ళి కావడం ప్రజాస్వామ్య విలువలకు జరిగిన హానిని రచయిత్రి ఈ పాత్రలో ప్రతికాత్మకంగా చెప్పారు.

ఇందూరు దొర : ఇందూరు దొర రామచంద్రారావు. ఇందూరు – ఆ ఊరు చుట్టూ ఉన్న నాలుగు పల్లెల్లోని భూమికి పట్టేదారు. అతడు జీతగాళ్ళను పెట్టి సొంతంగా వ్యవసాయం చేసే భూమి ఏ వందెకరాలలో ఉంటుంది. మిగతా వందలకొద్ది ఎకరాల భూమిని ఇందూరు – ఇందూరు చుట్టూ ఉన్న పల్లెల్లోని ప్రజలు సాగుచేసి దొరకు ధాన్యరూపంలో కౌలును చెల్లిస్తారు. అతడు మాట్లాడితే ఉరుము ఉరిమినట్లుగా ఉంటుంది. అతని కంఠస్వరం వింటేనే చాలు గడగడ వణికి పోతారు ఊరి ప్రజలు. అతడు పొద్దున్నే లేచి బెత్తం చేతిలో పట్టుకొని ఊళ్ళోకి బయలు దేరుతాడు. ఊళ్ళో దాదాపు రైతులందరూ దొర కౌలుదార్లే. అంటే దొర భూములను దున్ని పంట పండించి దొరకు కౌలుగా ధాన్యం కొలుస్తారు. పంటలు పండినా, పండకపోయినా కౌలు ధాన్యమెంతో అంత కొలువవలసిందే. కౌలు ధాన్యం వల్ల, నాగులతో వచ్చే ధాన్యం వల్ల దొర గరిసెలు ఎప్పుడూ నిండే ఉండేవి. కౌలు చెల్లించని రైతులను దొర అమానుషంగా క్రూరంగా శిక్షించేవాడు. దొరకు కోపావేశాలు ఎక్కువ ఒకసారి కొమరయ్య రైతు కౌలు కట్టలేక పోయాడు. అతనిని దివానాఖానాకు పిలిపించి అసభ్యకరమైన మాటలతో తిట్టాడు. అది చూసి కొమరయ్య తమ్ముళ్ళు దొరకు ఎదురు తిరిగారు. అంతే పట్టరాని ఆవేశంతో ముగ్గురు తమ్ముళ్ళను తన బెత్తంతో కొట్టడమే కాకుండా తన వద్ద కూలీ వాళ్ళతో కూడా కొట్టించాడు. ఆ దెబ్బలకు కొమరయ్య పెద్ద తమ్ముడు మృతి చెందాడు. ఇలా ఆనాటి దొరల పాలనలో సామాన్య ప్రజలు ఎలాంటి బాధలు పడ్డారో ఇందూరు దొర చరిత్రలో సుజాతారెడ్డి చూపించారు.

అన్నారం దేశముఖు : అన్నారం దేశముఖు రంగారావు. ఇతడు పల్లెల్లో ప్రజలను కొల్లగొట్టి నిజాంకు నజరానాలను అర్పించుకొని అతన్ని ఖుషీ చేస్తాడు. నిజాం ఖజానా నింపుతూ దర్జాగా జీవితాన్ని గడిపేస్తున్నాడు. తండ్రి తాతల నుంచి ఆస్తితో పాటు దేశముఖు పదవీ అతనికి అబ్బింది. అతడు అన్నారం దేశముఖు అయినా అక్కడ ఉండడం తక్కువ. హైద్రాబాదులోనే అతని నివాసం. హైద్రాబాదులో తన దర్జా నలుగురికి తెలిసేటట్లుగా కొన్ని ఎకరాల భూమిలో పెద్ద మేడను కట్టాడు. ఆ మేడలో చీటికి మాటికి జల్సాలు ఏర్పాటు చేసి పెద్దవాళ్ళను ఆహ్వానిస్తాడు. పాటగత్తెలతో నాట్యగత్తెలతో కళకళలాడే అతని జల్సాలకు అందరూ తప్పక వస్తారు. పండుగ రోజులని, జన్మదినోత్సవం అని నిజాంను దర్శించుకొని నిజాంకు అశ్రఫీలను, విలువైన బహుమానాలను సమర్పించుకునేవాడు. అతని దర్జా – వీళ్ళలాగా డబ్బును ఖర్చు పెట్టే తీరును చూసి అందరూ "రాజా సాహెబ్" అని పిలుస్తారు. దేశముఖుకు అన్నారంలో, అన్నారం చుట్టుప్రక్కల ఐదూళ్ళలో కలిపి అంతా వేయి ఎకరాల భూమికి పైగా ఉంటుంది. దేశముఖుకు సొంత వ్యవసాయమన్నదే లేదు. ఆ ఊళ్ళల్లోని రైతులే దున్ని పంట పండిస్తారు. కౌలు నాగుల ధాన్యాన్ని, అప్పులను, వడ్డీలను, పన్నులను అంతా వసూలు చేయడం గుమాస్తా – కిరాయి

మనుషుల బాధ్యత. రంగారావు దేశముఖు హఠాత్తుగా ఊరికి వచ్చి లెక్కలు చూసుకొని వసూలైన ధాన్యాన్ని అమ్మగా వచ్చిన పైకం, వడ్డీ రూపంగా పన్నుల రూపంగా వచ్చిన పైకం అంతా తీసుకొని పట్నం వెళ్ళిపోతాడు.

రంగారావుకు పద్దెనిమిదో ఏటనే సంయుక్తతో పెళ్ళయింది. సంయుక్త పెద్దదయిన నాటికే రంగారావు పదిరకాల రుచులకు అలవాటు పడ్డాడు. ఒక్క సంయుక్తతో సరిపెట్టుకోవాల్సిన అవసరం అతనికి కనిపించలేదు. భర్త ఆదరణ లేక సంయుక్త శారీరక సుఖం, మానసిక సుఖం లభించక మంచానికే అంటుకొనిపోయింది. ఆ రోజుల్లో జల్సాలకే పరిమితమైన దేశముఖులకు ప్రతినిధిగా రంగారావు పాత్రను రచయిత్రి చిత్రించారు.

దాసు : ఈ నవలలో దాసుది విభిన్నమైన పాత్ర. మాలతి అనే ఆడబాప కొడుకు దాసు. తన మారు తండ్రి సంపాదించిన ఆస్తిని అనుభవిస్తూ జల్సాలు చేస్తూ విలాసవంతమైన జీవితాన్ని గడిపేవాడు. ఎక్కువగా చదువుకోలేదు. కాని సమాజ పోకడలు బాగా తెలిసినవాడు. సరళను పెళ్ళి చేసుకున్నాడేగాని, ఆమెపై ప్రేమ, ఆప్యాయతలు చూపించలేక పోయాడు. సంఘంలో పేరు ప్రతిష్ఠలు సంపాదించాలని అతని తాపత్రయం. ఎలాగైనా సరే డబ్బు సంపాదించడమే అతని లక్ష్యం. అందుకే అతనికి దొంగ వ్యాపారంతో సంబంధముండేది. రాజకీయాల్లో మెళు కువలు తెలిసినవాడు. మొదటిసారి ఎన్నికల్లో గెలిచి, మంత్రి కూడా అయ్యాడు. రెండవసారి జరిగిన ఎన్నికల్లో అదే ప్రాంతం నుండి గెలిచి హోం మినిష్టర్ పదవిని పొందాడు. మంత్రి అయ్యాడే కాని, తాను చేసే పనుల్లో చిత్తశుద్ధి చూపలేక పోయాడు. ఎన్నికల సమయంలో ఖర్చయిన డబ్బంతా తిరిగి సమకూర్చుకునేందుకు ఎన్నో అవినీతి పనులు చేసేవాడు. ఈ విధంగా దాసు పాత్రలో ఊసరవెల్లిలా రంగులు మార్చే రాజకీయ నాయకులను చిత్రించారు. వాళ్ళ అవినీతి, దోపిడీ, కుత్సితాలను పేర్కొన్నారు. స్వాతంత్ర్యం సంపాదించిన తరువాత దేశం ఎటువంటి రాజకీయ నాయకుల చేతుల్లోకి వెళ్ళి పోయిందో వివరించారు.

ఇవేగాక ఈ నవలలో ఆడబాప కస్తూరిని, దొరసాని భువనేశ్వరిని, గ్రంథాలయం నడిపే ప్రభాకర్‌ను, రంగారావు భార్య సంయుక్తను, పేదరైతు కొమరయ్యను, సరళ కూతురు, అల్లుడు, మనుమరాలు పాత్రలను సుజాతారెడ్డి సహజత్వం చెడకుండా చిత్రించి పాఠకులను ఆకట్టుకున్నారు.

**సామాజిక చిత్రణ :**

రజాకార్ల సైన్యం : 1947 ఆగస్టు 15వ తేదీన బ్రిటీష్ సామ్రాజ్యపాలన నుంచి భారతదేశం దాస్య విముక్తి పొందింది. కాని హైదరాబాదులో మాత్రం నిజాం పాలన సాగుతూనే ఉంది. అప్పుడు తాను సమైక్య భారతంలో చేరబోనని, స్వతంత్రంగానే (ఆజాద్ హైదరాబాద్ గా) ఉండి పోతానని నిజాం ప్రభువు ప్రకటించాడు. 'ఆజాద్ హైదరాబాద్' ముస్లిం సామ్రాజ్యమని, అసహోహీ పాలనలో ప్రతి ముస్లిం పవిత్ర కర్తవ్యమని, ఇత్తెహాద్ ఉల్ ముస్లిమీన్ నాయకుడైన కాశీం రజ్వీ నాయకత్వంలో రజాకార్ సైన్యం ఏర్పడింది. ఈ రజాకార్లు నగరాలలో, పట్టణాలలో స్థావరాలు ఏర్పర్చుకొని, గ్రామాలపై దాడులు సాగిస్తూ ప్రజల ఆస్తిపాస్తులును కొల్లగొడుతూ,

జాతీయ జెండాలను, ఎర్రజండాలను లాగివేస్తూ ఉండేవారు. వాళ్ళ వద్ద బల్లేలు, జంబియాలు, బాకులు, నాటు తుపాకులు, రైఫిళ్ళు మొదలైన ఆయుధాలుండేవి. వీరు హిందువులకు వ్యతిరేకంగా తమను బలపరచవలసిందిగా సామాన్య ముస్లిం ప్రజనీకాన్ని కూడగట్టడానికి ప్రయత్నించేవారు. ముస్లిం జనాభాను పెంచటానికి హరిజనులకు భూములు, ఉద్యోగాలు ఇస్తామని ముస్లింలుగా మతం మార్పిడి చేసేవారు. దొరల, దేశముఖుల పాలన : దొరలు, దేశముఖులు,

జమీందార్లు, నిజాం పాలనకు మద్దతు పలికే వారు. నిజాం అండతో తమ నిరంకుశ అధికారాన్ని చెలాయించేవారు. ఈ నవలలో ఇందూరు, అన్నారం దొరల పాలన వృత్తాంతం ఉంది. ఈ దొరలకు నాలుగు ఐదు ఊళ్ళలో వేల ఎకరాలలో భూములు ఉన్నాయి. వీరు సొంతంగా జీతగాళ్ళను పెట్టి వ్యవసాయం చేసేది వంద ఎకరాలు మాత్రమే. మిగతా భూమంతా చుట్టూ పల్లె ప్రజలు సాగు చేసి కౌలును చెల్లిస్తారు. నాటి దొరల పాలన నిరంకుశంగా సాగేది. కూలీలను క్రూరంగా హింసించేవారు. ఎదురు తిరిగిన వారిని చితకబాదడమో చంపటమో చేసేవారు. ఈ దొరలకు అధికార దర్పం అధికంగా ఉండేది. దేశముఖులు తమ అజమాయిషీని తమ గుమాస్తాల ద్వారా, ఏజెంట్ల ద్వారా (సేరీదార్లు) చెలాయించేవారు. అధికారికి అన్ని అధికారాలు ఉండేవి. ఈ సేరీదార్లు రైతుల నుండి దౌర్జన్య పూర్వకంగా కౌలును, పన్నులను వసూలు

చేసేవారు. గ్రామానికి సంబంధించిన యావత్తు సమాచారాన్ని అందజేయడంతో సహా అన్ని పనులూ చేసేవారు. జాగీర్దార్లకు, దేశముఖులకు రైఫిళ్లు, తుపాకులు కలిగి ఉండడానికి లైసెన్సులు ఉన్నాయి. వారికి సాయుధ బలగాలూ ఉండేవి.

భూస్వామ్య వ్యవస్థ : తెలంగాణా గ్రామీణ ప్రాంతాలలో నైజాం నిరంకుశ పాలనకు మూలస్తంభాలుగా భూస్వాములు నిలిచారు. హైదరాబాదు సంస్థానంలో ప్రత్యేకించి తెలంగాణాలో ప్రజల సాంఘిక ఆర్థిక జీవితంలో ఉన్న మౌలిక లక్షణం, తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం ప్రారంభం అయ్యేంత వరకూ అడ్డూ అదుపు లేకుండా ఫ్యూడల్ దోపిడీ సాగుతూ వచ్చింది. ఈ నవలలో సుజాతారెడ్డి ఇందూరు, అన్నారం భూస్వాముల దోపిడీ దౌర్జన్యాలను తెలిపారు. వేల ఎకరాల్లో ఉన్న భూస్వాముల భూములను చుట్టూ గ్రామాల్లోని ప్రజలు సాగు చేసేవారు. తత్ఫలితంగా భూస్వాములకు ధాన్యరూపంలో కౌలుకు చెల్లించేవారు. పంట పండినా పండకపోయినా వారికి కౌలు చెల్లించవలసిందే. భూమిని కౌలుకు దున్ననివాళ్ళు కూలీ పనులు చేసుకుంటారు. దొర ఏ కూలి నిర్ణయిస్తే ఆ కూలే వాళ్ళు తీసుకోవాలి. పంటకాలం పూర్తి కాగానే ధాన్య రూపంలో కౌలు కట్టాలి. అలా కట్టని పక్షంలో దాన్ని నాగులుగా జమకడుతారు. ఆ తర్వాత పంటకాలంలో ఆ యేడు కౌలును, కిందటేడు నాగులును చెల్లించాలి. భూస్వామ్య వ్యవస్థ పల్లె ప్రజల ఆర్థిక స్థితిగతులను ఏవిధంగా పేదరికంలోకి నెట్టి వేసిందో సుజాతారెడ్డి ఈ నవలలో తెలియజేశారు.

వెట్టిచాకిరి విధానం : తెలంగాణాలో వెట్టి విధానం ఎట్లా ఉండేదో ఈ నవల ద్వారా సుజాతారెడ్డి వర్ణించారు. సోలెడు మానెడు జొన్నలకు పిల్లల్ని బానిసలుగా అమ్ముకోవడం, జీతభత్యాలు లేకుండా మనుషులు వెట్టి చాకిరి చేయడం, ఏడాదంతా వంచిన నడుము ఎత్తకుండా కుటుంబమంతా కష్టపడి పుట్ల కొద్ది ధాన్యం పండించి పోస్తే తినడానికి వాళ్ళకు తిండి లేకపోవడం మొదలయిన సామాన్య జీవన స్థితిగతులను వివరించారు. ఆనాటి కాలంలో ప్రతి హరిజనుడు వెట్టిచాకిరి చేయవలసి వచ్చేది. పటేల్, పట్వారీ, మాలీ పటేల్ లేదా దేశ ముఖుల ఇండ్లలో అక్కడ ఇంటి పనులు చేయడం, పోలీసు స్టేషన్లకు, తాలుకా ఆఫీసులకు రిపోర్టులు మోసుకెళ్ళడం, గ్రామ చావిడికి, బందిలి దొడ్డికి కాపలా కాయడం రోజూవారీ పనిలో భాగమే. హరిజనులే గాక బోయలు, బెస్తలు, రజకులు, వడ్రంగులు, కమ్మర్లు, కుమ్మరులు, గొల్లవారు మొదలయిన వివిధ వృత్తి పనివారు, తాము తయారు చేసిన వస్తువులను, దుస్తులను భూస్వాములకు ఉచితంగా సరఫరా చేయవలసి వచ్చేది. గ్రామాల్లోని వ్యాపారులు, కోమట్లు పోలీసు పటేలు నుండి చీటీ అందగానే గ్రామంలోకి వచ్చిన అధికారికి మంచి నెయ్యితో సహా అవసరమైన సరుకులన్నీ వంతుల వారీగా సరఫరా చేయవలసి వచ్చేది.

ఈ వెట్టి నుండి రైతులను కూడా వదిలి పెట్టేవారు కాదు. తమ స్వంత పొలాలలో పని ప్రారంభించడానికి ముందే గ్రామాధికారుల, భూస్వాముల పొలాలు దున్ని పెట్టాలి. భూస్వాముల భూములు తడిసేంత వరకూ, రైతుల పొలాలకు నీళ్ళు అందనిచ్చేవారు కాదు. అధికారుల, భూస్వాముల పొలాలలో వ్యవసాయ కూలీలు కొద్దిపాటి ప్రతిఫలంతోనే పని చేయవలసి వచ్చేది. ఈ విధంగా వెట్టి విధానం సామాన్య ప్రజల జీవిత విధానాన్ని అట్టడుగు స్థాయికి దిగ జార్చింది. బానిసత్వంలోకి నెట్టివేసింది. ఆడబాపల దయనీయ స్థితి : ఈ ఫ్యూడల్ దోపిడీలలో కెల్లా దారుణమైనది భూస్వాముల ఇండ్లలో 'బానిసలు'గా బాలికలను పంపించే పద్ధతి. వీరినే ఆడబాపలు అంటారు. ఆడబాపలంతా ఏ కరువు కాలంలోనో, ఏ అవసరానికో తల్లిదండ్రులు తమ కూతుళ్ళను అమ్ముకోగా గడీలో చేరిన వాళ్ళు. ఆడబాపలకు జీతాలంటూ ఏమి ఉండవు.

రెండు పూటలా పాసిపోయిందో, పులిసిపోయిందో ఇంత తిండి తింటారు. దొరసాన్లు ఇచ్చిన పాత గుడ్డలను కట్టుకుంటారు. అర్ధరాత్రి వరకు యంత్రాల్లాగా పని చేస్తారు. వాళ్ళు అర్ధరాత్రి ఎప్పుడో నడుం వాల్చగానే కోళు , కూస్తూనే ఉంటాయి. కోడి కూతతోనే లేచి మళ్ళా పనుల్లోకి దిగుతారు. వంటింట్లో వంటలు మొదలుకొని దొరసాన్లకు స్నానం చేయించేంత వరకు పనులన్నీ వాళ్ళు చేయవలసిందే!

భూస్వాములు తమ కుమార్తెల పెళ్ళిళ్ళు చేసినప్పుడు, ఆడబాపలుగా ఈ బాలికలను బహుకరించి, పెండ్లి జరిగిన తమ కుమార్తెలతో పాటు, వారి అత్తవారిండ్లలో పని చేయడానికి పంపేవారు. ఆడబాపలకు పెళ్ళిళ్ళు అనేవి ఏవీ ఉండవు. కాని వాళ్ళకు పిల్లలు మాత్రం ఉంటారు. ఇంటికి వచ్చిన ఏ అతిథికో లేదా గడిలోని దొరలకో ఆనందాన్ని అందించడంతో వాళ్ళకు

పిల్లలు పుడ్తారు. ఈ విధంగా దొరల గడిలో మానసిక, శారీరక దోపిడీలకు వారు గురవుతుండేవారు. వారికి పుట్టిన పిల్లలకు తండ్రెవరో తెలియని పరిస్థితిలో ఉండే ఆడబాపల దైన్యాన్ని సుజాతారెడ్డి నవలలో వివరంగా చిత్రించారు.

సాయుధపోరాటస్వరూపం:తెలంగాణవిమోచనోద్యమం కమ్యూనిస్టుల చేతుల్లో భూమికోసం, భుక్తికోసం, వెట్టిచాకిరీ నిర్మూలన కోసం, అమానుష ఫ్యూడల్ బానిసత్వ విముక్తి కోసం సాగిన ప్రజాందోళన చివరకు సాయుధపోరాట స్వరూపాన్ని దాల్చింది. ఈ సాయుధపోరాటాన్ని చిత్రించే నవల 'మలుపు తిరిగిన రథచక్రాలు'. ఈ నవలలో సుజాతారెడ్డి చిత్రించిన సాయుధపోరాట విప్లవకారులు రజాకార్ల దోపిడీలను అరికట్టడంలో అసాంతం పోరాడారు. అంతేగాక దేశంలో అట్టడుగు ప్రజలకు న్యాయం, సమతలను పంచడం; దొరల, దేశముఖుల, జమీందార్ల క్రూర నియంతృత్వాన్ని దోపిడి, దౌర్జన్యాలను ఎదిరించడం; దున్నేవాడిదే భూమి అన్న న్యాయాన్ని అమలు పరచడం కోసం కృషిచేశారు. సమసమాజ స్థాపన వీరి ఆశయంగా ముందుకు నడిచారు.

ఏ పోరాటమైనా విజయవంతం కావాలంటే కట్టలు తెంచుకునే ఆవేశమే కాదు దానికి నైతిక బలం కూడా అవసరం. ఈ నైతిక బలంతోనే దొరల దౌర్జన్యాలను అనుభవిస్తున్న యువకులందరూ ఏకమై రహస్యంగా గ్రామదళాలను ఏర్పరచుకునే వారు. తమ సాధారణ కార్యకలాపాలను సాగిస్తూనే వారి బర్మార్లతో, ఈటెలతో రజాకార్లను, దొరలను ప్రతిఘటించేవారు. నిజాం కోరల నుండి ఈ ప్రదేశాన్ని, ధనవంతుల అన్యాయాల నుండి ప్రజలకు విముక్తిని కలిగించడమే ఈ విప్లవకారుల ఆశయం. ఇందూరులో బతుకమ్మ పండుగ రోజు రజాకారులు కలిసి ఆడవాళ్ళ మీది బంగారమంతా దోచుకోవాలనే వ్యూహం పన్నారు. కాని సాయుధపోరాట దళాలు అక్కడికి వచ్చి వాళ్ళ ఆటను కట్టించారు. విప్లవవీరుల దళాలు తమకు ఆయుధాలు మందు గుండు సామాన్లు కావలసి వచ్చినప్పుడు పోలీసు స్టేషన్ మీద దాడి చేసి చేజిక్కించుకునేవారు. అందులో భాగంగానే ఈ నవలలో సాయుధ పోరాట దళాలు కుమ్మరి కుంట పోలీసు స్టేషన్ మీద దాడి చేసి, కొత్తగా వచ్చిన అత్యాధునికమైన అమెరికను రైఫిళ్ళు దోచుకున్నారు. సాయుధ పోరాట దళ నాయకుల ప్రోత్సాహంతో పీడిత గ్రామ ప్రజలందరూ కలిసి దొరల గడీలను కూల్చటంలో ప్రజలు ప్రదర్శించిన ఐక్యతను, సాహసాలను సుజాతారెడ్డి కళ్ళకు కట్టినట్లు చిత్రించారు.

బతుకమ్మ పండుగ : 'మలుపు తిరిగిన రథచక్రాలు' అనే నవలను సుజాతారెడ్డి బతుకమ్మ పండుగ సంబరాలతో ప్రారంభించారు. తెలంగాణాలో దుర్గాష్టమి నవరాత్రులను బతుకమ్మలు తయారు చేసి వాటిని చెరువులో నిమజ్జనం చేసి జరుపుకుంటారు. గునుగు పూలు, తంగేడు పూలు, బంతి పూలు, గోరింట పూలు, గుల్మాల పూలు, బీర పూలు, గుమ్మడి పూలు, మొదలగు వాటితో బతుకమ్మలను తయారు చేస్తారు. సంప్రదాయబద్ధమైన ఈ బతుకమ్మ పండుగలో స్త్రీలు ఎక్కువగా పాల్గొంటారు. పూల సేకరణలో పురుషులు తోడ్పడినా స్త్రీలు బతుకమ్మలను పేర్చడంలో, ఆడడంతో, పాటలు పాడడంతో ఎక్కువ మక్కువ చూపిస్తారు. ఈ పండుగ రోజున సాధారణంగా స్త్రీలు తాము దాచుకున్న నగలు, చీరలు ధరిస్తారు. వాటి ద్వారా స్త్రీలు తమ గొప్పలు ప్రదర్శిస్తారు. ఆడబిడ్డలు అమ్మగారింటికి వచ్చి ఆత్మీయులను కలుసుకొని తమ మంచి చెడ్డలను చెప్పుకుంటారు. తమ ఆడవారి అందచందాలు చూసి ముచ్చటపడి మురిసిపోవడం మగవాళ్ళ వంతైతే, పిల్లలు కొత్త బట్టలు కట్టుకొని, పిండి వంటకాలు ఆరగించి చిందులేస్తారు. పస్తులుండే పనివాళ్ళు కూడా ఆరోజు తృప్తిగా భుజించి సంతోషంగా ఉంటారు.

గ్రామ ప్రజల జీవనవిధానం : ఈ నవలలో సుజాతారెడ్డి 1946–86 ప్రాంతంలోని ప్రజల జీవన విధానాన్ని చూపించారు. అమాయకమైన ప్రజలు దొరల నియంతృత్వమైన పాలనకు బలి అయ్యేవారు. భూస్వామ్య వ్యవస్థ బలంగా ఉన్న ఆ రోజుల్లో గ్రామప్రజల ఆర్థికవ్యవస్థ అట్టడుగు స్థితిలో ఉండేది. వెట్టి చాకిరి విధానం అమలులో ఉండేది.

దొర ఎదురైనప్పుడు గ్రామ ప్రజలు "బాంచను దొరా! నీ కాల్మొక్తా" అనే వారు గాని, దొర అకృత్యాలను నిలదీసేవారు కాదు. వేల ఎకరాలలో వ్యవసాయ భూములున్న దొరలు, ఆ భూములన్నీ పేదవారి నుండి అక్రమంగా వశపరచుకున్నారు. మళ్ళీ వాటిలోనే వారిని వ్యవసాయ కూలీలుగా నియమించి, భూమిశిస్తు రూపంలో ధాన్యాన్ని తమ కాగుల్లో నింపుకునేవారు. దొరలకు గ్రామాలల్లో విశాలమైన గడీలు ఉండేవి. ఆ గడీల్లో

ఆడబాపలు, మగపనివారు ఉండేవారు. మగవారు గడీలను శుభ్రం చేయడం, ఆడబాపలు వంటలు వండి పెట్టడం, బాసాండ్లు తోమడం, దొరసానులు నిద్ర నుండి లేచినప్పటినుండి వారికి స్నానాలు చేయించడం వరకు విరామం లేకుండా పని చేసేవారు.

గ్రామాల్లో వివిధ వృత్తి పనివాళ్లుండేవారు. చివరికి చిన్నపాటి రైతులు కూడా దొరకు వెట్టిచాకిరి చేయడమే తప్ప ఏనాడు ఆ దొరను ఎదురించేవారు కాదు. ఒకవేళ దొర అకృత్యాలను భరించలేని యువకులు ఎదురు తిరిగితే, వారు దొరల కోపాగ్రహాలకు బలి అయ్యేవారు. ఈ విధంగా దొరలు, దేశ్ ముఖులు నిజాం నిరంకుశ పాలకుల అండదండలతో, నిజాంకు మద్దతు పలుకుతూ, రజాకార్లతో కలిసి వివిధ దోపిడీ, దౌర్జన్యాలలో పాలు పంచుకునేవారు. ఇది ఆనాటి గ్రామజీవనం.

నగర ప్రజల జీవనవిధానం : ఈ నవలలో కథ సగం నడిచిన తర్వాత గ్రామం నుండి పట్నానికి వెళు తుంది. గ్రామంలోని కథ సాయుధ పోరాటంతో కూడిన చారిత్రక స్వరూపంగా కనిపిస్తుంది. కాని పట్నంలో పోరాటం మాట వినిపిస్తుందే కాని, కనిపించదు. పట్నంలోని కథనంతా సాంఘికంగా చిత్రీకరించారు సుజాతారెడ్డి.

ఈ నవలలో కథ గ్రామం నుండి పట్నానికి వెళ్ళినప్పుడు హైదరాబాదు పాత బస్తీలోని ప్రజల జీవన విధానం కన్పిస్తుంది. హైదరాబాదు పాతబస్తీలో తరుచూ అల్లర్లు జరగడం పరిపాటియే! అర్ధరాత్రుల్లో హిందూ ముస్లింల మధ్య కొట్లాటలు జరిగి, ఎన్నో హత్యలతో అట్టుడికి పోయిన పట్నం, తెల్లారే సరికి కూలీలతో, చిన్నపాటి ఉ ద్యోగుల ప్రయాణరద్దీతో, రిక్షాలతో, వివిధ వాహనాలతో, వ్యాపారస్తుల దుకాణాల సందడితో మళ్ళీ రోజూ వారి విధానాన్ని కలిగి ఉండేది. నగరాల్లో ఒక్క రోజు పొట్ట కూటి కోసం శ్రమించే కూలి వాళ్ళు ఎంతో మంది కనిపిస్తారు. వివిధ రకాలైన మనుషులు మనస్తత్వాలు గలవారు ఉంటారు. పట్నంలోని వారందరూ గ్రామాల నుండి వలస వచ్చి జీవనాధారం పొందుతున్నవారే. పట్నంలో చిన్న చిన్న గదులు, సున్నం వెలసి ఇరుకుగా ఉండే అర్రలు రెండు కలిసి ఒక పోర్షన్ గా ఉండడం, నీటి కోసం మంచి నీటి నల్లాల వద్ద కొట్లాటలు వుండేవి. నగరం శబ్ద కాలుష్యం, వాయు కాలుష్యం, నీటి కాలుష్యం మొదలగు వాటితో వాతావరణం కలుషితమై ఉంటుంది. ఆ రోజుల్లో నగరంలో టాంగాలు ప్రయాణ సాధనాలుగా ఉండేవి. పట్నంలో మోసాలు ఎక్కువగా ఉంటాయని వింటాం. కాని అక్కడా మంచివారు స్నేహ పూర్వకంగా ఆదరించి, దారీ తెన్ను లేని వారిని గమ్య స్థానానికి తీసుకుపోయే కరీంబాయిలాంటి రిక్షా నడిపేవారు ఉంటారని సుజాతారెడ్డి పేర్కొన్నారు.

స్వాతంత్ర్యానంతర రాజకీయ పరిస్థితి : భారత స్వాతంత్ర్యానంతరం మొట్టమొదటిసారి 1952 లో ఎన్నికలు వచ్చాయి. ఈ ఎన్నికల్లో రాజకీయ నాయకులు బాగా ప్రచారం చేసి, ప్రజల ఓట్లను కైవసం చేసుకున్నారు. కాని నాటి కమ్యూనిస్టు ఉద్యమం ప్రభావానికి గ్రామ ప్రాంతాలలో నిలబడి గెలవడం చాలా కష్టంగా ఉండేది. గ్రామ ప్రాంతాలనుండి అన్ని పార్టీల్లో చాలా మంది ఎన్నికల్లో పోటీ చేయడానికి భయపడేవారు. బోలెడు ఖర్చు పెట్టినా, అక్కడి విప్లవ వీరుల ప్రభావం ఎక్కువగా ఉండడం వల్ల ఎన్నికల్లో నిలబడి గెలుస్తామనే ఆశలు నాయకుల్లో తక్కువగా ఉండేవి. ఈ నవలలో సుజాతారెడ్డి స్వాతంత్ర్యానంతరం జరిగిన ఎన్నికలను భూమికగా తీసుకొని నిజంగా పోరాటం చేసిన వాళ్లు కాక దాసులాంటి వాళ్లు రాజకీయలలో ప్రవేశించి, తద్వారా ఎన్నికలలో గెలిచి, ప్రజా పరిపాలనను ఎలా దుర్వినియోగం చేశారో తెలియజేశారు. ఎన్నికల ప్రచారంలో ప్రజలకు చేసిన వాగ్దాలను, ఎన్నికలు గెలిచిన తరువాత వాటిని మరిచిపోయి, తాము ఎన్నికల సమయంలో ఖర్చు పెట్టిన డబ్బును ఎలా రాబట్టుకోవడమా అని ఆలోచిస్తారే తప్ప, ప్రజా ప్రతినిధులుగా ప్రజలకేమైనా చేయాలన్న ధ్యాస వీసమెత్తైన ఉండదని పేర్కొన్నారు.

బాల్యంలో చూసిన సామాన్య ప్రజల జీవన స్థితిగతులు ముదిగంటి సుజాతారెడ్డి మనస్సులో చెరగని ముద్ర వేశాయి. దొరలు, దేశముల పాలన, వారి గడీల్లోని జీవన విధానం, వారు ప్రజలపై చేసే దోపిడీ దౌర్జన్యాలను కళ్ళారా చూశారు. ఈ నేపథ్యంతో కూడిన 'మలుపు తిరిగిన రథచక్రాలు' అనే నవలను రచించడంలో కృతకృత్యురాలయినారు. ఈ గ్రంథం 1994 జులైలో మొదటి ముద్రణ, 1998లో ద్వితీయ ముద్రణ పొంది పాఠకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసింది.

కథ

# చిత్రం

- ఈరంకి ప్రమీలారాణి

సాయంత్రం అయింది ఆఫీస్ నుండి లక్ష్మణరావు ఇంటికి వచ్చాడు.హాల్లో కుర్చీ లో ఆరిన బట్టలు వేసి మడతలు పెడుతోంది శాంత.భర్త వైపు ఒకసారి చూసి మాట్లాడకుండా తన పనిలో తనుంది.శాంత,ఆమె ధోరణి ఈ మధ్య అలవాటు అయింది కాబట్టి. లక్ష్మణరావు పట్టించుకోలేదు.''ఇదిగో శాంతా మా మేనత్త మనవరాలి పెళ్లిట మధ్యహ్నం ఫోన్ చేసి చెప్పింది మన ఇద్దరినీ నాలుగు రోజులు ముందే రమ్మంది.శుభలేఖ వాట్స్ ప్ చేసింది''

''ఇంకేం వెళ్లిరండి.''

''పిలిచింది మన ఇద్దరిని,''

''నాకు చెప్పలేదుగా.''

''నా ఫోన్ నెంబరు తెలుసుకాబట్టి నాకు ఫోన్ చేసింది,నీకు చెప్పమని మరీమరీ చెప్పింది.ఏం వెడదామంటావా.''అతనికి ఆ పెళ్ళికి వెళ్ళాలనే వుంది.

''చూద్దాం లెండి.''ఆమె అతనికి కాఫీతేవడానికి వెళ్లింది,అతనుకాఫీ తాగి వాకింగ్ కి బయలుదేరాడు. నిజానికిఅతనికి వాకింగ్ చెయ్యాలని పెద్ద కోరికేమీ లేదు. కానీ ఇంటిలో వుంటే శాంత ఎదో అంటుంది తనేదో అంటాడు,ఇద్దరికీవాద ప్రతివాదాలు.అందుకే అతను ఎదో వంకన బయటికి పోతాడు.ఇంతలో శాంత ఫోన్ మోగింది. అటునుంచి లక్ష్మణ్ మేనత్త కూతురు రాజ్యలక్ష్మి.తన కూతురు పెళ్ళని తామిద్దరూ రావాలని.''నా ఫోన్ నెంబరు నీకు ఎవరిచ్చారు.''

అడగకుండా ఉండలేకపోయింది శాంత.

''నీఫోన్ నెంబరు మా అమ్మ దగ్గర వుందిట ఇంతకు ముందే తనకి ఫోన్ చేసినప్పుడు అడిగి తీసుకున్నాను.''శాంత మనసులో ఎదో వేడి చల్ల బడ్డట్టు అయింది.మరోసారి పెళ్ళికి రమ్మని చెబుతూ ''ఆ మీ ఫ్రెండే అక్కా ఈ మధ్య పరిచయం అయ్యారు.సుహాసిని గారు నీకు గుర్తున్నారా.''

''సుహాసిని మీ ఊళ్ళో ఉందానీకెలా పరిచయం.''

''మా అమ్మాయి పెళ్లి చీరల మీద బ్లౌజ్ లకు ఆవిడే కంప్యూటర్ వర్క్ చేయిస్తున్నారు. మాటలమధ్యలో తెలిసింది ఆవిడా నువ్వు స్నేహితులని.నువ్వు పెళ్ళికొస్తే నిన్ను కలుసుకోవచ్చని ఆవిడ చాల సంబర పడింది.'' కాస్సేపు మాట్లాడి ఫోన్ పెట్టేసింది.

శాంత కు ఒకే ఆశ్చర్యం.చదువు తప్ప ఏమీ పట్టించు కోనీ సుహాసిని ఎంబ్రాయిడరీ చేయించడమా.సుహాసిని గవర్నమెంట్ లెక్చరర్ గా పని చేస్తోందని తనకు ఎవరో చెప్పారు. నిజానికి తన లాగే సుహాసిని కూడా రిటైర్ అయివుండాలి.అందుకే ఆదాయం కోసం ఇలా టైలరింగ్ చేస్తోందా....ఇదంతా తెలుసుకోవాలంటే తను పెళ్ళికి వెళ్ళాల్సిందే.శాంత కు కాస్త ఉత్సాహం,వచ్చింది. వాకింగ్ నుంచి వచ్చిన లక్ష్మణరావ్ కి ఇదంతా చెప్పలేదు రాజ్యలక్ష్మి పెళ్ళికి పిలిచిందని తను రావాలనుకుంటున్నానని చెప్పింది.''రక్షించింది'' అనుకున్నాడు లక్ష్మణ రావ్,ఆ రాత్రి తొందర గా నిద్రరాలేదు అతనికి. శాంత కూడా అంత తొందరగా

నిద్ర పోదని తెలుసు అయినా ఇద్దరి మధ్యా మాటలు ఉండవు.

ఆమెతో మాట్లాడాలంటేనే ఈ మధ్య భయంగా ఉంటోంది.అందుకే తను రిటైర్ అయినా డబ్బు తొ అవసరం లేకపోయినా ఎదో ప్రైవేటు జాబు లో చేరాడు.శాంత ఒకప్పుడు పేరు కు తగ్గట్టే శాంతం గా ఉండేది.ఆమె రిటైర్

అయినప్పటి నుంచి ధోరణి మారిపోయింది.ఎప్పుడూ ఏదో ఆలోచన,ఏమడిగినా విసుగు.వితండవాదన.పోనీలే ఈ పెళ్ళికి వెళ్ళే నప్పుడైనా తను మారితే బాగుండును,

★ ★ ★

అనుకున్నట్టు పెళ్ళికి రెండు రోజులు ముందే బయలుదేరిందిశాంత. లక్ష్మణరావు ను తన తో రమ్మని ఆమె బలవంతం చేయలేదు.తనకేదో ఆఫీస్ పని ఉందని పెళ్లి టైం కి వస్తానని చెప్పి ఆమెను ట్రైన్ ఎక్కించాడు లక్ష్మణరావ్. అతనికి తనతో రావడం ఇష్టం లేదని శాంతకు తెలుసు. ఆమె గ్రహించిందని అతనికి తెలుసు.

★ ★ ★

శాంత ట్రైన్ దిగేసరికి రాజ్యలక్ష్మి ,ఆమె భర్త కనిపించారు. వారి బంధుఅభిమానానికి సంతోషం అనిపించింది, కానీ వెంటనే లక్ష్మణ్ వీళ్ళని స్టేషన్ కు వెళ్ళమని చెప్పలేదుకదా అనిపించింది. ఇంటికి వెళ్ళాక పెళ్లి సందడి చాలా బాగా కనిపించింది. తనపెళ్లి విషయాలు గుర్తు కొచ్చాయి శాంతకు.''అక్కా రా టిఫిన్ తిందుగానీ.''అంటూ రాజ్య లక్ష్మి శాంతను తీసుకు వెళ్లింది.ఏముంది ఉప్మా, శాంతమనసులో విసుగు పడుతూతినసాగింది. ఎవరెవరో చుట్టాలు పలకరిస్తున్నారు.సగం మందిని గుర్తు పట్టలేకపోయింది.ఆమె లో ఎప్పుడూఉండే విసుగు మళ్ళీ కోంచెం బయటికి వస్తోంది. ఇంతలో ఒక కొత్త వ్యక్తీ ని వెంట బెట్టుకు వచ్చింది రాజ్యలక్ష్మి ''అక్కా ఈవిడను గుర్తు పట్టవాపేరు చెప్పు చూద్దాం.''అంటూ

''నీ ఫ్రెండ్ నాకెలా తెలుస్తారు రాజ్యలక్ష్మి.''

''ఊ అనుకుంటూనె వున్నా నన్ను మర్చిపోతావని.''సుహాసంగా నవ్వుతూ.అంది సుహాసిని,

''అయ్యో అక్కా ఈ విడ నీ ఫ్రెండ్ సుహాసిని గారు.

''ఆ అవునవును ఈ ఊళ్ళో వున్నారని చెప్పావు,''ఈ మాట తొ సుహాసిని, రాజ్యులక్ష్మి ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు,ఎన్ని రోజులకు కలుసు కు ం టున్నాము అంటే ఎవరైనా కాస్త వుత్సాహం చూపిస్తారు.

ఈ శాంత ఇలా వుందేమిటి,''ఇక్కడ మనంచేసే పనేముంది పద మా ఇంటికి పోదాం అంది సుహాసిని. రాజ్యలక్ష్మి తో చెప్పి ఇద్దరూ బయలుదేరారు

''ఇక్కడఆటోలు దొరుకుతాయా?''అడిగింది శాంత.

''ఆటోఅక్కర్లేదు.నేను కారు తెచ్చాను.''అంది సుహాసిని.

''నువ్వుకారు డ్రైవ్ చేస్తావా.''''ఆశ్చర్యంగాఅడిగింది శాంత.

''భయపడకు నిన్ను జాగ్రత్త గా తీసుకువెడతానులే ''అంది సుహాసిని

కారు చాలా దూరం ప్రయాణించి ఇంటిముందు ఆగింది.''వూరికి కాస్త దూరంలో వున్నారేం సుహాసిని,''

''ఇద్దరం రిటైరు అయ్యాక కాస్త ప్రశాంతంగా ఉందామని,''అంది ఇంటి తాళం తీస్తూ.

''ఇల్లు చాలాబాగుంది.సుహాసిని,ఇంట్లో ఎవరూ లేరేమిటి.''

''మా వారు వూరికి వెళ్ళారు,మాకు ఒకమ్మాయి పెళ్లి అయింది.వాళ్ళు బెంగుళూరు లో ఉంటున్నారు. అది సరే గానీ నువ్వు చాలా మారిపోయావు.''

'ఆహాఅదేంలేదు చాలా రోజులకు చూసావు కదూ అందుకే అలా అనిపిస్తోంది.''

సుహాసిని ఏదో అనబోయే లోపున ఆమె ఫోన్ మోగింది.''ఆ,,ఆ..అలాగే తప్పకుండా చేద్దాము.''అంటూ ఫోన్ పెట్టేసి ఇటు తిరిగింది. అప్పటిదాకా ఆమె ను చూస్తున్న శాంత చప్పున మొహం తిప్పుకుంది.''ఏమిటి అలా చూస్తున్నావ్.''

''ఏమిలేదు ''

''అంటే తప్పకుండా ఏదో ఉన్నట్టే''

''అలాఎందుకు అనుకుంటున్నావు.''

''నీలో ఏదో మార్పు కనిపిస్తోంది.నేను రాజ్య లక్ష్మి ఇంట్లో దాదాపు గంట వున్నాను నీలో ఏదో ఆలోచన ,పెళ్లింట్లో ఉన్నామన్న ఉత్సాహం ,ఆనందం నాకు కనిపించలేదు.''

ఆలోచిస్తున్నట్టుగా అంది శాంత''నిజమే సుహాసిని. నా కెందుకో ఎవరితో మాట్లాడలనిపించదు.ఏవో ఆలోచనలు వస్తూంటాయ్.''

''అంటే''

''చూడు ఇప్పుడు పెళ్లి వారిల్లు అంటే ఎక్కువ మంది ఉంటారు సులభంగా అయిపోతుందని ఉప్మా చేస్తారు అది నాకు విసుగు,,,,ఈ పని ఇలా కాకుండా ఇంకోలా చేయవచ్చుగా అని ప్రతి విషయం , అనిపిస్తుంది.అది నాకే కాదు నా పక్కనున్న

వాళ్ళని విసిగిస్తోంది.గతం లో నేను పొందిన విజయాల కంటే,కలిగిన వైఫల్యాలే ఎక్కువ గుర్తు కొస్తాయి.''

''ఎందుకు అలాటి ఆలోచనలు.......మీవారు నిన్ను ఏమైనా అంటారా పిల్లలు సరిగా లేరా.''

''అదేమీలేదు ఆయన సాధారణంగా నన్ను ఏమీ అనరు. పిల్లలు ఇద్దరూ స్థిర పడ్డారు.అబ్బాయి ముంబాయిలో,అమ్మాయి అమెరికాలో సెటిల్ అయ్యారు.''

''మరి బోర్ గా ఉంటే వాళ్ళ దగ్గర ఉండోచ్చు కదా.''

''అమెరికాలో ఆరు నెలలు ఉందామని వెళ్ళాము.అక్కడా ఏమీ తోచలేదు మూడు నెలల్లోనే తిరిగి వచ్చాము. ముంబాయి లో రెండు నెలలుఉన్నాము.నాకు ఉండాలనిపించలేదు.''

''వాళ్ళు మిమ్మల్ని బాగా చూడలేదా.''

''అయ్యో అదేమీ లేదు.బాగానే చూసుకున్నారు. అయినా దెబ్బలాడుకునేంత టైం ఎవరికీలేదు. నేనూ పిల్లలని పెంచుకుంటూ ఉద్యోగం చేసినదాన్నే.అందుకని మా కోడలు ఏదో చేయలేదని గొడవ పెట్టె మనిషిని కాదు.''

''అయితే ఏమిటి నీ ప్రాబ్లం''

''అదే తెలియదు''

''నేను చెప్పనా.''

''అదేగా అడిగేది.''

''ప్రేమ రాహిత్యం''

''ఈవయసులో నాకు ప్రేమేమిటి.''ఆ మాట తోనే శాంత మానసిక పరిస్థితి ఎలా ఉందో అర్ధమైంది సుహాసినికి.

''నేను చెప్పేది అందరూ అనుకునే ప్రేమ కాదు శాంతా,ఇంతకు ముందు నీ పిల్లలు చిన్నవాళ్ళు వాళ్ళకి ఏమీ కావాలో,ఎలా చదివించాలో ఇలా ,రెండోది నీఉద్యోగం మాట పడకుండాపని చెయ్యాలి,జాగ్రత్త గా ఉండాలి ఇలా,అయినాఆ వయసులో ఇంకా ఎంతోజీవితం వుంది ఏదోచెయ్యాలనే ఆశ ఉంటుంది.పిల్లల కు ఇప్పుడు పెద్దగా మన అవసరం ఉండదు. ఉద్యోగంచేసినన్నిరోజులుఅబ్బాఎప్పుడుఈఉరుకులు,పరుగులు లేకుండా ప్రశాంతంగా ఉందామాఅనిపిస్తూంది.....తీరా రిటైర్ అయ్యాక బోర్ అనిపిస్తుంది.''

''మరి నీకు అలా అనిపించదా.''మధ్యలోనే అందుకుని అంది శాంత,

''అందుకనే నాకంటూ ఒక ప్రపంచం సృష్టించుకున్నాను.''

అంటే''

''చూసావుగా కంప్యూటర్ఎంబ్రాయిడరి చేయించడం. కొంతమందికి చేతిలో స్కిల్ ఉంటుందిడబ్బు ఉండదు వాళ్ళ చేత ఇలా పని చేయిస్తానునాకు కాస్త కాలక్షేపం,వాళ్ళకి డబ్బు. నేనువృత్తిరీత్యా లెక్చరర్ ను కాబట్టి పేద ఆడపిల్లలకు చదువు చెబుతాను.ఇంట్లో పని ఉండనే ఉంటుంది.మంచి పుస్తకాలు చదువుతాను గొంతెత్తి చక్కటి పాటలు పాడుకుంటాను. ఇంకేమి కావాలి.''

''మనం ఈ వయసు లో కూడా ఇలా కష్ట పడటం అవసరమా''

''కష్ట మని ఎందుకనుకుంటావు శాంతా దేన్నేయినా మన చూసే భావనలో ఉంటుంది....పోనీ నువ్వు రిటైర్ అయ్యి మూడేళ్ళు అయింది అంటున్నావు ఇలా కాకుండా ఇంకోకలా ఆలోచించి ఏమైనా సాధించావా. '' శాంత ఏమంటుందోనని ఆగింది సుహాసిని. నిజమే శాంత లో ఆలోచన మొదలైంది. అర్ధం పర్ధం లేనిఆలోచనల తోలక్ష్మణ్ ను బాధ పెట్టింది.అతను కూడా ఎన్నడూ తనతో సమస్య ఏమిటి అని తెలుసుకుందుకు ప్రయత్నించ లేదు. అతనికి ఇంట్లోఏమీ తోచడంలేదని జాబ్ లో చేరాడు. టైం కి అతనికి టిఫిన్అని,భోజనం అని చేసి పెట్టడం తప్ప నీకేం కావాలి అని అతను అడగలేదు.పైగా ''గయ్యాళి''అని తనకి పేరు తగిలించాడు.

''ఇప్పుడు నన్ను ఏం చెయ్యమంటావ్ సుహాసిని.''

''నీ కంటూ ఒక ప్రపంచం నిర్మించుకో అప్పుడు నీతో నువ్వు మాట్లాడుకోవడానికి కూడా టైం ఉండదు.''శాంత ఆలోచిస్తూండిపోయింది.ఇంతలో సుహాసినికి మళ్ళీ ఫోన్.''అలాగే చేద్దాము...నాకు తెలిసిన మంచి ఆర్టిస్ట్ వున్నారు. ఆమె చేత చేయిద్దాము, ఆ మీరు సాయంత్రం రెడీగా ఉండండి. ఆవిడను పరిచయం చేస్తాను.....చూసావా శాంతా నువ్వు ఏదో చేయ్యాలనుకున్నవో లేదోఅప్పుడే ఒక క్లైంట్ దొరికింది''

''అయ్యో నాకేం తెలుసు సుహాసిని,,,అసలు ఏం చెయ్యాలి.''

''నువ్వు మొదట ఆ ఖంగారు తగ్గించుకో,నువ్వు డిగ్రీ లో ఎంత బాగా బొమ్మలు వేసేదానివి,ఇప్పుడు దాన్ని డేవలప్ చేసుకో.చీరల మీద పెయింటింగ్ దగ్గర నుంచి,ఫ్లిక్సి ల

పెయింటింగ్ వరకు చేయవచ్చు.''

''అమ్మో ఇప్పటికిప్పుడు అంటే ఎలా సుహాసినీ నాకు భయంగా వుంది అసలు ఎలా చేయాలో ఏమో.''

సుహాసిని నవ్వేసింది ''చూసావా ఒక పని అనుకుంటే మనకు తెలియకుండానే దానిలో కలిసి పోతాము,గాభరా పడకు ఫస్ట్ టైం కాబట్టి నేను చెబుతానులే కానీ సాయంత్రం వాళ్ళు వచ్చేవరకూ దీని గురిం చి అలోచించు.ఆ ఆలోచనఎంత బాగుంటుందో నీకే తెలుస్తుంది.

ఒక నిముషం ఆగి అంది. సుహాసిని,''నీకు తెలియదు శాంతా....నేను ఉద్యోగం చేస్తున్నప్పుడు గానీ తర్వాత గానీచాలా సమస్యలు ఎదుర్కొన్నాను.మా అత్తగారి సాధింపులు,నా జీతం మీద వాళ్ళ ఆశ విసిగిపోయాను. నా సమస్యల వల్లనే నేను మరో బిడ్డను కనడానికి కూడా ఇష్టం లేకపోయింది,ఆ మాట గుర్తుకొస్తే మనసు అదోలా అయిపోతుంది. కానీ గతం తలుచుకుని ఎంత కాలం బాధపడుతూ కూర్చుంటాము.అందుకే ఈ పనులన్నీ చేస్తున్నది. డబ్బు కొంచెం వచ్చినా మనశ్శాంతి ఎక్కువకలుగుతోంది. ఆ డబ్బు అనాధశరణాలయంలాటి వాటికీ ఇస్తూంటాను, నాకు కాస్త కాలక్షెపమ్,,,కాస్తసంఘసేవ.ఆ ఇప్పుడుఫోన్ చేసింది కూడా మీ రాజ్యలక్ష్మి గారే పెళ్లి లో వధూవరుల మధ్య వేసే తెర కు మంచి డిజైన్ కావాలిట. నువ్వు వేద్దుగానివి.''

''అమ్మో అలాటి పని నాకేం వస్తుంది, సుహాసిని బాగా లేకపోతే పెళ్లిలో అందరూ నవ్వుతారు.''


''అంత భయపడకు శాంతా నేను నీతో నే ఉంటాను. ఒక వేళ బాగా రాలేదనుకో మనమే ఆ ఖర్చు భరించి కొత్తది చేయిద్దాము.పెళ్ళికి ఇంకా రెండురోజులు టైం ఉందిగా.''

సుహాసిని కి మళ్ళీ ఫోన్ వచ్చింది.ఆమె మాట్లడుతూంటే శాంత ఆలోచనలు సాగిపోతున్నాయి.నిజమే ''సినిక్'' గా ఎన్నాళ్ళు బతుకుతుంది.తను చూసిన చిత్రాలు,పెళ్లి తెరలు గుర్తుచేసుకుం టోంది,,,శాంత,మొదటగా చేసే ఈ పని అందరి మెప్పు పొందాలి.ముఖ్యంగా పెళ్ళికి లక్ష్మణ్ వస్తాడు అతని చేత 'శభాష్''అనిపించుకోవాలి.''గయ్యాళి''అనే పేరు పోయి ఆర్టిస్ట్ ''అనే పేరు రావాలి.శాంత,.....సుహాసిని అందించి న తెల్లకాగితం,పెన్సిల్ చేతిలోకి తీసుకుంది.....

★ ★ ★

కవిత

# శిల్పి




వి. పద్మ
9951445867


తొమ్మిది నెలలు
మోసి, కన్నందుకే.... అమ్మ
తొలి అడుగుకు మెరుగులు దిద్దితే,
మలి అడుగు మార్పు దిశగా వేయిస్తే
ఆ అమ్మే... ఆదిశక్తి.

ఆమె శాంతి కాముక
జగడాలకు జంకి కాదు,
ఆమెకు ప్రళయాలు కొత్తకాదు,
ప్రళయం ప్రగతికి శూన్యమని
ప్రాణి కోటి వినాశనమని తెలుసు
ఆమె ... సర్వ ప్రేమిక.

ఆమె ఒక సృష్టి
ఆమె నుంచే ఈ సృష్టి
సర్వ శ్రేష్ఠత మనిషికిస్తే
మనిషే మారణహోమం సృష్టిస్తే
ఆమె తనువులో తెలియని గాయాలెన్నో!
ఆమె మోయలేని ఘోరాలెన్నో..!
ఆమె.. ఒక పునరుత్పత్తి శక్తి.

ఆమె జనని జాగరుకత తెలుసు...
జరాయువుతో జీవం పొయ్యటం తెలుసు..
జారిపోయే విలువల్ని పట్టి
జాగ్రత్తగా పసి గుండెలో పాతటం తెలుసు..
ఆమె... కాచే కల్పవల్లి.

ఆమె ధీశాలి
కదనరంగాన్ని కథలల్లోనే అల్లింది.
అవసరమైన విద్యలు నేర్పి
ఆయుధమై అండగా నిలిచింది
చిన్నారి శిలని శిల్పంగా మలిచింది
ఒకే గొడుగున నీడనిచ్చే
ఛత్రపతిగా చక్రవర్తిగా తీర్చిదిద్దింది
ఆమె.... ఒక చల్లని తల్లి.

కథ

# పునర్నవి



- బి. భవానీ

నేలమీద పడివుంది సీత. జుట్టు పట్టిలాగటంతో జుట్టంతా చెదిరిపోయింది. తలని రమణా రావు బలంగా గోడ కెసికొట్టడం వల్ల తల కుడివైపు చిట్లి రక్తం గడ్డ కట్టింది. బంగారుగాజులని మట్టి గాజులతో సహా లాగటం వల్ల చేతులు గీరుకుపోయినై. మెళ్ళోవున్న మంగళ సూత్రాన్ని నల్లపూసల్ని మెళ్ళోనుంచి బలంగా లాగటం మూలాన మెడమీద చీరుకుపోయింది. జుట్టు బాగా నొప్పిలేస్తోంది. కాళ్లతో పశువులాగా ఎక్కడ పడితే అక్కడ కుమ్మటం వల్ల నడముక్రింది భాగమంతా విపరీతమైన నొప్పి . వీపుమీద బలంగా చేతులతో కొట్టడంతో వీపంతా నొప్పి, నేలమీదనుంచి లేవలేక నిస్తేజంగా పడివుంది సీత.చాలాసేపు ఆమె ఒకరకమైన అచేతనావస్థలో ఉండిపోయింది.

రమణా రావు లో గొంతుకతో అంటున్న అసభ్యపు మాటలు, ఆమె విరగబాటు నవ్వులు సీత హృదయాన్ని తాకి ఛేదిస్తున్నాయి. . ఇది కలో నిజమో అన్న అయోమయంలో పడిపోతోంది. శరీరానికి తగిలిన గాయాలు జరిగిన .అమానుషాన్నీ నిజమే అని తెలియజేస్తున్నాయి. ఇంటికి దూరంగా పదేళ్లనించి బదిలీకి ట్రై చెయ్యకుండా అతను కాలం గడిపేస్తుంటే అనుమానంతో ఎన్ని సార్లు అడిగినా, విషయం దాటవేసేవాడు.. పదేళ్లనుంచి చేస్తున్న నిర్వాకం ఇది. సీతఎన్నిసార్లు నిలదీసినా దౌర్జన్యానికి దిగేవాడు తప్ప నిజం చెప్పేవాడు కాదు. ఎవరికకి చెప్పినా, నిలబడి న్యాయం చేసేవాళ్ళు లేరు. ముప్పైఏళ్ళ వైవాహిక జీవితంలో లభించని అనురాగం,గౌరవం కోసం అనేకసార్లు పోరాటం చేసి అలసిపోయింది.

కానీ ఇంత దౌష్ట్యానికి పాల్పడతాడనుకోలేదు. అక్రమ సంబంధాన్ని నిర్లజ్జగా ఇంటిదాకా తీసుకువచ్చాడు. ఇదేమిటి అని అడిగినందుకు ఈ దౌర్జన్యం.సీతకు దుఃఖం ఆగటం లేదు. ముప్పైఏళ్ళ వైవాహికి జీవితంలో అతని చేతిలో ఎన్నో అవమానాలు, చీత్కారాలు అనుభవించింది. పిల్లలు అనే బంధం కోసం అన్నీ భరించింది. అతని దృష్టిలో తానొక దిష్టిబొమ్మ. కాకిముక్కుకు దొండపండు.తన అందం చూసుకొని చాలా గర్వ పడేవాడు. ఆ అహంకారమే ఈ విధంగా పరిణమించిందా? ఈ అవమానాన్ని అమానవీయ ప్రవర్తనని భరించాలిసిందేనా?

. ఎవరు తనని ఆదుకొంటారు?

కొడుకు శ్రీకాంత్ గుర్తొచ్చాడు. కోడలు లావణ్య కలవారి అమ్మాయి. ఆమెకి ఎవరు రావటం, పోవటం భరించలేదు. శ్రీకాంత్ అత్తగారిచ్చిన బంగ్లాలోనే ఉంటున్నాడు. ,కూతురు కలవారి కోడలు. ఎప్పుడైనా చూడాలని అనిపించి వెళితే తనని, తనచీరలని అత్తగారింటి స్థాయికి తగినట్టులేవని మనసు గాయపడేలా మాట్లాడుతుంది. కూతురు పరాయి ఇంటిదైంది. ఆమెనుండి ఏ సహాయం ఆశించకూడదు అని తెలుసు సీతకు.

ఆమె మనసు రగులుతోంది. ముందే నరకంనుంచి బయటపడాలి. కొడుకు తప్పితే ఇంకెవరు దిక్కు?

అతికష్టమీద లేచి బాత్ రూంలోకి వెళ్లివచ్చింది. . రమణారావుకి తెలియకుండా దాచిన తన బాగ్ తీసుకుంది. అందులో తన టెన్త్ సర్టిఫికెట్ , ఆధార్ కార్డు, , తనని కొడుతున్నప్పుడు వీడియో రికార్డింగ్ చేసిన సెల్ ఫోన్ ,8000 వేలు వున్నాయి. .తాగి, విసురుగా తన రూంలోకి వచ్చినప్పుడే ఆన్ చేసింది. . నాలుగు రోజులుగా చేస్తున్న దమనకాండ అది. తన వైపు ఎవరు గట్టిగా నిలబడి సపోర్ట్ చెయ్యరని అతనికి తెలుసు. అందుకే ఆ రోజు రికార్డు చేసింది. ఎందుకు ఆ పని

చేసిందో ఆమెకే తెలియదు. నాలుగు గోడల మధ్య జరుగుతున్న ఈ అన్యాయాన్నీ బయటపెట్టాలి అన్న ఆలోచన ఎందుకో కలిగింది. తెల్లవారుఝాము నాలుగయింది. బిజీ ఏరియా కాబట్టి ఆటోలు తిరుగు తున్నాయి. మెయిన్ డోర్ చప్పుడు కాకుండా తీసి మళ్లీ తాళం వేసి బాగ్ లో వేసుకొంది డూప్లికేట్ తాళాలు దొరికిందాకా ఏడవాలి అనుకొంది కసిగా. .కొంగు తలమీదుగాలాక్కుని ఆటోని బస్ స్టేషనుకి పోనివ్వమంది.

రమణా రావు కొట్టిన దెబ్బలకి ఒళ్ళు పచ్చి పుండులా వుంది. మొహంమీద పడిన దెబ్బలకి కన్ను వాచింది. టికెట్ తీసుకొని సీట్లో జారగిల పడింది. కళ్ళనుండి ధారాపాతంగా నీళ్లు కారుతున్నాయి. ప్రక్క సీట్లో ఎవరూ లేకపోవడం తో నిశ్శబ్ద్యంగా రోదించింది. హైదరాబాద్ చేరేసరికి ఎనిమిదైంది. ఆటోలో కొడుకింటికి వెళ్ళింది.నాలుగు అంతస్తుల మేడ అది.. వాచ్ మాన్ పైకి తీసుకెళ్లి బెల్ కొట్టాడు. కోడలు లావణ్య వచ్చి తలుపు తీసింది. సీతని చూసిమొఖం చిట్లించి, వెంటనే వెళ్లి శ్రీకాంత్ ని లేపింది.

తల్లిని చూసి షాక్అయ్యాడు. ఏమైందమ్మా, ఏమిటీ దెబ్బలు?" జవాబుగా కొడుకుని పట్టుకొని భోరున ఏడుస్తూ జరిగిందంతా చెప్పిందిసీత.ఏమి మాట్లాడాలో తెలియక మౌనంగా వుండిపోయాడు శ్రీకాంత్.

. "పది ఏళ్ళనుండి ఈ భాగోతం గురించి తెలియదా నీకు? అంత అమాయకురాలివా నువ్వు? సిగ్గులేకపోతే సరి. మా అమ్మవాళ్లకి తెలిస్తే ఎం త పరువు తక్కువ?లావణ్య మాటలకు నివ్వెర పోయింది సీత.

శ్రీకాంత్ ఎంత వారించటానికి ప్రయత్నిచించినా లావణ్య ఊరుకోలేదు. "లేబర్ మనుషులు, లేబర్ బుద్ధులు అంటూ, భర్త కేసి తిరిగి " అమ్మవాళ్లకి తెలిసేలోపు, పంపించేయి " అంటూ లోపలికి వెళ్ళింది. కాసేపటికి శ్రీలేఖ సీతకి ఫోన్ చేసింది.సీతకి అర్ధమైపోయింది.కోడలు ఫోన్ చేసివుంటుందని. శ్రీలేఖ " అమ్మా, పోరాపాటునకూడా నువ్విక్కడకి వచ్చి నా పరువు తీయకు. " సీతకు గొంతు లుంగ చుట్టుకు పోయింది. " రాను లేమ్మా, భయపడకు". అంది.

లోపలనుంచి లావణ్య అరుస్తోంది," పదేళ్లనుండి సాగుతుంటే తెలుసుకోలేక పోవడం, అబ్బా, ఎంత అమాయకురాలివి, తల్లి, ఇంటికి తీసుకు వచ్చేసరికి రోషం వచ్చిందా?, సిగ్గు లేకపోతేసరి" అంటూ ఈసడించింది. శ్రీకాంత్ ఎంత ప్రయత్నించినా ఆమెని కంట్రోల్ చెయ్యలేక పోయాడు. లోపలికి వెళ్లి " కాఫీ అన్నా ఇవ్వు,కొంచం రెస్ట్ తీసుకోని,, ఈవెనింగ్ నేను తీసుకెళ్లి దింపేసి వస్తాను." లావణ్య ఇంకా గట్టిగ అరవసాగింది, సీత నెమ్మదిగా లేచి బయటకు వచ్చేసింది. శ్రీకాంత్ బయటకు వచ్చి చూసేసరికి సీత వేగంగా నడుస్తూ చాలా దూరం వెళ్లి పోయింది.

సీతకు అంతా అగమ్యంగా వుంది. ఎటు పోవాలి? ఇక అది తన ఇల్లు కాదు. ఆ ఇంట్లో మానాభిమానాలు మరచిపోయి బ్రతుకలేదు.

సెల్ మోగింది. రమణారావు" " కొడుకు, కోడలు వచ్చేసి నా కెదురు మాట్లాడతారని ఎగురుకొంటూ వెళ్ళావా? ఏ గతి లేదు నీకు, కుక్కలా పడి ఉండాల్సిందే? వెనకనించి ఆమె నవ్వు వినపడుతోంది, ఆ క్షణమే ఆమె నిశ్చయించుకుంది, ఏమి చెయ్యాలో.

బస్సు దిగి నేరుగా పోలీస్ స్టేషన్ కు వెళ్ళింది.స్టేషన్ సి ఐ వివరాలు రాసుకొంది. ఆమె తలమీద దెబ్బ, కన్ను వాచి ఉండటం, ఒంటిమీద కవుకు దెబ్బలు చూసి ఎక్కువ ప్రశ్నలు వేయకుండా జీప్ లో ఇంటికి తీసుకెళ్లింది. పోలీసుని చూడగానే విపరీతంగా భయపడి పోయాడు.రమణా రావు. ఇద్దర్ని స్టేషన్లో కూర్చోపెట్టారు. తాను అమాయకురాల్నని, భార్య చనిపోయిందని చెప్పి పెళ్లి చేసుకున్నాడని బుకాయించింది ఆమె. . రమణారావు అంతే, రెలెటివ్ అని, కష్టాలలో ఉందని ఎంత చెప్పినా సీత యాగీ చేస్తోందని చెప్పసాగాడు. అప్పుడు చూపించింది సీత ఒకవారం నుంచి అతను పెడుతున్న హింస, రాత్రి కొడుతుంటే తీసిన వీడియో రికార్డింగ్. ఇన్స్పెక్టర్ ఆశ్చర్య పోయింది. ఎంతో చదువుకొన్నా కూడా ఇంత తెలివిగా వుండరు.

తర్వాత చాలా కథ నడిచింది.సీత అన్నలిద్దరూ," ఏ ఆదాయం లేకుండా ఎలా బ్రతుకుతావు"అని నచ్చ చెప్పడానికిప్రయత్నిం చారు. ఆమెకు ఆశ్రయమివ్వాల్సి వస్తుందేమోనని వాళ్ళ భయం. పిల్లలిద్దరూ వచ్చి తమకు రావాల్సిన ప్లాట్స్, ఇల్లు గురించి ఎంత అడిగినా అంతా స్వార్జితం ఏమి ఇవ్వనని తేల్చి చెప్పాడు రమణా రావు. ఆమె తరుపున వాళ్ళు కూడా వచ్చి చాలా యాగీ చేశారు. రమణా రావుకి దిక్కు తోచటం లేదు. . పిల్లలిద్దరి కోపం తల్లి పైకి తిరిగింది. కేసు విత్ డ్రా చేసుకోవాలంటే విడాకులు కావాలి.

అతని ఆస్థి,డబ్బు ఏమి వద్దు, అంది సీత . అన్నా, వదినా పిల్లలిద్దరూ ఆమె నిర్ణయం విని నివ్వెరపోయారు

లావణ్య నోరు అదుపుచేసుకోలేక పోయింది," ఏమి చూసికొని నీకింత బలుపు, ఎవరి నెత్తిన ఎక్కుదామని? కొంపదీసి నీకుకూడా సెకండ్ సెటప్ లేదుగదా?" లావణ్య మాట పూర్తి అయిందొలేదొ సీత బలంగా ఆమె చెంప చెళ్లుమనిపించింది. సీత అపర కాళికలా కనిపించింది ఆందరికి, ఆమె ఉగ్ర రూపం చూసి రమణా రావు కూడా వణికి పోయాడు." నా గురించి ఇంత అసభ్యంగా మాట్లాడానికి నీకు నోరెలా వచ్చింది?, నేను నీ ఇంటికికానీ, నా కూతురు ఇంటికి కానీ రాను అంటే , నేను కూడా నీతి తప్పి బ్రతుకుతున్నానని నువ్వు డిసైడ్ చేసేసావు అన్నమాట". రమణారావు కేసి తర్జని చూపిస్తూ అన్నది. " వీడు చేసిన దగుల్బాలజి పని మీకు తప్పుగా అనిపించటం లేదు, నా మూలాన్నే మీకు ఇంత నష్టం కలిగిందని బాధ పడుతున్నారు. మీరు నా గురించి అసభ్యంగా పేలితే ఊరుకోను. నీ బతుకు సక్రమంగా ఉద్యోగం పోకుండా ఉండాలంటే నాకు విడాకులు ఇవ్వు. నీ పెన్షన్, డబ్బు ఏమి నాకు అక్కరలేదు. . పిల్లల కేసి తిరిగిఅన్నది , " వీడినించి మీకేమి కావాలో అది తీసుకోండి. నా జోలికి రావద్దు.వీడి అండ లేకుండా నేను బతకలేననుకోవద్దు." తననుంచి లాక్కొన్న బంగారాన్ని . తండ్రి పెళ్లప్పుడు ఇచ్చిన వంట సామాగ్రి, గ్యాస్ స్టవ్ ,సిలిండెర్ తీసేసు కుంది. బీరువాలోని పట్టు చీరలు ఆమె తీసేసు కుందని అర్ధ మైంది. తండ్రి ముందు చూపుతో పదేళ్ల క్రింద డిపాజిట్ వేసిన మూడు లక్షల డిపాజిట్ కాగితాలు అతనికి తెలియకుండా ముందే బాగ్ లో పెట్టేసుకొంది. పిల్లలు వెళ్ళాక సామాను తో సహా హైదరాబాద్ వెళ్లి పోయింది.

గాయత్రి వచ్చి సామాను అంతా రెండు గదుల వాటా లోకి మార్చటానికి సా యం చేసింది. చిన్న నాటి స్నేహితురాలు, అడిగిన వెంటనే పోర్షన్ ఖాళి చేయించి ఇచ్చింది.బ్యాంకు ఆఫీసర్ గాయత్రి. పెద్ద ఇల్లు. తోడుకోసం రెండు గదుల వాటాలు రెండు కట్టించింది. ఇప్పుడు వాటిల్లో ఒకటి సీత కోసం రెడీ చేసింది.గత రెండు నెలలనుంచి జరుగుతున్నదంతా గాయత్రికి తెలియ పరుస్తూనే వున్నది.

కొత్త జీవితాన్ని మూడు ఇళ్లల్లో వంటకు కుదరటం ద్వారా మొదలెట్టింది సీత. . పన్నెండు గంటలకల్లా పని ముగించుకొని ఇంటికి చేరుకొని రెస్ట్ తీసుకొనేది. తనకు అలవాటైన కుట్టు పని చేసేది.. ఐదు వేలు ఖర్చులకి పోయినా మిగతా డబ్బు దాచుకోవటం మొదలెట్టింది. సీతకు తాను ఒక ఐదు ఏళ్ళు ఆక్టివ్ గా పనిచేయగలదని తెలుసు. అందుకే డబ్బు విషయం లో చాలా జాగ్రత్తగా ఉండేది. గాయత్రికి సీత జీవితాన్ని మలుచుకున్న విధానం చూస్తే ఆమె నుండి చాలా నేర్చుకోవాలని అనుకోనేది.

నాలుగేళ్లు యిట్టె గడచి పోయాయి. సీత మనసులో ఏముంది తెలిసేదికాదు. ఎప్పుడూ పిల్లల ప్రస్తావన తెచ్చేదికాదు. ఆమె మనసు ఎంత గాయపడిందో? గాయత్రికి ఒంట్లో బాగా లేకపోతేనో, పండుగలకు, పబ్బాలకి పనిలో చాలా సాయపడేది. చిన్న కలర్ టీవీ కొనుక్కొని కాలక్షేపం చేసేది.ఒక రోజు గాయత్రి "నువ్వేమనుకోకపోతే ఒకటడుగుతాను సీతా, నిజం చెప్పు సీతా, పిల్లలు ఎలావున్నారో అనిపిస్తుందా నీకు, నేనేమైనా సాయం చేయగలనా" అని అడిగింది.

సీత నవ్వింది నిర్వేదంగా, " గాయత్రీ, వివేకానందుడు చెబుతాడు " ఒక మనిషి సహజ ప్రవృత్తి ఇరవై అయిదఏళ్లకే కొలనులో అలలు కేంద్రీకృతమైనట్టు అవుతుంది. ఇక ఆ నేచర్ మారదు. , మారాలని అని గట్టి ప్రయత్నం చేస్తే తప్ప. నా కోడలు, కూతురు, రమణా రావు లాగే స్వార్ధపరులు. . వాళ్లకి నా పట్ల ఎటువంటి ప్రేమ లేదు, శ్రీకాంత్ కు ఎప్పుడైనా నేను గుర్తుకొస్తాననుకొంటా. కానీ వాడు నిస్సహాయుడు. గుణమెరగకుండా భార్య ద్వారా స్టేటస్, డబ్బు వస్తుందని ఆశ పడి చేసుకొన్నాడు. ఇప్పుడు వాడు నాకోసం పోరాడాలని, భార్య తో విభేధించాలని నేను కోరుకోవటం లేదు. . పిల్లలు ఏ అమెరికాలోనే ఉంటే ఏమి చేస్తాం ? నాకు సరైన సమయయంలో నువ్వు చేసిన సాయం అయినవాళ్లెవరూ చేయలేదు. ఆఖరికి మా అన్న వదినా వాళ్ళు కూడా నాకు ఒక నెల నీడ ఇవ్వ టానికి వెనుకాడారు. నాకు నిరాశ లేదు, జీవితం ఇట్లా అయ్యిందే అన్న బాధలేదు. ఈ మాత్రం సాయం చేసేవాళ్ళు లేక ఎంతమంది నశించి పోతున్నారో? ఇప్పటికైనా నా జీవితం నాది అయ్యింది. గతం గురించి నేను ఆలోచించదలుచు కోలేదు. వర్తమానమే నాకు మిగిలింది. భవిష్యత్ పట్ల నిరాశ లేదు." గాయత్రీ లేచి సీతని గుండెకు హత్తుకొంది కన్నీళ్లతో అనుకోకుండా.

వ్యాసం

# శ్రామిక మహిళా దినోత్సవం



- సరోజన బోయిని

నేను పెద్ద,పెద్ద సదువులు సదవలే. నాకు తెలిసింది కాయ,కట్టం సేసుడు. అవ్! సేను సెలక పని సేసుడు. ఎండ, ఆన, సలి ఏది లేదు. పంట సేతికి అచ్చినంక గుప్పెడు మెతుకులతో అందరి కడుపు నింపాలే.. అగో గప్పడి దాకా.భూదేవర లెక్క...!

నాగళ్లతోని కడుపు సీల్చుకుంట దున్నుతా ఉంటే గా భూదేవర పానం ఎంత తండ్లాతుంది. అయిన గూడ గా తల్లి కడుపు కోసి ఇత్తులు నాటితే.. మన అందరిని బతికిచ్చుటానికి పంట నిత్తంది. గి భూమీ్మద ఉన్న పతొక్క జీవ రాసి గా తల్లి బిడ్డలే గా..

గందుకే ఎన్ని సేసిన గా భూదేవర ఓర్సుకుంటది. అగో గట్లనే నేను గూడ.

నాతిరనక, పగలనక  గట్ల ఎంబడి తిరిగే మమ్ముల ఏ పురుగు, బుషో కుట్టిన, కరెంటు మోటారులతోని మా ఇంటి పెద్ద పానాలు పొయ్యి  మా బతుకులకు కరెంటు షాక్ కొట్టిన.

మల్ల తెల్లారి పొలంకి పొయ్యి నాలుగు ఇత్తులు నలుగురి కడుపు నింపాలే అని మల్ల ఎవుసం సేసుడే.

ఇగ మేము ఎంత కట్ట పడ్డ ఒగో పారి పెట్టువడి సుత రాదాయే.. పెట్టువడి కోసం సేసిన అప్పు తీర్సు టానికి  పెయ్యి మీద నగలతోని తినే తలే,ముంత అన్ని తాకట్టు పెట్టుడునాయే.

ఇగ పండగకో, పబ్బానికో పెయ్యి మీద కొత్త బట్ట పేగు లేక పోయిన సినిగిన సీరెకు అతుకులు వెట్టుకొని కాలం ఎల్ల దీసుకొని అయిన మల్ల సేనుకు పెట్టువడి తెచ్చి పెట్టుడినాయే.. గియన్ని సేసిన దలారోని సేతుల బతుకు లేనాయే.. గాడు ఎంత ఇత్తె గంతకే పంటను అమ్ముడాయే.. గిన్నిటికి ఓర్సుకునేది.ఆకలి తోని అందరు కడుపు మాడి సావకూడదు అని.

గిన్నీ సేసిన నన్ను మాత్రం గి కాలీగం పట్టించు కోదాయే..

పెద్ద సదువులు సదివి, పెద్ద, పెద్ద కొలువుల సేసే టోళ్లనే మంచిగ సూసుకుంట గాళ్లను మేడం అని పిలుత్తరు, గాళ్ళు అత్తె లేసి నిలవడి అంగి, అంగి దండాలు వెడుతరు.

సదువు గొప్పదే..!కానీ గాళ్ళు బాగ సదివి కొలువు సేయాలి అన్న కడుపుల ఒసర ఉండాలి.కడుపు నిండు తేనె కదా ఓసర ఉండేది..గా కడుపు నింపే మమ్ముల ఇడిసిపెట్టి గాళ్లకు మాత్రమే సలాం కొడుతరాయే..

ఇగ ఇంత పార్టీలల్ల తిరిగి గండ్ల గెలిసిన అక్కల ముచ్చెట సెప్పుడే అక్కర లేదు.. ఏడికి పోయిన దండలు ఏసుడు దండాలు వెట్టుడు. ఎనకో నలుగురు ముందో నలుగురు గా అక్క పాణాలకు  కావాలి.

ఇగ నేను మా అవ్వ ఒడిల నేర్సిన భాష నే ముచ్చట సెప్తా.. గది అందరికి మనసున వడుతది కానీ గీళ్ళందరు ఏందో సదువు కున్నోల్లమ్ అని ఏదో పారాయి భాషల ముచ్చెట సెప్తే మా లాంటి ఒల్లకు ఎమ్ మనసున వడుతది.గాళ్ళు ఎమ్ ముచ్చెట సేప్పింద్రో కూడ తెల్వద్ ఇగ.

ఇగో గిట్ల నాలెక్క పొలం పని సేసే ఎవుసాయా కూలి, పొద్దంత ఇంటడు సారిగెమ్ సేసి తను తినకున్న ఇంట్ల కొలువు పోయే టోళ్లను ఆళ్ళు ఏది అడిగితే అది  అలిట్ట పడకుండ సేసి పెట్టే ఇంట్ల ఉన్న  అవ్వలు,అక్కలు..గీళ్ల కట్టం కూడ ఎవరికి పట్టింపు లేకపాయే..

"మహిళా దినోత్సవం" అని పేరు సెప్పి గా పెద్ద మనుషులను పెద్ద నౌకరి సేసే టోళ్లను, పార్టీలల్ల తిరిగే టోళ్లనే ఏదిక అని పెట్టి గాళ్లను పిలిసే సంబురంగా శాల్వాలు

కప్పుతారాయే..

గింత సేసిన మమ్ముల కింద కూసో వెట్టి గాళ్లకు సప్పట్లు కొట్టించు కుంటరు..

ఇగో పెద్ద మనుషులు, ఓ.పెద్ద పెద్ద అక్కలు జెరంత ఇగ నన్న మారుండ్రి..

మాకు మీ లెక్క తగిన గౌరవం ఇయిండ్రి..

★ ★ ★

అవును నిజమే కదా!

అసలు మహిళా దినోత్సవం అంటే ఏమిటీ ఘనంగా వేడుకలు జరుపుకుని సాలువలు కప్పుకోవడమేనా?

మహిళా దినోత్సవం అసలు ముందు ఎక్కడ జరుపుకున్నారు?

దాని ఉద్దేశం ఏమిటి?

అంతర్జాతీయ మహిళా దినోత్సవంను మొదట మహిళా శ్రామిక దినోత్సవంగా పిలిచేవారు.

తక్కువ పనిగంటలు సమాన పనికి సమాన వేతనం,మహిళల హక్కుల కోసం పోరాటం చేయడానికి సుమారు 100 సంవత్సరాల కన్న ముందే ఈ దినోత్సవాన్ని జరుపుకున్నారు.

ముందు ఈ దినోత్సవంకు బీజం పెద్దది 1908 లో తక్కువ పనిగంటలు,మెరుగైన జీతం ఓటు హక్కు కోసం ముందు న్యూయార్క్ సిటీలో 15 వేల మంది ప్రదర్శనలు చేశారు.

వీరి డిమాండ్లను దృష్టిలో పెట్టుకొని సోషలిస్టు పార్టీ 1909 జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రకటించింది.

ఈ దినోత్సవాన్ని అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించాలి అన్న ఉద్దేశంతో "క్లారా జెట్కిన్ "అనే మహిళా "కోపెన్ హెగ్ నగరం "లో 1910 లో జరిగిన "ఇంటర్ నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ వర్కింగ్ ఉమెన్" సదస్సులోఈమె ప్రతిపాదన చేశారు. 17 దేశాల నుండి ఈ సదస్సుకు హాజరు అయిన100 మంది మహిళలు "క్లారా జెట్కిన్" ప్రతిపాదనను ఏకగ్రీవంగా అంగీకరించారు.

అలా అంతర్జాతీయ మహిళా దినోత్సవం మొదట 1911 కొన్ని దేశాలలో నిర్వహించారు.

దీనిని ఐక్యరాజ్యసమితి కూడ గుర్తించి ఏటా నిర్వహిస్తోంది.

★ ★ ★

"మార్చి 8 "న నిర్వహించుకునే ఈ దినోత్సవం కార్మిక సంఘాల నుండి పుట్టుక వచ్చింది.

కానీ ఇప్పుడు ఈ దినోత్సవాన్ని వేడుకలకు మాత్రమే పరిమితం చేస్తున్నారు..

సభలు నిర్వహించుడు సన్మానాలు చేయించు కోవడం కాదు.

ఈ దినోత్సవం బీద మహిళ ఉన్నతి కోసం పోరాటం చేసేది గా ఉండాలి.

చదువు ప్రతీ మాహిళకు ఉండాలి చదువు తో మహిళా సాధికారత సాధించాలి.

చదువు వ్యక్తిత్వాన్ని, గౌరవాన్ని,మనిషి హోదాను పెంచేదిగా ఉండాలి.

చదువుతో హోదా ,గౌరవం పొందవచ్చు.ఉన్నత స్థాయికి ఎదగవచ్చు.

కానీ చదివిన ప్రతీ మనిషికి ఉద్యోగం సాధ్యమా?

కేవలం చదువు కున్న వారి కోసం కాకుండా శ్రమను నమ్ముకున్న వారి కోసం ఈ దినోత్సవం జరుపుకోవాలి..

కానీ ఎక్కడి వేడుకలో చూసిన ఇలాంటి వారు ఎక్కడ కనబడుతున్నారు.వారిని గౌరవంగా వేదిక మీద పిలిచి వీరి శ్రమకు తగిన గౌరవం ఇస్తున్నారు..

ఒక వృద్ధ మహిళా అనుభవాలను ఎవరు చెప్పిస్తున్నారు.. జీవిత సారం వాళ్ల దగ్గర నేర్చుకోవాడానికి ఇలాంటి వేదికలు అవసరం కానీ వారికి అవకాశం ఇచ్చేది ఎవరు .

ఒక రైతు మహిళా, ఒక సపాయి మహిళా, ఒక కూలి మహిళా ,కూరగాయలు అమ్మే వాళ్లు, ఇంటెడు పని చేసే గృహిణి వాళ్ళ శ్రమ గురించి వాళ్ల అనుభవాలను పంచుకుంటూ..

పితృస్వామ్య వ్యవస్థ లో మహిళలకు పురుషులతో సమానంగా హక్కులు,వారితో సమాన మైన స్వేచ్ఛ కోసం పోరాటం చేస్తూ ఇప్పడికి మహిళల పట్ల గల ఆధిపత్య ధోరణి, అరాచకాలకు అడ్డుకట్ట వేయడానికి పోరాటం చేయాలి.. గాని ఈ దినోత్సవం కేవలం వేడుకల కోసమే కాకూడదు.

కథ

# నువ్వునాకునచ్చావ్



కోటమర్తి రాధాహిమబిందు
Phone no:7780188651

"వచ్చారా సార్..మీ కోసమే చూస్తున్నా" అంటూ కనకం బండి క్రింద పెట్టిన కూరగాయల కవరు వామనరావుకు అందించింది.

"ఎంత?"

"వన్ ట్వంటీ రూపీస్"

"ఇదిగో" జేబు నుండి పర్సు తీసి వంద కాగితం ఏభై కాగితం కలిపి ఇచ్చాడు వామనరావు.

"నా దగ్గర మీవి ముప్పయి రూపాయలు వుంటాయి సార్" చిరునవ్వుతో చూసింది కనకం.

"ఎప్పుడూ ఈ లెక్కలేనా.. గణేష్ ఫీజ్ కట్టావా"

"కట్టాను సార్.. త్వరలో మీ డబ్బు తిరిగి ఇచ్చేస్తాను"

"మళ్లీ మరోసారి చెప్పాలా? అదే నచ్చదు నాకు.. మనిషికి మనిషి సహాయం చేసుకోకపోతే ఎలా? గిరిజకు జ్వరం తగ్గిందా?"

"తగ్గింది సార్"

"సరే.. డబ్బు కావాలంటే అడుగు మొహమాట పడకు"

"తప్పకుండా సార్" చేతులు జోడించింది కనకం. కనకాన్ని చిరునవ్వుతో ఒకసారి చూసి బైక్ పై వెళ్ళిపోయాడు వామనరావు.

★ ★ ★

వామనరావు రిటైరై పన్నెండు సంవత్సరాలు అయింది. భార్య పేరు భవాని. పిల్లలు ఇద్దరూ ఆస్ట్రేలియాలో స్థిరపడ్డారు వాళ్లకూ పిల్లలు. వామనరావు ఆఫీసర్ గా రిటైర్ కావటంతో మంచి పెన్షన్ వస్తుంది. కొడుకు కోటి రూపాయలతో ఇల్లు కొనటంతో ఉంటున్న ఇల్లు అద్దెకు ఇచ్చి కొడుకు కొన్న ఇంటికి మారాడు.. చేతిలో కారు.. దగ్గర్లో తిరగటానికి బైక్.. కూరగాయలు కొనటానికి వెళ్ళినప్పుడు కనకం పరిచయమైంది. మొదట్లో ఆమె ఎవరో తను ఎవరో అన్నట్లుగా వున్నా పది నెలలుగా ఆమె విషయాలు తెలుసుకుంటూ ఆమె మనసుకు దగ్గరయ్యాడు. ఆమెకు డబ్బు పరంగా చిన్న చిన్న సహాయాలు చేస్తూ ఆమె సొంత విషయాలు కూడా కనుక్కునే చనువు పెంచుకున్నాడు. కనకం భర్త వెంకటేశ్వర్లు ఆటో నడుపుతాడు. వామనరావుకు కొద్దిగా పరిచయం. ఎప్పుడైనా కనకం దగ్గర కనిపించినప్పుడు మాట్లాడేవాడు.

"సార్.. ఇంట్లో మీరు ఇద్దరే కదా.. వారానికోసారి కూరలు తీసుకోవచ్చు కదా? రోజూ రావటం ఎందుకు?" ఒకరోజు అడిగింది కనకం.

"రిటైర్ అయ్యాను కదా..నాకూ టైంపాస్ కావాలి ఇలా ఒక రౌండ్ వస్తే నిన్ను చూసినట్లు వుంటుంది..తాజా కూరగాయలు తీసుకోవచ్చు"

"అంతా మీ అభిమానం సార్..మీరు ఎవరో..నేను ఎవరో..నా పరిస్తితి తెలుసుకొని నాకు అండగా ఉంటున్నారు" చెమర్చిన కళ్ళతో చేతులు జోడించింది కనకం.

"మళ్లీ మొదలు పెట్టావా పొగడ్తలు.. వద్దులే..సరే మరి నేను వెళ్లిరానా? పండుగ వస్తుంది కదా బట్టలు కొనుక్కోవడానికి డబ్బు ఉందా?"

"నిజం చెప్పాలంటే పిల్లలు కొత్తబట్టలు అని గొడవ పెడుతున్నారు సార్.. కానీ కొనమని చెప్పాం"

"పిల్లల మనసుల్ని నొప్పించడం ఎందుకు కనకం.. అసలుతో పాటు వడ్డీ తీసుకోమంటానులే.. అప్పుడైతే నీకు.."

"తీసుకోండి సార్.. అలా అయితే నాకూ హాయి.. బిడియంగా ఉండదు"

"బిడియం ఎందుకు..ఇంకా నన్ను పరాయిగా అనుకుంటున్నావా?"

"లేదులెండి సార్..దేవుడు మిమ్మల్ని ఎందుకు పరిచయం చేశాడో గానీ మాకు చాలా మంచిది అయింది"

"ఇక్కడకు వస్తే పోబుద్దేకాదు కనకం నీ మాటలు అలా కట్టి పడేస్తాయి నన్ను.. మీ అమ్మగారు నాకోసం కంటే కూరలకోసం ఎక్కువగా ఎదురు చూస్తారు..వెళ్తాను" అంటూ వెళ్ళిపోయాడు వామనరావు.

★ ★ ★

"ఏమండీ.. పండగ వస్తుంది..ఇల్లు క్లీన్ చేయటానికి ఎవరినైనా చూడండి. మన పనిమనిషి పండుగకు ఊరికి వెళ్తుందట" పొద్దున్నే అడిగింది భవాని.

"నేను కూరగాయలు తీసుకుంటా కదా కనకం అని.. ఆమె ఎవరినైనా కుదిరిస్తుందేమో అడుగుతాను" అంటూ కనకానికి ఫోన్ చేసాడు.

"వేరే ఎవరో ఎందుకు సార్..నేను వస్తాను లెండి" అంటూ చెప్పిన ప్రకారం సాయంత్రం వేళ వచ్చింది.

"భవానీ..నీకు చెప్పానుగా కనకం అని..టెన్త్ పాసైంది చాలా మంచి మనసున్న వ్యక్తి" అంటూ భార్యకు పరిచయం చేశాడు. కనకం పనులు చేస్తుంటే తాను కూడా సహకరించాడు వామనమూర్తి.. కనకం వెళ్లేముందు ఐదువందల రూపాయలు ఇవ్వబోయాడు.

"అమ్మో వద్దు సార్.. మనిషికి మనిషి సహాయంగా ఉండాలని మీరే కదా అన్నారు. మీరు మాకు చేస్తున్న సహాయాల్లో ఇది ఏపాటిది?" అంటుంటే భవాని వచ్చి భర్త చేతి నుండి ఐదువందలు తీసుకుని చనువుగా కనకం చేతిలో పెట్టింది. రెండు నెలలు గడిచాయి. వామనరావు కనకానికి ఫోన్ చేసి ఇల్లు క్లీన్ చేయడానికి రమ్మన్నాడు. వచ్చింది కనకం.

"అమ్మగారు ఊరెళ్ళారు.. రావటానికి రెండురోజులు పడుతుంది. ఆస్ట్రేలియా నుంచి పిల్లలు వస్తున్నారు ఇరవై రోజులు ఉంటారు. నువ్వు అప్పుడప్పుడూ వచ్చి అమ్మగారికి సహాయంగా వుండాలి"

"ఇంతగా అడగాలా సార్.. తప్పక వస్తాను"

పనులు చేస్తున్న కనకానికి తోడుగా ముచ్చట్లు పెడుతూ తానూ సహాయ పడ్డాడు. కనకం వద్దంటున్నా కాఫీ చేసి ఇచ్చి తనూ తాగాడు.

"తర్వాత మిగతా పని చేద్దువుగాని నీతో కాస్త మాట్లాడాలి అలా కూర్చో కనకం"

"ఫర్వాలేదు చెప్పండి సార్"

"కనకం.. నువ్వు నాకు చాలా నచ్చావు. ఎన్నో రోజులుగా ఈ విషయం నీకు చెప్పాలని నా మనస్సు ఆరాట పడుతుంది.. నీపై నాకు ఉన్న ఇష్టం రోజు రోజుకు పెరిగిపోతుంది. నిజం చెప్తున్నాను.. రాత్రివేళ నిద్రపట్టడం లేదు.. నీ రూపం నీ మాటలు నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. నీ దగ్గరికి వస్తే ఇంటికి రాబుద్ది కావడంలేదు. నేను వచ్చేది కూరల కోసం కాదు నీ కోసం నిన్ను చూడటం కోసం" అంత దగ్గరగా నిలబడి ఆర్తిగా చెబుతున్న వామనరావును చూసి విస్తుపోయింది కనకం.

"కనకం.. ఈ విషయం నీకు చెప్పకుండా రోజులు వెళ్ళదీయటం నాకు చాలా కష్టంగా వుంది" అంటూ చేయి పట్టుకోబోయాడు. క్షణకాలం ఉలిక్కిపడి గభాలున రెండు అంగలు వెనక్కు వేసింది కనకం.

"అర్థం అయింది సార్.. ఇంకా మీరు నాకు ఏం చెప్పకండి.. అంటే.. నేను మీకు కావాలి.. అంతేనా"

"కనకం" ఆనందంతో కూడిన అయోమయం అయింది వామనరావుకు. కళ్ళు మతాబుల్లా వెలిగాయి.

"సార్.. ఎందుకు సార్ నన్ను మీరు ఈ దృష్టితో చూశారు? మీ మనసులో నేను ఉండేలా నేను ఏదోలా

ప్రవర్తించానా? నన్ను అంత తక్కువగా హీనంగా ఎందుకు అంచనా వేశారు? సార్.. మీలో చనిపోయిన మా పెద్దన్నయ్యను చూసుకున్నాను"

"కనకం.. ఇలాంటి మాటలు నాకు చెప్పకు.. ప్లీజ్.. నా మనసు బాధ పెట్టకు"

"సార్" కనకం కళ్ళనిండా కన్నీళ్లు నిలిచాయి.

"కనకం.. నీకు ఎంత డబ్బైనా ఇస్తాను.. నీకు ఎప్పటికీ అండగా ఉంటాను" బ్రతిమాలుతున్న ధోరణిలో అన్నాడు వామనరావు.

"సార్..నన్ను ఒక చెల్లెలిగానో..కూతురుగానో చూస్తున్నారని అనుకున్నాను. అందుకే మీతో అంత ఆపేక్షగా మాట్లాడాను"

"అవునా..ఇప్పటినుండి మరోలా చూడు..ఈ క్షణం నుండి ఇంకోలా ఆలోచించు"

"మీరు పిలవగానే నేను వచ్చి మీ కోరిక తీరుస్తానని ఎలా అనుకుంటున్నారు? మాకు నీతి న్యాయం ధర్మం అంటూ ఉండవా? మాకు బంధాలు అనుబంధాలు సంబంధాలు అంటూ ఉండవా? మాకూ సంసారాలు వుంటాయి.. ప్రేమలు వుంటాయి. డబ్బు కోసం ఒళ్లు అమ్ముకుంటామా? మీలో ఇంత మురికి ఆలోచనలు ఉన్నాయనుకోలేదు. సార్.. ఇంకెప్పుడు పరాయి ఆడవాళ్ళ గురించి ఇంత నీచంగా ఆలోచించకండి"

"ప్లీజ్.. ఇంకేం చెప్పకు.. ఎదుగూ బొదుగూ లేని నీ జీవితాన్ని ఒక్కసారిగా మార్చి వేస్తాను.. మీ ఆయన సంపాదనతో మీకేం సుఖం వుంటుంది?"

"సార్ చెప్పింది ఇక చాలు.. ఆపండి.. మా గురించి మీకేం తెలుసు అని ఇలా మాట్లాడుతున్నారు? నేను మా ఆయన కొన్ని సంవత్సరాలు ప్రేమించుకుని పెళ్లి చేసుకున్నాం. మాది అన్యోన్యమైన కాపురం. నేనన్నా పిల్లలన్నా ఆయనకు ప్రాణం.. మీరు డబ్బు ఆశగా చూపించి ఈ దుర్బుద్ధి పెట్టుకుని ఏదేదో అడగటం అత్యంత అసహ్యకరంగా ఉంది. మనిషికి మనిషి సహాయపడటం అంటే ఇలా కూడా వుంటుందా సార్? మీ పిల్లలు చాలా ప్రయోజకులు అయ్యారు ఆనందపడండి. మీ భార్య దేవతలాంటి మనిషి మీరు బాగుండాలని పూజలు ఉపవాసాలు చేస్తారు. వాటిపై మీరు దృష్టి నిలపండి. అంతేలేండి సార్.. అన్ని విధాలా సుఖంగా ఉన్నప్పుడు ఇలాంటి ఆలోచనలే వస్తాయి. తప్పుడు మార్గాల వైపే తెలిసి నడుస్తారు.. సార్.. రేపు ఒకసారి.. చివరిసారిగా నా దగ్గరకు రండి..మీరు నాకు ఇచ్చిన డబ్బు వడ్డీతో సహా ఇస్తాను"

"కనకం"

"మీరంటే అసహ్యం వేస్తుంది సార్.. ఇదే మీ అమ్మాయిని మీ కోడలిని ఇలా ఎవరైనా అడిగితే మీకు ఎంత కోపం వస్తుంది? ఎంతగా మండి పడతారు? ఇప్పుడు మా ఆయనకు ఒక్క ఫోన్ చేస్తే చాలు వందమందిని తీసుకుని వస్తాడు. మీ భరతం పడతాడు. పోలీసులు మాకు బాగా తెలుసు. ఎస్ ఐ

వరప్రసాద్ గారు నా దగ్గరే కూరగాయలు కొంటారు.. వారికి చెప్పానంటే మీ అంతు తేలుస్తారు..ఇదా మీ అసలు రూపం? మీ వయసుకు తగ్గట్లుగా మీ స్థాయికి తగ్గట్లుగా మీ బుద్ధితీరు ఉండాలి.. డబ్బు ఆశ పెట్టి అధికారంలేని పెత్తనం చెలాయించి ఇలా మానవ మృగంలా ప్రవర్తించబోయారు. సార్..మీరెంటో తెలిసింది. వెళ్తున్నాను. మీ నీచపు ఆలోచనలు మానేసి అమ్మగారిని ప్రేమగా చూసుకోండి. రేపటిరోజున మీకు ఏమన్నా అయితే సేవలు చేసేది మీ భార్యే.. మీ బుద్ధి ఇలాంటిది అని తెలిస్తే మీకు విడాకులు ఇచ్చే మనస్తత్వం వారిలో వుంది.. జాగ్రత్తగా మిమ్మల్ని మీ కుటుంబాన్ని కాపాడుకోండి. తాత్కాలిక ఆనందాలకు కోరికలకు ఆమడ దూరంలో ఉండండి. మీ భవిష్యత్తుకు అది చాలా మంచిది" అంటూ తలుపు తీసింది కనకం. కాలింగ్ బెల్ నొక్కబోతున్న వెంకటేశ్వర్లు కనకాన్ని చూసి చిరునవ్వు నవ్వాడు.

"అయిందా ఇల్లు క్లీన్ చేయటం?"

గుమ్మం దాకా వచ్చిన వామనరావు కనకం ఏం చెబుతుందా అని చూసాడు.

"పూర్తిగా దుమ్ము దులిపి శుభ్రం చేశాను" వామనరావునే సీరియస్ గా చూస్తూ అంది కనకం.. అసలే కనకం మాటలతో కుంచించుకుపోయిన వామనరావు ఇంకా కుంచించుకుపోయాడు.

కథ

# అలనాటి తెలుగు ఇల్లాలు



- లంక సీత,
(M) 9868145541

తూరుపు తెల తెల వారుతోంది ! వెలుగు రేఖలు విచ్చుకుంటున్నాయి.!

ఇంటి ఇల్లాలు నిద్ర లేచి, వాకిలి తలుపు తెరిచింది. వీధి వాకిలి చీపురుతో చిమ్మి, కళ్ళాపు జల్లింది. ముద్దులొలికే ముగ్గులు పెట్టింది.

"ఏరా! వెంకా!ఇప్పుడట్రా రావడం? తెల్లారిపోవడం లేదూ! ఊఁ త్వరగా పో! గొడ్ల దగ్గర కసువు ఊడ్చేసి పెంటపోగు మీద పడేయ్. వామిలోంచి గడ్డి తెచ్చి వాటి ముందెయ్యి ! గేదెలకు కుడితి పెట్టు!. ఈ లోగ నేను చేతులు కడుక్కొచ్చి పాలు తీస్తా". అంటూ పన్నెండేళ్ల గొడ్ల కాడ బుల్లోడికి పనులు పురమాయించింది.

క్షణం లో పళ్ళు తోముకుని చేతులు శుభ్రం చేసుకుంది. బిందె లో పాలు పితికి ఇంట్లో పెట్టింది. "ఒరే వెంకా ! నేనొచ్చేలోగా దాలి గుంట లో పిడక లేసి నిప్పు రాజేyyi. తెలిసిందా" అంటూ ముఖానికింత పసుపు రాసుకుని, సున్నిపిండి పళ్లెం లో వేసుకుని స్నానాల గది కి చేరింది. వంటికి నలుగు పెట్టుకుని, కుంకుడుకాయ రసంతో తలారా స్నానం చేసి వచ్చింది. రాజుకున్నదాలి పొయ్యిమీద పాల కుండ పెట్టింది. గుంజకు కట్టిన కవ్వంతో పెరుగు చిలికి వెన్న తీసింది . అప్పటికి సూర్యుడు ఉదయించి పై కి వచ్చేసాడు.

"పిల్లలు! లేవాలి! లేవాలింక ! లేచి మొహాలు కడుక్కుని స్నానం చేద్దురు గాని. వూ త్వరగా!" అంటూ పిల్లలిని లేపి మొహాలు కడిగించి స్నానాలు చేయించి ఉతికిన బట్టలు తొడిగింది. చద్దన్నం పెట్టింది. పలకా, పుస్తకాలు యిచ్చి అయ్యవారింటికి చదువుకోను పంపించింది.

"ఏమయ్యోయ్! నీ పనులన్నీ తెమిలియా"? అంటూ భర్త ని ఓ కేక వేసింది. "అదిగో ఆ గిన్నె లో తరవాణి ఓణ్ణం వుంది , గూట్లో పిడత లో మాగాయ ముక్క నంజుకుని త్వరగా కానివ్వు. ఇవ్వాళ్ళన్నా ఆహోటల్ షావుకార్ని డబ్బడిగి పట్రావాలి. రోజు పాలబిందెట్టుకెళ్ళి పాలోసొచ్చేయడము కాదు . వారానికోసారైనా పైకం అడిగి తెస్తావుండాలి ! ఇంటన్నావా?" అంటూ మొగుడికి బోధ చేసింది.

పాలబిందె తీసుకుని మొగుడు పట్నానికి బయలుదేరాక, పొయ్యి రాజేసి అడ్డెడు గిన్నె లో ఎసరుకు నీళ్లు పెట్టింది. ఏరి పెట్టుకున్న యెర్రని దంపుడు బియ్యం ఎసట్లో పోసి ఓ ఉడుకు రానిచ్చి గంజి వార్చింది. ఆ పైన అన్నం గిన్నె దింపింది.

"ఒరేయ్ ! వెంకా ! .పాక పైకెక్కి సొరకాయేమన్న ముదురుతోందేమో చూసి కోసెయ్యి. ఆ చేత్తోనే ఆ వంగ మొక్కల్నొంచి ఓ పది కాయలు తుంపుకొనిరా !" అంటూ కేకేసింది .

పొయ్యి మీద ఉడుకు నీళ్ల కుండ దించి వంకాయ కూర వేసింది. సొరకాయ ముక్కలపులుసు పెట్టింది. సూర్యుడు నడి నెత్తి కొచ్చేసరికి పట్నంనించి తిరిగొచ్చిన భర్త స్నానానికి ఉడుకు నీళ్లిచ్చింది.

భర్తకి అన్నముపెట్టి, తానింత తింది. ఈలోగా స్కూల్ నుంచి పిల్లలొచ్చారు. అన్నాలు తిని ఆడుకుందుకు

వెళ్లిపోయారు.

"ఏం మంగమ్మోదినా! భోజనాలయినట్టేనా ? అంటూ నలుగురైదుగురు ఇరుగు పొరుగు ఇల్లాళ్లు వచ్చి చేరారు. " రండి! రండి!" అంటూ వాళ్ళందర్నీ ఆహ్వానించింది.

ఇదిగో! ఏమయ్యోయ్! ఏంచేస్తున్నావ్ ? ఆదొడ్లో బాదాం ఆకుల్ని కోసి యిక్కడ పడేయ్! ఇంట్లో అడ్డాకులైపోయాయి " అంటూ మొగుడికి పని పురమాయించింది.

ఈలోగా ఓ ఇల్లాలు పెట్టె రాట్నం తెరిచి " పాడవే రాట్నమా ప్రణయ భారత గీతి" అంటూ నూలు దారం తీయడం మొదలుపెట్టింది.


నలుగురూ కలిసి కొబ్బరీనెలు సన్నగా చీల్చారు . కూని రాగాలు తీస్తూ ఆకబుర్లు ఈకబుర్లు చెప్పుకుంటూ విస్తళ్ళు కుట్టేశారు. కాలం ఇట్టే గడిచిపోయింది. సాయంత్రమైంది. సూర్యుడు అస్తమిస్తున్నాడు. దీపాలవేళ అయింది వచ్చినవాళ్లంతా ఇళ్లకెళ్లిపోయారు.

ఇంటి ఇల్లాలు లేచి సంధ్య వాకిలి ఊడ్చి కళ్ళాపు జల్లింది. మేత కెళ్లిన పశువులు తిరిగొచ్చాయి. పాలు తీసింది. లాంతర్లలో కిరసనాయిలు పోసి దీపాలు వెలిగించింది. వంట మొదలెట్టి అయిందనిపించింది. ఆటలాడొచ్చేసిన పిల్లలకు స్నానాలు చేయించి అన్నాలు పెట్టింది. దీపం ముందు కూర్చోబెట్టి చదువుకోమంది. భర్త తో కలిసి భోజనం చేసి, వంటిల్లు సర్దింది.

అప్పుడు గుర్తొచ్చింది రామాలయం లో హరికథ ఉందని. "ఇదిగో! నిన్నే! మెలకువగా వుండు తలుపు దగ్గిరగా వేసి వెడుతున్నా!" అని బయలుదేరింది రామాలయానికి. హరికథ నుంచి తిరిగొచ్చి పిల్లలని "పడుకోండిరా ఇంక తెల్లవారి లేవరు అంటూ పిల్లలని పడుకోబెట్టింది. పిల్లల పక్కనే పడుకుంది. ఎప్పుడు తెల్లవారిందో! అప్పుడే మెలకువ వచ్చేసింది. మళ్ళీ దిన చర్య మొదలు అనుకుంటూ బద్ధకం గా వొళ్ళు విరుచుకుని పనిలో పడింది ఆ ఇల్లాలు.

పాట

# మహిళా దినోత్సవం



**వారణాసి నాగలక్ష్మి**

మహిళా దినోత్సవం! మహిలో మహోత్సవం!
మహోదయం వైపుగా మహిళలదీ ప్రస్థానం !

పనిచేసే ప్రదేశాల వివక్ష తగదంటూ
అందించే వేతనాల హెచ్చు తగ్గు వద్దంటూ
వాణిజ్య రంగంలో వ్యాపార ప్రకటనల్లో
స్త్రీత్వాన్ని దిగజార్చే ప్రయత్నాలనెదిరిస్తూ
అతివలు గళమెత్తిన శుభదినం !
ఐక్యత ప్రకటించుటెంత సుందరం !

సద్భావం సహకారం ప్రోత్సాహం ప్రోద్బలం
స్త్రీలంతా పరస్పరం అందిస్తే అదే జయం !
అసమానతనెదిరిస్తూ స్త్రీ హింసను నిరసిస్తూ
ఆలోచన సాగరమై ఆకాశంలో సగమై
అతివలు విజయలైన శుభదినం !
ఐక్యత ప్రకటించుటెంత సుందరం!

వ్యాసం

# ఇది మహిళా పోరాట దినం



- జి.విజయలక్ష్మి

ఇపుడిపుడే నడవడం మొదలు పెడుతున్నాం మగపురుగుల గుండెల్లో భూకంపాలు సృష్టిస్తాం తరతరాలుగా మా రక్తంతో తడిసిన పైటకొంగుల్ని అంతర్జాతీయ మహిళా దినోత్సవ విజయ పతాకాలుగా ఎగురవేస్తాం అరుణ పతాకాలమై మెరుస్తాం

సరిగ్గా 112 సంవత్సరాల క్రితం, అంటే 1910లో కోపెన్ హేగన్లో రెండవ సోషలిస్టు అంతర్జాతీయ మహాసభ జరిగింది. మార్చి 8ని అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినంగా పాటించాలని జర్మన్ సోషలిస్టు క్లారా జట్కిన్ ఆ మహాసభలో ప్రతిపాదించింది. అప్పటినుంచి ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక మహిళల అంతర్జాతీయ మహిళా పోరాటదినంగా మార్చి 8ని పాటిస్తున్నారు

భారతదేశ సంపన్నవర్గ, ఉన్నత మధ్యతరగతి వర్గ మహిళలు, వారి సంఘాలు క్లారా జట్కిన్ స్ఫూర్తిని తంగలో తొక్కి మార్చి 8ని సరదా ఉత్సవ దినంగా దిగజార్చివేశాయి. ఆకలి, దరిద్రం, నిరుద్యోగం, ధరలు విపరీతంగా పెరిగిపోతున్నప్పటికీ స్వతంత్ర దినాలను ఎలా ఉత్సవంగా జరుపుతున్నారో, అదే విధంగా యాసిడ్ దాడులు, ఈవ్ టీజింగ్, వరకట్న హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతూ స్త్రీల బ్రతుకులు దుర్భరంగా ఉన్నప్పటికీ మార్చి 8ని మహిళా ఉత్సవంగా జరపటం శోచనీయం. .

జనాభాలో సగమైన స్త్రీలలో ఎక్కువమంది గ్రామీణ ప్రాంతాలకు చెందిన వ్యవసాయ కూలీలే. భూమిమీద ఎటువంటి హక్కునూ కలిగి లేకపోవడం వలన వీరు భూస్వామ్య వర్గాల దోపిడీకి గురౌతున్నారు. చేనేత వంటి చేతివృత్తులు చేసే మహిళలు నిరంతరం బండచాకిరీ చేస్తూ తాము తయారుచేసిన వస్తువులకు గిట్టుబాటు ధరలు లేక, సరైన మార్కెటింగ్ సౌకర్యం లేక విలవిల్లాడుతున్నారు. ఎక్కువ భాగం దళితులుగా, వెనుకబడ్డ తరగతులుగా ఉన్న గ్రామీణ మహిళలు శ్రమదోపిడితోపాటు సాంఘిక వివక్షకు, భూస్వామ్య వర్గాల లైంగిక వేధింపులకు గురౌతున్నారు.

పారిశ్రామిక రంగంలో ఉన్న మహిళల్లో ఎక్కువమంది అసంఘటిత కార్మికులుగా ఉన్నారు. వీరి శ్రమశక్తిని కారుచౌకగా కొల్లగొడుతున్నారు. నైపుణ్యం లేని, విసుగు కలిగించే పనుల్లో ఎక్కువ సమయం పనిచేస్తూ అతి తక్కువ వేతనాలతో దుర్భర జీవనం గడుపుతున్నారు. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో శ్రామిక స్త్రీలే కాక, మధ్యతరగతి మహిళలు సైతం తప్పనిసరిగా ఉద్యోగం చేయాల్సిన పరిస్థితికి నెట్టబడ్డారు. వీరిలో ప్రైవేటు రంగంలో టీచర్లు, నర్సులు మొదలైన వాళ్ళు అతి తక్కువ వేతనాల్ని పొందుతున్నారు. యజమానుల దోపిడి, దౌర్జన్యాలకు గురౌతున్నారు.

ఇళ్ళలో పనిమనుషులుగా, బీడీ కార్మికులుగా, భవన నిర్మాణ కార్మికులుగా, కూరగాయలు, పూలు, పళ్ళు అమ్ముకనే వారిగా, అగరువత్తులు, పేపరు సంచుల తయారీ... ఇంకా అనేక

చిల్లర మల్లర పనుల్లో రోజంతా పని చేసినప్పటికీ వారికి ముట్టే ప్రతిఫలం నామమాత్రమే. ఉత్పాదక రంగంలో శ్రమ దోపిడితో పాటు కుటుంబంలోను వీరు తీవ్రమైన దోపిడీ దౌర్జన్యాలకు గురౌతున్నారు.

పితృస్వామిక కుటుంబ వ్యవస్థలో స్త్రీ బానిసగా చూడబడుతోంది. కుటుంబంలో ఆమె చేసే పనికి విలువ లేదు. నిరంతరం బండచాకిరి చేసి పిల్లల్ని కని పెంచే యంత్రంగానే స్త్రీని చూస్తున్నారు. పురుషునితో సమానంగా పనిచేసి కుటుంబ ఆర్థిక బాధ్యతల్ని పంచుకున్నప్పటికీ ఇంటి చాకిరీ, పిల్లల పెంపకం ఇంకా స్త్రీల పనులుగానే భావిస్తున్నారు. మెజారిటీ స్త్రీలు సరైన తిండికి, విద్యకి, వైద్యానికి దూరంగానే ఉన్నారు. సంతానంలో మగ పిల్లలు, ఆడపిల్లల మధ్య వివక్షత తీవ్రంగా కొనసాగుతోంది. సాంఘికంగా స్త్రీలు అత్యంత దయనీయ స్థితిలో ఉన్నారు.

దేశంలో రెండవ శ్రేణి పౌరులుగా చూడబడుతున్న స్త్రీలు అనేక సాంఘిక దురాచారాలకు బలౌతున్నారు. దళిత కులాలకు చెందిన స్త్రీలను దేవదాసిలు, జోగినులుగా చేసే ఆచారం తెలంగాణా జిల్లాల్లో ఇంకా కొనసాగుతూనే ఉంది. వరకట్న దురాచారం రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతోంది. ఎంత విద్యావంతులైనా, ఉద్యోగం చేస్తున్నా కట్నం ఇవ్వకపోతే పెళ్ళి జరగని స్థితి నేటికీ ఉ ంది. కట్నం కోసం స్త్రీలను వేధించి చివరకు చంపివేసే సంఘటనలు నిత్యకృత్యమయ్యాయి.

వీటికి ప్రేమోన్మాదం తోడయింది. ప్రేమ హత్యలు ఇటీవలి కాలంలో పెరిగిపోతున్న కొత్త సంఘటనలు. టీవీలు, సినిమాలు, పత్రికలు వినోదం పేరుతో ద్వందార్థాల పదాల్ని విపరీతంగా వాడటం, సెక్సు, హింసల్ని పెంచి పోషించడం చేస్తున్నాయి. లైంగికోద్రేకాలను పెంపొందిస్తున్న ఈ కార్యక్రమాలు యువతని పెడత్రోవ పట్టిస్తూ స్త్రీలపై అత్యాచారాలకి పురికొల్పుతున్నాయి. వరంగల్ యాసిడ్ దాడి సంఘటన, అనంతరం యువకుల ఎన్‌కౌంటర్ ఘటనల తదనంతరం సైతం పరిస్థితిలో మార్పు రాకపోవడం అత్యంత విషాదం.

స్త్రీలు పోరాడి సాధించుకున్న మద్యనిషేధం ఎత్తివేసిన తర్వాత విచ్చలవిడిగా పెరిగిన మద్యం అమ్మకాలు కూడా వీటిని ప్రోత్సహిస్తున్నాయి. సామ్రాజ్యవాద సంస్కృతి విచ్చలవిడితనాన్ని ప్రోత్సహించి స్త్రీలను వ్యాపార సరుకులుగా మాత్రమే చూడటాన్ని నేర్పుతోంది.

పారిశ్రామిక ఉత్పత్తుల అమ్మకాలకు స్త్రీల అర్ధనగ్న ప్రకటనలు సాధారణమైపోయాయి. శ్రమతో సంబంధంలేని, స్త్రీల వ్యక్తిత్వాల్ని కించపరిచే అందాల పోటీల సంస్కృతి నగరాలనుంచి పట్టణాలకి పాకింది. మధ్యతరగతి, ఆపై మధ్యతరగతి, సంపన్న తరగతుల యువతులకు ప్రపంచ సుందరులు కావాలనే కలలే ఆశయాలుగా మారాయి. కాస్మొటిక్స్ ఉత్పత్తుల అమ్మకాల కోసం సామ్రాజ్యవాదులు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే వెనుకబడ్డ దేశాల యువతులు ప్రపంచ సుందరులు కాగలుగుతున్నారనే నిజాన్ని ఎక్కువమంది గ్రహించడంలేదు.

సమాజం, రాజకీయ పార్టీలు, అధికార యంత్రాంగం, కుటుంబం, న్యాయవ్యవస్థ ఏవీ కూడా స్త్రీలకి రక్షణ కల్పించి ప్రస్తుత పరిస్థితుల్లో ఆకలి, దరిద్రం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, అందాల పోటీలు, అత్యాచారాలు, ఈవ్ టీజింగ్, ప్రేమోన్మాద హత్యలు మొదలైన వాటికి వ్యతిరేకంగా పితృస్వామిక వ్యవస్థపై కలిసికట్టుగా పోరాడాల్సిన అవసరం నేటి మహిళలపై ఉంది. మహిళలపై అత్యాచారం, వేధింపులను పదునైన ఆయుధాలుగా ధరించిన పితృస్వామిక వ్యవస్థపై రాజీలేని పోరాటం సాగిస్తామని క్లారా జట్కిన్ ప్రతిపాదనలోని స్ఫూర్తితో ఈ అంతర్జాతీయ మహిళా పోరాట దినం సందర్భంగా మహిళలు ప్రతినబూనాలి.

కథ

# అత్తగార్లూ పారా హుషార్ ...!!!



చివుకుల లక్ష్మి

"అత్తయ్య గారూ! ఆఫీసుకు వెళ్లి వస్తాను. సెల్ ఫోన్ , టి.వి ఎక్కువ సేపు చూడకండి!....

కళ్లకి ఎక్కువ స్ట్రెయిన్ అవుతుంది. కీర ముక్కలు రౌండ్ గా కట్ చేసుకుని, కళ్ల మీద పెట్టుకుని కాసేపు కళ్లు మూసుకోండి.... జాగ్రత్త అత్తయ్య గారూ"!

ఇవన్నీ వింటున్న మీలాంటి వాళ్ళకి... నా కోడలి మీద గొప్పగా ప్రేమాభిమానాలు పుట్టుకొచ్చేసి....

'అబ్బో మీ కోడలకి మీ మీద ఎంత ప్రేమో' ! అని సంభ్రమాశ్చర్యాలు తొణికిసలాడేలా ముఖం పెట్టేసి... మురిసి ముక్కలై పోకండేం. ఇంకొంచెం చదవండి... ఇన్ ఫ్రంట్ ఈజ్ క్రోకడైల్ ఫెస్టివల్ ...

ఇంక నా పరిస్థితి చూడండి....

"అందరికీ దోసెలు వేసాను. దోసెలు కూడా ఒక్కొక్కళ్ళకి వాళ్లకి నచ్చినట్లుగా ఒకరికి పల్చగా, పెద్దగా, కరకర లాడే లాగా, నూనె వేయకుండా, ఇంకొకరికి మెత్తగా చిన్నగా, నూనె తక్కువ వేసి....

మళ్ళీ దానిలోకి ఒకరికి పల్లీల పచ్చడి, ఇంకొకళ్ళకి అల్లం పచ్చడి చేసాను. కావాలనుకునే వాళ్ళకి ఇంట్లో ఎలాగూ మొన్న చేసిన కారంపొడి ఉండనే వుంది."

టిఫిన్ పని అయిపోయింది కదా అని.... కాసేపు కూర్చుని ఫోన్ చూస్తున్నాను.

మా కోడలు మాటలు కొత్తగా వినేవాళ్లకి 'ఈవిడ ఎప్పుడూ టి.వి యో లేక సెల్ ఫోనో పట్టుకుని వదలదేమో....

పాపం ఇంట్లో పనంతా కష్టపడి కోడలే చేసి, ఆ తరవాతే తన ఆఫీసుకు వెళుతుందేమో!!' అనుకునే అవకాశం వుందండోయ్ ,.

మా అబ్బాయికి పెళ్లి అయిన కొత్తలో, మా కోడలు నా దగ్గరకు వచ్చి ఎంతో వినయంగా...

"అత్తయ్యా గారూ! మీరు ఏం కూరలు ఇష్టంగా తింటారు"?

అని ప్రేమంతా వలక పోస్తూ అడిగితే, ఎంతో మురిసి పోయి వెర్రి పీనుగులా ఇక రేపటి నుంచి

'ఎవరక్కడ? భోజనాలు సిద్ధమా?'.....అని అడగ కుండానే, కంచంలో నాకు ఇష్టమైన కూర అన్నం పెట్టి, నేను కూర్చున్న చోటుకే తెచ్చి అందిస్తుందేమో నా కోడలు !...

అని ఎంతో అందంగా ఊహించు కుంటూ మురిసిపోయి ఏవేవో కలలు పగలూ రాత్రి తేడా లేకుండా కన్నాను.

అయితే అనుకున్న దొక్కటి అయినది ఒక్కటి అన్నట్టు బోల్తాకొట్టి.... విచిత్రంగా నాకు ఇష్టమని చెప్పిన కూరలు ఆరోజు నుంచి మా వంటిట్లో కంటి చూపుకు కూడా నోచుకోలేదు.

ఫలానా కూరగాయ రేట్ ఎక్కువగా వుందని ఒకసారి, ఈ కూరగాయలు ముదిరిపోయాయి అని ఇంకొకసారి,

ఈ కాయల్లో పుచ్చులు ఎక్కువగా వున్నాయని మరొసారి, అయ్యో కొనడం మర్చిపోయాను అత్తయ్యా అని ఇంకొకసారి....

చెప్తుండే సరికి నా మట్టి బుర్రకి అర్థమై పోయింది....

ఇంకా నయం... నా అదృష్టం బావుండి నాకు నచ్చిన, ఇంకా అన్ని కూరలు, పచ్చడులు, పిండివంటలు ఏకరవు పెట్టలేదు.

'కూతురు వుంటే కోకకి కరువు, కోడలుంటే కూరకి కరువు' అని సామెత ఊరికే అన్నారా పెద్దలు.

ఒకరోజు టి.వి.లో ఒక ఛానెల్ లో నాకు ఎంతో ఇష్టమైన

సీరియల్ చూస్తున్నాను. సరిగ్గా అప్పుడే...

"అత్తయ్య గారూ! ఈ సీరియల్ మీరు రెగ్యులర్ గా చూస్తూ వుంటారా"? అని మా కోడలు ప్రేమగా అడిగేటప్పటికి గతంలో జరిగిన అనుభవం మర్చిపోయి

"అవునమ్మా! ఈ సీరియల్ లో ఎవరూ ఓవరాక్షన్ చేయటలేదు, ఎవరికీ ఓవర్ మేకప్ లు లేవు, డైరెక్షన్ కూడా బావుంది. కథ కూడా ఇంకా చాలా బావుంది.

ఇంకే సీరియల్స్ జోలికీ పోను... ఇదొక్కటే నేను ఎంతో ఇష్టంగా చూసే సీరియల్ "....అన్నాను.

అంతే!! ఆ మరుసటి రోజు నుంచి టి.వి.లో ఆ ఛానలే మాయమై పోయింది....

ఇంక అప్పటి నుంచి నా ఇష్టాఇష్టాలు ఏమిటో బయటకు చెప్పడందాకా వదిలి పెట్టండి... మనసులో తలచుకోడానికే భయపడ్డం మొదలైంది.

సాటర్ డే గాని సండే గాని వస్తే... "మేము ఐదు రోజులు ఆఫీస్ లో పని చేసి అలిసి పోయాం...

మాకు రిలాక్సేషన్ కావాలి"...

అంటూ సినిమాలకి షికార్లకి బయటకు వెళ్లి పోతారు.

మరి నెలలో అన్ని రోజులూ ఇంట్లో పని చేసిన నాకు వద్దా రెస్టు?? నాకు వద్దా రిలాక్సేషన్.

ఎంతకాలం నాకీ రొస్టు??

"ఈ శనివారం, ఆదివారం నేను ఇంటిని చూసుకుంటాను మీరు రెస్ట్ తీసుకోండి" అని ఒకసారి అయినా అంటారేమో అని ఎదురు చూస్తాను...

కానీ అలాంటి రోజు ఇప్పటి వరకూ రాలేదు. నా ఆశ అడియాశ గానే మిగిలి పోయింది.

ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో రసవత్తర మైనవి.. గ్లిజరిన్ లేకుండానే కన్నీళ్ళు తెప్పించేవి... చెవుల్లోంచి రక్తాలు కారేంతగా కర్ణ కకఠోరమైన ఎన్నో విషయాలు బయటకు తెలుస్తాయి.

కానీ నేనూ ఇంక ఏమీ చెప్పనుగా !

ఈ మధ్య నేనూ కూరల్లో పోపు మాడ్చేస్తున్నాననీ..., కూరలు తరిగేటప్పుడు పుచ్చులు కూడా తీయకుండా తరిగి వేసేస్తున్నా ననీనూ ఇంట్లో వాళ్ల కంప్లైంట్!

మీరు మరీనూ...... చోద్యం కాకపోతే...

'ఇవేవీ నేను కావాలని చేస్తున్నవి కాదండీ! కళ్లు సరిగ్గా.... కనిపించక!!!

నా కొడుకు నన్ను కళ్ళ డాక్టర్ కి చూపిస్తే కళ్ళకి కేటరాక్ట్ ఆపరేషన్ చేయించాలి అన్నారుట.

చేయిస్తానూ..చేయిస్తాను... అంటున్నారు కానీ.. ఎవరికీ నన్ను హాస్పటల్ కి తీసుకెళ్ళేంత తీరుబడి వుండటం లేదు.

నా కోసం లీవ్ పెట్టుకుని ఆపరేషన్ చేయించేంత..... అవసరం వుందా? అని ఆలోచిస్తూ... వాయిదా వేసుకుంటూ వస్తున్నారు.

'ఆ లీవ్ దాచుకుంటే వాళ్ళు వేరే పనికి ఆ సెలవలు ఉపయోగించుకోవచ్చు కదా!' అదీ సంగతి.

ఆ తరవాత నుంచీ మొదలైంది అసలు తమాషా...

ఇంట్లో వాళ్లు నా మీద ఒక ఎంక్వయిరీ కమిటీ వేసి తరిగిన కూరలని పరిశీలిస్తున్నారు. దీనికంటే వాళ్లే కూరలు తరిగి ఇవ్వొచ్చుగా !

అమ్మో! అంత పని చేస్తే వాళ్ల సుకుమార శరీరాలు అలిసి పోవూ!

ఆ తరవాత నుంచి మొదలైంది మరొక రకం టార్చర్ . నా మీద నిఘా మరింత ఎక్కువ అయింది.

టి.వి. చూడద్దు! ఫోన్ చూడద్దు! అంటారే గానీ నా మీద జాలి పడి కూరలు కట్ చేయద్దు! వంట చేయద్దు! అని మాత్రం ఎవరూ చెప్పరు.

మీరు మాత్రం మా కోడలిని ఊరికినే .. ఏ పనీ చేయదని ఆడిపోసుకోకండి. 'నేను టిఫిన్ చేసి చట్నీ చేస్తే చాలు... పాపం తనే ప్లేట్ లో పెట్టి తీసుకెళుతుంది.

వంట చేసి టేబుల్ మీద పెడితే చాలు లంచ్ బాక్స్ లలో తనే సర్దుకుంటుంది.

అన్నట్టు చెప్పడం మర్చి పోయాను... ఈ మధ్య నేను చేసిన పదార్థాలన్నీ ఫోటోలు తీసుకుంటుంది.

అదేదో వంటల గ్రూప్ ట... అందులో ఆ ఫోటోలు అన్నీ పోస్ట్ చేసి తనే చేసినట్టుగా రాస్తుందిట.

ఈ విషయం మీకెలా తెలుసు అని ఆశ్చర్య పోకండేం.... ఎవరో మీలాంటి పెద్దలు నా చెవిలో వేసారు.

'మీ కోడలు ఉదయాన్నే లేచి వంటంతా చేసి పాపం

ఆఫీసుకు వెళుతుంది అటగా??' అని దీర్ఘాలు తీస్తూ నన్ను అడిగారు. నోట్లో నాలుక లేని అమాయకురాలిని కదా!! నేనేం మాట్లాడ గలను.

ఈ మధ్య నా ఫ్రెండ్ ఒక మాట చెప్పింది. మా కోడలిది ఎంత జాలి గుండెనో తెలుసా??

'నేను ఒక్కదాన్నే పనిచేస్తుంటే 'చూడలేక' రూమ్ లోకి వెళ్లి పోయి తలుపులు మూసుకుంటుంది మా కోడలు అని'.

ఆ మాట విన్నాక ఇది ఇంటింటి లోనూ నడిచే రామాయణమే అనుకుని నాలో నేనే నవ్వుకున్నాను.

నాకు కేటరాక్ట్ ఆపరేషన్ చేయించరని భయమేమీ లేదు. ఏదో ఒక రోజు వాళ్ళే చేయిస్తారు.

లేదంటే వాళ్లు మాత్రం ఎన్నాళ్లు అని మాడిపోయిన వంటలు తినగలరు?!!.

అదీకాకుండా.... నాలాంటి నమ్మక మయిన జీతం భత్యం లేని పనిమనిషీ, అన్నీ రుచిగా వండి పెట్టే వంట మనిషీ, అలాగే వాళ్ళ పిల్లలకు డైపర్స్ మార్చే ఆయా...

ఇంకా వాళ్ళ పిల్లలను ఇంటికి దగ్గరగా వున్న స్కూల్ కి జాగ్రత్తగా తీసుకెళ్లి తిరిగి తీసుకొచ్చే సెక్యూరిటీ గార్డూ,

పిల్లలను ఎత్తుకుని తిప్పి..తిప్పి.. వాళ్లకి కథలు, కాకరకాయలు చెప్పి, బతిమాలి బామాలి అన్నం తినిపించే ఇంటి మనిషీ...

మధ్యాహ్నం వేళ పడుకుంటే రాత్రి వేళ నిద్ర పట్టదేమో అని పగటిపూట అంతా వళ్ళు పులిసి పోయేలా పనిచేసే పని మనిషి...

కొడుకు కోడలు ఆఫీసులు కెళితే వాళ్లు వెళ్లే టైమ్ కి వంట టిఫిన్ రడీ చేసి పెట్టి, రాత్రి వాళ్లు ఇంటికి చేరుకునే సరికి వేడి వేడిగా వంట చేసిపెట్టే వంట మనిషి...

దొంగల భయం లేకుండా, ఇంటికి తాళం వెయ్యక్కర లేకుండా, కుక్క ని పెంచుకునే అవసరం లేకుండా ఇంటికి కాపలాగా వుండే గూర్ఖా...

ఎవరేమన్నా దులిపేసుకుని నా వాళ్లే అన్నారులే అనుకునే సిగ్గులేకుండా దులుపుకు పోతూ... ఎవరేమన్నా ఎదురు తిరిగి మాట్లాడకుండా తలవంచుకుని వెళ్లి పోయే సిగ్గూ పౌరుషం లేని మనిషి...

ఎంత డబ్బు పెట్టినా దొరకరని వాళ్లకి మాత్రం తెలియదా?

కవిత

# ప్రగతి పథంలో పడతి




గుడిపూడి రాధికారాణి
9494942583


బాలికున్న గృహము బంతిపూల వనము
శోభతోడ వెల్గి శుభముగూర్చు
నెమలియాడినట్లు నీయింట తిరుగంగ
పాప పుట్టెననుచు పరవశింపు

నీదు కష్టమందు నేస్తమై వెన్నంటి
తల్లడిల్లువేళ తల్లియగుచు
చిన్న మెప్పునివ్వ చితికైన తోడొచ్చు
తరుణి రుణముదీర్చ నరుని తరమె!

బడికి నోచలేని బతుకుచెరను వీడి
రోదసికినిబోవు రోజులొచ్చె
నాతినిటుల నేడు నాశనమొందింప
పాడియగునె నీకు పరమపాపి!

గతుకు బాట వీడి గడ్డు కాలము దాటి
ప్రగతి పథమునందె పడతి నేడు
తనదు యునికికిట్లు తగుయూతమిచ్చేటి
పురుషులందరికిదె పూలజల్లు

కథ

# కాల పురుషుని కరాళ ధంష్ట్రలు




పి. శాంత

మొబైల్: 9717860010


“అమ్మా, అమ్మా “ గట్టిగా పిలిచాడు పదిహేడేళ్ళ బాబు. లేవాలని ప్రయత్నం చేస్తున్నాను, కానీ లేవడం కష్టం గా ఉంది.

అమ్మా, అమ్మా, మళ్ళీ పిలుస్తున్నాడు. ఎలాగో ప్రయత్నం మీద శక్తి కూడ దీసుకుని లేచాను. పిల్లాడు పిలుస్తుంటే ఎలాగా? అప్పటికీ నాలుగు రోజుల నుంచీ నాకు, బాబుకీ కూడా జ్వరం. 102 డిగ్రీలు దాటి ఉంది వాడికీ, నాకూ కూడా. కరోనా సెకండ్ వేవ్ విలయ తాండవం చేస్తున్న రోజులవి. నేను, బాబు ఇంట్లోనే ఉంటున్నాం. ఎక్కడికీ కదల కుండా. పని మనిషిని కూడా మానిపించేశాను. కానీ దురదృష్టం. ఎలా అంటుకుందో తెలియదు. ముందు వాడికి జ్వరం వచ్చింది. కరోనా అనుకోలేదు నేను. ఎందుకంటే, మాకు వచ్చే అవకాశం లేదని ధీమా. కానీ మూడు రోజులయింది, తగ్గట్లేదు. విపరీతమైన నీరసం. ఎందుకైనా మంచిదని పరీక్ష చేయించాను. అంతే , నేను ఉన్నానని అరిచింది కరోనా మహమ్మారి. ఏదో మందులు తీసుకుంటే తగ్గుతుంది అనుకుని గడుపుతుంటే నాకు చుట్టుకుంది. లేవలేని నీరసం. వెంటనే, భోపాల్ లో ఉన్న మా అమ్మాయి దామిని కి మెసేజ్ పెట్టాను వెంటనే బయలుదేరమని. ఇవాళ వస్తుందేమో అని చూస్తున్నాను. టిక్కెట్టు దొరకలేదేమో , ఇంకా ఏ కబురూ లేదు.

బాబు దగ్గరకు వెళ్ళేసరికి ఊపిరి తీసుకోడానికి కష్ట పడుతున్నాడు. నాకు ప్రాణం పోయినంత పని అయ్యింది. ఎలా నా చిన్నతండ్రిని అలాంటి కష్టం లోంచి బయటకు లాగడం? ముందు పక్కింటాయనకి ఫోను చేశాను. ఏదైనా హాస్పిటల్ కి ఫోను చేసి పిల్లాడిని అడ్మిట్ చేయించాలని. ఆయన చాలా మంచి వాడు. ఒక పది నిమిషాలకి ఫోను చేసి ఫోర్టీస్ హాస్పిటల్ నుంచి అంబులెన్సు వస్తుంది, తయారుగా ఉండండి అని చెప్పారు. ఈ లోగా పిల్లాడి దగ్గర కూర్చుని దీర్ఘ శ్వాస తీసుకో, నెమ్మదిగా ఒదులు అంటూ వాడి చేత ప్రాణాయామం చేయిస్తున్నాను.

అంబులెన్సు వచ్చింది. నేనూ వాడి తో ఎక్క బోయాను. వాళ్ళు అడ్డుపెట్టేశారు. ఇది అంటు వ్యాధి, అందుచేత మీరు రావడానికి కుదరదు అన్నారు. నాకూ ఉంది, అందు చేత నాకు అంటుకుంటుంది అన్న భయం లేదు, అన్నాను. అయితే అసలు వీలు కాదు, మిమ్మల్ని పేషంటు దగ్గర ఉండనివ్వరు, మీకు ఇచ్చేందుకు ఇంకో బెడ్ లేదు మా దగ్గర. ఎమర్జెన్సీ అయితే తప్ప ఆసుపత్రి లో అడ్మిషన్ కుదరదు, అని పిల్లాడిని తీసుకుని వెళ్ళిపోయారు. నేను ఏమి చెయ్యను? వాడు ఎలా ఉన్నాడో తెలియదు, ఎవరైనా చూస్తున్నారో లేదో తెలియదు. ఉండుండి మొబైల్ లో మాట్లాడుతూ టైమ్ గడుపుతున్నాను.

ఎలాగ తెల్లారిన్దో నాకు తెలియదు. టీవి పెడితే అందులో భయంకరమైన వార్తలు; న్యూస్పేపరు తీశాను చదువుదామని, వేల కొలదీ కేసులు, వందలకొలదీ మరణాలు; హాస్పిటల్ లో పిల్లాడు. ఫోను చేస్తే వాడు సమాధానం చెప్పడం లేదు. చాలా సేపు రింగు అయ్యాక, సిస్టర్ ఎవరో తీసింది. ‘ మీ అబ్బాయి కి ఆక్సిజన్ పెట్టాము, ముఖం మీద ఆ గొట్టాలు ఉండడం వలన మాట్లాడ లేదు. బాగానే ఉన్నాడు, కంగారు పడకండి. ‘ అంది. నాకు చాలా భయం వేసింది.

బాబు నాలుగేళ్ల వాడుగా ఉన్నప్పుడు, మా వారికి నా కంటే అందమైన ఆవిడ తటస్థ పడింది. అప్పటినుంచి,

పిల్లలు ఇద్దరినీ కళ్ళల్లో పెట్టుకుని పెంచుకుంటున్నాను. వాడి బాధ నా గుండెలని పిండేస్తోంది. దామినికి ఫోను ప్రయత్నం చేస్తున్నాను, అందట్లేదు. ఎలాగో తెలియదు. ఎలా ఉందో, దానికి కూడా కరోనా సోక లేదు కదా, ఆ ఆలోచనకే నా గుండె ఝుల్లుమంది. నేనీ చెయ్యను? దామిని స్నేహితుల ఫోన్లు కోసం ప్రయత్నిస్తున్నాను. ఏవీ దొరకట్లేదు. ఇంతలో హాస్పిటల్ నుండి ఫోను, మీ అబ్బాయిని ఇంకా కనీసం నాలుగు రోజులైనా ఐ సి యు లో ఉంచాలి, రెండు లక్షలు కట్టండి అని. నేను బయటకు వెళ్లలేను, ఎలాగా? మళ్ళీ పక్కింటి ఆయనకు ఫోను చేశాను. ఆయన పాపం, దేవుడు లాగా ఆదుకున్నాడు. మీ దగ్గర ఉన్నాయా, అన్నాడు. బాంకులో మూడు లక్షలు ఉన్నాయి, అదృష్టం కొద్దీ, ఈ మధ్యే ఇన్సూరెన్సు డబ్బులు వచ్చాయి. ఫిక్సెడు చేద్దామనుకుంటూ ఉండగా జ్వరం వచ్చి వెళ్ళ లేక పోయాను. ఆయన , నాదగ్గర చెక్కు తీసుకుని ఆ డబ్బు కట్టాడు.

మర్నాడు కూడా దామిని నుంచి కబురు లేదు. అప్పటికి నాకు జ్వరం మొదలయ్యి ఆరో రోజు. మధ్యాహ్నం అవుతుండ గా నాకు ఊపిరి తీసుకోడం కష్టం అయ్యింది. ఏమి చేసినా లాభం లేకపోయింది. రోజూ గవర్నమెంటు వాళ్ళు ఫోను చేసి పరిస్తితి కనుక్కుంటు న్నారు. సరిగ్గా నేను ఊపిరి తీసుకోలేక కష్టపడుతున్న సమయం లో ఫోను వచ్చింది. ఫోను ఎత్తాను, కానీ మాట్లాడ లేను. మేడమ్, మాట్లాడకండి, ప్రాణాయామం చేయండి, ధైర్యం గా ఉండండి, మేము వస్తున్నాం, అని ఫోను పెట్టేశారు. ఆ తరువాత, అంబులెన్సు వచ్చింది, నాకు ఆక్సిజను పెట్టారు, అంబులెన్సులో ఎక్కించారు తీసుకు వెళ్తున్నారు. ఇల్లు పక్కింటాయన చూసుకున్నాడుట. నాకు తరువాత తెలిసింది. నన్ను ఎక్కడికో తీసుకు వెళ్తున్నారు, నా దృష్టి బాబు మీద, దామిని మీద. దామిని ఎందుకు ఫోను ఎత్తడం లేదు?

నన్ను తీ సుకు వెళ్ళి ఏదో హాస్పటల్ లో ఐ సి యు లో పెట్టారు. రెండు రోజులు ఆక్సిజను ఇచ్చారు. మూడో రోజుకి సర్దుకున్నాను. నాది గట్టి ప్రాణం అనుకుంటాను. వార్డు లోకి మార్చారు. ఆ రోజు దామిని నుంచి ఫోను వచ్చింది. దానికీ కరోన వచ్చింది భోపాల్ లో. కానీ ఇంత ఎక్కువ గా కాదు. అది తగ్గి, నెగటివ్ వచ్చాక ఆ రిపోర్టు తీసుకుని అది డిల్లీ బయలుదేరి వచ్చింది. వస్తూనే పాపం పిల్ల మా ఇద్దరినీ చూసుకోడానికి ప్రయత్నం చేసింది. నాకు అప్పుడు తెలిసింది నన్ను నరేలా లో ఉన్న రాజా హరిశ్చంద్ర హాస్పిటల్ లో పెట్టారని. ఎక్కడి, మునీర్కా, ఎక్కడి నరేలా! ఇదెక్కడో కూడా నాకు తెలీదు. దామిని వస్తానంటే రావద్దని చెప్పాను. నువ్వు తమ్ముడిని చూసుకో, నేను కొద్ది రోజులలో వచ్చేస్తాను అన్నాను.

నాపరిస్థితి బాగాయ్యింది కదా, నేను ఇంటికి వెళ్ళి పోవచ్చు అనుకున్నాను, కానీ నన్ను ఇంకా ఉంచారు. నాలుగు బెడ్సు ఉన్న వార్డు లో ఉంచారు. గవర్నమెంటు హాస్పిటల్ ఎలా ఉంటాయో చెప్పక్క ర లేదు. పిలిస్తే పలికే వాళ్ళు లేరు. అందరికీ భయం. ఆ రోజు సాయంత్రం నా పక్కన బెడ్డులో ఉన్న యాభై సంవత్సరా ల వయసు ఉన్న ఆవిడ హఠాత్తు గా హార్టు ఫైల్యూర్ అయ్యి, పోయింది. సిస్టర్ వచ్చి ఆవిడ ముఖం కప్పేసి వెళ్లిపోయింది. ఎవరూ వచ్చి ఆవిడని తీసుకుని వెళ్లలేదు. మిగతా బెడ్స్ వాళ్ళు భయం భయం గా ఆ బెడ్ కేసి చూస్తూ కూర్చున్నామ్. వార్డు లోకి డాక్టర్లు రావట్లేదు. ఉందయం ఒకసారి పల్మనాలజిస్టు వస్తారు, దూరం నుంచే మాట్లాడి వెళ్లిపోతారు. పేషంట్లకి ఇవ్వాల్సినవి ఏమైనా ఉంటే, సిస్టరు దూరంగా పెట్టి వెళ్లి పోతారు. సిస్టరు అటువైపుగా వస్తే అడిగాను, ఈవిడని ఇక్కడే వదిలేశారేమిటి అని.

ఆవిడని తీసుకు వెళ్ళటానికి కుటుంబీకులు ఎవరూ రాలేదు. అంది చాలా నిర్లిప్తం గా.

మరి? ప్రశ్న పూర్తి చేసే అవసరం లేదు.

రేపు మునిసిపాలిటీ వాళ్ళు తీసుకు పోతారు, అంది మామూలు విషయమ్ చెప్తున్నట్లు.

పోనీ, మార్చురి , అన్నాను సందేహిస్తూ

నిండిపోయింది. ఏ గదులూ ఖాళీ లేవు , అనేసి వెళ్లిపోయింది.

నాకు కన్నీళ్లు నిండుకొచ్చాయి, భగవంతుడా, ఎలాంటి పరిస్థితులు చూపిస్తున్నావు! ఇంకో గంట గడిచింది. మా వార్డులో ఉన్న ఇంకో పేషంటు పరిస్థితీ విషమించింది. అక్సిజన్ అదీ పెడుతూ ప్రయత్నం చేశారు కానీ లాభం లేక

పోయింది. డాక్టరూ వెళుతూ వెళుతూ ముఖం మీద దుప్పటి కప్పేసి వె ళ్లి పోయాడు.

నాలుగు మంచాల వార్డు లో రెండు మృత శరీరాలు. అలాగే అక్కడే ఉండాలి. కొంత సేపటి తరువాత నా పరిస్తితి ఇంతేనా? పిల్లలు దగ్గర లేరు. భర్త ఎప్పుడో వదిలేశాడు. అమ్మా, నాన్న లేరు. నేను ఏమైనా అయిపోతే, నా పిల్లల కి దిక్కెవ్వరు? కాల పురుషుని తాండవం అని మా అమ్మ చిన్నప్పుడు అంటూ ఉండేది. ఇదేనా ఆ తాండవం! కాల పురుషుని కరాళ దంష్ట్ర ల మధ్య అందరూ నలిగి పోవ లిసిందేనా? నేనూనా? మరి నా పిల్లలు? దామిని ఏమయి పోతుంది? బాబు పరిస్తితి ఎలా ఉందో! మళ్ళీ డబ్బు కట్టమని అన్నారేమో! ఎవరు కడతారు? కట్టక పోతే వాడిని చూస్తారా? దామిని చిన్న పిల్ల , ఒక్కత్తే ఏమి చెయ్యగలదు? నేన్ను చచ్చిపోతే, నా పిల్లలని ఎవరు చూసుకుంటారు? భగవంతుడా, నన్ను వదిలెయ్యి. నేను బ్రతకాలి, నా పిల్లల కోసం బ్రతకాలి. నన్ను తెసుకెళ్లకు. —నా మనసులో ఇదే ఆలోచన.

నాలుగో మంచం మీద ఒక పెద్దాయన ఉన్నాడు. ఆయన ఒకటే ఏడుపు. ఓదార్చే వాళ్ళు లేరు. ఆయనకి ధైర్యం చెప్పాలని అనిపించింది, కానీ నాకే భయం గా ఉంటే నేను ఆయనకి ఏమి చెప్పను?

సిస్టరు మళ్ళీ వచ్చింది, పెద్దాయనకి మందు ఇవ్వడానికి.

మమ్మల్ని ఇంకో గది లోకి మార్చ లేవా సిస్టర్, భయం గా ఉంది, దీనం గా అడిగాను.

'బ్రతికి ఉన్న మనిషికి భయపడాలి కానీ, చచ్చిపోయిన మనిషి నిన్ను ఏమి చేస్తాడు, బెహెన్, భయ పడకు. ఇంకో గదిలోకి మార్చ గలిగిన అవకాశం ఉంటే మార్చి ఉండే వాళ్ళం కదా? చెప్పాను కదా, ఎక్కడా ఖాళీలు లేవని. అటు వైపుకి తిరిగి పడుకో. రామ నామం అనుకుంటూ ఉండు. నువ్వు బాగానే ఉన్నావు కాబట్టి రేపు నిన్ను డిశ్చార్జి చేసేస్తారేమో.' అంది. నేను ఆ అమ్మాయి కేసి తేరిపారి చూశాను. గట్టిగా 30 ఏళ్ళు ఉంటాయేమో . ఎంత ప్రాక్టికల్ గా మాట్లాడింది. జీవితం అంటే ఏమిటో ఈ అమ్మాయికి తెలుసు కాబోలు.

ఎందుకమ్మా అలా చూస్తావు. నేను ఉద్యోగం లో చేరి ఓ పదేళ్ళు అయ్యి ఉంటాయి. ఈ పదేళ్ళ లో నాకు జీవిత సత్యాలు బోధ పడ్డాయి. ఈ కరోనా వచ్చాక్ పూర్తి జ్ఞానోదయమ్ అయ్యింది. అనుబంధం , ఆత్మీయత, ఇవన్నీ ఉట్టి బూటాకాలు. ఈ ప్రపంచం లో బ్రతకడానికి మనిషి కల్పించుకునే లంపటాలు. నిజం గా సమస్య వస్తే మన దగ్గర ఎవరూ ఉండరు. ఇది జీవిత సత్యం. — అనేసి వెళ్లి పోయింది.

నాకు ఏదో పాత సినిమాలో పాట గుర్తొచ్చింది. 'అనుబంధం, ఆత్మీయత అంతా ఒక బూటకం, ఆత్మ తృప్తి కై మనుషులు ఆడుకునే నాటకం, వింత నాటకం". ఎంత కరక్టు గా చెప్పిందీ పిల్ల!

ఆ రాత్రి ఎలా గడిచ్చిందో నేను చెప్పలేను. కళ్ళు మూసుకుని కూర్చున్నాను. రామ రామ అనుకుంటూ. మనస్సులో ధృఢ నిశ్చయం చేసుకున్నాను, నేను చచ్చిపోను, నా పిల్లల కోసం నేను బ్రతకాలి, అని. రాత్రంతా అలా కూర్చునే ఉన్నాను.

తెల్లారింది. నేను బ్రతికే ఉన్నాను. మూడో మంచం మీది పెద్దాయన కూడా రాత్రి ఎప్పుడో పోయాడు, నాకు తెలియనే లేదు. నా ఒళ్ళు ఝల్లుమంది, విషయం తెలియ గానే. పొద్దెక్కే సరికి, డాక్టర్లు వచ్చి నన్ను డిశ్చార్జి చేశారు. హాస్పిటల్ బయటికి వచ్చేసరికి, దామిని కనబడింది. నాకు ప్రాణం లేచి వచ్చింది. దామిని ని పట్టుకుని బావురుమన్నాను.

బాబు ఇంకా హాస్పిటల్ లోనే ఉన్నాడుట . వాడిని మధ్యలో వెంటిలే టర్ మీద కూడా ఉంచారుట. ప్లేట్లెట్లు పడిపోయాయిట. ఎవరెవరి సహాయం తో టో దామిని అన్నీ ఏర్పాటు చేసిందిట. ఇప్పుడు కూడా ఇంకా ఇన్ఫెక్షను ఉందిట. దామిని చెప్పిన విషయాన్ని బట్టి వాడిని మళ్ళీ ఆరోగ్యవంతుడిని చేసుకోడం ఇంకొక పెద్ద యుద్ధం అని అర్థం అయ్యింది. కానీ, ఇప్పుడు నేను యుద్ధానికి రెడీ. నా కూతురు దగ్గర ఉంది. నా బాబు బ్రతికాడు. నేను బ్రతికాను. ఇంకేమీ కావాలి?

వ్యాసం

# 'మహిళా మణి'



సుమతి చురుకంటి

9866344106

చక్కని గూడు, పిల్లలు చల్లని సంసారం దిశగా సాగుతున్న యానంలో మహాదానందంగా తన ఉనికిని కోల్పోతోంది ఒక మహిళ. తనకు తెలియ కుండానే తన కోరికలు, ఇష్టాలు, ఆశయాలు అన్నీ ఆ సమయంలో అటకెక్కిస్తుంది స్త్రీ. ఆ తర్వాత తీరుబాటుగా యోచించి "నేనేమిటి ఇలా తెర వెనుక తలవంచుకు నిలబడాలా... ఏ గుర్తింపూ లేకుండా.. లేదా, తనేమిటో ? తన తెలివి తేటలేమిటో ? నిరూపించుకుని సమాజంలో ఓ గుర్తింపు, ఆత్మతృప్తి పొందాలా" అని నిరంతరం ఆలోచనలతో మరికొన్నాళ్ళు సాగుతుంది జీవితం.

ఆనక తన గొంతు సవరించి మెల్లగా వినిపించే సరికి అందరూ ఆశ్చర్యపోతారు. 'ఇదేమిటి ఇలా మాట్లాడు తోంది ! ఏమైనా ఈ మధ్య కోపం అసహనం ఎక్కువయ్యాయి నీకు' అంటారు అందరూ ఇంట్లో. ఇదంతా తనకు సంక్రమించాల్సినవి రాక పోవడం తో, తగిన గుర్తింపు లేక వచ్చిన ఆసహాయతలోని ఆ వేదన, ఆక్రోశమని వారికి ఎలా తెలియ జేయాలి. ఎంతో ఆవేదన, తనకేం కావాలని ఎవ్వరూ ఆలోచించరు. అయినా తన గురించి తనే ఆలోచించ లేదు. ఎవరి పరుగులు వారివి. ఇంట్లో అందరి సమస్యలు తనవిగా అందర్నీ మెప్పిస్తూ (అనుకుంటూ) తన వెలుగుకి తానే మసి పూసుకుని ఇప్పుడు తొంగి చూడాలనుకుంటుంది లోకాన్ని. ఇన్నాళ్ళు ఓపిక పట్టింది'ఇంకెన్నాళ్ళు ఆంక్షలు. అన్నీ నేర్చుకోవాలి, నేర్చుకునే మనసుంటే వయసుతో పని ఏముంది. ఇప్పుడైనా మించి పోయింది లేదు. ఈ కరోనా సమయంలో అరచేతిలోనే ఎన్నో నేర్చుకునే అవకాశం వుంది. ఏమో ఎప్పుడు ? ఏ ఆపద జీవితంలో ముంచుకొచ్చినా తట్టుకోవాలిగా. ఎదగాలంటే అందరినీ ధిక్కరించటం కాదు, కుటుంబ సభ్యుల్ని మెప్పిస్తూనే నీ ఉనికి చాటుకో కష్టమే కానీ ! నువ్వు చేయగలవు. 'త్యాగశీలివమ్మా మహిళా' అనే నినాదాన్ని దాటి ఇంకా ఇంకా 'పదండి ముందుకు, పదండి తోసుకు, పదండి పోదాం మునుముందుకు'.

కవిత

# మానవత్వం



తిరునగరి సంధ్య (స్యాండీ)

9121546695

మానవత్వం అనేది ఒక
చిన్న పదం కానీ .....

మనుషుల మధ్య
మానవత్వం
మర్చి పోయి స్వార్థం
అసూయ
ఈర్ష్య డబ్బు వ్యామోహంలో
పడి
ప్రేమని కరుణ జాలి దయని
కోల్పోతున్నారు ......

మానవత్వాన్ని కాపాడదాం .....
మనం విత్తనాన్ని
నాటి నీళ్లు పోసి
ఎలా పెంచుతామో
మనుషుల మధ్య ఉన్న
విభేదాలను మార్చి
ఒక కొత్త ప్రపంచాన్ని
తీర్చిదిద్దుదాం.......

మహిళల పట్ల వివక్ష వదిలేద్దాం
మానవతను చూపుదాం....

వ్యాసం

# శాపగ్రస్త అహల్య



- చంద్రకళ దీకొండ,
చరవాణి : 9381361384

త్రిలోకాలను చుట్టి వస్తే అహల్యను వివాహమాడవచ్చునని బ్రహ్మ తెలుపగా...ఇంద్రుడు స్వయంవరమునకు సిద్ధపడెను.

ప్రసవిస్తున్న ఆవు చుట్టూ ప్రదక్షిణ చేయడం... ముల్లోకాలను చుట్టడంతో సమానమని... అలా చేసిన గౌతమ

మహర్షితో వివాహము జరిపించెను.

అహల్యపై మోహము వీడని ఇంద్రుడు...

భర్త వ్యాహ్యాళికి వెళ్లిన సమయములో

అతని రూపం ధరించి,అహల్య చెంత చేరెను.

నిజం తెలియని అహల్య తన భర్తే అనుకుని మోసపోయెను.వ్యాహ్యాళి నుండి తిరిగి వచ్చిన గౌతముడు అది చూసి రాయిగా మారమని శపించెను.త్రేతాయుగం వరకూ వేచి ఉన్న అహల్య శ్రీరాముని పాదము తాకి శాపవిమోచనమొందెను.

ఇంద్రుడు కూడా శాపగ్రస్తుడై...

మొదట దేహమంతా స్త్రీ జననేంద్రియాలతో నిండిపోగా...

దేవతల సహాయంతో జీవాన్ని బలి ఇచ్చి, వళ్ళంతా కళ్లతో సహస్రాక్షుడై,తిరిగి తన నైజమును ప్రదర్శించసాగె...!

అమాయకురాలైన అహల్య...

తన తప్పేమీ లేకున్నను శాపము పొంది,రాయిగా మారి యుగముల కొలదీ

వేచి,శాపవిమోచనమొందెను...!

కామముతో కళ్ళు మూసుకుపోయిన ఇంద్రుడు... పరసతియైన

అహల్యను చెరబట్టె...!

నేరమెవరిదో విచారించకనే భర్త

గౌతముడు శాపమొసగె...!

నేటి కామాంధులకు ప్రతినిధిగా

వళ్ళంతా కళ్లు గల ఇంద్రుడు...

శాపగ్రస్తుడైననూ...

జైలు శిక్షాకాలమును తగ్గించుకున్నట్లుగా...

అధికారులైన దేవతల అండతో

పరిహారము చెల్లించి,బయటపడి...

మరల తన దుర్బుద్ధిని ప్రదర్శించసాగె...!

అనుమానాలు, అపోహలతో భార్యలను బాధించే భర్తలకు ప్రతిరూపంగా గౌతముడు...!

తన తప్పేమీ లేకపోయినా పరాభవానికి,శాపానికి గురైన అహల్య...

తిరిగి భర్త అనుగ్రహానికై యుగాలకొలదీ వేచి...

సహనశీలురైన ఇల్లాళ్లకు ప్రతీకగా నిలిచింది.

అనాది నుంచీ...

యుగయుగాలనుంచీ...

తప్పు చేసింది పురుషుడైనా...

స్త్రీకి మాత్రమే ఎక్కువ పరాభవాలు,శిక్షలు,శాపాలు అన్న వాస్తవానికి నిదర్శనంగా నిలిచిన పాత్ర అహల్య...!!!

# వీరనారి సుమయ్య(రజి)

**కవి కరీముల్లా**

అది క్రీస్తు శకం 7వ శతాబ్ది కాలం.అరబ్బు ఖండమంతా అగ్రవర్ణ అహంకారానికీ,మూఢ నమ్మకాలకూ ఆలవాలమైన కాలం.స్త్రీలు వారి దృష్టిలో పశువుల కన్నా హీనం.ఆడపిల్ల పుట్టడం అవమానంగా భావించి ఎడారుల్లో సజీవంగా పాతేసేవారు.అరబ్బు సర్దార్ల పురుషాహంకారానికీ,ఆగడాలకు హద్దులుండేవి కావు.మనుషులను అమ్మటం,కొనటం అనే బానిస విధానం అమలులో ఉండేది.అలాంటి గడ్డు కాలంలో ఓ బానిస స్త్రీ విన్పించిన ధిక్కార స్వరం మక్కా సర్దార్లను కుదిపేసింది.ఆమె పేరు సుమయ్య.

సుమయ్య ఓ సామాన్య బానిస స్త్రీ.అబూహుజైఫా అనే యజమాని రక్షణలో ఉండేది.తనకు యాసిర్ అనే యువకునితో వివాహం జరిగాక అబూహుజైఫా ఉదారత్వంతో బానిసత్వం నుండి విముక్తి పొందింది.సమాజంలో తను,తన భర్త నిమ్నజాతి వారిలా చూడబడటం,అరబ్బు సర్దార్ల దయాదాక్షిణ్యాలపై బతకాల్సిరావటం ఆమెను కృంగదీసేది. మనుషుల్లో తెల్లవాళ్ళు,నల్లవాళ్ళు,అరబ్బులు,అరబ్బేతరులు అనే తేడాలతో కొనసాగుతున్న అసమ సమాజంపై అసంతృప్తి అధికంగా ఉండేది.తన కుమారుడైన అబూఅమ్మార్ ను సైతం ఇలాంటి విప్లవ భావాలతో పెంచింది.ఆ తరువాత చరిత్ర ఆమెను మర్చిపోయింది.ఆమె వృద్ధాప్యంలో అడుగు పెట్టేసరికి చరిత్రకు ఆమెను పట్టించుకోవటం అవసరమైంది.ఆమె ఒక మామూలు స్త్రీలా తన జీవితం గడిపివుంటే ఆమె చరిత్రకు అవసరమయ్యేది కాదు.ఆ వృద్ధనారి అరేబియా సర్దార్లకు వ్యతిరేకంగా గళమెత్తడంతో చరిత్ర ఆమెను గమనించడం మొదలుపెట్టింది.తను ఇలా మారడానికి కారణం దైవప్రవక్త ముహమ్మద్(స) ప్రారంభించిన ఉద్యమం.అరేబియా ధనిక భూస్వాముల దోపిడీకి,అగ్రవర్ణ అహంకారానికీ వ్యతిరేకంగా ప్రవక్త ముహమ్మద్(స)గొప్ప విప్లవాన్నే లేవదీసారు.నాటి విగ్రహారాధనకు వ్యతిరేకంగా ఏక దైవారాధన,మనుషులంతా ఒక్కటేనని చెప్పి సామాజిక అసమానతలను వ్యతిరేకించడం,అరేబియా సర్దార్ల ఆర్థిక దోపిడీని వ్యతిరేకించి ఆర్థిక సమానత్వాన్ని గురించి బోధించటం , శ్రమదోపిడీని ప్రశ్నించటం అరేబియా ధనిక వర్గానికి మింగుడుపడలేదు. ప్రవక్త పై,ఆయన సహచరులపై హింసా,దౌర్జన్యాలకు పాల్పడటం మొదలైంది.ఈ ఉద్యమ ప్రభావం సుమయ్య పై పడింది.తను,తన భర్త,కుమారుడు ప్రవక్త అనుచరులుగా మారి ఆ మహోద్యమంలో పాల్గొన్నారు.శివారు ప్రాంతంలో అర్ఖమ్ అనే వ్యక్తి ఇల్లు ప్రవక్త ప్రారంభించిన సామాజిక, ఆధ్యాత్మిక ఉద్యమానికి కేంద్రంగా ఉండేది.సమాజంలోని దళితులు,నిరుపేదలు ,బానిసలు ప్రవక్తతో సమాలోచనలు జరిపేవారు.

ఈ కారణంగా సుమయ్య కుటుంబంపై నిషేధం విధించబడింది.అరేబియాలో ఇక ఏ మహిళ గళమెత్తకుండా సుమయ్యపై దాడికి దిగారు.క్రూరుడైన అబూజహల్ తన పరివారంతో సుమయ్య ఇంటిని చుట్టుముట్టాడు.సుమయ్యను, ఆమె కుటుంబాన్ని కొరడాలతో కొడుతూ దుర్భాషలాడుతూ వీధుల్లో నడిపించారు.తనతో సహా తన భర్త,బిడ్డ ప్రాణాలు సంకటంలో పడినప్పటికీ ఆ స్త్రీ మూర్తి చలించలేదు. అబూజహల్ ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ఎవరైనా సరే తమ పెత్తందారీతనానికి వ్యతిరేకంగా నోరు విప్పినా,ప్రవక్త ముహమ్మద్(స)ను అనుసరించినా ఇదే గతి పడ్తుందని హెచ్చరించాడు.సుమయ్య భర్తను కట్టేసి సమయ్యను జుట్టు పట్టి లాగుతూ తీవ్రంగా గాయపర్చాడు.సుమయ్య దేహమంతా రక్తసిక్తమయ్యింది.ఇప్పటికైనా మా హుకుంకు తలవంచుతావా అంటూ బెదిరించాడు.ఆ వీరనారి ప్రవక్త మార్గాన్ని వీడేది లేదని ఖరాఖండిగా చెప్పారు. సుమయ్య కడుపులో శూలాన్ని బలంగా దించుతాడు దుష్టుడైన అబూజహల. నెత్తుటి ముద్దగా మారిన సుమయ్య కాళ్ళకు చెరోవైపు తాళ్ళు కట్టి రెండుగుర్రాలతో దౌడు తీయిస్తారు.సుమయ్య భర్త,కుమారుడు చూస్తూ ఉండగానే ఆమె శరీరం రెండుగా చీలిపోతుంది.అలా ప్రాణం పోతుండగా ఆమె పలికిన చివరి పలుకులు “లాయిలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్రసూలుల్లాహ్”.అలా ఇస్లాం చరిత్రలో హక్కుల కోసం అమరత్వం పొందిన వీరనారిగా ఆమెను చరిత్ర గౌరవించింది.

# ఈ ఒక్క రోజుకే.... భయపడకు



జ్వలిత
9989198943

అన్నింటా సగం కోరే అంగనలు
ఆకాశంలో సగమైన ఆర్తనాదాలు
పాము పొడల దేహం – పడగ నీడన దేశం
దేహ దాహాలా గాయం – స్వార్థ మోహాల మయం ధరణి
గెలిచిందా? మరణం గెలిచిందా?
విముక్త నినాదం ఏదైనా? గుంటనక్కలకు ప్రమోదం
విటమిన్ లోపంతో మెరుస్తున్న పాముపొడలు
ఏ లోపమో తేల్చని హత్యలు – పడగ నీడన దేశం ధరణి
స్త్రీలింగమై గెలిచిందెప్పుడట?
ముడి వడని బంధాల అరాచకం – వీడని వివక్షల
హత్యాచారం
గెలుపంటే మరణమనే కొత్త భాష్యం
పతిత పావనులు అధికమైన దేశం
అన్నం పండించే రైతులు – వండి వడ్డించే అతివలు
పనులు మార్చుకుందాం రండంటూ
ఉచిత అఫర్ల పొలికేకలు పెడుతుంటే
కుర్చీలు మార్చుకోవడం అని అర్థమటా
ఏ రోజైనా ఏముంది గర్వకారణం
గొంగడి అంటేనే వెంట్రుకల మయం
ఐ యామ్ నాట్ శివ – నాట్ జీసస్ – నాట్ అల్లా నేను ఈ
ఒక్కరోజు మాత్రమే భయపడకండి
నా రూపాలు మీకు సాక్ష్యం చెబుతాయి

తొమ్మిది నెలల ప్రాయపు పసిపడుచు మహిళను నేనొక
హత్యాచార భారతపు కావ్య నాయికను
నన్ను కన్న తండ్రి అర్థరాత్రి తెరచిన రాష్ట్రాదాయాన్ని తాగితే
గంజి నీళ్లను సనుబాలుగా మార్చుకున్న
తల్లి రొమ్ము చప్పరిస్తున్న దాన్ని
ఒక కన్ను పూర్తిగా తెరవనే లేదు
రెండో కన్ను నిద్రలో కూరుకున్నది
మెత్తని పొత్తిలి ఏమైందో
నెత్తుటి ఒత్తులు కత్తులుగా మొత్తలు చీల్చినవి
నేను ఇప్పుడు
నా హంతకునికి హక్కులు ఉన్నాయన్న వారికి
ప్రేతాంజలి ఘటిస్తూన్న

అమ్మమ్మ భూతవైద్యుణ్ణి పిలిచింది
భక్షకభటులు భూతమని ప్రకటించారు
ఏమైందో ఎరిగిన నాథుడేడి
మరణం మత్తుల ఆవహించింది
నేనో సైబర్ ప్రేతాన్ని

గుడి బడి స్నానాలదడి ఏదైనా
నా మరణ పీఠమే
నాలుకలు కత్తిరించి – వెన్నెముకలు విరిచేసి
ఏదైనా చేయగల సజీవ ప్రయోగశాల నా దేహం
బేటీ బచావో అంటూ
ఇప్పుడు స్వేచ్ఛావరణంలో
88 వ స్థానంలో నిలిచిన బాలికాభారతాన్ని
నేనో ప్రేతాత్మ
నేను నేటి ఈ ఒక్క రోజును మాత్రమే
భయపడకండి ఈ ఒక్కరోజు మాత్రమే

కవిత

# చిటికెన వేలు నృత్యం



గీతాంజలి
మొబైల్ :889791964

ఐదు వేళ్ళలో...
అన్నింటికన్నాచిన్న వేలు
నా అష్టాచెమ్మా ఆటల్లోనూ
గుజ్జనగూళ్ళ... కబడ్డీ ఆటల్లోనూ
పరుగు పందాల్లోనూ...
కఠినమైన గణిత సూత్రాలు
పరిష్కరించడంలోనూ

మిగతా నాలుగు వేళ్ళూ కలుపుకుని
ఆత్మవిశ్వాసపు పిడికిలిగా
మార్చిన నా చిటికెన వేలు!
బొటనవేలితో విజయాన్ని
సూచించాలన్నా భాగమవ్వాల్సిన
చిటికెన వేలు!

చివరికి ఉద్యమ నాయకురాలినైనా
రాజకీయాధినేత్రినైనా
పిడికిలెత్తి కొట్టేవాణ్ణో
ఆసిడ్ పోయాలనుకునేవాణ్ణో
చూపుడు వేలితో బెదిరించాలన్నా
నిలువరించాలన్నా,
మిగతా నాలుగు వేళ్ళకూ బలాన్నిచ్చిన
చిటికెన వేలు !

కవిత్వమో పాటో
కథో ఆరోపణో రాసినప్పుడల్లా
కలాన్ని దృఢంగా పట్టుకోడానికి
నాలుగు వేళ్ళకీ
పునాది వేలుగా నిలబడి పట్టునిచ్చే
చిటికెన వేలు!

గర్వంగా తలెత్తుకుని నిలబడే
చిటికెన వేలు!
అయితే...
నాలుగు రోడ్ల కూడలిలో
నా దేహంలోని ఒక చిన్న ద్రవసంచి
కలిగించే ఒత్తిడికతల దించుకుంటుంది!
లొంగిపోతున్నట్లు ఒరిగిపోయి
ఒంగి పోతుంది!
భరించలేక బిగించిన పిడికిలి కూడా
ఆత్మవిశ్వాసపు ప్రతీకలా కాకుండా
పిరికిగా ముడుచుకు పోతుంది!

నేను చిన్న పిల్లగా బడికెళ్ళేప్పుడు
దేహంలో పోటెత్తిన త్సునామీని
చెప్పలేక గుబురో పొదో దొరకక
ముడుచుకు పోయినప్పుడు
ఒత్తి పట్టిన తొడల మధ్య నుంచి
పాదాల మధ్య నేలపైన
చిన్న చెరువొకటి పుట్టుకొచ్చి
ఫక్కుమన్న వెటకారపు నవ్వుల మధ్య
కళ్ళు కూడా చెలమలయ్యేవి!

నేను యవ్వనవతి నయ్యాక
శ్రావణమాసమో ధనుర్మాసమో
మాసాలు మారినప్పుడల్లా
కాలేజీకెళ్ళేప్పుడో బస్సెక్కేలోపు
చాటు – దాపు దొరికే లోపు
ఆపుకోలేక తడిసిపోయిన
రుధిర నేప్కిన్ల రసాయనాలతో
నడిచిన ప్రతి కదలికలోని రాపిడిలో
చిట్లిపోయె చర్మపు ఇన్ఫెక్షన్
కలిగించే మంటనో
పిడికిలి బిగిస్తూ భరిస్తూ
మాసాలు మారినప్పుడల్లా
భయంతో ఒంటికి పోవడం
ఒణికి పోవడం
ఒక నెలవారీ ఆనవాయితీగా

మారిపోయిందిది !
భార్య నయ్యాక
కడుపులో పెరిగే బిడ్డకే కాదు
మొగుడు కదా
వాడు అంటించిన సుఖ క్రిములకీ
నా మీద ఆధిపత్యమే!

ఆసుపత్రి కెళ్ళేలోపు
దొరకని మూత్ర శాల కోసం
బిగపట్టిన మూత్రాశయం
చిట్లిపోయే లోపల
కనిపించిన ఏ షాపింగ్ మాల్లోకో
దొంగలాగా నిస్సిగ్గునై
పరిగెత్తాల్సి వచ్చేది!
గర్భసంచీ – మూత్రసంచీ
రెండూ సముద్రాలయ్యేవి!
నా పిడికిలి సాధించిన ఆత్మవిశ్వాసాన్ని
చిటికెన వేలు ఓడించేది!

ఇప్పుడు...
అమ్మమ్మను కదా
మెనోపాజ్ కదా
ఆపుకొనే బలాన్ని కోల్పోయిన
మూత్ర సంచిని మోసే
వృద్ధ దేహాన్ని కదా
అమ్మమ్మ నయ్యాక
నా చిటికెన వేలు
ఇంకా నాట్య మాడుతూనే ఉంటుంది
నా మనవరాలి చిటికెన వేలితో పాటు!!

కవిత

# మహిళ




- డా. దేవులపల్లి పద్మజ,
ఫోను 9849692414.


మహిళ మహిన వెలసిన కళాకాంతుల నవోదయం
కన్నవారి కలలు విరబూసిన వసంతోదయం
మెట్టింటి ముంగిట మెరసిన భాగ్యోదయం
మానవాళి మనుగడకు
దివినుండి దిగిన మహోదయం !
పేగును పంచి ఊపిరి నించే బ్రహ్మ స్వరూపం
ఆలనపాలన పరిపాలన చేసే విష్ణు స్వరూపం
చిరునగవుల చింతలు సమయించే శివ స్వరూపం
త్రిమూర్తులు వందనమిడే త్రిమూర్త్యాత్మక స్వరూపం !
సకల శాస్త్ర సాహిత్య సరస్వతీ రూపం
సకల సిరుల ఆధిపత్య లక్ష్మీ రూపం
సకల శక్తుల పరిపుష్టి తత్వ పార్వతీ రూపం
త్రిమూర్తుల భాగ్యోదయ త్రిశక్తి రూపం !
అందాలకు ఆదిరూపం, బంధాలకు బహురూపం
కళలకు కళారూపం, కావ్యాలకు నవ్యరూపం
ప్రేమకు ప్రతిరూపం, ద్వేషానికి శక్తి రూపం
మానసిన ధృఢ హిమవత్ పర్వత సదృశం
శారీరిక దుర్బల దర్భపరక సదృశం
అణురేణు పరమాణువుల విలసిల్లు మహిళారూపం !
మహిళ చూపులు రంగుల రంగవల్లులు
మహిళ పలకరింపు చెరకు పానకం
మహిళ చిరునవ్వు తేనె చిలకరింపు !
పుడమికి శోభనిచ్చు మహిళకు ఏమిలాభం?
నయనాశృవుల అభిషేకం, అవమానాల అర్చనం
కుతంత్రాల నైవేద్యం, కామ పిశాచుల నీరాజనం !
ఏనాటికి విలువనొందు మహిళ వ్యక్తిత్వం
ఏనాటికి విరబూయు మహిళా మనోగతం
ఆనాటికి విలసిల్లు మహిళాదినోత్సవం
పుడమిల పరిఢవిల్లు మహిళానవోదయం!!

కవిత

# మహిళా దినోత్సవం - 2022



తంగెళ్ళశ్రీదేవిరెడ్డి

నేను మహిళను.... బహుళను...
అనంత భావాల విపులను..!
నేను మాలికను.....వేదికను....
అనాది అఖండ భూమికను.....!

నేనిప్పుడు నా గురించి
మాట్లాడుతున్నాను...
నా గమనం గురించి నా గమ్యం గురించి
నా జీవితం గురించి నా జీవం గురించి
మాట్లాడుతున్నాను....

అనాగరిక అమానవీయ ఛత్రఛాయాల్లో
భ్రూణహత్యగా అసువులు బాస్తున్న
రక్తపు ముద్దను నేనే!

అక్కరకు రానిదానిగా నిషేధానికి గురవుతూ
సంతలోనో రహస్యంగానో అమ్ముడుపోయి
అమ్మ ఒడిని విడుతున్న పసిగుడ్డును నేనే !

మృగాడి ఆకలికి
వాడి లైంగిక దప్పికకు
నిర్దాక్షిణ్యంగా మాన ప్రాణాలు కోల్పోతున్న
అమాయక బాలికను నేనే!

అవమానాలకు అనుమానాలకు
మధ్య అమానుషంగా కూరుకుపోతూ....
నిష్టూరాలకు నిబంధనలకు
మధ్య నిరంతరం నలిగిపోతూ....
నిందలను భయాలను
నిర్వీరామంగా మోస్తున్న
సగటు ఆడదాన్ని నేనే !

కారుమబ్బులు దాటుకుని
కాంతిరేఖల వెంబడి పయనిస్తున్నాను
అనాచారాలను ప్రశ్నిస్తూ
ఎల్లలు దాటి దూసుకుపోతున్నాను
కానీ ఆడపిల్లవు అనే మాట దగ్గర
లోకం ఆగిపోతుంటే
“ భద్రత “ కోసం
నాలోనేను దాచుకుంటున్నది నేనే!

నేను సుదీర్ఘ శ్వాసను
ఈ సృష్టి సుకుమార ధ్యాసను
అణిచివేసే కబంధ హస్తాల పాలిట
శౌర్య ధైర్య భీకర గర్జనను
విజయాలు ఎన్ని ఉన్నా
విషాదాలను మూట గట్టుకుంటున్న
జాతి కోసం సాధికారత జెండా ఎత్తి పట్టుకున్నది నేనే !

నేను మహిళను.... బహుళను...
అనంత భావాల విపులను..!
నేను మాలికను.....వేదికను....
అనాది అఖండ భూమికను.....!

కథ

# లైక్ , కామెంట్, షేర్ చేయండి



రమాదేవి బాలబోయిన

మే నెల. మిట్టమధ్యాహ్నం రెండు గంటల సమయం. ఆకాశపు నడినెత్తికెక్కిన సూర్యుడు నిప్పుల వాన కురిపిస్తున్నాడు. సిటీమధ్యలోని ఛాయా ఏసీ ఫంక్షన్ హాల్ లో "మాతృదేవోభవ ఫౌండేషన్" వారి సమావేశం జరుగుతోంది. చాలా పేద్ద డయాస్. వేలాది మంది ప్రేక్షకులు. వారిలో సగం మంది హైఫై ఫ్యామిలీ లోనుండి వచ్చినవారే. మరోసగం అప్పుడప్పుడే ధనం రుచి మరుగుతున్న వారు. ముఖ్యంగా వారంతా సోషల్ మీడియా లో పోస్ట్ చేయబడిన "మదర్స్ డే" సెలబ్రేషన్స్ అక్కడ జరుపుతారని చూసి వచ్చినవారే. అందులో ఒక్కొక్కరు ఆరోజంతా "హాపీమదర్స్ డే" అంటూ కొన్ని వందల మందికి లైక్ కామెంట్ షేర్ చేసినవారే.

డయాస్ పైన సత్యహరిచ్చంద్ర నాథ్ గారి ప్రసంగం యమారంజుగా సాగుతోంది.కొందరు కన్నార్పకుండా,కొందరు నోరు తెరిచి మిగతా అందరు తమ ఒళ్ళు మరిచి మరీ ఆ ప్రసంగాన్ని ఆలకిస్థున్నాను. పులకరిస్తున్నారు. చాలా సేపటి నుండి అలుపనేదే ఎరుగక వారు తమ జీవితంలోని విషయాలను వివరిస్తోంటే మీరు చాలా గ్రేట్ సర్ , ఎక్సలెంట్ సర్ ,సూపర్ సర్ అంటూ అసంకల్పితంగా అంటూ తమ చప్పట్లను విరివిగా కురిపిస్థున్నారందరూనూ.

సత్యహరిచ్చంద్రనాథ్ గారి ప్రసంగం ఇలా సాగింది" నా పుట్టుకకు ముందు అమ్మకు రూపంలేదు.నేను జన్మించిందే ఆమెను అమ్మా! అమ్మా! అని పిలవడానికి కాబోలు.నన్ను కనడానికి అమ్మ పడిన శ్రమ తెలుసుకున్నాను కనుకనే ఆమెను నేను ఎదిగాక ఎపుడూ శ్రమపడనీయలేదు. కష్టాల్లో ఉన్నప్పుడు మనం పిలిచే పదం అమ్మా... అందుకే అలా పిలిచే నేను మా అమ్మను ఏనాడూ కష్టపడనీయలేదు. ఆమెను నిత్యం దగ్గరుండి చూసుకుంటాను. ఏది కోరితే అది తెచ్చిపెట్టి ఆమెను సంతోషంగా చూసుకుంటాను.అందుకే ప్రియతమ పిల్లల్లారా మీరూ నాలాగే ఎదిగి మీ అమ్మలను మంచిగా చూసుకోవాలి....." తన్మయత్వంతో తానూగిపోతూ...తన మాటలతో ప్రేక్షకులను ఉర్రూతలూగిస్తూ ప్రసంగిస్తున్నారు సత్యహరిచ్చేంద్రనాథ్

తమ పిల్లలను సక్రమమైన మార్గంలో పెడుతున్న పెద్దాయన కి ఆడియన్స్ లోని తల్లిదండ్రులు మనసులోనే పాదాభివందనాలు చేస్తున్నారు. పిల్లలు తాము మారి తమ తల్లిదండ్రులను ఆనందంగా ఉంచాలని మనసులోనే ఒట్లు వేసుకుంటున్నారు. అంతేకాదు ఇంకొంతమంది మరో అడుగు ముందుకేసి ఆ స్పీచ్ వీడియోలు,ఫోటోలు,ఆడియోలు తీసుకుని ఫేస్బుక్, వాట్సాప్ లలో పోస్ట్ చేసి బోలెడన్ని,లైకులూ, కామెంట్స్,పేర్లూ సంపాదిస్తున్నారు.

సరిగ్గా అదే సమయంలో హాల్ బయట గేట్ కీపర్ ఒక బక్కపలచని ముసలావిడ తో గొడవ పడుతున్నాడు. లోపలికి రానీయకుండా వెళ్ళగొడుతున్నాడు. ఆవిడ కాళ్ళావేళ్ళా బడి బతిమిలాడుతోంది.ఆవిడ బట్టలు మాసిపోయి,చిరుగులు పడి ఉన్నాయి. ఆమె చర్మం ఎముకలగూడుకు అంటుకుపోయినట్లుగా ఉంది. ఆకలికి తట్టుకోలేక కాస్తంత అన్నంపెట్టించమని అడుగుతోంది. గేట్ కీపర్ ఛీకొడుతున్నాడు.

ఇంతలో హాలులోపల అప్పటిదాకా సత్యహరిచ్చంద్రనాథ్ గారి ప్రసంగం వింటూ ఆనందించిన ఆ "ఛాయా ఏసీ ఫంక్షన్ హాల్ "యజమాని "మహానుభావుడు చాలా గొప్పవాడు..ఇంత గొప్పవాడు కాబట్టే వేలమంది హాజరవుతున్నారు.మాకూ చాలా ఆదాయం వస్తోంది."ఈయనను కన్న తల్లి కడుపు సల్లగుండా". అని అనుకుంటూ కోటి దండాలు పెట్టుకుంటూ బయటికి వచ్చాడు.

గేట్ కీపర్ మరియు ముసలావిడల గోల అతని కంట పడనే పడింది. "ఏయ్ ఏమిటయ్యా అది". అని అడిగాడు. "నమస్తే సర్, ఒక్క ఐదునిమిషాలు సర్ ,ఆ ముసల్దాన్ని బయటకు పంపుతాం సర్"ప్రాధేయపడ్డాడు.

తన డ్యూటీ తాను సరిగా చేయడంలేదని ఎక్కడ తన ఉద్యోగం లోంచి తీసేస్తాడోనని అతని భయం.

"ఏయ్ ఆగాగు... ఈరోజు మాతృదినోత్సవం కదా...ఈ ముసల్దానికి భోజనం పెడదాంలే...మంచి రోజు నాడు దానం చేసినట్టుంటది" పుణ్యం కొట్టేయాలనే ఆలోచన యజమానిది.

గేట్ కీపర్ యజమాని ఆదేశంతో కిచెన్ లోకి వెళ్ళి

ఒక పేపర్లో భోజనం ప్యాక్ చేసి తెచ్చాడు. హాల్ యజమాని ఆ పొట్లాం ముసలిదానికి ఇస్తూ ఒక ఫోటో తీయించుకుని ఫేస్బుక్ లో అప్లోడ్ చేసాడు. అతని దాతృత్వాన్ని పొగుడుతూ... బోలెడన్ని లైకులు, కామెంట్స్,షేర్లూ టపటపా కురుస్తున్నాయి.

కానీ ఏమైందో ఏమో...ఆ ముసలావిడ కళ్ళల్లోంచి కన్నీరు ధారాళంగా కురుస్తోంది. ఆవిడ పొట్లాంలోని ఆహారం క్రింద పడిపోతున్న విషయం కూడా చూసుకోలేదు. పెట్టే దాకా ఆకలో ఆకలీ అన్నావు. అన్నం పెట్టగానే నేలపాలు చేస్తావా? మందలించాడు హాల్ యజమాని.

నా కొడుకు ఫోటో చూడగానే మనసు నిండి పోయి ఆకలికి జాగా లేకుండా పోయిందయ్యా...అంది ఆమె ఏడుస్తూనే.

పేపర్లోకి తొంగి చూసిన యజమాని ఒక్కసారిగా షాక్ తిన్నాడు. ఆ......ఫోటో సత్యహరిచ్చంద్రనాథ్ ది.

ఆ వెనువెంటనే తేరుకున్న అతను ఆ ముసలావిడ ఎవరో ఎవరికీ చెప్పకుండా తీసుకెళ్ళి ఒక వృద్ధాశ్రమం లో చేర్చాడు. ఆమెను చేర్చుతున్నపుడు ఒక ఫోటో తీసుకుని దయార్ద్ర హృదయం తో ముసలావిడ ఆశ్రమంలో చేర్చినట్లు రాసి సోషల్ మీడియా లో పోస్ట్ చేసాడు. ఇంకా అంతే వేలసంఖ్యలో లైకులూ, కామెంట్స్. హాల్ యజమాని ఉబ్బితబ్బిబ్బైయ్యాడు.

పెద్దపెద్ద న్యూస్ ఛానల్ లు కూడా సత్యహరిచ్చంద్రనాథ్ గారి స్పీచ్ విని ప్రభావితం చెందిన హాల్ యజమాని చేసిన ఈ మంచి పనిని పొగుడుతూ చాలా కార్యక్రమాలు చేసాయి. వాటి టీఆర్పీ ఒక్కసారి గా పెరిగిపోయాయి. వాటి లైకులు, కామెంట్స్ షేర్లూ పెరిగాయి.

వివిధ సంస్థల వాళ్ళు అతని హాల్ ని అద్దెకు తీసుకుని స్పీచ్ లు ఏర్పాటు చేయసాగారు. అటు సత్యహరిచ్చంద్రనాథ్ ది ఇటు హాల్ యజమానిది ఆదాయం రెట్టింపయింది.ముసలావిడని ఆదుకున్న తనకు ప్రజలు మంగళనీరాజనాలు పట్టినందుకు సంతోషించినదానికన్నా.తన ఉపాయం పారినందుకు చాలా సంతోషించాడు హాల్ యజమాని..

ఆనోటా ఈనోటా సత్యహరిచ్చంద్రనాథ్ దృష్టి కి కూడా ఆ విషయం చేరింది.అతని గొంతులో పచ్చి వెలక్కాయ పడింది. కానీ...తేలుకుట్టిన దొంగ లా ఏమీ తెలియని వాడిలాగానే నా స్పీచ్ విన్న సామాన్యుడు ఇపుడు మాన్యుడయ్యాడు. గొప్ప పేరుప్రతిష్టలతో పాటు చాలా ధనం సంపాదించి కోటీశ్వరుడు అయ్యాడు అంటూ సోషల్ మీడియా లో పోస్ట్ చేసాడు.

అంతే వెర్రిజనం అతనికి అఖండనీరాజనాలర్పిస్తూ ఆ పోస్ట్ ని కూడా లైకులూ, కామెంట్లు, షేర్లు చేయడంలో బిజీ అయిపోయారు.

**కవిత**

# ప్రయోగశాలలు




**కడెం లక్ష్మీ ప్రశాంతి**
**ఫోన్ :7893399773**


మాదేహాలు పరీక్షానాళికలుగా
మారిపోయాక
ఘనీభవించిన కన్నీటి రాశుల్ని
ఎక్కడని ఒంపుకోము!?

అనాదిగా అమ్మతనమే
జీవిత పరమావాదిగా
నొక్కివక్కానించాక
పూటకోమాత్ర,రోజుకో ఇంజక్షన్
అనివార్యం

జీవితాల్ని దారపోయడం
ప్రాణాల్ని పణంగా పెట్టడం
మాకు తరతరాలుగా వచ్చే
వారసత్వ సంపద

నెలకోమారు మూలగదిలో
కూర్చున్నప్పుడు
మీ చూపుల బాకుల్లో
తనువే కాదు
మనసూ రక్తమోడుతుంది

మా చేతుల తుమ్మెదలు
మీ పూలమొక్కలపై వాలటానికి
మీ పాపాయిల బోసినవ్వుల్ని
పొత్తిళ్ళలో పొదువుకోవడానికి
అనర్హంవుతాయి
శుభాకార్యలకు మేము మినహాయింపు
అనధికారిక నిషేధమొకటి
మాపై అమలవుతుంది

మా దుఃఖం హాస్పిటల్ గోడలకు
స్కానింగ్ సెంటర్లకు
తెలిసినంతగా మరెవ్వరికీ తెలీదు
మేమంతా రకరకాల మందుల్ని
ఇంజెక్ట్ చేయబడ్డ శరీరాలం
మీకు వంశంకురాల్నిఇచ్చే
ప్రయోగశాలలం

కథ

# పుత్తడి బొమ్మ



- రోహిణి వంజారి

మొబైల్: 90005 94630

తలుపు చాటు నుంచి వారి మాటలు విన్న ఆమె ఏ నిర్ణయం తీసుకుంది..?

ఆమె నిర్ణయానికి వారు తలవంచారా..?

ఇంకా పూర్తిగా తెల్లవారనేలేదు. చిరుచీకట్లు తెరలు తెరలుగా విడివడుతూ ఉన్నాయి. పెరట్లో జామ చెట్టు మీద పక్షులు మాత్రం అప్పుడే ఉదయరాగాలు ఆలపిస్తున్నాయి తమ తమ విచిత్ర స్వరాలతో..

బంతులు, చేమంతులు, రాత్రి విరబూసిన సన్నజాజులు సుమధుర పరిమళాలను వెదజల్లుతున్నాయి పెరడంతా. ఆ పువ్వుల్లో పువ్వులా పెరడంతా తిరుగుతూ మొక్కల పాదులు చేసి ట్యూబ్ తో నీరు పెడుతోంది వసుంధర. ఆమె వెనుకే పెంపుడు కుక్క స్న్యూబి కూడా పరుగులు తీస్తోంది. కూతురి పనితనానికి అచ్చెరువొందుతూ అపురూపంగా చూస్తున్నారు ఆమె తల్లిదండ్రులు కోటేశ్వర రావు, పార్వతమ్మ.

కోటేశ్వరరావుకి పెద్ద బజార్ లో చిన్న బంగారు అంగడి ఉంది. తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన వ్యాపారాన్ని తన నిరంతర శ్రమతో పాటు ఎదుటివారిని ఆకట్టుకునే మాటకారితనం, మార్కెట్లో వచ్చిన కొత్త పరిస్థితులకు అనుగుణంగా తన వ్యాపారాన్ని సాగిస్తూ కోటేశ్వరరావు శెట్టి మార్కెట్లో నమ్మకస్తుడైన వ్యాపారిగా ఖాతాదారుల నుంచి మంచి పేరు పొందాడు.

లేక లేక పుట్టిన తమ గారాల పట్టి వసుంధరకు చిన్నప్పటినుంచి ఏలోటూ రానీలేదు వారు. తను కోరుకున్న చదువు చెప్పించారు. చదువు పూర్తి కాగానే ఓ చిరు ఉద్యోగ్యం కూడా సంపాదించింది వసుంధర.

"వసూ.. ఈ రోజు ఆఫీస్ కి సెలవు పెట్టు తల్లి. నిన్ను చూడడానికి గుంటూరు నుంచి పెళ్ళివారు వస్తున్నారు" పార్వతమ్మ ఇచ్చిన కాఫీ గ్లాసు అందుకుంటూ పెరట్లో వేసిన పడక్కుర్చీలో కూర్చున్నాడు కోటేశ్వరరావు.

"నాన్నా.. అప్పుడే నాకు పెళ్ళి వద్దు నాన్న. జాబ్ లో చేరి ఒక్క సంవత్సరం కూడా కాలేదు " స్న్యూబిని ఎత్తుకుని బుంగమూతి పెడుతూ వసుంధర.

"ఇంకెప్పుడే తల్లీ. పాతికేళ్ళకు దగ్గర పడుతోంది నీ వయసు. నీ పెళ్ళి చేస్తే మేము ఇక నిశ్చింతగా ఉండవచ్చు" అంది పార్వతమ్మ గ్రైండర్లో మినపప్పు వేస్తూ.

"అంటే ఏంటమ్మా.. సంతలో గంగిరెద్దుని అలంకరించినట్లు నేను అలంకరించుకుని వారి ముందు తలవంచుకుని కూర్చుని, వారికి నచ్చుతానా లేదా అని ఎదురుచూస్తూ ఉండాలా..? ఈ రోజుల్లో కూడా ఈ పద్ధతులు ఏంటమ్మా..? అలా అయితే అసలు నాకు పెళ్ళే వద్దు. మిమ్మల్ని వదిలి నేను ఎక్కడకు పోను" తల్లిని హత్తుకుంది వసుంధర.

"నా బంగారు తల్లీ.. మనం పెళ్ళి ప్రయత్నాలు చేయడం ఇదే మొదటిసారి కదా. ఈ ఒక్కసారికి మా మాట విను. నీకు నచ్చకపోతే ఇక నువ్వు చెప్పినట్లు వింటాం మేము" చిన్న పిల్లాడు తల్లిని బతిమాలినట్లు కూతుర్ని బతిమాలాడు కోటేశ్వరరావు. తండ్రి మాటలకు మెత్తబడింది వసుంధర.

వారు ఎదురుచూస్తున్న సాయంత్రంతో పాటు పెళ్ళి వారు రావడం కూడా జరిగింది. అబ్బాయి దినేష్, అతని అమ్మా, నాన్న, స్నేహితుడు అంకిత్ వచ్చారు పెళ్ళిచూపులకు. పరస్పర పరిచయాలు, ఫలహారం, కాఫీ సేవనం అయినాక వసుంధర లోపలిగదిలో నుంచి వచ్చి సోఫాలో ఒద్దికగా కూర్చుంది.

పుత్తడి బొమ్మలా ఉన్న వసుంధరని చూసి వారి కళ్ళు తృప్తిగా మెరిసాయి. "అమ్మాయిని ఏమైనా అడుగుతారా బాబు " వినమ్రంగా దినేష్ ని చూస్తూ అడిగాడు కోటేశ్వరరావు.

ఏం లేదని అడ్డంగా తల ఊపాడు అతను.

"అమ్మాయిని లోపలకు తీసుకువెళ్ళండి. మనం మాట్లాడు కుందాం" షరా మాములే అన్నట్లు చూసాడు శంకరయ్య.

తండ్రివైపు సాలోచనగా చూస్తూ లోపలి గదిలోకి వెళ్ళింది వసుంధర.

"వసుంధర మాకు లేకలేక పుట్టిన కూతురు. తనని అపురూపంగా పెంచుకున్నాం మేము. మంచి చదువు, సంస్కారం చెప్పించాం" వారు అడగక ముందే చెప్పాడు కోటేశ్వరరావు.

"మంచిది. మీకు మా రంగనాధం చెప్పే ఉంటాడు. మా దినేష్ అమెరికాలో జాబ్ చేస్తున్నాడు ఇప్పుడు. ఇంకో ఆరు నెలల్లో తన ప్రాజెక్ట్ అయిపోతుంది. తర్వాత ఇక్కడకి వచ్చేసి

ఏదైనా బిజినెస్ స్టార్టప్ చేయాలని, అందుకని" అంటూ ఆగాడు శంకరయ్య.

అతని భార్య మోచేత్తో నెట్టింది అతన్ని పూర్తిగా చెప్పమని. ఆయన ఏం చెప్తాడా అని ఆత్రంగా వాళ్ళు ఎదురుచూస్తుంటే తలుపు చాటు నుంచి ఆసక్తిగా వాళ్ళ సంభాషణ వింటోంది వసుంధర.

"కట్నం, లాంఛనాల గురించి కూడా మనం ఓ మాట అనుకుంటే బాగుంటుందని" చివరి మాట నానుస్తూ సాగదీసాడు శంకరయ్య.

"మీరు చెప్పింది నిజమే బావగారు. నాది చిన్న బంగారు వ్యాపారం. పెద్దగా కట్నం ఇచ్చుకోలేను. వసుంధర మా ఏకైక సంతానం. మీకు తెలుసుకదా. నేను వ్యాపారంలో నిలదొక్కుకుని కట్టించిన ఇల్లు ఇది. పెద్దల ఆస్తులు ఏవి మాకు వారసత్వంగా రాలేదు. బంగారు వ్యాపారం మాత్రం నాకు మా తండ్రి నుంచి వచ్చింది. కట్నం ఎక్కువ ఇవ్వలేక పోయినా లాంచనాల్లో ఏ లోపం రానీయం" ఎక్కడ వారు పెళ్ళికి ఒప్పుకోరో అని సంశయిస్తూనే అన్నాడు కోటేశ్వరరావు.

"బాగానే ఉంది. కట్నం ఇవ్వలేం అంటున్నారు. మీ తదనంతరం ఈ ఇల్లు మీ అమ్మాయికే కదా. అదేదో ఇప్పుడే ఇల్లు అమ్మేసి ఆ డబ్బు అబ్బాయి వ్యాపారానికి పెట్టుబడిగా ఇస్తే బాగుంటుంది కదా. పిల్లల సంతోషం కన్నా మనకు ఇంకేం కావాలి చెప్పండి. మీరు ఏమంటారు..?" తెలివిగా మాట్లాడాను కదా అని భార్య వంక గర్వంగా చూస్తూ శంకరయ్య సైగ చేసాడు. దినేష్ వంక నిరసనగా చూసాడు అతనికి తోడుగా వచ్చిన మిత్రుడు అంకిత్.

వారినుంచి ఊహించని ఆ మాటలకి బిత్తరపోయారు కోటేశ్వరరావు, పార్వతమ్మ. కాస్త తమాయించుకుని సమాధానం చెప్పేలోగా–

"ఆగండి నాన్న. నన్ను చెప్పనీయండి" తలుపు చాటు నుంచి సివంగిలా దూసుకువచ్చిన వసుంధరని విస్మయంగా చూస్తున్నారు అందరు ఆమె ఏం చెప్తుందో అని.

"దినేష్ గారు..! మీ నాన్నగారు చెప్పినదాన్ని మీరు కూడా సమర్థిస్తున్నారా" సూటిగా అతని కళ్ళల్లోకి చూస్తూ వసుంధర.

"పెద్దవాళ్ళు ఏదైనా మన మంచికే చెప్తారు. నాన్న చెప్పినదాన్లో తప్పేముంది. ఎటూ ఈ ఇల్లు కొన్ని రోజుల తర్వాత నీకే కదా వచ్చేది. ఇప్పుడే ఇస్తే మన వ్యాపారానికి పనికి వస్తుంది కదా" ఆమె కళ్ళల్లో ఎరుపు చూసి కాస్త తడబడ్డాడు దినేష్.

"ఇక చాలు ఆపండి. మీ నిర్ణయం చెప్పారు కదా. ఇక నా నిర్ణయం కూడా వినండి. మా అమ్మ, నాన్న నాకు కష్టం తెలియకుండా చిన్నపటినుంచి బంగారు బొమ్మలా అపురూపంగా పెంచారు. నాన్న రాత్రి, పగలు వ్యాపారంలో కష్టపడి పైసా పైసా కూడబెట్టి కట్టుకున్న మా ప్రేమ మందిరం ఈ ఇల్లు. ఈ రోజు ఇంటిని నా పెళ్ళి కోసం అమ్మేస్తే ఇక వారు ఎక్కడ ఉండాలని. వారికి కొడుకైనా, కూతురైనా నేనే" కాస్త ఆగి గాఢంగా ఊపిరి తీసుకుని

"అమ్మాయి, అబ్బాయి ఇద్దరు కష్టపడి చదువుకుని ఉద్యోగాలు తెచ్చుకుంటారు. మరి ఈ పెళ్ళి దగ్గరకి వచ్చేసరికి అమ్మాయిలు మాత్రం ఈ కట్నం ఎందుకు ఇవ్వాల్సివస్తోంది..?

ఏం.. ఆడపిల్లలు ఇచ్చే కట్నం డబ్బులు లేకపోతే అత్తగారింటి వాళ్లకు గతిలేదా..? ఆడపిల్ల తల్లిదండ్రులు ఇచ్చే కట్నంతోనే మగపెళ్ళివారి బతుకులు గడుస్తాయా..? భర్త అనేవాడు కష్టపడి సంపాదించి భార్యని పోషించుకోలేడా..? అలాంటప్పుడు అసలు పెళ్ళి ఎందుకు చేసుకోవడం..? ఇలా కట్నాలు, లాంఛనాలు ఇచ్చిపుచ్చుకుంటే అది కళ్యాణం కాదు, వ్యాపారం. దంపతుల మధ్య ఉండాల్సింది అనురాగబంధం కానీ, ఆర్థికబంధం కాదు. అది బంధనం అవుతుంది అమ్మాయికి, వారి తల్లిదండ్రులకు" ఆవేశంగా వసుంధర సంధించిన ప్రశ్నల బాణాలకు సమాధానం చెప్పలేక తల దించుకున్నాడు దినేష్.

అతని అమ్మ, నాన్నల చూపులు నిరసనగా, కోటేశ్వరరావు, పార్వతమ్మల చూపులు ఆందోళనగా, దినేష్ మిత్రుడు అంకిత్ చూపులు వసుంధర పట్ల ఆరాధనగా. అందరిమనస్సులో ఆలోచనలు రకరకాలుగా.

"అయితే ఇప్పుడు ఏమంటారు. పెళ్ళిచూపులకని ఇంటికి పిలిచి కూతురిచేత మాటలడిగించి మమ్మల్ని అవమాన పరుస్తారా" కోపమో ఆశాభంగమో తెలియలేదు దినేష్ అమ్మ కళ్ళల్లో.

"మరి.. మీ మాటలకు గంగిరెద్దులా తల ఊపి మా బంగారు పొదరింటిని తెగనమ్మి మీ చేతుల్లో డబ్బు పోయాలా..? ఒక వేళ మా అమ్మ, నాన్న ఇంటిని అమ్మేస్తే ఇక వాళ్ళు ఎక్కడ ఉండాలని..? ముందే చెప్పాను కదా, కొడుకైనా, కూతురైనా నేను ఒక్కదాన్నే వాళ్ళకి. పెళ్ళి తర్వాత నాతో పాటు మా అమ్మ, నాన్నలను కూడా జీవితాంతం మీరు చూసుకోగలరా..?"

వసుంధర అడిగిన మాటలకు జవాబు రాలేదు వారినోటి నుంచి.

"హు..మీరు చెప్పలేరు. ఎందుకంటే ఆడపిల్ల తల్లిదండ్రులను చూసుకునే ఉదారస్వభావం మీకు లేదు కనుక. కానీ కన్న కూతురిగా నాకు జన్మనిచ్చిన నా తల్లిదండ్రులను చూసుకునే బాధ్యత జీవితాంతం నాకు ఉంది. ఈ ఇల్లు అమ్మేది లేదు. అత్యాశతో మీరు అడిగినంత కట్నాలు ఇచ్చే ఉద్దేశ్యం కూడా మాకు లేదు. ఇదే నా నిర్ణయం. నా నిర్ణయాన్ని మా అమ్మ, నాన్న కూడా కాదనరనే నమ్మకం నాకు ఉంది. ఇక పొమ్మని చెప్పకుండానే మీరు వెళ్ళిపోతే మీకు, మాకు కూడా మర్యాదగా

ఉంటుంది" వసుంధర మాటల్లో ఆత్మవిశ్వాసం పొంగిపొర్లింది.

"ఇంటికి పిలిచి అవమానిస్తారా..? ఆడపిల్లకు ఇంత బరితెగింపు మాటలు పనికి రాదు. మీ అమ్మాయికి పెళ్ళి ఎలా చేస్తారో చూస్తాం " గొణుక్కుంటూ, తిట్టుకుంటూ దినేష్ అమ్మ, నాన్న ఇంటిబయటకు నడిచారు. వారి వెనుకే మౌనంగా అనుసరించారు దినేష్, అతని మిత్రుడు అంకిత్.

కొండంత ఎత్తుకి ఎదిగిన ఆదర్శాలను పుణికి పుచ్చుకుని, తమపై అంతులేని అనురాగాన్ని కురిపించిన కూతురిని చూసి సంతోషించాలో, పెళ్ళి చూపులు ఇలా రసాభాసం అయినందుకు విచారించాలో తెలియని డైలమోలో పడిపోయారు కోటేశ్వరరావు, పార్వతమ్మలు.

వారం రోజులు మౌనంగా, విచారంగా వెళ్లిపోయాయి.

ఆఫీస్ నుంచి వచ్చిన వసుంధర స్క్యూబితో ఆడుకుంటోంది. కోటేశ్వరరావు కాఫీ తాగుతూ దినపత్రిక చూస్తున్నాడు.

గేటు తీసుకుని లోపలకు వచ్చాడు అంకిత్. అతను దినేష్ మిత్రుడు. అతని రాక వారిలో రకరకాల ఆలోచనలకు తావిచ్చింది.

"రా బాబు. నువ్వు ఆ రోజు పెళ్ళివాళ్ళతో వచ్చావు కదా" అన్నాడు కోటేశ్వరరావు అతనికి కుర్చీ చూపించి కూర్చోమని.

"అంకుల్, నేను ఇప్పుడు మీ ఇంటికి రావడం మీకు ఆశ్చర్యం కలిగించి ఉండచ్చు. నేను మీతో కాసేపు మాట్లాడొచ్చా" అతని చూపుల్లో వసుంధర పట్ల ఆరాధన కనిపిస్తోంది.

"ఏం చెప్పాలనుకుంటున్నారు. దినేష్ వాళ్ళు మీ చేత సంధి రాయభారం పంపారా..?" వసుంధర మాటకి చిరునవ్వుతో


"లేదు వసుంధర గారు. నేనే మీతో మాట్లాడాలని వచ్చాను. ఆ రోజు అలా జరగడం చాల విచారకరం. దినేష్ స్వార్థపరుడు. తల్లిదండ్రుల అత్యాశకు అతను వంతపాడి మీలాంటి నిజమైన పుత్తడిని వదులుకున్నాడు. నేను మీలాగే కట్నం తీసుకోవడానికి వ్యతిరేకం. నాకు కొన్ని ఆదర్శభావాలు ఉన్నాయి. చదువుకున్నాను. ఉద్యోగం చేస్తున్నాను. నా తల్లిదండ్రులకు నేను ఒక్కడినే. నేను చేసుకోబోయే అమ్మాయి అమ్మ, నాన్నలను కూడా నేను జీవితాంతం చూసుకోవాలని అనుకుంటున్నాను. ఆ రోజు మీ ఆదర్శాలు, మీ ధైర్యం చూసి మీ పట్ల ఆరాధన భావం కలిగింది. మిత్రుడికి తోడుగా వచ్చి ఆ రోజు మీతో మాట్లాడే సాహసం చేయలేకపోయాను. మీకందరికీ ఇష్టమైతే నేను వసుంధరని వివాహం చేసుకోవాలని ఆశ పడుతున్నాను" మనసులో అనుకున్నదంతా చెప్పేసాడు.

వసుంధర కళ్లలో కనపడిన కాంతుల్లో అంకిత్ కి సమాధానం దొరికింది. ఆ ఇంట పెళ్ళి సందడి మొదలైంది.

కవిత

# మరో అడుగు ....

మొహమ్మద్. అఫ్సర వలీషా



సిగ్గు పరదాలను
తొలగించుకొని వస్తున్న
ఆ మొగ్గను ఆదిలోనే
తుంచేయకు......

ఆశయాల దుప్పటి
పరుచుకున్న ఆ అడుగును
అక్కడికక్కడే అది మేయకు...

ఆకాశానికి నిచ్చెన వేసి
జ్ఞానవిజ్ఞాన తారా చంద్రికలను
తెంపే ఆలోచనలకు
అంధకారం పులమకు ....

అందరి ఆత్మీయతను కోరే
ఆ మేలిముత్యం మనసుకు
మలినపు మాలలు కట్టకు.....

ఆ పసిడి పారాణి
అందాలకు అనుమానపు
సంకెళ్ళు వేయకు...

శ్రమల దారంతో అల్లబడిన
ఆ దేహానికి ఆంక్షల
సూదితో గుచ్చకు....


పగలు రేయి తేడా తెలియని
ఆ వంటగది గుమ్మం దాటి
మరో అడుగు వేయనీ
తను కోరుకున్న గమ్యం చేరనీ...!!

( అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా)

# కొత్త పుస్తకాలు



'నా ఏకాంత బృందగానం'
'డా. అమృతలత సచిత్ర స్వీయ చరిత్ర'
అపురూప పబ్లిషర్స్
ప్లాట్ నం. 494/ఏ, రోడ్ నం. 22 జూబిలీ హిల్స్,
హైదరాబాదు- 500033
మొబైల్:9848868068
పేజీలు: 404, వెల: 600/-




'ఝోళి'
గోర్ బంజారా సాకి
డా. సూర్యాధనంజయ్ కథలు,
ఇంటి నెంబరు: 12-5-55/1/T-2, విజయపురి కాలనీ,
తార్నాక, సికింద్రాబాద్ - 500007.
ఫోన్: 9949996902.
పేజీలు: 210. వెల: 200/-




'తల్లివేరు',
నెల్లుట్ల రమాదేవి కథలు
అపురూప పబ్లిషర్స్ హైదరాబాద్ - 500033.
ఫోన్:9848868068
పేజీలు - 198,
వెల: 200/-



వేళ్ళని వెదికే చెట్లు (కవితాసంపుటి)
డా|| సి. భవానీదేవి
'హిమబిందు పబ్లికేషన్స్'
102, గగన్మహల్ అపార్ట్మెంట్స్,
దోమల్గూడా, హైదరాబాద్ -500029.
ఫోన్: 040-27636172
పేజీలు: 148, వెల: 150/-




'చినుకులు',
నెల్లుట్ల రమాదేవి - నానీలు,
అపురూప పబ్లిషర్స్ హైదరాబాద్ - 500033.
ఫోన్:9848868068
పేజీలు - 84,
వెల: 100/-

FUTURE ACRES
REALTY | RELIABILITY | RESPONSIBILITY

HIGHWAY FACING PROJECT
HYDERABAD - MUMBAI NH 65

Highway PARIS
@ SADASHIVPET

Premier VILLA PLOTS
DTCP Layout

INTEGRATED PREMIUM GATED COMMUNITY PROJECTS
SUCCESSFULLY COMPLETED PROJECTS

DownTown
PREMIUM VILLA PLOTS @ KOTHUR MUNICIPALITY

Highway DownTown
@ NANDIGAMA, SHADNAGAR

Shadnagar DownTown
@ Shadnagar

ROYAL GARDENS
MYTHRI ENCLAVE

FUTURE ACRES | # 405, SVSS Nivas, Opp Gokul Theatre, Czech Colony , Erragadda, Hyderabad - 500 018. T.S.
www.futureacres.in E-mail: futureacres@gmail.com

Printed at JD Publications, Hyderabad

Price : 100/-